# వేద వాఙ్మయము



మువ్వల సుబ్బరామయ్య

# వేద వాఙ్మయము

ముప్పల సుబ్బరామయ్య

జయంతి పబ్లికేషన్స్
కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ - 520 002.

# VEDAVANGMAYAMU

by :

**Muvvala Subba Ramaiah**

For Copies :

**MUVVALA PERUMALLU & SONS.**

29-13-19/B, Opp. St. To CHARITHA SRI HOSPITAL,

MALLIKAMBA St., SURYARAOPET,

VIJAYAWADA - 520 002.

Ph : 2577828;

Mobile: **8978261496**

**© PUBLISHER**

Edition :

**January - 2012**

Title Design :

**Giridhar**

PRICE : **₹ 75-00**

DTP :

**SRI SRINIVASA GRAPHICS**

VIJAYAWADA - 521 108.

Ph : **9440397989**

Printers :

**ARUNODAYA**

**Vijayawada - 2**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | వేద వాఙ్మయము .................. | 5 |
| 2. | ఋగ్వేద సంహిత .................. | 47 |
| 3. | యజుర్వేద సంహిత ............... | 57 |
| 4. | సామవేద సంహిత................. | 65 |
| 5. | అధర్వవేద సంహిత................ | 71 |
| 6. | బ్రాహ్మణాలు........................ | 79 |
| 7. | ఆరణ్యకాలు ........................ | 94 |
| 8. | ఉపనిషత్తులు ....................... | 109 |
| 9. | వేదాంగాలు......................... | 128 |
| 10. | ఉపాంగాలు ........................ | 143 |
| | అనుబంధం – ఒకటి....................... | 148 |
| | అనుబంధం – రెండు....................... | 153 |
| | అనుబంధం – మూడు ..................... | 162 |
| | అనుబంధం – నాలుగు..................... | 166 |
| | అనుబంధం – అయిదు .................... | 167 |

# వేద వాఙ్మయము

**ప్రా**చీన భారతీయుల చరిత్రకు చక్కని అక్షర ప్రతిరూపమే సంస్కృత సాహిత్యం. చరిత్రకందని కాలం నుంచి మానవజాతి మనుగడ అందులో స్పష్టంగా గోచరిస్తుంది. సంస్కృత సాహిత్యం అతి ప్రాచీనమైంది.

సంస్కరింపబడిన భాష, సంస్కారాన్ని కలిగించే భాష కనుక గీర్వాణవాణి సంస్కృత భాష అని పరిగణింపబడింది. భారతీయ భాషలకు మూలభాషగా ఆదరింప బడింది. ఆయా ప్రాంతీయ భాషలకు ఇది ఎంతో శక్తి సామర్థ్యాలను అందించింది. ఈ భాషలో నిబద్ధమైన సాహిత్యమే సంస్కృత సాహిత్యం. ఇది మానవత్వపు విలువలకు అంకితమైన సాహిత్యమని, మానవుణ్ణి పరిపూర్ణమైన వ్యక్తిగా, శక్తిగా రూపొందించే సాహిత్యమని భావించబడింది.

మంత్రద్రష్టలైన కొందరు మహర్షుల చేత దర్శించబడిన వేదములు వైదిక సంస్కృత భాషలో ఉన్నాయి. సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు అని నాలుగు విభాగాలలో వైదిక వాఙ్మయం ఏర్పడింది. వాల్మీకి మహర్షి వచించిన రామాయణంతోనే లౌకిక సంస్కృత భాష రూపుదిద్దుకుంది. ఆ తరువాత ఏర్పడిన వాఙ్మయమంతా లౌకిక సంస్కృతభాషలో ఉంది.

ప్రపంచ వాఙ్మయరంగంలో ప్రప్రథమ స్థానాన్ని అలంకరించి, తత్త్వ భాండాగారాలుగా ప్రసిద్ధి చెందిన వేదాలను దర్శించింది భారతదేశం. మానవజాతి సంతరించుకున్న మహనీయ పుస్తక భాండాగారములో ఋగ్వేదం మొట్టమొదటిదని మాక్స్ ముల్లర్ పేర్కొన్నాడు. ఋగ్వేదం భారతీయ వాఙ్మయ మణిహారంలో మొట్టమొదటి మణి. ప్రపంచ వాఙ్మయ మణిహారంలో ప్రథమస్థానం పొందింది. ఋగ్వేదంతో ప్రారంభమై ఇతర వేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు, వేదభాష్యాలు, సూత్ర వాఙ్మయము, ఆగమ వాఙ్మయము, దర్శనాలు, ఇతర శాస్త్రాలు– ఇలా సంస్కృత వాఙ్మయము ఎంతగానో విస్తరించింది. ఇలా శాఖోపశాఖలుగా వెల్లివిరిసిన వైదిక – లౌకిక సంస్కృత వాఙ్మయాలు వేల సంవత్సరాలనుంచి తరతరాలుగా భారతీయ సంస్కృతిని తీర్చిదిద్దుతూ సమాజానికి ఎంతో దోహదం చేస్తున్నాయి.

ధర్మం అంటే ఏమిటి ? దేని ఆచరణ వల్ల మనకు, సమాజానికి సంతృప్తి, సంతోషం కలుగుతాయో అదే ధర్మం. ధర్మమంటే ఏమిటో తెలుసుకోవాలన్నా, ధార్మిక సూత్రాలను తెలుసుకోవాలన్నా మనం కొన్ని ధర్మ ప్రమాణాల గ్రంథాలను అధ్యయనం చెయ్యాలి. ప్రమాణమంటే సత్యాన్ని నెలకొల్పేది అని అర్థం. అంటే ధర్మప్రమాణమంటే ధర్మం గురించి నిజమైన జ్ఞానాన్ని ప్రసాదించేది అన్నమాట. నిజమైన ధర్మం గురించి వివరించే గ్రంథాలు పద్నాలుగున్నాయి – నాలుగు వేదాలు (ఋక్, యజుః, సామ, అథర్వ); ఆరు వేదాంగాలు (వేదాలకు అనుబంధాలు – శిక్ష (శబ్దశాస్త్రం), వ్యాకరణం, నిరుక్తం (భాషా శాస్త్రం), ఛందస్సు, జ్యోతిషం, కల్పం); నాలుగు ఉపాంగాలు (మీమాంస = వేదాలకు వ్యాఖ్య, న్యాయం = తర్కం, పురాణం, ధర్మశాస్త్రం = వర్తనకి సంబంధించిన నియమాలు). వీటిలో విజ్ఞానం, వివేకం నిక్షిప్తమై ఉన్నాయి. అందుచేతనే ఈ పద్నాలుగు విద్యాస్థానాలంటారు.

వీటికి ఉపాంగాలు నాలుగున్నాయి. ఇవి వేదాలకు అనుబంధాలు. ఒకటి ఆయుర్వేదం = జీవితానికి సంబంధించిన శాస్త్రం. రెండు అర్థశాస్త్రం = సంపదకి, అర్థానికి సంబంధించిన శాస్త్రం. మూడు ధనుర్వేదం = అస్త్రాలకీ, యుద్ధానికీ సంబంధించిన శాస్త్రం. నాలుగు గాంధర్వ వేదం = సంగీత, నృత్య, నాటకం వంటి లలిత కళలకు సంబంధించిన శాస్త్ర గ్రంథాలు.

చతుర్వేదాలు అతి ప్రామాణాలు. ఆరు వేదాంగాలు, నాలుగు ఉపాంగాలు కూడా వేదాలమీదే ఆధారపడ్డాయి. వేదాలను ఈ ఆరు అంగాలతో, నాలుగు ఉపాంగాలతో కలిపి అధ్యయనం చేయాలి.

వైదిక సాహిత్యంలో మొట్టమొదటివి వేదాలు. వేదాలు హిందువులకు అతి పురాతనమైన పవిత్రగ్రంథాలు. 'విద్–జ్ఞానే' అనే ధాతువు నుంచి వేద శబ్దం నిష్పన్నమైందన్నారు. దేని ద్వారా జ్ఞానం ప్రాప్తిస్తుందో దానినే వేదమని అన్నారు. వేదాలు మానవజాతి చరిత్రకు మొట్టమొదటి పాఠ్యగ్రంథాలు, వేలాది సంవత్సరాలుగా హిందువులకు పరమ పవిత్ర విశ్వసనీయమైన ప్రమాణం.

వేదాలు అపౌరుషేయాలు. అంటే పురుషప్రమేయం లేనివి అని అర్థం. 'పౌరషేయ' మంటే మానవ కల్పితం. వేదాలు మానవ కల్పితాలు కానందువల్ల ఏ ఋషీ వాటిని రచించలేదు. వారే వ్రాసివుంటే మంత్రకర్తలనేవారు. కాని వారిని మంత్రద్రష్టలంటున్నారు.

అంటే మంత్రాలను దర్శించినవారని అర్థం. ఋషులు మంత్రాలను కనుగొన్నారు కాని వారు రచించలేదు, సృష్టించలేదు. జ్ఞానం శాశ్వతమైనది, ఈశ్వరీయమైనదని హిందువుల నమ్మకం, మనిషిలోని మనీషి తనలో దాగియున్న అక్షరదీప్తిని దర్శించి, సమున్నతమైన సమాధి స్థితిలో తనకు తెలియని మనోదశలో ఉన్నప్పుడు అతని వర్చస్సు నుండి వెలువడిన వచస్సే వేదనాదం. అలాంటి జ్ఞానాన్ని తపో సంపన్నులైన ప్రాచీన మహర్షులు స్వానుభవపూర్వకముగా దర్శించి, శిష్యపరంపరగా లోకానికి అందజేసిన మహత్తర జ్ఞానం. వారు ఆ జ్ఞానానికి కర్తలు కారు. అందువలననే వేదాలు అపౌరుషేయాలని నమ్ముతున్నారు.

వేదాలకు 'శ్రుతు'లని కూడా మరోపేరు. శ్రుతి అనగా 'వినుట' అని అర్థం. పరమాత్మ నుంచి ఋషిపుంగవులు వేద జ్ఞానాన్ని విన్నారు కాబట్టి వేదాలకు శృతులనే పేరు వచ్చిందన్నారు. వేదాలు వ్రాతలో కాకుండా ఒకరి నుండి ఒకరు వినడం ద్వారానే ప్రాచీనకాలంలో ప్రచారంలో ఉన్నాయి. కాబట్టి వాటికి ఆ పేరు వచ్చిందని అభిప్రాయం. వేదంలో ప్రధానమైంది నాదం. ఈ నాదం విని ఆనందించవలసిందే కాని విశ్లేషించి విమర్శించవలసింది కాదట. అందువలననే దానికి శ్రుతి అనే పేరు వచ్చిందంటారు. వేదాలకు శృతి,అనుశ్రవం, త్రయి, ఆమ్నాయం, సమామ్నాయం, ఛద్దం, స్వాధ్యాయం, ఆగమం, నిగమం మొదలైన తొమ్మిది పేర్లున్నాయి.

వేద ప్రామాణ్యము హిందూత్వానికి ప్రధాన లక్షణం. ఈశ్వరుడు లేడనే వారినైనా సహించారు కాని, వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని వారిని సహించలేకపోయారు హిందువులు. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించేవారిని ఆస్తికులుగా, అంగీకరించని వారిని నాస్తికులుగా  పరిగణించారు.

యోగ తపో సంపన్నులై వేదాలను దర్శించిన ఋషులలో పురుషులే కాక స్త్రీలు కూడా ఉన్నారు. వేదాలు మంత్ర రూపంలో ఉన్నాయి. మంత్ర సంకలనాలకు సంహితలని పేరు. వ్యాసుడు వేదాలను విభజించాడు. అందువలననే అతనికి వేదవ్యాసుడనే పేరు. విస్తృతమైన వేద సంహితాన్ని వ్యాసుడు నాలుగుగా విభజించి, తన నలుగురు శిష్యుల చేత అధ్యయనం చేయించాడు. పైలునికి ఋగ్వేదాన్ని, వైశంపాయనునికి యజుర్వేదాన్ని, జైమినికి సామవేదాన్ని, సుమంతునికి అథర్వ వేదాన్ని వ్యాసుడు చెప్పాడట. వారు తమ శిష్యులకు, ఆ శిష్యులు తమ శిష్యులకు ప్రశిష్యులకూ – ఇలా వేదాలు ప్రచారమవుతూ వచ్చాయి.

బాహ్యదృష్టిలోని అందచందాలను అంతరదృష్టితో అవగాహన చేసుకుని వాటి ఆంతర్యాన్ని అనురాగంతో కీర్తించిన ఆనందగీతికలు ఋగ్వేదంలోని ఋక్కులయితే, గృహమేదికి కావలసిన గృహ్యాసూత్రాలు, యజ్ఞయాగాదులు, కర్మకాండలకు సంబంధించిన మంత్రాలు యజుర్వేదంలో చేరాయి. పాడుకొని కొనియాడదగిన పరమ రమణీయ పద సంపద సామగానమయితే, ఐహికాముష్మిక రహస్య సంపుటి అథర్వ రూపాన్ని ధరించింది.

ఇలా నాలుగు భాగాలుగా విస్తరిల్లిన వేద వాఙ్మయములో తిరిగి నాలుగు శాఖలు ఏర్పడ్డాయి - మంత్ర భాగం, బ్రాహ్మణ భాగం, ఆరణ్యక భాగం, ఉపనిషద్భాగం. మంత్ర భాగాన్ని సంహితా భాగమని కూడా అంటారు. సంహితమంటే సంకల్పింపబడి, ఒక క్రమంలో ఏర్పరచబడినదని అర్థం. ఏ సంహితైనా, ఆ వేదము యొక్క అంతరార్థాన్ని మంత్రాల ద్వారా తెల్పుతుంది. ఈ మంత్రాలకు వినియోగం, ప్రయోజనం, ప్రక్రియ నిరూపించేది బ్రాహ్మణ భాగం. బ్రహ్మ శబ్దానికి మంత్రమనే అర్థం ఉంది. బ్రహ్మతత్త్వాన్ని అంటే మంత్ర తంత్రాన్ని నిర్వచించి వ్యాఖ్యానించేది బ్రాహ్మణం. ఈ భాగంలో ఎక్కువగా ప్రవృత్తి మార్గానికి చెందిన విషయాలుంటాయి. నివృత్తి మార్గానికి చెందిన వైరాగ్య సూత్రాలు, వేద రహస్యాలు ఆరణ్యకంలో ఉంటాయి. ఈ రెండింటి సమన్వయం చివరి భాగమైన ఉపనిషత్తులో కన్పిస్తుంది. మూల రూపంలో వేదం ఒక్కటే.

వేదాలు నాలుగు అయినా, 'త్రయీ' అనికూడా అంటారు. పద్య, గద్య, గేయ విభజన వేదత్రయం అని ఒక ఉవాచ. వేదాలలో ఋక్కు, యజస్సు, సామగీతి - అని మూడు రకాల మంత్రాలున్నాయి. అందువలననే నాలుగు వేదాలను మూడుగా విభజించి 'త్రయీ' అని కూడా అంటారు.

ఏ మంత్రమును ఏ మహర్షి దర్శించాడో అతడే ఆ మంత్రానికి ఋషి అన్నారు. వివిధ ఋషుల సంప్రదాయానికి సంబంధించి వివిధ శాఖలు ఏర్పడ్డాయి. ఈ వేదశాఖల ఉచ్చారణలో అక్కడక్కడ మతభేదం కనిపిస్తుంది. కొన్ని మండలములలోని భాష చాలా పురాతనమైన దనిపిస్తుంది. ఒక వేదంలోని మంత్రం వేరొక వేదంలో స్వరగత, శబ్దగత, అర్థగత భేదాలలో కనిపిస్తుంది. వేదాలలో వర్ణించిన విషయాలు కూడా ఒకే కాలానికి చెందిన విశ్వాసాలపై ఆధారపడినట్లు అనిపించదు. ఒకచోట మహోన్నత శక్తి సంపన్నులుగా వర్ణించబడిన దేవతలు వేరొకచోట మానవుల కంటె తక్కువగా కనిపిస్తారు.

భాష్యకారుడు పతంజలి ననుసరించి ఋగ్వేదమునకు ఇరవై ఒకటి, యజుర్వేదానికి నూరు, సామవేదానికి వెయ్యి, అథర్వణ వేదానికి తొమ్మిది శాఖలు

ఉన్నాయి. చాలావరకు ఈ శాఖలు కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రతి వేదశాఖకు ప్రత్యేకంగా సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులు, ప్రాతిశాఖ్యములు, శ్రౌత సూత్రములు, గృహ్యసూత్రములు మొదలైన వాఙ్మయముంటుంది. కాని నేడు మనకు ఋగ్వేద శాఖ ఒకటి, యజుర్వేద శాఖలు అయిదు, సామవేదశాఖలు మూడు, అథర్వవేద శాఖలు రెండు – మొత్తం పదకొండు శాఖలు మాత్రమే మిగిలాయి.

## వేదపాఠం

భారతీయ ధార్మిక జీవనంలో వేదాలకి మహోన్నతమైన స్థానం ఉంది. హిందూ దేశంలో చాలా మత సంప్రదాయాలు ప్రవేశించాయి. వేదాల విషయంలో ప్రాచీన ఋషులు, పండితులు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. కాబట్టి వ్రాత రూపంలో లేకపోయినా వేదాలు ఈ రోజుకి మూలం మార్పు చెందక వేలాది సంవత్సరాలుగా పదిలంగా ఉన్నాయి. హిందూ దేశంలో ఈనాడు పలు ప్రాంతాల వారు వివిధ భాషలు మాట్లాడేవారు సయితం వేదాల ఉచ్చారణలో ఏ విధమైన తేడా లేకుండా వేదపాఠం పఠిస్తున్నారు. దానికి ముఖ్య కారణం మన ప్రాచీనులు అనుసరించిన సంప్రదాయ బద్ధమైన పద్ధతే. సరైన ఉచ్చారణ వల్లనే వేదమంత్రాలు శక్తివంతమౌతాయని నమ్మేవారు. ఇందులో దోషాలు దొర్లకుండా కాపాడుకోవడానికీ, ఒక తరం నుండి వేరొక తరానికి ఆ స్వచ్ఛతలోనే అందించటానికి సమాజంలో ఒక వర్గం అంకితమైంది. వేద శబ్దాల ఆదిమ స్వచ్ఛత అలాగే నిలిచిపోవడానికి కారణమదే.

వేద శబ్దాలకున్న ఒక నిర్ధిష్ట క్రమాన్ని (అనుపూర్వి) గమనించి, ధ్వనుల సంయోజనకూ (సంధి), అక్షరాల పరస్పర సంబంధానికీ (సంతానం) ఏర్పడిన ధ్వని శాస్త్ర నియమాన్ని అనుసరించి, కంఠస్థం చేసుకొన్న పాఠాల శుద్ధతను కొన్ని నిర్ధిష్ట గణిత శాస్త్ర పద్ధతుల్లో నిరూపించి బ్రాహ్మణులు, వేదాల మౌలిక పరిశుద్ధతను అత్యంత ప్రాచీనకాలం నుంచి పరిరక్షిస్తూ వచ్చారు. వేద శబ్ధంలోని ప్రతి అక్షరం విలక్షణత ఉన్నది, ఫలప్రదమైనది.

మంత్రాలను, మంత్రపదాలను పఠించే పద్ధతిని పాఠమని అంటారు. ఈ విధమైన పాఠపద్ధతుల నియమావళే వేదాలు అక్షరం పొల్లుపోకుండా నిలిచి ఉండటానికి ప్రత్యేకమైన గ్రంథాలు వ్రాయబడ్డాయి. ఆ గ్రంథాలను ప్రాతిశాఖ్య గ్రంథాలని అంటారు. మంత్రాలను, మంత్ర వర్ణాలను పఠించే పద్ధతులు – వాక్య, పద, క్రమ, జట, మాల, రేఖ, ధ్వజ, అథ, ఘన మొదలైనవి.

మంత్రాలను ఒక వాక్యం వలె వల్లె వేయటాన్ని 'వాక్యపాఠం' అనీ 'సంహిత పాఠం' అని అంటారు. ఒక వాక్య రూపంలో మంత్రాలను వల్లించేప్పుడు కొన్ని కొన్ని పదాలను కలుపవలసి వస్తుంది. మంత్రాలలో ప్రతి పదాన్ని దేనికదిగా, విడిగా వల్లించటాన్ని పదపాఠమంటారు. సంహిత పాఠం తరువాతనే పదపాఠం వస్తుంది. పదపాఠంలో వాక్యాలకి పద విభజన జరుగుతుంది. దీనివల్ల వేదాధ్యయనం చేసేవారికి ప్రతి పదమూ తెలుస్తుంది. దీని తరువాతది క్రమపాఠం. ఈ పద్ధతిలో మొదటి పదాన్ని రెండవ దానికీ, రెండవపదాన్ని మూడవదానికీ, మూడవ పదాన్ని నాల్గవ దానికీ చేర్చుకుంటూ వాక్యం పూర్తయ్యేవరకూ వల్లిస్తారు. ఈ పద్ధతి వల్ల ప్రతి పదమూ అర్థమవటమే కాక, రెండేసి పదాలను కలిపి ఏ విధంగా వల్లించాలో, ఆ కలపటంలో వచ్చే మార్పులు ఏమిటో కూడా తెలుస్తాయి. తరువాత జటాపాఠం. ఈ పద్ధతిలో మొదటి పదాన్నీ రెండవ పదాన్నీ కలిపి వల్లిస్తారు. తరువాత మళ్ళీ మామూలు వరసలో చెప్తారు. క్రమపాఠంలో పదాలక్రమం 1-2, 2-3, 3-4, 4-5 ఇలా వుంటుంది. కాని జటాపాఠంలో 1-2, 2-1, 1-2 ఈ క్రమంలో ముందుకీ వెనకకీ వల్లెవేస్తారు. జటాపాఠంలోని ముందు, వెనుకకి ముందు వచ్చే పదాన్ని కలుపుతూ చదివినట్లయితే అది శిఖాపాఠం. పదాలను ముందు, వెనుక క్రమంలో చాలాసార్లు చదివినట్లయితే ఘనపాఠం. ఈ ఘనపాఠం నాలుగు రకాలుగా ఉంటుంది. దానిలో ఒకటి శిఖాపాఠంలోని పదాలను తిప్పి మళ్ళీ పఠించే పద్ధతి.

**ఉదాహరణము :**

**మూల ఋక్-**

పవస్వ వాజసాతయే విప్రస్య గృణతో వృథే! సోమరాస్వ సువీర్యమ్!!

(ఓ సోమా! మాకు నన్నా లాభము కొరకు నిన్ను స్తుతించునట్టి విప్రుడనగు నాకు నభివృద్ధి యగుటకు రసమిమ్ము; వీర్యవంతుడగు పుత్రుని నాకు నిమ్ము)

**పదపాఠము** : పవస్వ! వాజసాతయే! విప్రస్య! గృణతః! వృథే!! సోమ! రాస్వ! సువీర్యమ్!!

**క్రమపాఠము** : పవస్వ వాజసాతయే! వాజసాతయే విప్రస్య! వాజసాతయే ఇతి వాజసాతయే! విప్రస్య గృణతః! గృణతో వృథే! వృథే ఇతి వృథే! సోమరాస్వ! రాస్వ సువీర్యమ్! సువీర్య మితి సువీర్యమ్!

**జటాపాఠము** : పవస్వ, వాజసాతయే వాజసాతయే, పవస్వ పవస్వ, వాజసాతయే వాజసాతయే, విప్రస్య విప్రస్య, వాజసాతయే వాజసాతయే, విప్రస్య! వాజసాతయే ఇతి వాజసాతయే! విప్రస్య, గృణతో గృణతో, విప్రస్య విప్రస్య, గృణతః! గృణతో, వృధే వృధే, గృణతో గృణతో వృధే! వృధే ఇతి వృధే! సోమ, రాస్వ రాస్వ, సోమ సోమ, రాస్వ! రాస్వ, సువీర్యమ్ సువీర్యమ్, రాస్వ రాస్వ, సువీర్యమ్! సువీర్య మితి సువీర్యమ్!!

**ఘనపాఠము** : పవస్వ, వాజసాతయే వాజసాతయే, పవస్వ పవస్వ వాజసాతయే, విప్రస్య విప్రస్య, వాజసాతయే, పవస్వ పవస్వ, వాజసాతయే, విప్రస్య! వాజసాతయే, విప్రస్య విప్రస్య, వాజసాతయే వాజసాతయే, విప్రస్య, గృణతో గృణతో, విప్రస్య, వాజసాతయే, వాజసాతయే విప్రస్య, గృణతః! వాజసాతయే ఇతి వాజసాతయే! విప్రస్య, గృణతో గృణతో, విప్రస్య విప్రస్య, గృణతో, వృధే వృధే, గృణతో, విప్రస్య విప్రస్య, గృణతో, వృధే! గృణతో, వృధే వృధే, గృణతో గృణతో, వృధే! వృధే ఇతి వృధే!

సోమ, రాస్వరాస్వ, సోమసోమ, రాస్వ, సువీర్యమ్ సువీర్యమ్, రాస్వ, సోమసోమ, రాస్వ, సువీర్యమ్! రాస్వ, సువీర్యమ్ సువీర్యమ్, రాస్వ రాస్వ, సువీర్యమ్! సువీర్య మితి సువీర్యమ్!

ఈ విధమైన పాఠ పద్ధతులు ఉండడం వలన వేదాలు వ్రాత రూపంలో లేకపోయినా నేటికీ నిలిచి ఉన్నాయి. మంత్ర జపం వల్ల పూర్తి సాఫల్యం పొందాలంటే దానికి నిర్ణీతమైన పద్ధతి ఉన్నదని పేర్కొన్నారు. ఆరు విధాలుగా మంత్రాలను వల్లెవేయటం వర్జనీయమని విజ్ఞులు చెప్పారు – గీతీ, అంటే పాట వలె మంత్రాన్ని ఆలపించేవాడు. ఇది సరియైనది కాదు. సామవేదాన్ని ఆలాపించాలి. కాని ఆ పాడటం కూడా విధ్యుక్తంగానే చెయ్యాలి గాని ఎవరికి తోచినట్లు వారు చేయకూడదు. అంతేకాక శబ్దానికీ, ఆ శబ్దంలోని మార్పులకీ శక్తి ఉండడం వల్ల సరియైన స్వరంతో కాక ఇంకొక విధంగా పఠించడం తప్పే కాకుండా హానికరం కూడా. అందువల్ల మంత్రాన్ని నిర్ణీతమైన విధంగానే చెప్పాలి.

శీఘ్రీ, అంటే వేగంగా మంత్రాన్ని చెప్పి హఠాత్తుగా నిలిపేవాడు. ఇది కూడా తప్పే. వేద పదాలను నియమిత కాలానుగుణంగానే ఉచ్చరించాలి. లేకపోతే వాటికి ఫలితం పూర్తిగా లభించదని నమ్మకం. శిరః కంపీ, అంటే మంత్రాన్ని చదువుతూ అనవసరంగా తలని ఆడించేవాడు. మనిషి ఏకాగ్రతతో నిటారుగా కూర్చుని నాడుల

ప్రకంపనం సహజంగానే జరగనివ్వాలి. నేటి గాయకుని వలె తలని ఆడించడం వలన ఆ ప్రకంపనలకు భంగం కలుగుతుందట. లిఖిత పాఠకః, అంటే మంత్రం యొక్క అర్థం తెలియని వాడు. మంత్రాల సాఫల్యం పరిపూర్ణంగా పొందాలంటే వాటి అర్థాన్ని కూడా ఎరిగి ఉండాలట. అల్పకంఠి, అంటే హీనస్వరంతో ఉచ్చరించేవాడు. శబ్ద తరంగాలకి సత్ఫలితాలుండాలంటే ఏదో గొణుగుతున్నట్లు కాక స్పష్టంగా వినబడాలట.

వేదాలను గంభీరతతో ఉచ్చరించాలి. అప్పుడు ఆ శబ్దాలు స్పష్టంగా వినబడతాయి. వేదమంత్రాలు, ఆ పఠించేవాని నాడులలో మంచి ప్రకంపనాలనేకాక, వినేవారిలో కూడా అటువంటి వాటినే కలిగిస్తాయి. అవి వాతావరణంలో విస్తరిస్తాయి. కాబట్టి ఎల్లవేళలా శ్రేయోదాయకాలే. మంత్రాలు అంతటా వ్యాపించడానికి వీలుగా వాటిని బిగ్గరగా వల్లెవేయాలట.

వేదలక్షణాలు – అనాది, అపౌరుషేయాలు, సృష్టికి మూలం. అంతేకాదు వాటిని పఠించేప్పుడు వచ్చే శబ్దం మన నాడులను ప్రకంపింప చేస్తుంది. వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యక్తికి, సమిష్టికి మేలు కలిగిస్తుంది. ఇక్కడ సమిష్టి అంటే కేవలం మానవులేనని అర్థం కాదు.

## యజ్ఞం

వేదాలలో ముఖ్యంగా ప్రతిపాదింపబడిన విషయజాలమంతా యజ్ఞయాగాలకు, కర్మకాండలకు ఎక్కువగా సంబంధించింది. యజ్ఞం అంటే అగ్ని సహాయముతో, మంత్రాలను ఉచ్ఛరిస్తూ విద్యుక్తమైన కర్మలు చేయడం. 'యజ్ఞ' మన్న పదం 'యజ్' అనే ధాతువు నుండి వచ్చిందంటారు. దీని అర్థం – ఆరాధించు లేక సమర్పించు. క్రతువును మనసారా, పరమాత్మపట్ల, దేవతపట్లా – సంపూర్ణమైన భక్తిభావంతో నిర్వహించటమే యజ్ఞమంటే. మంత్రపూర్వకంగా అగ్నిని ప్రజ్వలింపజేసి, వెలిగే అగ్నిలో తమ ఇష్ట దేవతలను మంత్రాలు చదువుతూ ఆహ్వానించి హవిస్సులను అర్పిస్తారు. అవసరాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి యజ్ఞయాగాది అనుష్టానాలు క్లిష్టమైనాయి. బహుముఖంగా కూడా విస్తరించాయి. బ్రాహ్మణాలకాలం నాటికే యజ్ఞవిధులు బాగా విస్తరించాయి. సూత్రాల కాలంలో, ఆ తరువాత అవి వెర్రితలలు వేసి, అతిగా విస్తరించాయి. అర్థం పర్దం లేకుండా విస్తరించిన యజ్ఞయాగాదులను ఖండిస్తూ బౌద్ధమతం ఆవిర్భవించింది.

వైదికార్యులు చేసే యజ్ఞాలలో సోమయజ్ఞం లేక సోమయాగం ప్రముఖమయింది. సోమయాగం మూడు రకాలు. ఒకటి ఏకాహం – ఒక్కరోజు మాత్రమే చేసేది. రెండవది

అహీనం – రెండు రోజుల నుండి పన్నెండు రోజుల వరకు చేసేది. మూడవది సత్రం – పదమూడు రోజులు మొదలుకుని ఒక సంవత్సరం వరకుగాని, వెయ్యి సంవత్సరాల వరకు కాని చేసేది. సోమయాగంలో సోమలత నుంచి తీసిన రసాన్ని ఆహుతిగా ఇచ్చి దేవతలను ఆహ్వానిస్తారు. ఈ యాగంలో పదమూడు మంది ఋత్విజులుంటారు. వారికి సహాయ ఋత్విజులుంటారు. యజ్ఞవిధిని గురించి బాగా తెలిసిన వారిని ఋత్విజులు అంటారు. వారు యజ్ఞక్రియను సశాస్త్రీయంగా నడుపుతారు. ఋత్విజులు నాలుగు వేదాలకు సంబంధించి నాలుగు విధాలుగా ఉంటారు. ఋగ్వేదం ప్రకారం దేవతలను ఆహ్వానించే వారిని 'హోత' అంటారు. యజుస్సుల ద్వారా యజ్ఞక్రియను సంపన్నం చేసేవారిని 'అధ్వర్యు'లంటారు. సామ మంత్రాలను గానం చేసేవారిని 'ఉద్గాత' అంటారు. అథర్వవేదం తెలిసి, యజ్ఞకర్మను పర్యవేక్షించేవారిని 'బ్రహ్మ' అంటారు. ఈ నాలుగు విధాలైన వారికి ఒక్కొక్కరికి ముగ్గురు సహాయకులు ఉంటారు. హోతకు – మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు, గ్రావస్తుత్ అనేవారు సహాయకులు. అధ్వర్యునికి – ప్రతిప్రస్థాత, నేష్ఠ, ఉన్నేత సహాయకులు. ఉద్గాతకు – ప్రస్తోత, ప్రతిహర్త, సుబ్రహ్మణ్యుడు సహాయకులు. బ్రహ్మకు – బ్రాహ్మణాచ్ఛంసి, అగ్నీధ్రుడు, పోత సహాయకులు.

వేద మంత్రాలను పఠిస్తూ వివిధ పదార్థాలను అగ్నికి ఆహుతి చేస్తారు యజ్ఞంలో. దీనిని 'హోమ'మంటారు. అగ్నికి ఆహుతి చేసినా, అన్నింటినీ అగ్నికి సమర్పించినట్టు కాదు. ప్రత్యేకంగా అగ్నికి సమర్పిస్తున్నట్టు మంత్రం చెప్పినప్పుడు మాత్రమే అవి అగ్నికి చెందుతాయి. ఇతర దేవతలు రుద్రునకూ, ఇంద్రునికీ, విష్ణువుకు, వరుణునకూ, వాయువుకూ, సోమునకూ సమర్పించిన వాటిని వారికి చేరుస్తాడు అగ్ని. హవిస్సులను అగ్నిలో అర్పించే క్రియను 'ఆహుతి' అంటారు. ఆహుతి అంటే వైదిక భాషలో ఆహ్వానం అని అర్థం.

యజ్ఞవిధి అంతా అయిన తరువాత ఋత్విజులకు 'దక్షిణ'లు ఇస్తారు. వేదకాలంలో ఆవులు ఎక్కువగా దక్షిణ రూపంలో ఇవ్వబడేవి. యజ్ఞంలో ఋత్విజులను నియమించడం, వేదమంత్రపాఠం, ఉచ్చారణ విధులు చాలా శ్రద్ధగా పాటిస్తారు. వాటిలో ఏదైనా లోపం జరిగితే యజ్ఞఫలం సిద్ధించదని ప్రాచీనుల గాఢవిశ్వాసం.

ఆనాటి యజ్ఞయాగాలలో సోమయాగమే కాకుండా – అగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశీ, అతిరాత్రం, అత్యగ్నిష్టోమం మొదలైనవి ఉన్నాయి. అగ్నిష్టోమంలో యజ్ఞం చివర అగ్నిపేరున సామమంత్రగానం చేస్తారు. ఆ సామగానానికే అగ్నిష్టోమం అనిపేరు. ఈ యజ్ఞం అయిదు రోజులవరకు జరుగుతుంది.

యజ్ఞంలో చివర ఉక్థ్యం అనే పేరుగల సామమంత్రాలను గానం చేస్తే, ఆ యజ్ఞానికి ఉక్థ్యం అని పేరు. ఏ యజ్ఞంలో అయితే ఉక్థ్యం తరువాత షోడశీ స్తోత్రం చేయబడుతుందో దానికి షోడశీ అని పేరు. షోడశీ స్తోత్రం తరువాత అతిరాత్రమనే సామమంత్రాలు గానం చేస్తే దానికి అతిరాత్రమని పేరు. ఈ నాలుగు యజ్ఞాలను సామూహికంగా జ్యోతిష్టోమ యాగమని అంటారు.

అత్యగ్నిష్టోమంలో అగ్నిష్టోమం తరువాత ఉక్థ్యపాఠం లేకుండానే షోడశీ విధానం ఆచరించబడుతుంది. వీటన్నిటిలో ప్రధానమైనది, ప్రకృతి రూపమైనది అగ్నిష్టోమం. పైన పేర్కొన్న యాగాలే కాకుండా గవామయన, వాజపేయ, రాజసూయ, అశ్వమేధ యాగాలు ప్రధానమైనవి.

యజ్ఞం మూడు విధాలైనది – ప్రభాతకాలంలో చేసే యజ్ఞం, మధ్యాహ్నవేళ చేసే యజ్ఞం, సాయం సంధ్యలో చేసే యజ్ఞం. యజ్ఞాలలో పంచాగ్ను (శ్రౌతాగ్ని (ఆహవనీయ, గార్హపత్య, దక్షిణ), స్మార్తాగ్ని (గృహ్యాగ్ని), సభ్యాగ్ని) లందు ఆహుతి చేయబడాలని చెప్పబడింది. యజ్ఞక్రియలలో ఉపయోగింపబడే అగ్ని శ్రౌతాగ్ని అనబడుతంది. శ్రౌతాగ్ని మూడు విధాలుగా ఉంటుంది – ఆహవనీయ, గార్హపత్య, దక్షిణ. ఇవి ప్రజ్వలింపజేయబడే కుండాల ఆకారాలు వేరువేరుగా ఉంటాయి. ఆహవనీయ కుండం చతురాకారంగా, గార్హపత్యాగ్నికుండం వర్తులాకారంగా, దక్షిణాగ్నికుండం అర్ధచంద్రాకారంగా ఉంటాయి. వీటిలో ఆహవనీయ ముఖ్యమైనది. దీనిలోనే దేవతలకు ఆహుతి ఇయ్యబడుతుంది. గార్హపత్యాగ్ని హవిస్సులను వండేందుకు ఉపయోగిస్తారు. దక్షిణాగ్నిలో పితృకర్మలు చేయబడతాయి. ఇవిగాక స్మార్తాగ్ని వుంటుంది. స్మార్తకర్మల్లో ఉపయోగపడే అగ్ని. దీనికి గృహ్యాగ్ని అని పేరు. ఈ నాలుగూ కాక అయిదవది సభ్యాగ్ని. దీనిని సభామంటపంలో ప్రజ్వలింప జేస్తారు. అందుకే దీనికి సభ్య అని పేరు.

యజ్ఞక్రియలలో పురోడాశాది (బియ్యపు పిండితో చేసిన రొట్టె వంటిది) పక్వాన్నాలను హవిస్సులుగా ఉపయోగిస్తారు. పురోడాశాదులే కాకుండా పాలు, పెరుగు, యవలు, బియ్యం, నెయ్యి ఆహుతులుగా అగ్నిలో అర్పించబడతాయి. కొత్తపంట వచ్చినప్పుడు వివిధ ధాన్యాలు కూడా ఆహుతులుగా అర్పించి యజ్ఞక్రియ ఆచరించేవారు.

యజ్ఞక్రియలు విస్తరించిన కొద్దీ పశువులను కూడా బలిగా అర్పించటం ఆరంభించారు. మేక, గొర్రె, ఎద్దు – ఈ పశువులను మొదట్లో యజ్ఞపశువులుగా ఉపయోగించేవారు. తరువాత తరువాత గుర్రాన్నీ, మనిషిని కూడా యజ్ఞపశువుగా

ఉపయోగించసాగారు. పశువులలో మానవుడు ఉత్తమమైన పశువు అని మానవుని కూడా యజ్ఞపశువుగా ఉపయోగించసాగారు. అత్తపత్తి చెట్టు లేక బిల్వంతో చేయబడిన యూపానికి యజ్ఞపశువును కట్టేవారు. ఈ పశువును నోరు, ముక్కు మూసి, అనగా ఉచ్ఛ్వాస నిశ్వాసలను ఆపి చంపేవారు. ఈ చంపే విధానాన్ని 'సంజ్ఞపన' మన్నారు. పశువు మరణించిన తరువాత ప్రత్యేకాంగాలను తీసి అగ్నిలో హవిస్సులుగా అర్పించేవారు.

## వేదాలలో దేవతలు

వైదికార్యులు ప్రకృతి శక్తులను ఆరాధించారు. సూర్య, అగ్ని, వరుణ, వాయు, మరుత్తులు, విద్యుత్తు, మేఘం, ఉషస్సు మొదలైన ప్రకృతి శక్తులను వారు దేవతలుగా చేసి స్తుతి చేశారు. కేవలం సూర్య, మరుత్త, రాత్రి, పగలు, భూమి, ఆకాశం వంటి ప్రకృతి దేవతలే కాక వైదికార్యులు నదులను కూడా ఆరాధించి స్తుతించారు. తాము తినే ఆహార పదార్థాలను అగ్నిముఖంగా దేవతలకు అర్పించి ఆహ్వానించేవారు. ఆ ప్రకృతి శక్తులు తమలో ప్రవేశించి తమకు బుద్ధి, దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, తేజస్సు, శక్తి, వీర్యం ఇవ్వమని కోరేవారు. అంతేకాక వారు విశ్వశాంతి, విశ్వబంధుత్వం కూడా యాచించారు. మానవులలో పరస్పరమైత్రి సౌహార్ద్ర భావాలను పెంపొందించమని కోరారు. అందరికి సుఖాలను, శాంతులను, శుభాలను, ఆరోగ్యాన్ని ప్రసాదించమని వైదికార్యులు ప్రార్థించారు. ఇతర మతాలలో వ్యక్తి తన కోరికలకే ప్రాధాన్యం ఇచ్చినట్లుగా కనిపిస్తుంది. కాని విశ్వ కళ్యాణాన్ని కోరినట్లుగా కనిపించదు.

వేదాలలో విగ్రహాలు, మూర్తుల ప్రస్తావన లేదు. కాబట్టి వైదికార్యులు విగ్రహారాధకులు కారు. యజ్ఞమే వారికి ప్రధాన పూజా విధానం. యజ్ఞంలో సోమరసాన్ని తయారు చేయడం, పానం చేయడం ముఖ్యమైన విధిగా ఉండేది. సోమరసం త్రాగడం వలన దేవతలు మత్తులై గొప్ప పనులు చేసినట్లుగా వారు ప్రస్తుతించారు. సోమరసం త్రాగడమే ఆర్యుల పూజావిధానంలో ప్రధానంగా కనిపిస్తుంది.

సోమలత యొక్క చిన్న చిన్న కొమ్మలను అంశువులంటారు. వాటిని రాళ్ళతో చితుక కొడతారు. అప్పుడు ఆ కొమ్మల నుండి సోమరసం వస్తుంది. రెండు చేతులు, పదివ్రేళ్ళు ఆ రాళ్ళను తిప్పుతాయి. అలా నూరగా నూరగా వచ్చిన సోమరసాన్ని ఉన్ని వస్త్రాలతో వడగడతారు. తరువాత పెద్ద పెద్ద బానల్లో భద్రపరుస్తారు. ఈ సోమరసాన్ని పదిమంది సేవికల చేత (వేళ్ళతో) మళ్ళీ శుభ్రపరచబడుతుంది. తరువాత సోమరసం నీళ్ళతోను, పాలతోను, పెరుగుతోను, బార్లీతోను కలుపబడి ఆయా యజ్ఞాలలో

వినియోగించబడుతుంది. ఒకానొకచోట తేనెతో కూడా కలపబడుతుంది. ఈ సోమరసం సోమలత, సోమదేవత అరుణవర్ణం కలవిగాను, హరిత వర్ణం కలవిగాను వర్ణించబడ్డాయి. స్వర్గంలో ఉన్న ఈ సోమలత దివ్యపక్షి చేత భూలోకానికి తీసుకు రాబడినట్లు, మూజవత్పర్వతాలలో పుట్టినట్లు వర్ణించబడింది.

(సోమరసాన్ని సోమలత లేదా సోమవల్లితో తయారుచేస్తారు. ఈ సోమవల్లిని ఇప్పుడు గుర్తించడం సాధ్యం కాదని పరిశోధనా పండితులు వెల్లడించారు. కాని మన తెలుగు నిఘంటుకారులు (సి.పి. బ్రౌన్ మినహా) తిప్పతీగ, పొన్నగంటి అనే అర్థాలు వ్రాశారు. సోమవల్లి ఋగ్వేదకాలంలో పుష్కలంగా, సులభంగా కొండప్రాంతాలలో (ముఖ్యంగా హిమాలయాల్లో) దొరికేదట. దానిని కిరాతులు సేకరించి తీసుకురాగా, వారి నుండి కొనేవారట. కిరాతుని హీనంగా చూచినా, వారి నుంచి కొన్న సోమవల్లిని మహా పవిత్రమైనదిగా పరిగణించి – అనంత, అమృత, ఇందులేఖ, కుండలి, కుల్య, చంద్రిక, చక్రలక్షణ, ఛిన్న ఛిన్నరుహ, జీవంతి, తంత్రిక, దేవనిర్మిత, నిర్జర, మధుక, మధుపర్ణి, వత్సాదని, పయస్థ, విశల్యాది మొదలైన ఘనాతి ఘనమైన పేర్లతో పిలుస్తూ, దాన్ని వారు కళ్ళకు అద్దుకునేవారట!)

వైదిక దేవతలు ఒక్కొక్కరుగా, జంటగా ఆరాధించబడుతున్నారు. మిత్రావరుణ, ద్యావాపృథ్వి, అశ్వినులు జంటగా పేర్కొన్నారు. ఇద్దరుకంటే ఎక్కువమంది గుంపులుగా కూడా దేవతలు కనిపిస్తున్నారు – మరుత్తులు, రుద్రులు, వసువులు, ఆదిత్యులు మొదలగువారు గుంపులు.

వైదిక దేవతలు – ద్యుస్థానీయులు, అంతరిక్ష స్థానీయులు, పృథ్వీ స్థానీయులు అని మూడు రకాలు. ద్యౌస్, వరుణుడు, మిత్రుడు, సూర్యుడు, సవిత, పూషుడు, విష్ణువు, వివస్వత్తు, ఆదిత్యులు, ఉషస్సు, రాత్రి, అశ్వినులు – ద్యుస్థాన దేవతలు. ఇంద్రుడు, త్రితుడు, (ఆప్త్యుడు), అపాంనపాత్, మాతరిశ్వుడు, అహ్నిబుధ్న్యుడు, అజుడు (ఏకపాత్), రుద్రుడు, మరుత్తులు, వాయువు (వాతుడు), పర్జన్యుడు, ఆపః (నీళ్ళు) – అంతరిక్ష దేవతలు. అగ్ని, బృహస్పతి, సోముడు, పృథ్వి, నదులు, సరస్వతి – పృథ్వీస్థాన దేవతలు.

## ద్యుస్థాన దేవతలు

**ద్యౌస్ :**

ద్యౌస్ ద్యుస్థాన దేవత. ఋగ్వేదంలో చాలాచోట్ల 'ఆకాశం' అనే అర్థంతో, కొన్నిచోట్ల 'పగలు' అనే అర్థంలో వ్రాయబడింది. స్వర్గానికి అధిదేవతగా చెప్పబడిన

పృథివీ శబ్దంతో కలసి 'ద్యావా పృథివీ' అని వాడబడింది. స్వర్గం తండ్రి అనీ, భూమి తల్లి అనీ భావన. అశ్వినులు ఆయన సంతానంగా, ఉషస్సు పుత్రికగా, అగ్ని, పర్జన్యుడూ, సూర్యుడూ, ఆదిత్యులూ, మరుత్తులూ, అంగిరసులూ కూడా కొడుకులుగా చెప్పబడ్డారు. కొన్ని మంత్రాలలో వృషభం (ఎద్దు)గాను, భూమికి ఉత్పాదనాశక్తిని కలిగించే జంతువుగాను, రాత్రివేళ నక్షత్రాలతో కూడిన ద్యౌస్, ముత్యాలతో అలంకరించిన గుర్రంతోనూ పోల్చారు. ఆయనకి ప్రత్యేకత లేకపోవడం వలన ఒక సూక్తంలో కూడా ప్రత్యేకంగా ఆయన్ని ఉద్దేశించలేదు.

**వరుణుడు :**

వైదిక దేవతలలో వరుణుడు ఒకడు. వరుణుడు, ఇంద్రుడు ఋగ్వేద దేవత లందరిలో గొప్పవాళ్ళు. వరుణుని ఔన్నత్యాన్ని ప్రత్యేకంగా స్తుతించే సూక్తాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. మిత్రునితో కలిసి మిత్రావరుణులుగా స్తుతించిన సూక్తాలు ఎక్కువ. ఇంద్రుని తరువాత వరుణుడే వేదాలలో ప్రముఖ దేవత. అతనిది సుందరమైన రూపమని, ముఖమూ, ఒక కన్నూ, చేతులూ, ముంజేతులు, పాదాలు ఉన్నట్లు చెప్పబడింది. సూర్యుడే అతని కన్ను. ఆ కంటితో సకల మానవుల కర్మకాండను పరిశీలిస్తాడు. దూరదృష్టి కలవాడు, వెయ్యి కన్నులు గలవాడు. ప్రకాశించే తన పాదంతో అణగ కుయుక్తుల్ని ద్రొక్కుతాడు. యజ్ఞాలలో బంగారు కవచాన్ని, ప్రకాశించే దుస్తులు ధరించి దర్భ (గడ్డి) మీద కూర్చుంటాడు. మిగిలిన దేవతల మాదిరి మిత్రుడితో కలిసి సోమరసం త్రాగుతాడు. మిత్రావరుణుల బంగారుమయమైన నివాసం స్వర్గంలో ఉంది. వెయ్యిస్తంభాలు, వెయ్యి ద్వారాలు ఉన్న గొప్ప సౌధంలో వరుణుడు కూర్చుని భవిష్యత్తులోకి చూస్తాడు. వరుణుడు లోకాలకు రాజు. సాధారణంగా ఇంద్రుడికి వర్తించే స్వరాట్ అనే పదం, మిత్రునితో కలిసి సమ్రాట్ అనే పదం ఇతనికి వాడబడింది. మిత్రావరుణుల అనిర్వచనీయమైన దివ్యశక్తికి 'మాయా' అని పేరు. ఆ శక్తితో లోకాలను ఏలుతారు. వరుణుని ప్రమేయం లేకుండా ఏమీ జరగదు. మధువుతో కూడిన బిందువులను వర్షం కురిపించి ప్రాణులను పోషిస్తాడు. మిత్రా వరుణులు ఉషస్సును పంపుతారు. సూర్యుణ్ణి ఆకాశంలో ప్రకాశింపజేసి, చరించేటట్లు చేస్తారు. వర్షం పడేటప్పుడు మబ్బులతోను, వానతోను సూర్యుని కప్పుతారు.

వరుణుడు అంతరిక్షాన్ని వనాలలోనూ, బలాన్ని గుర్రాలలోనూ, పాలను ఆవులలోనూ, క్రతువును హృదయాలలోనూ, అగ్నిని నీటిలోనూ, సూర్యుణ్ణి స్వర్గంలోనూ, సోమాన్ని పర్వతాలలోనూ స్థాపించాడు. వరుణుడు ఋతువుల్ని క్రమబద్ధం చేసేవాడుగా

కొన్నిచోట్ల చెప్పబడ్డాడు. వరుణుడి దగ్గర వెయ్యి మందులున్నాయి. ఆయన మృత్యువుని పారదోల్తాడు. పాపాలనించి విముక్తి కలిగిస్తాడు. ఆయన ఆయుష్షును తగ్గించగలడు, ఎక్కువ చేయగలడు. వరుణుడు తనను ఆరాధించేవారికి స్నేహితుడు. భక్తుడి స్తుతులు వింటాడు. తన మనోనేత్రంతో అతన్ని చూస్తాడు.

వేదాలలో వరుణుని వర్ణన నారాయణ, విష్ణువుల వర్ణనలను పోలి ఉంటుంది. వరుణుడు సత్య, ఋతాలను కాపాడే దేవత. అందువలననే సత్యనారాయణుని రూపం ఆవిర్భవించింది. అసత్యం, వ్రతభంగాలను సహించనివాడు వరుణుడు.

**మిత్రుడు :**

మిత్రావరుణులు జంటగా ప్రస్తుతించబడిన సూక్తాలే ఎక్కువ. మిత్రుని దేవతా స్వరూపమేమిటో స్పష్టంగా లేదు. ఒక మంత్రంలో తను శబ్దం చేస్తూ మనుషుల చేత పనులు చేయిస్తాడని, దున్నేవారిని కనురెప్పవేయకుండా చేస్తాడని ఉంది. మిత్ర శబ్దానికి స్నేహితుడు, సూర్యుడు అని అర్థాలు ఉన్నాయి. సూర్యుడు ప్రకృతికి, మానవులకు, సకల జీవరాశికి సహాయం చేసేవాడుగా, స్నేహితుడుగా 'మిత్ర' అనే దేవతా రూపంలో ఆరాధించబడి ఉంటాడు. మిత్రుడు దయాస్వభావుడు, శాంతికి అధిదేవత. మిత్రా వరుణుల రూప లక్షణాలు ఒకే విధంగా ఉన్నాయి. ఇద్దరూ యవ్వనంతో మెరిసే దుస్తులు ధరించి అంతరిక్షంలో రథమెక్కి తిరుగుతారు. ఉండేది స్వర్గంలోని సువర్ణమయసౌధంలో, స్వర్గం, భూమి, అంతరిక్షం వారి ఆధీనంలో ఉంటాయి. వారు వర్షానికి, నదులకు అధిపతులు.

**పూషుడు :**

సౌరదేవతలలో పూషుడు (పూషన్) ఒకడు. పూషన్ శబ్దం 'పోషించు' అనే ధాతువు నుండి వచ్చింది కాబట్టి 'పోషకుడు' అని అర్థం. ఇతనికి తలమీద కొప్పులా కట్టుకొన్న జడలు, గడ్డమూ ఉన్నాయి. అతని చేతిలో బంగారు ఆయుధం, పశువులను తోలే ఇనపముక్క చివరగల కర్ర (ముల్లు కర్ర) ఉన్నాయి. ఈయన మంచి రథికుడు. ఈయన రథాన్ని గుర్రాలకు బదులు మేకలు లాగుతాయి. ఈయన ఆరగించేది కరంభం అనే పెరుగుతో కలిపిన పిండి. అందుకే ఈయనకి 'కరంభాత్' అనే విశేష నామం వాడబడింది. ఇతడు నివసించేది స్వర్గంలో, ప్రపంచాన్ని పరిశీలిస్తూ రథం మీద తిరుగుతూ ప్రాణులకు ఆపదలు కలుగకుండా రక్షిస్తాడు. తోవలు తెలిసిన పూషుడు దాచబడిన వస్తువులు కనబడేటట్లు చేసి దొరికేటట్టు చేస్తాడు. తప్పిపోయిన పశువులను ఇంటికి చేరుస్తాడు. ఇతని సోదరి పూషా అంటే ప్రేమమయి.

**సవిత :**

సవిత (సవితృ) మరొక సౌరదేవత. ఈ దేవత ముఖ్యంగా హిరణ్యమయుడు అని చెప్పవచ్చు. ఇతని కన్నులూ, చేతులూ, నాలుకా బంగారు కాంతితో మెరుస్తూ ఉంటాయి. ఒకచోట ఈయన ఇనప దవడలు కలవాడు అని చెప్పబడింది. ఈయన బంగారు రథం మీద లోకాలన్నీ తిరిగి వస్తాడు. ఆ రథానికి గోధుమ రంగుతో, తెల్లని కాళ్లు కల రెండు కంటే ఎక్కువ గుర్రాలు పూని ఉంటాయి. ఆయన ఉషస్సుకు ముందు అశ్వినుల రథం వెళ్ళేటట్టు చేస్తాడు. తను ఉషస్సు ప్రయాణం తరువాత ప్రవేశిస్తాడు. భూప్రదేశాలన్నీ కొలిచి సూర్యుడి కిరణాలతో కలిసిపోతాడు. సవిత స్వర్గమూ, భూమి ఈ రెండింటి మధ్య పయనిస్తాడు. రోగాలను పోగొడతాడు. సూర్యుణ్ణి ప్రేరేపిస్తాడు. మిత్రుని కన్నా సవిత ఎక్కువ మహత్తు కలిగిన దేవతగా వేదాలలో కనిపిస్తున్నాడు. నీళ్ళు, గాలి అతని అధీనంలో ఉంటాయి.

**సూర్యుడు :**

సౌర దేవతలలో సూర్యుడు కూడా ప్రముఖుడు. సూర్యుడు మిత్రావరుణులకు, అగ్నికి కన్ను అని చెప్పినప్పటికీ, అతనికి కూడా కన్ను ఉందని చెప్పబడింది. ఆ కంటితో ఆకాశానికీ, భూమికీ, నీటికీ అవతలవైపు కూడా చూస్తాడనీ, దూరదృష్టి కలవాడనీ చెప్పబడింది. 'హరిత' అనే పేరుగల ఏడు ఆడగుర్రాలు, 'ఏతశ' అనే గుర్రంతో కలిసి అతని రథాన్ని లాగుతాయి. సూర్యుడి గమనానికి మార్గాన్ని, ఆదిత్యులైన మిత్రుడూ, వరుణుడూ, అర్యముడు ఏర్పాటు చేశారు. పూషుడు ఆయన దూత. సూర్యుడికి ఉషస్సు భార్య అని కొన్నిసార్లు చెప్పబడింది. కొన్నిసార్లు సూర్యుడికి ఉషస్సు జన్మనిస్తుందని, ఉషస్సు ఒడిలోంచి ఆయన ప్రకాశిస్తాడని కూడా చెప్పబడింది. సూర్యుడు అదితి కుమారుడు కాబట్టి ఆదిత్యుడని, ఆదితేయుడని పేర్లు ఉన్నాయి. వేరొకచోట ఈయనకీ, ఆదిత్యులకీ భేదం చూపబడింది. ఈయన తండ్రి ద్యౌస్ అనీ, ఈయన దేవతలచేత సృష్టించబడ్డాడనీ చెప్పబడింది. ఈయన కరువునీ, హోమం చేయలేకపోవడాన్ని, రోగాలను, చెడు కలలను పోగొడతాడని అంటారు. దేవతలకు గొప్ప పురోహితుడు.

**విష్ణువు :**

సౌరదేవతలలో విష్ణువు ఒకడు. విష్ణువుకి ఋగ్వేదంలో తక్కువ స్థానమే ఉంది. ఆయన పెద్ద శరీరము కలవాడు, బాలుడు కాని యువకుడు. ఆయన స్వభావంలో ముఖ్య లక్షణం మూడు అంగలు వేస్తాడనేది. ఈ మూడు అంగలతో విష్ణువు భూప్రదేశాలని

అధిగమిస్తాడని వర్ణించబడింది. విష్ణువు అత్యున్నత స్థానాన్ని పండితులు స్వర్గంలో కన్నులా చూస్తారు. అది ఆయన ప్రియమైన స్థానం. అక్కడ పుణ్యాత్ములు సంతోషంగా ఉంటారు. అక్కడ దేవతలు కూడా సంతోషంతో ఉంటారు. ఆ అత్యున్నత స్థానం ప్రకాశిస్తూ ఉంటుంది. అది ఇంద్రుడికీ, విష్ణువుకి నివాస స్థానం. ఇంద్రుడికి వృత్రాసుర యుద్ధంలో సహాయం చేసే మరుత్తులకీ విష్ణువుతో కూడా సాహచర్యం ఉంది. విష్ణువు మదం కలిగించే సోమాన్ని కోరినప్పుడు మరుత్తులు పక్షులు మాదిరిగా వచ్చి, ప్రియమైన దర్భల మీద కూర్చుంటారు. విష్ణువుకి హోమం చేసేటప్పుడు మరుత్తులను కూడా ఆహ్వానిస్తారు.

విష్ణువు ఇతర లక్షణాలు అందరి దేవతలకీ ఉన్నవే. ఆయన మేలు చేసేవాడు. అపకారం చెయ్యనివాడు, మంచిదనం కలవాడు, రక్షకుడు, ఎవరూ జయించలేనివాడు, హింసించనివాడు, దానం ఇచ్చేవాడు. ఆయన ఒక్కడే భూమినీ, ఆకాశాన్నీ, అన్ని భువనాలనీ ధరించాడు. ఆయన భూమిని పర్వతాల రూపంలో ధరించాడు. ఆయన ఆజ్ఞాపకుడు. అనేక దేవతలు విష్ణువు రూపాంతరాలుగా, అవతారాలుగా చెప్పబడ్డారు.

**అశ్వినులు :**

అశ్వినులు ఇద్దరు. ఇంద్రుడు, అగ్ని, సోముడు తరువాత ఈ జంట దేవతలకే ఎక్కువ ప్రాముఖ్యం ఉందని తెలుస్తుంది. వారిలో ఒకడు జయశీలుడు, మరొకడు స్వర్గానికి పుత్రుడని ఒకచోట చెప్పబడింది. ఒకడు రాత్రి పుత్రుడని, మరొకడు ఉషస్సు పుత్రుడని నిరుక్తంలో యాస్కుడు చెప్పాడు. వారు ఇద్దరు అందమైనవారు. తామరపువ్వుల దండలు ధరిస్తారు. మనోవేగం కల బలవంతులు, గొప్ప జ్ఞానం కలవారు, మాయాశక్తి కలవారని చెప్పబడింది. వీరు మధువు (తేనె)ను ఎక్కువగా తాగుతారు. వీరి రథం మధువర్ణంలో ఉండి, మధువుతో కూడి ఉంటుంది. వేగవంతమయిన గుర్రాలు ఉంటాయి ఆ రథానికి. ఇతర దేవతల మాదిరి సోమం అంటే ఇష్టపడతారు. ఉషస్సు, సూర్యులతో పాటు సోమపానానికి ఆహ్వానించబడతారు. ఒకచోట వారికి సముద్రం తల్లి అని చెప్పబడింది. మరొకచోట వివస్వత్తుకీ, త్వష్ఠకూతురు సరణ్యకీ కవలపిల్లలని చెప్పబడింది. సూర్యుడు కూతురు సూర్యా వీరికి భార్య. ఆమె వీరిని వరించింది. సూర్యా వారితో కలసి రథం మీద రావడం ఒక ప్రత్యేకత.

అశ్వినులు నపుంసకుడి భార్యకు సంతానం ఇస్తారు. గొడ్డుపోయిన ఆవులు పాలు ఇచ్చేటట్లు చేస్తారు. వారు తండ్రి ఇంట్లోనే ఉండిపోయిన ఘోష అనే వృద్ధ కన్యకు పతిని ఇచ్చారు. ఇతర వీరులతో పోరాడలేని విమదుడనే అసమర్థుని భార్యను

తమ రథం మీద అతని ఇంటికి చేర్చారు. వారు ప్రేమికులను కలుపుతారని చెప్పబడింది. వారు మందులతో రోగాలను తగ్గిస్తారు. పోయిన దృష్టి మళ్ళీ కలిగిస్తారు. గుడ్డివారికీ, రోగులకీ, అంగవైకల్యం పొందినవారికీ వైద్యం చేసి నయం చేస్తారు. వారు దేవతలకు వైద్యులు. అమరత్వానికి రక్షకులు. భక్తుల నుంచి మృత్యువును పారద్రోలతారు. సాయం చేసేవారుగా, వైద్యులుగా, ఆశ్చర్యకరమైన పనులు చేసేవారుగా, దానగుణం కలవారుగా చెప్పబడింది. గుర్రాలను, ఆవులను కలిగిన దేవతలు వారు. ఉభయ సంధ్యలను అనుసరించే నక్షత్రాలకు వీరు ప్రతీక అంటారు. పెళ్ళి మంత్రాలలో వధువును వారి రథం మీద కూర్చోబెట్టుకొని సంతానవతి అయ్యేటట్లు ఆశీర్వదించమని అశ్వినులు ఆహ్వానింప బడతారు.

**ఉషస్సు :**

ఉషస్సు తెల్లవారే సమయానికి అధిదేవత. వేదాలలో ఆమె రూపాన్ని వర్ణించినంత గొప్పగా ఏ దేవత రూపాన్ని కూడా వర్ణించలేదు. ఆకాశానికి కూతురైన ఆమె కాంతిని ధరించి తూర్పున కనబడి, తన అందాలను ప్రదర్శిస్తుంది. ఆమె ప్రాచీన కాలానికి చెందినది అయినా మళ్ళీ మళ్ళీ పుడుతుంది. ఒకే రంగుతో ప్రకాశిస్తుంది. ఆమె ముసలితనం లేనిది. ఆమె చక్రంలా తిరుగుతూ ఎప్పుడూ కొత్తగా ఉంటుంది. ఆమె ప్రాతఃకాలాన అగ్ని ఉపాసకులను మేలుకొల్పుతుంది. వారిని అగ్నిహోత్రానికి ప్రేరేపిస్తుంది. జగత్తులోని ప్రాణికోటినందరినీ నిదురనుంచి లేపి చైతన్యం కలిగిస్తుంది. ప్రతిరోజు ఆకాశంలో ఒకేచోట ఉదయించి క్రమమార్గంలో పోతుంది. ఉషస్సు ప్రకాశించే అందమైన రథం మీద వస్తుంది. సూర్యుడు ప్రయాణించడానికి దారి చూపుతుంది. ఆమె తన ప్రియుడైన సూర్యునికాంతితో ప్రకాశిస్తుంది. సూర్యుడు ఆమె వెనుక నడుస్తాడు. ఆమె సూర్యుడికి భార్య అని కొన్నిచోట్ల చెప్పబడింది. కాని సూర్యుడి కన్నా ముందే ఆమె ఉదయించడం జరుగుతుంది. కాబట్టి ఆమె సూర్యుడికి తల్లిగా కొన్నిచోట్ల భావించబడింది. ఉషస్సు సూర్యుణ్ణీ, యజ్ఞాన్నీ, అగ్నినీ సృష్టించింది. ఆమె సవితని కనడానికి అవతరించ బడింది. ఆమె ప్రకాశించే పిల్లవాడితో ప్రకాశిస్తూ వస్తుంది. ఆమె ఆదిత్యుడైన భగుడికి సోదరి. వరుణుడికి ఆమె చుట్టం. రాత్రికి సోదరి. స్వర్గానికి కూతురని కూడా చెప్పబడింది. ఉషస్సు తన ఆరాధకులకు ఐశ్వర్యాన్ని, సంతానాన్ని ఒసగుతుంది. వారిని రక్షిస్తుంది. దీర్ఘాయుష్షును కలిగిస్తుంది.

**రాత్రి :**

రాత్రి (నిశ) ఉషస్సుకి సోదరి. సూర్యుడికి కూతురు అనికూడా చెప్పబడింది. ఆమె చీకటి నిండినదిగా కాకుండా నక్షత్రాలతో ప్రకాశించేదిగా భావించబడింది. ఈమె తనను ఆరాధించే వారిని రక్షిస్తుంది. ఈమె రాకతో ప్రాణికోటి విశ్రాంతి తీసుకుంటుంది. వేదాలలో ఒకానొకచోట దురదృష్టదేవతగా మార్పు చెందింది.

**యముడు :**

యముడు పితృలోకానికి అధిపతి. యమునికి దేవశబ్దం విశేషంగా ఏ మంత్రంలోనూ లేదు. ఆయకు రాజన్ శబ్దమే విశేషంగా వాడబడింది. యముడు వివస్వత్, సరణ్యుల కొడుకు. యమి ఇతని సోదరి. యముడు వరుణ, అగ్ని, బృహస్పతులతో జంటగా వారి స్నేహితుడుగా ప్రస్తుతింపబడ్డాడు. మొదట మానవుడుగా ఉండి శరీరాన్ని త్యజించి పితృదేవతలు నివసించే లోకానికి మార్గదర్శకుడైనాడు. యముడి నివాసం స్వర్గంలో చివరి ప్రదేశం. మూడు స్వర్గాలలో రెండు సవితవి, ఒకటి యముడిది. దీర్ఘాయుష్షును ఇచ్చేవాడు. మరణం అతని మార్గం. అతనికి మృత్యుశబ్దం ఎక్కువగా వాడబడింది. వరుణుడి దగ్గర ఉన్నట్లే ఇతని దగ్గరా పాశముంటుంది. గుడ్లగూబ, పావురం యముడి దూతలని ఉంది. కాని నాలుగు కన్నులూ, వెడల్పు ముక్కులుగల సరమా కొడుకులైన కుక్కలు ఇతన్ని అనుసరిస్తాయి. యముని దూతలుగా ఇవి మనుషుల మధ్య తిరుగుతూ ఉంటాయి.

**వివస్వత్తు :**

వివస్వత్తు (వివస్వత్) ఋగ్వేదంలో ఏ ప్రత్యేక సూక్తంలోనూ స్తుతించబడలేదు. కాని ఆయన పేరు అందులో షుమారు ముప్పైసార్లు ప్రస్తావించబడింది. ఆయన అశ్వినులకీ, యముడికీ తండ్రి. వేదకాలం తరువాత సాహిత్యంలోలా వేదాలలోనే ఆయన మానవజాతికి ఆదిపురుషుడైన మనువుకి తండ్రి అని చెప్పబడ్డాడు. మనువుకే వివస్వత్తు అనేపేరు ఒకచోట వాడబడింది. అధర్వవేదంలో మనువు వైవస్వతుడని చెప్పబడింది. మనువులు కూడా ఆదిత్యుడైన వివస్వత్తు సంతానమే. ఒకచోట దేవతలు కూడా వివస్వత్తు సంతానమనే చెప్పబడింది. త్వష్ట కూతురైన సరణ్యు వివస్వత్తు భార్య.

వివస్వత్తుకీ, మాతరిశ్వుడికి అగ్ని మొదట కనబడ్డాడు. వివస్వత్తు దూత మాతరిశ్వుడని ఒకచోట ఉంది. కాని సాధారణంగా ఆయన దూత అగ్ని. ఋగ్వేదంలో చాలా సందర్భాలలో వివస్వత్తుకూ ఇంద్రుడికీ సంబంధం సూచితమైంది. ఇంద్రుడు

వివస్వత్తు స్తుతికి ఆనందిస్తాడు. ఆయన తన సంపద వివస్వత్తుకి ఇస్తాడు. ఇంద్రుడితో అంత సన్నిహిత సంబంధం ఉండడం వలన సోముడు కూడా అక్కడ ఉండడం సహజం. సోముడికీ వివస్వత్తుకీ సంబంధం తొమ్మిదో మండలంలో చెప్పబడింది.

వివస్వత్తు కూడా వరుణుడు మొదలగు దేవతలతోపాటు పూజనీయుడు. ఒక మంత్రంలో వివస్వత్తుకి అపకారం చేసే లక్షణం కనబడుతుంది. అందులో ఆదిత్యులను పూజిస్తూ భక్తులు వివస్వత్తు పదునైన బాణం తమని ముసలితనానికి ముందు చంపకూడదని ప్రార్థిస్తారు. దీనికి వ్యతిరేకంగా, వివస్వత్తు భక్తులను యముడి నుంచి కాపాడతాడని కూడా చెప్పబడింది. యజుర్వేదంలోనూ, బ్రాహ్మణాలలోనూ వివస్వత్తు ఆదిత్యుడని చెప్పబడింది. వేదకాలం తరువాత సాహిత్యంలో ఈ పేరు సూర్యుడికి పర్యాయంగా ప్రచురంగా వాడబడింది.

**ఆదిత్యులు :**

ఆదిత్యులని చెప్పబడే దేవతల సముదాయం ఋగ్వేదంలో ఆరు పూర్తి సూక్తాలలోను, మరి రెండు సూక్త భాగాలలోను ప్రశంసించబడింది. ఈ సముదాయంలోని దేవతల పేర్ల విషయంలోనూ, వారి సంఖ్య విషయంలోనూ ఋగ్వేదంలో కొంత అస్పష్టత ఉంది. ఆరుగురికన్నా ఎక్కువమంది ఎక్కడా చెప్పలేదు. ఆరుగురిని కూడా చెప్పింది ఒకచోట – మిత్రుడు, ఆర్యముడు, భగుడు, వరుణుడు, దక్షుడు, అంశుడు. ఋగ్వేదంలో చివరి మండలాలలో వీరి సంఖ్య ఏడు అని ఒకచోట, ఎనిమిది అని ఇంకొకచోట ఉంది. మరి రెండు సందర్భాలలో వారు పన్నెండుమంది అనీ, వారే పన్నెండు మాసాలనీ చెప్పబడింది. వేదకాలం తరువాతి సాహిత్యంలో సర్వత్రా ఆదిత్యులు పన్నెండుమంది అనీ, వారికీ మాసాలకీ సంబంధం ఉందనీ, వారిలో ఒకడైన విష్ణువు అందరికీ గొప్పవాడని ఉంది.

అథర్వవేదంలో సూర్యుడు అదితి పుత్రుడనీ, సూర్యుడూ, చంద్రుడూ ఆదిత్యులనీ చెప్పబడింది. ఆదిత్యులు భువనాలను రక్షిస్తారు. చరాచరమైన వాటికన్నింటికీ వారే ఆధారం. వీరు మనుషుల హృదయాలలో మంచినీ, చెడునీ చూస్తారు. ఎవరికి కపటత్వం ఉన్నదీ లేనిదీ తెలుసుకుంటారు. వీరు అబద్ధాన్ని అసహ్యించుకుంటారు. పాపాన్ని శిక్షిస్తారు. పాపాన్ని క్షమించమనీ, పాపం యొక్క పరిణామాల నుంచి తప్పించమనీ, భక్తుల పాపాన్ని త్రిత ఆప్తుడికి మార్చమని వారు ప్రార్థించబడ్డారు. వారు తమ పాశాలతో శత్రువులని

బంధిస్తారు. కాని భక్తులను – పక్షులు రెక్కలు కప్పి వాటి సంతానాన్ని కాపాడినట్లు కాపాడతారు. భక్తులని వారు ఆయుధమూ, పాపమూ తగలకుండా కవచంలా రక్షిస్తారు. వారు రోగాన్నీ, బాధను దూరం చేస్తారు. కాంతి, దీర్ఘాయుష్షు, సంతానం, సలహా వంటి వరాలు ఇస్తారు.

## అంతరిక్ష దేవతలు

**ఇంద్రుడు :**

అంతరిక్ష దేవతలలో ఇంద్రుడు ఒకడు. ఋగ్వేదంలోని మొత్తం సూక్తాలలో నాలుగోవంతు ఇంద్రుని సూక్తాలే ఉన్నాయి. ఇంతగా ప్రస్తుతించబడిన దేవత ఇతను కాక మరొకరు లేరు. అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు అనే దేవతాత్రయంలో ఈయన అంతరిక్షానికి ప్రతినిధి. ఇంద్రుడి ప్రత్యేకమైన ఆయుధం వజ్రాయుధం. కొన్నిచోట్ల పొల్లు, బాణమూ ఉన్నట్లు చెప్పబడింది. ఇంద్రుడి రథం స్వర్ణమయం మది. అది మనసుకన్నా వేగం కలది. దేవతలంతా సోమపాన ప్రియులే అయినా, ఇంద్రుడికి సోమమంటే చాలా ఇష్టం. సోమం త్రాగిన మదంతో ఇంద్రుడు ఆకాశాన్నీ, భూమినీ నిలపడమూ, భూమిని విశాలం చెయ్యడం వంటి విశ్వానికి సంబంధించిన కార్యాలు చేశాడని కొన్నిచోట్ల చెప్పబడింది. కాని సోమపానం ఆయన్ని ప్రత్యేకగా రాక్షసుడైన వృత్రుడ్ని చంపడమూ, శత్రువులని జయించడమూ వంటి వీరకార్యాలు చేయడానికి పురికొలుపుతుంది.

ఇంద్రుడు ద్యుః, త్వష్టల సంతానంగా చెప్పబడ్డాడు. ఒకచోట ఆయన 'నిష్టిగ్రీ' అనే ఆమె పుత్రుడని చెప్పబడ్డాడు. అథర్వ వేదం ప్రకారం ఇంద్రుడికీ, అగ్నికీ తల్లి ప్రజాపతి కూతురైన ఏకాష్టకా. ఇంద్రుడు, అగ్నీ కవలలు. వారి తండ్రీ, తల్లీ ఒక్కరే. అగ్ని ద్యౌస్‌కీ, పృథ్వికి కొడుకు అని వేరేచోట ఉంది. ఇంద్రుడి భార్య ఇంద్రాణి. ఇంద్రుడికి ఇతర దేవతలు అనేకులతో సాహచర్యం ఉంది. మరుత్తులు ఆయనకి ముఖ్య స్నేహితులు; యుద్ధంలో సహాయులూ. ఇంద్రుడు అగ్నితోనూ, వరుణిడితోనూ, విష్ణువుతోనూ అరుదుగా కలుస్తాడు. ఇంద్రుడు తన ఆరాధకుల శత్రువులను చంపి వారికి విజయం చేకూరుస్తాడు. అనేకమంది దేవతలతో జంటగా స్తుతించబడ్డాడు ఇంద్రుడు.

ఇంద్రుడు వేదములలో వరుణుడి మాదిరిగా దివ్యరూపం గల దేవతగా ఉండడు. చాలా అనైతిక, అధర్మపనులు ఆచరించినట్లు చెబుతారు. వట్టి తిండిపోతు, త్రాగుబోతు. తాగిన మదంతో తన తండ్రి త్వష్టనే చంపిన కిరాతకుడిగా చిత్రించబడ్డాడు.

**అపాంనపాత్ :**

అంతరిక్ష దేవతలలో అపాంనపాత్ ఒకడు. అపాంనపాత్ అంటే జలాలపుత్రుడు అని అర్థం. బంగారురంగు కలవాడు. మెరుపుని వస్త్రంగా ధరించేవాడు, పరమపదంలో నివసించేవాడు, రహస్యస్థానంలో వృద్ధి పొందేవాడు, ప్రకాశించేవాడు, భూమికి దిగి వచ్చేవాడు, అగ్నికి రూపాంతరమని, అతడే యజ్ఞాగ్నిగా ఉద్భవిస్తాడని అంటారు. ఋగ్వేదంలో నీళ్లు అపాంనపాత్‌కు తల్లిగానే కాక భార్యగాను చెప్పబడింది.

**ఆపః (నీళ్లు) :**

ప్రకృతిలో కనిపించే దివ్యశక్తులలో విద్యుదగ్ని, మేఘాలూ, సూర్యుని చలనశక్తి, ఉషస్సు, రాత్రులే కాకుండా నీళ్ళను కూడా దివ్యరూపంగా ఆపః (ఆపస్) అని ప్రస్తుతించారు వేదాలలో. వారు దేవతల మార్గాన్ని అనుసరించే స్త్రీ దేవతలు. ఇంద్రుడు తన వజ్రాయుధంతో వారికి మార్గాన్ని తవ్వాడు. వారు ఇంద్రుడి ఆజ్ఞలను పాటిస్తారు. వారు దేవతలు ఉండేచోటా, మిత్రావరుణులకు దగ్గరలో, సూర్యుడికి ప్రక్కన ఉంటారు. అగ్ని నీళ్ళలో ఉంటాడని వర్ణించబడింది. తల్లులైన నీళ్లు అగ్నిని పుట్టించాయి. అగ్ని ఒక రూపం నీళ్ళకి కొడుకు (అపాంనపాత్) అని ఒకచోట చెప్పబడింది. నీళ్లు భువనానికి తల్లులు, భార్యాలు. ఈ దేవతలు పాపాన్ని కొట్టుకుపోయేటట్లు చేస్తారు. నీళ్ళలో ఔషధాలు, అమర్త్యత్వం, రోగనివారణశక్తి ఉండడంచేత రోగం నివారించి దీర్ఘాయుష్షు ఇస్తాయి. ఆపః చాలాసార్లు మధువుతో కలిపి ప్రస్తుతించబడ్డారు. వారు తమ పాలను మధువుతో కలుపుతారు. అంతరిక్షంలో నీళ్ళు సోమరసం. అవి ఇంద్రుడి పానము. ఆపస్ అపాంనపాత్‌తో పాటు సోమయాగంలో దర్భాసనం మీద కూర్చోమని ప్రార్థించబడ్డారు. మనుషుడు అందమైన యువతులతో ఆనందించినట్లు సోముడు జలాధిదేవతలతో ఆనందిస్తాడు.

**పర్జన్యుడు :**

పర్జన్యుడు ఋగ్వేద దేవతలలో చాలా అప్రధానుడు. పర్జన్యుడు అంటే నీటి మేఘం, వానకి అధిదేవత అనే అర్థం ఉన్నట్లు కనబడుతుంది. ఆయన ముఖ్య స్వభావం వాన కురిపించడం. ఉరుములు, మెరుపులతో కూడిన నీరుగల రథం మీద అంతటా సంచరిస్తూ ఉంటాడు. పర్జన్యుడి భార్య భూమిగా పేర్కొన్నారు. అథర్వవేదంలో భూమి తల్లి అనీ, పర్జన్యుడు తండ్రి అనీ చెప్పబడింది. కాని మరొకచోట ఆయన భార్య 'వశా'

అని పేర్కొనబడింది. ఈయనకీ, ఉరుమూ, మెరుపూ, వానా – వీటికీ ఉన్న సంబంధంలోనూ ఈయన స్వభావం ద్యౌస్ స్వభావానికి దగ్గరగా ఉంటుంది. పర్జన్యుడు ద్యౌస్ (ద్యుః) కొడుకని ఒకచోట చెప్పబడ్డాడు. ఆయనకి వాతుడితో (వాయువు) ఎక్కువ సంబంధం ఉంది. ఔషధమొక్కలను మొలకెత్తించి, రక్షిస్తాడు.

**రుద్రుడు :**

ఈ దేవతకి ఋగ్వేదంలో అప్రధాన స్థానమే ఉంది. రుద్ర శబ్దానికి ప్రకాశించేవాడు, ఎర్రనివాడు అని అర్థం ఇచ్చారు. అగ్ని, వరుణ, ఇంద్ర మొదలైన దేవతలకన్నా రుద్రుని మహత్త్వం తక్కువే. యజుర్వేదంలో ఒక అధ్యాయం అంతా ఇతని స్తుతి ఉంది. అథర్వ వేదంలో రుద్రుడు ఎక్కువగా మరుత్తులతో చేర్చి చెప్పబడిన విషయాలు ఎక్కువ. వారు ఆయన కొడుకులని, అందువలన కొన్నిచోట్ల వారు రుద్రులు, రుద్రియులు అని ఉంది. రుద్రుడు మరుత్తులను పృశ్ని (ప్రకాశించే పొదుగు) నుంచి పుట్టించాడు అని ఉంది. ఋగ్వేదంలోని ఒక మంత్రంలో రుద్రుడూ మరికొందరు దేవతలు అగ్నికి రూపాంతరాలు అని చెప్పబడింది.

ఋగ్వేదంలో చెప్పబడిన విషయాల వల్ల రుద్రుడు తుపానుకి సంబంధించిన ఒక దేవత అని సాధారణంగా అంటారు. రుద్రుడు తుపాను అన్ని లక్షణాలకూ ప్రతీక కాకుండా పిడుగు ద్వారా హాని కలిగించడమనే ఒక లక్షణం కలవాడు. ఆయనకి భయంకరమైన ఆయుధాలు ఉంటాయని, ఆయన తుపాను దేవతలైన మరుత్తులకు తండ్రి అని అన్వయిస్తుంది. మరుత్తులకు మెరుపు ఆయుధమనీ, వారు మెరుపు నవ్వు నుంచి పుట్టారని చెప్పబడింది. రుద్రుడు ఉగ్రుడు. భయంకరుడే కాకుండా భక్తుల భయాలను తొలగింపజేసి శుభాలను చేకూర్చేవాడు కూడానట.

**మరుత్తులు :**

మరుత్తులు ఋగ్వేదంలో ప్రాముఖ్యం గల దేవతలు. వీరు రుద్రుడి కొడుకులు. అందువలన వీరికి రుద్రః, రుద్రులు, రుద్రియాః అనే పదాలు కూడా వాడబడ్డాయి. వీరి తల్లి పృశ్ని అనే గోవు. పృశ్ని నుంచి పుట్టినప్పుడు మరుత్తులు నిప్పులతో పోల్చబడ్డారు. వారు మెరుపు యొక్క నవ్వు నుంచి పుట్టినట్లు కూడా చెప్పబడింది. ఒకచోట వాయువు వారిని స్వర్గం యొక్క గర్భాలలో పుట్టించాడని ఉంది. వారు స్వర్గపుత్రులని కూడా పేర్కొనబడ్డారు. మరుత్తులు భూమి మీదా, అంతరిక్షంలోనూ, స్వర్గంలోనూ పెరిగారని, మూడు స్వర్గాలలో నివసించారని ఉంది. వేరొకచోట వారు కొండలమీద నివసిస్తారని

ఉంది. దేవతా స్త్రీలైన ఇంద్రాణి, సరస్వతులతో సాహచర్యం ఉంది. కాని వారికి రోదసి అనే దేవతాస్త్రీతో ఉన్న సంబంధం చాలా సన్నిహితమైనది. ఆమె వారి రథం మీద ఉంటుంది. అందువలన ఆమె వారి భార్య అయినట్లు అంటారు. మరుత్తుల భుజాలమీద ఈటెలు, కాళ్ళకి అందెలు, వక్షస్థలం మీద బంగారు హారాలు, రథం మీద నీరూ, చేతులలో అగ్ని కాంతి గల విద్యుత్తులూ, తలల మీద పెద్ద బంగారు తలపాగాలు ఉంటాయి. మరుత్తులు మెరుపులతో మెరిసే రథం మీద వస్తారు. వీరు ఒక గణంగా, గుంపుగా చెప్పబడ్డారు. ఇంద్ర, అగ్ని, పూషన్‌లతో కలిపి కూడా ప్రస్తుతించబడ్డారు. ద్యుః కి కుమారులుగా కీర్తించబడ్డారు. రుద్రుని మాదిరిగా మరుత్తులు కూడా కష్టాలను తొలగించి, రోగనివారణ చేసేవారుగా, ఓషధులు కురిపించేవారుగా ప్రస్తుతించబడ్డారు.

**వాతుడు :**

వాతుడు (వాత) అంటే వాయువు. వాయువు కూడా దేవతగా పరిగణింపబడి ప్రస్తుతింపబడినాడు. ఒకచోట ఈయన త్వష్ట అల్లుడు అని చెప్పబడినాడు కాని ఈయన భార్యపేరు లేదు. ఇతర దేవతల మాదిరి వాయువుకి కూడా సోమం అంటే ఇష్టం. దేవతలందరికంటే వేగం కలవాడు కాబట్టి సోమపానానికి తన సముదాయంతో రమ్మని ప్రార్థించి అతనికి మొట్టమొదట అర్పించబడుతుంది. వాయువు కీర్తిని, సంతానాన్ని, గుర్రాలను, గోవులను, బంగారాన్నీ ఇస్తాడు. ఆయన శత్రువులను పారద్రోలతాడు. బలహీనులు ఆయన్ని రక్షించమని ప్రార్థిస్తారు. వాయువు భూమి మీద దుమ్మురేపుతూ, అంతరిక్షంలో తన తోవలలో తిరుగుతాడు. ఒకరోజు కూడా విశ్రాంతి తీసుకోడు. ఆయన దేవతల ప్రాణం, ఆత్మ. ఈ జగత్తుకి బీజం వంటివాడు. తన ఇష్టాన్ని అనుసరించేవాడు. అతని రూపం కనబడదు. రుద్రుని వలె వాయువు కూడా రోగనివారణ గుణం కలవాడు, దీర్ఘాయుష్షు కలిగించేవాడు, అమరత్వానికి నిధి. ఉరుములు మెరుపులతో కలసినవాడు అని చెప్పబడ్డాడు.

**త్రితుడు :**

ఆప్త్యుడు (ఆప్త్య) అనే విశేషణం కల త్రితుడు (త్రిత) ఋగ్వేదంలో ఏ పూర్తి సూక్తంలోనూ స్తుతించబడలేదు కాని ఇరవై తొమ్మిది సూక్తాలలో, నలభై విడివిడి మంత్రాలలో ప్రసంగవశాత్తూ ఆయన పేరు వచ్చింది. ఆప్త్య – అనే పదం త్రితుడికి విశేషణంగానో లేక దానికి పర్యాయంగానో ఏడుసార్లు నాలుగు సూక్తాలలో వచ్చింది.

త్రితుడి అసలు స్వభావం గురించి అత్యల్పంగా చెప్పేవీ, అసలు ఏమీ చెప్పనివీ కొన్ని మంత్రాలు ఉన్నాయి. ఒక వరుణ సూక్తం మధ్యలో ఒక మంత్రంలో త్రితుడిలో జ్ఞానం చక్రం మధ్యలో ఇరుసులా ఇమిడి ఉందని చెప్పబడింది. అథర్వవేదంలో త్రితుడి ప్రసక్తి ఉన్న ఆరు మంత్రాలలోనూ – ఈయన పాపాన్నీ, కలలను తన దగ్గరకు చేర్చుకునే దూరప్రదేశంలోని దేవుడు అనే భావాన్ని మాత్రమే అవి సూచిస్తాయి. ఈయన దీర్ఘాయుష్షు ఇచ్చేవాడు అని చెపుతుంది. అమరత్వాన్ని ఇచ్చే పానమైన సోమాన్ని తయారు చేసేవాడుగా భావించబడిన త్రితుడికి ద్వితీయశ్రేణి లక్షణంగా ఇది సంక్రమించింది అనడంలో సందేహం లేదు. బ్రాహ్మణాలు ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ – ఈ ముగ్గురు దేవతలూ అగ్ని కొడుకులు, నీటి నుంచి పుట్టినవారు అంటాయి.

**మాతరిశ్వుడు :**

మాతరిశ్వుడు (మాతరిశ్వన్)ని ఉద్దేశించిన పూర్తి సూక్తమేదీ ఋగ్వేదంలో లేదు. ఈ పేరు ఇరవై ఏడు చోట్ల మాత్రం వచ్చింది. మాతరిశ్వుడూ అగ్నీ ఒకరుగానే వ్యవహరించబడడమో లేక మాతరిశ్వుడు అగ్నిని పుట్టించేవాడు అని చెప్పడమో జరిగింది. ఒకచోట మాతరిశ్వుడు బృహస్పతి రూపాంతరమే అన్నట్లు చెప్పబడింది. ఆ బృహస్పతి యజ్ఞంలో మాతరిశ్వుడుగా సంభవించాడు. బృహస్పతీ, అగ్నీ ఒకరేనని కొన్నిచోట్ల ఉంది.

**అహిబుధ్న్యుడు :**

లోతునీళ్ళలో ఉండే పాము (అహి) అయిన అహిబుధ్న్యుడి పేరు విశ్వదేవతలకు ఉద్దేశించిన సూక్తాలలో మాత్రమే వస్తుంది. ఇది ఋగ్వేదంలో పన్నెండుచోట్ల మాత్రమే ఉంది. అపాంనపాత్‌ని పోలిన అహిబుధ్న్యుడు దేవతగా భావించబడినా, ఈయన హానికర స్వభావము సూచితమవడం కూడా గమనించదగినది. తరువాత కాలపు వైదిక గ్రంథాలలో అహిబుధ్న్యుడికీ గార్హపత్యాగ్నికీ సూచన ప్రాయంగా సంబంధం ఆపాదించబడింది. వేదాల తరువాత కాలపు సాహిత్యంలో అహిబుధ్న్యుడు అనే పదం రుద్రులలో ఒకరికి పేరూ, శివుడికి విశేషణముగా ఉన్నది.

**అజుడు :**

అజుడు (ఏకపాత్). ఈ దేవతకీ అహిబుధ్న్యుడికి చాలా సన్నిహిత సంబంధం ఉంది. ఈ పేరు అహిబుధ్న్యుడి పేరుతో కలిసి అయిదుచోట్లా, విడిగా ఒకచోట మాత్రం వచ్చింది. ఏకపాత్ – అంటే, ఒక పాదం కాలవాడు లేక ఒక పాదంతో కాపాడేవాడు

లేదా తాగేవాడు అని మాత్రం చెప్పారు. తరువాత కాలంలో సాధారణంగా ఈయన ప్రత్యేక దేవతగా భావించబడకపోయినా, ఈయనకీ అహిబుధ్న్యుడికీ గృహకర్మల్లో ఆహుతులు ఇవ్వబడతాయి. పురాణాలలో అజైకపాత్ పదకొండుమంది రుద్రులలో ఒకరికి పేరూ, శివుడికి విశేషణముగా ఉన్నది.

అంతరిక్ష స్థానంలోని పై దేవతలే కాక ఋషులు, ధాతర్, విధాతర్, విశ్వకర్మ, ధార్తర్, త్రాతర్, ప్రజాపతి, త్వష్టర్ మొదలైన దేవతలు కూడా అక్కడక్కడ ప్రస్తుతింపబడ్డారు. ఋభులు అని ముగ్గురు దేవతలు – ఋభు, విభ్వ, వాజ. వీరు సుధన్వుని కుమారులు. ఋభులు త్వష్టర్ వలెనే దేవతల శిల్పులు. త్వష్ట లేక త్వష్టర్ పనితనం గలవాడు. వజ్రాయుధాన్ని చేశాడు. ఇతని కూతురు సరణ్యు యమ యమీలకు తల్లి. ఇతడు ప్రజాపతి. మానవులకు అధిపతిగా స్తుతించబడినాడు. వీరేకాకుండా అమూర్తభావాలు కూడా దేవతలుగా వేదాలలో ప్రస్తుతింపబడినవి. అవి – మన్యు (కోపం), శ్రద్ధా (నమ్మకం), కామ (కోరిక), కాల (సమయం), ప్రాణ (ప్రాణము), శ్రీ (సౌందర్యము), అనుమతి (FAVOUR), అరమతి (DEVOTION), సూనంత (BOUNTY), అసునీతి (SPIRIT LIFE), నిరుతి (DECEASE) మొదలైనవి. ఇంకా అదితి, దితి అనే దేవతల ప్రసక్తి కూడా వేదాలలో ఉన్నది. అదితి దేవతలకు తల్లిగా చెప్పబడింది. అదితి కుమారులు కాబట్టి వారు ఆదిత్యులైనారు. అదితికి ప్రతిరూపంగా దితి చెప్పబడింది. కాని తర్వాత తర్వాత దితి దైత్యులకు (రాక్షసులకు) తల్లిగా చెప్పబడింది.

## పృథ్వీస్థాన దేవతలు

**అగ్ని :**

పృథ్వీస్థాన దేవతలలో ముఖ్యుడు అగ్ని. వేదాలలో ఇంద్రుడి తరువాత ఈయనకే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. అగ్ని అనేక పశువులతోను, అచేతన పదార్థాలతో కూడా పోల్చబడ్డాడు. ఇంద్రుడిలా ఈయనకీ సహస్ర ముష్క అనే విశేషణం ఉంది. కొన్నిచోట్ల ఆయన యజ్ఞంలోని హవిస్సులను దేవతలు తినడానికి సాధ్యమైన నోరూ, నాలుకా అని చెప్పబడ్డాడు. ఆయన తన జ్వాలలనే తెడ్డులతో దేవతలని అర్చించే హోత. కాని చాలా తరచుగా ఆయనే హవ్యాలను భక్షించమని ప్రార్థించబడ్డాడు. ఆయనకు సాధారణంగా అర్పించేవి సమిధలూ, నెయ్యి అయినా, కొన్నిచోట్ల ఇతర వేదాలతోపాటు ఆహ్వానించబడి నప్పుడు సోమరసం కూడా అర్పిస్తారు. ఒక సూక్తంలో ఆయన సోమాన్ని రక్షించేవాడు అని చెప్పబడింది. ఆయన యజ్ఞానికి రమ్మని ప్రార్థించబడ్డాడు. ఇతర దేవతలతోపాటు ఆయన దర్భాసనం మీద కూచుంటాడని తరచు చెప్పబడింది.

అగ్ని గొప్ప కాంతి కలవాడు, గొప్ప జ్వాలలు కలవాడు. సూర్యుడిలా ప్రకాశిస్తాడు. ఆయన కాంతి ఉషస్సు కిరణాలలాగా, సూర్యుడిలాగా, వర్షించే మేఘంలోని మెరుపులాగా ఉంటుంది. ఆయన రాత్రిలో కూడా ప్రవేశిస్తాడు. సూర్యుడిలా చీకట్లని తన కిరణాలతో నాశనం చేస్తాడు. అగ్నిని ఉషఃకాలంలో పుట్టిస్తారు కాబట్టి ఈయనకి ప్రత్యేకంగా 'ఉషర్బుధ్' అనే విశేష నామం వాడబడింది. అగ్ని రథం మెరుపు. అది ప్రకాశించేది, బంగారంతో చేయబడింది. అందమైనది. దాన్ని లాగే గుర్రాలు రెండు లేక అంతకన్న ఎక్కువ. మనసుకన్నా వేగం కలవి. ఆయన రథికుడు. దేవతలని తీసుకురావడానికి గుర్రాలను రథానికి కడతాడు. తన రథం మీద భార్యలతోకూడిన ముప్పై ముగ్గురు దేవతలని ఆయన యజ్ఞానికి తీసుకు వస్తాడు.

వేద ఋషుల అభిప్రాయంలో అగ్ని తండ్రి ద్యౌస్. అగ్ని ద్యావా, పృథ్వుల కొడుకు అని తరచుగా చెప్పబడ్డాడు. అంతేకాక త్వష్టకీ, నీళ్ళకీ పుట్టినవాడు అనికూడా ఉంది. అగ్నికి మూడు రకాల స్వభావం ఉన్నట్లు భావించబడింది. దేవతలు అగ్నిని మూడుగా చేశారు. ఆయన మూడు ధాతువులు కలవాడు. మూడు తలలూ, మూడు నాలుకలూ, మూడు శరీరాలూ, మూడు స్థానాలు కలవాడు. ఒకచోట అగ్ని మొదట్లో స్వర్గానించి, రెండోసారి మనుషులనించి, మూడోసారి నీళ్ళలో పుట్టాడు అని ఉంది. అగ్ని భక్తులకు బాగా సాయం చేస్తాడు. నావికుడు నావతో నదిని దాటినట్లు ఆయన గొప్ప పాపాలని భక్తులు దాటేటట్లు చేస్తాడు. ఆయన రక్షకుడు. ఆతిథ్యమిచ్చేవాడికి మిత్రుడు. ఆయన కోసం పుల్లలు మోస్తూ చెమట కార్చేవాడికి ధనం ఇస్తాడు. ఆయన కోసం ఆహారం తెచ్చి ఆహుతులు ఇచ్చేవాణ్ణి వెయ్యి కళ్ళతో కాపాడతాడు. ఆయన భక్తుల శత్రువులని ఎండిన పొదలని కాల్చినట్లు కాలుస్తాడు. యుద్ధాలలో ఆయన అగ్రగామి.

అగ్ని దివ్యుడైన సమ్రాట్టు. ఇంద్రుడిలా శక్తిమంతుడు. ద్యావా పృథ్వులకన్న, అన్ని లోకాలకన్నా గొప్పవాడు. ఆయన పుట్టినప్పుడు అన్ని లోకాలనీ ఆక్రమించాడు. గొప్పతనంలో ఆయన దేవతలందరినీ మించినవాడు. ఆయన చీకటిలో ఉన్నప్పుడు దేవతలందరూ ఆయనకి భయపడి ఆయన్ని పూజిస్తారు. వరుణుడూ, మిత్రుడూ, మరుత్తులూ అందరు దేవతలూ ఆయన్ని స్తుతించి పూజిస్తారు.

అగ్ని స్వర్గానికీ, భూమికీ కొడుకు అని చెప్పబడినా, ఆయన లోకాలకి తండ్రి అనికూడా చెప్పబడ్డాడు. ఆయన ఆజ్ఞని స్వర్గమూ, భూమీ పాటిస్తాయి. బలమూ, శుద్ధ స్వభావమూ, జ్ఞానమూ కలవాడుగానూ, శత్రునాశకుడుగానూ అగ్ని పురుషతారూపం

పొంది పూజించబడ్డాడు. హిందువులు విగ్రహారాధన ప్రారంభించిన తరువాత అగ్నికి ప్రాధాన్యం తగ్గిపోయింది. ప్రతి శుభకార్యానికి ఆరంభంలో వినాయకుని పూజించడం మొదలుపెట్టారు. అగ్నిని ఆహ్వానించే సంప్రదాయం సమసిపోయింది. దేవతకు అర్పించేవి విగ్రహాల ముందు ఉంచు ఆచారం ఆరంభమవడంతో అగ్నిలోవేసి ఆరాధించే సంప్రదాయం కనుమరుగైంది. దేవాలయాలలో కూడా విగ్రహారాధనలేకాని అగ్నిపూజలు అజ లేవు.

**బృహస్పతి :**

పృథ్వీస్థాన దేవతలలో బృహస్పతి ఒకడు. ఈ దేవతకి ఋగ్వేదంలో గణనీయమైన ప్రాముఖ్యం ఉంది. పదకొండు పూర్తి సూక్తాలలో ఈయన స్తుతి ఉంది. మరి రెండు సూక్తాలలో ఈయనా, ఇంద్రుడూ దేవతాద్వయంగా కలిపి స్తుతించబడ్డారు. బృహస్పతి అనే పేరు నూట ఇరవై సార్లూ, దీనికే నామాంతరమైనా బ్రాహ్మణస్పతి అనే పేరు యాభై సార్లూ వచ్చాయి. ఈ రెండు పేర్లూ ఒకే సూక్తంలోని వేరువేరు మంత్రాలలో నామాంతరాలుగా ప్రయోగించబడ్డాయి. బృహస్పతికి చెప్పబడిన ఆకార లక్షణాలు తక్కువ. ఆయన ఏడు నోళ్ళూ, ఏడు రశ్మలు కలవాడు, మంచి నాలుక కలవాడు. నీలంరంగు వీపు కలవాడు. వందరెక్కలు కలవాడు. ఆయన బంగారు రంగు కలవాడు, ఎర్రనివాడు, ప్రకాశించేవాడు, శుచి అయినవాడు, స్పష్టమైన వాక్కు కలవాడు. యజ్ఞకర్మే ఆయన వింటితాడు. ఆయన బాణాలు మంచివి. ఆయకు బంగారు గొడ్డలి ఉంది. మంచి ఇనుముతో చేసిన ఈయన గొడ్డలికి త్వష్ట పదును పెడతాడు.

బృహస్పతి మొదట ఉన్నతమైన స్వర్గంలోని గొప్ప జ్యోతి నించి పుట్టి శబ్దంతో చీకట్లని పారదోలాడు. ఆయనకు రెండు లోకాలూ తల్లులు. కాని త్వష్ణ ఆయన్ని పుట్టించినట్లు కూడా చెప్పబడింది. మరోప్రక్క ఆయన దేవతలకి తండ్రి అని కూడా చెప్పబడ్డాడు. బృహస్పతి పురోహితుడు. ఒకచోట యజ్ఞం చేయించే పురోహితులలో మంత్రాలు చదివే ఆయన అనే అర్థంలో వాడబడినట్లు కనబడుతుంది. ఆయన సోముడికి పురోహితుడు. బృహస్పతి భక్తిని కలిగిస్తాడు. ఆయన లేకుండా యజ్ఞం సిద్ధించదు.

బ్రాహ్మణస్పతి అనే పేరు సూచిస్తున్నట్లు ఈ దేవత 'ప్రార్థనలకి పతి'. (సాయనాచార్యులు బ్రాహ్మణస్పతి ఓ దేవుడని చెప్పాడు. మరికొందరు ఈ బ్రాహ్మణస్పతి గుణవిశేషాలను బట్టి ఇంద్రవరుణులకు సమానంగా చెప్పబడి ఉండడంచేత ఈ దేవుడు అగ్ని అని ఊహించారు. బ్రాహ్మణస్పతి అనగా బృహస్పతి అని మరికొందరంటారు.) యజ్ఞానికి సంబంధించిన రథం మీద ఎక్కి ఆయన ప్రార్థనలకి శత్రువులనూ, దేవతలను

నిందించేవారినీ నాశనం చేస్తాడు. ఆయన ప్రార్థనలని పుట్టించాడు. మంత్రాలను ఉచ్చరిస్తాడు. మానవ పురోహితుల నోటికి వాక్కు ఇస్తాడు. అందువలన తరువాత కాలంలో ఆయనకి వాచస్పతి 'వాక్కు కి పతి' అనే పేరు వచ్చింది.

**సోముడు :**

పృథ్వీస్థాన దేవతలలో సోముడు ఒకడు. యజ్ఞంలో సోమయాగం ముఖ్యాంశం కాబట్టి ఋగ్వేదంలో సోముడు సహజంగానే అతి ముఖ్య దేవతలలో ఒకడయ్యాడు. తొమ్మిదో మండలంలో ఉన్న మొత్తం నూట పదాలుగు సూక్తాలూ, ఇతర మండలాలలో ఆరు సూక్తాలు ఆయన్ని స్తుతించడానికి ఉద్ధిష్టమయ్యాయి. ఇంతేకాక మరి నాలుగైదు సూక్త భాగాలలోనూ ఇంద్రుడు, అగ్ని, పూషుడు, రుద్రుడు – వీరిలో ఒక్కొక్కరితో కలిసి దేవతాద్వయంగా షుమారు ఇంకొక ఆరు సూక్తాలలోను ఈయన స్తుతించబడ్డాడు. సోమ శబ్దం సమాసాలలోనూ, విడిగానూ ఋగ్వేదంలో కొన్ని వందలసార్లు వచ్చింది. ప్రాచుర్య ప్రమాణాన్ని బట్టి చూస్తే వేద దేవతల ప్రాముఖ్య విషయంలో సోముడికి మూడోస్థానం లభిస్తుంది. ఇతర దేవతల మాదిరి ఆయన కూడా ఇందు, సోమ అనే పేర్లతో యజ్ఞానికి వచ్చి దర్భల మీద పెట్టిన ఆహుతులను స్వీకరించమని ప్రార్థించబడ్డాడు.

**పృథివి :**

పృథివి (భూమి) సాధారణంగా ద్యౌస్‌తో పాటే స్తుతించబడుతుంది. అందువల్ల ఈమెను ప్రత్యేకంగా ఒకే ఒక చిన్న సూక్తంలో మూడు మంత్రాలు మాత్రమే ఉన్నాయి. కాని అథర్వవేదంలో ఒక రమణీయ కవిత్వం గల ఒక పెద్ద సూక్తం ఈమెకు కేటాయించ బడింది. ఈమె విషయంలో వ్యక్తిత్వారోపం చాలా తక్కువ. ఆమె విస్తారమైనది, దృఢమైనది, ప్రకాశించేది. ద్యౌస్‌తోపాటు కలిపి చెప్పబడినప్పుడు పృథివికి తరచుగా తల్లి (మాతృ) అనే విశేషణం వాడబడింది.

**నదులు – సరస్వతి :**

పృథివీస్థాన దేవతలలో నదులు – సరస్వతి కూడా ఉన్నారు. ఋగ్వేదంలో దైవాంశగల జలాలతోపాటు దివ్యత్వం ఆపాదించబడిన నదులకి కూడా స్థానం ఉంది. సరస్వతీ నది మిగిలిన నదులకన్నా చాలా ఎక్కువగా స్తుతించబడింది.

## వేదభాష :

నేడు ప్రపంచములో వ్యాప్తమైన భాషల సంఖ్య దాదాపు ఐదు వేలు. భాషా వైజ్ఞానికులు ఈ భాషలన్నింటినీ నలభై భాషా కుటుంబాల క్రింద విభజించారు.

ఇండో–యూరోపియన్... ఇది ప్రపంచ భాషా కుటుంబాలన్నిటిలోకి పెద్ద భాషా కుటుంబం. అతి ప్రాచీనమైన సాహిత్యం గల సంస్కృతం, గ్రీక్, లాటిన్ భాషలు దీనికి చెందినవే. ఇందులో పదకొండుముఖ్యమైన శాఖలు ఉన్నాయి. ఈ భాషలన్నీ ఒకానొక కాలంలో ఒకే భాషగా ఉండేవి అని శాస్త్రజ్ఞుల నిర్ణయం. ఆ భాష సాంకేతిక నామం మూల ఇండో – యూరోపియన్. అది వ్యవహారంలో ఉన్న కాలం మూల ఇండో – యూరోపియన్ కాలం. ఇండో – యూరోపియన్ భాషా కుటుంబంలో సుమారు వెయ్యి భాషలు ఉన్నాయి.

**అ.** ఇండో – ఇరానియన్ : సంస్కృతము, ప్రాకృతి, పాలీ, హిందుస్థానీ, ఉరుదు, హిందీ, గుజరాతీ, బెంగాలీ, పంజాబీ, బీహారీ, మరాఠీ, రాజస్థానీ, సింధీ, ఒరియా, సింహాళీ, రోమనీ భాషలు ఒక విభాగం. ఇరానీ ప్రాంతంలో ఉన్న భాషలు మరో విభాగం – ఇరానియన్, అవెస్తా, పారశీ, కుర్దిష్, బలూచీ, పుష్టు, ఆస్సెటియన్ భాషలు.

**ఆ.** బాల్టో – స్లావొనిక్ : బాల్టక్, లుతూనియన్, లాట్వియన్, రష్యను, పోలిష్, చెక్, స్లోవక్, బల్గేరియను, ఉక్రేనియను, సెర్బో – క్రోయేషియను, ప్రష్యన్, స్లోవోనిక్ భాషలు.

**ఇ.** ఆర్మేనియన్

**ఈ.** అల్బేనియన్

**ఉ.** హెలెనిక్ : గ్రీక్, ఆధునిక గ్రీక్, డిమోటిక్ భాషలు

**ఊ.** ఇటాలియన్ : ల్యాటిన్, రొమాన్సు, పోర్చుగీసు, స్పానిష్, ఫ్రెంచ్, రోమన్, ఇటాలియన్, రుమేనియన్, కాటలాన్ భాషలు.

**ఋ.** కెల్టిక్ : గాలిక్, ప్రాచీన ఐరిష్, బ్రిటన్, కార్నిష్, స్కాటిష్, గాలిష్, వేల్సు భాషలు.

**ౠ.** జర్మానిక్ : స్వీడిష్, నార్వేజియను, డెనిష్, జర్మను, ప్రిసియన్, ఆంగ్లో–శాగ్జన్, ఇంగ్లీషు, స్కాటిష్, డచ్, తూర్పు జర్మనీ గోలక్, ప్రాచీన నార్సు, ఐస్లాండిక్ భాషలు.

**ఎ.** టొకేరియన్

**ఏ.** యానటోలియన్ : హైటెట్, ఆధునిక టర్కీ భాషలు. ఈ కుటుంబంలోని థ్రానియన్, ఫ్రిజియన్, ఇరివియన్, ఆస్కో – ఉంబ్రియన్, వెనెటిక్ అనే భాషలు ఇప్పుడు నశించాయి. వీటికి అతి స్వల్పమైన ఆధారాలు లభించాయట.

**ఐ.** హిటైట్.

నేడు ప్రపంచములోని అతి ముఖ్యమైన భాషా కుటుంబముల సంఖ్య పంతొమ్మిది.

1. ఆఫ్రో ఆసియా భాషాకుటుంబము - సహారా ఎడారికి దక్షిణమున మాట్లాడే భాషలు ముఖ్యముగా మూడు భాషాకుటుంబములకు సంబంధించినవి. ఉత్తర ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలలో మాట్లాడే భాషలు ఈ వర్గమునకు చెందినవి.
2. అల్టాయిక్, జపనీస్, కొరియను భాషాకుటుంబము - టర్కీ, మంగోలియను భాషలు అల్టాయిక్ భాషాకుటుంబమునకు చెందినవి. జపాను, కొరియా భాషలు ఏ భాషా కుటుంబమునకు చెందినవో నిర్ణయించుట కష్టము.
3. ఆస్ట్రేలియాలోని ఆదివాసుల భాషాకుటుంబము.
4. ఆస్ట్రేసియాటిక్ - వియత్నాము, కాంబోడియా భాషలు ఆస్ట్రోఏసియాటిక్ భాషాకుటుంబమునకు చెందినవి.
5. ఆస్ట్రనేసియన్ - మెడగాస్కరు, తైవాన్, ఈస్టరు దీవుల నుండి హవాయు దీవుల వరకు ఉన్న దీవులలో మాట్లాడే భాషలు ఆస్ట్రోనేసియా భాషాకుటుంబమునకు చెందినవి.
6. కాకసియన్
7. ద్రవిడ భాషాకుటుంబము.
8. ఎస్కిమో - అల్యూట్
9. ఇండో యూరోపియన్ భాషాకుటుంబము
10. ఇండో - పసిఫిక్ - న్యూగినీలోని జనులు మాట్లాడే ఏడు వందల భాషలు ఇండో పసిఫిక్ భాషాకుటుంబమునకు చెందినవి.
11. ఖోయిసాన్
12. నా-డెన్
13. నైగర్ - కోర్డోఫానియన్
14. నైలో - సహారా
15. ప్రాచీన సైబీరియన్ - కాశ్మీరు, పాకిస్తాన్, సైబీరియాలలో వారు మాట్లాడే భాషలు.
16. సినో-టిబెటన్
17. టాయ్

18. యూరలిక్ – ఉత్తర, దక్షిణ అమెరికాలోని ఆదివాసులు మాట్లాడే భాషలు అమెరిండ్ భాషాకుటుంబమునకు చెందినవి.

19. అమెరిండ్ – ఉత్తర, దక్షిణ అమెరికాలోని ఆదివాసులు మాట్లాడే భాషలు అమెరిండ్ భాషా కుటుంబమునకు చెందినవి.

భారతదేశంలో నేడు నాలుగు భాషాకుటుంబాలకు చెందిన భాషలు వాడుకలో ఉన్నాయి.

**అ.** ఆస్ట్రిక్

**ఆ.** ద్రవిడియన్

**ఇ.** ఇండో – యూరోపియన్

**ఈ.** సైనోటిబెటన్

భారతదేశంలో మాట్లాడబడే ఆస్ట్రిక్ భాషలు – సంతాలీ, ముండరీ, ఖరియా, సవర, గడబ, ఖాసీ మొదలైనవి. ఇక ద్రవిడ భాషలు – తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, తుళు, కొడగు, తోడా మొదలైనవి. ఇండో – యూరోపియన్ భాషలు – హిందీ, సంస్కృతం, బెంగాలీ, ఒరియా, అస్సామీ, గుజరాతీ, మరాఠీ, సింధీ, పంజాబీ, కాశ్మీరీ, రాజస్థానీ ఇంకా వీటికి సంబంధించిన అనేక ఉపభాషలు. సినో టిబెటన్ భాషలు మాట్లాడే జనులు భారతదేశంలో చాలా తక్కువ. వారు క్రమంగా తమ భాషలను వదలివేసి అస్సామీనీ, బెంగాలీనీ, ఆర్యన్, నేపాలీనీ మాట్లాడడం ప్రారంభించారు. మణిపురీ, లూషీ, బోడో మొదలైనవి సినోటిబెటన్ భాషా కుటుంబానికి చెందినవి. భారతదేశంలో ప్రజలు మాట్లాడు భాషలు 600. అందులో 17 ముఖ్యమైన భాషలు. భారతదేశంలో సుమారు 2800 మాండలికములున్నాయని అంచనా. ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 375 మాండలికము లున్నాయి.

వేదాలలోని భాష ఇప్పుడు మనకు అర్థం కాదు. అవి కొన్ని వేల సంవత్సరాలనాటి గ్రంథాలు. వాటిలోని భాషను వైదిక సంస్కృత భాష అన్నారు. ఈ భాష పూర్వం వ్యవహారంలో (వాడుకలో) ఉండేది. ఆనాటి వ్యవహారిక భాషలోనే వేద మంత్రాలను రచించారు. కాని తర్వాత తర్వాత వ్యవహారంలో వైదికభాష చాలా మార్పు చెందింది. ప్రాకృత భేదాలు ఆవిర్భవించాయి. ప్రజలు వైదిక భాషకు వికృత రూపాలైన వివిధ ప్రాకృత భాషలను మాట్లాడేటప్పుడు – సంస్కృత రూపమైన ఒకానొక భాషను శిక్షితులైన జనులు మాటాడుతుండేవారు. అటువంటి భాషకి పాణిని వ్యాకరణం రచించాడు (అష్టాధ్యాయి).

సంస్కృతమంటే మెరుగు దిద్దినది, సంపూర్ణమైనది అని అర్థం. ఇండో యూరోపియన్ భాషలన్నింటికీ సంస్కృతం పెద్దక్క. దీని అక్షర లిపిని దేవనాగర అంటారు. అంటే దేవతా నిలయం అని వాచ్యార్థం. ప్రాచీన భారతదేశపు భాషా శాస్త్రవేత్త పాణిని గణిత శాస్త్రీయంగానూ, మనో వైజ్ఞానికంగానూ సంస్కృతానికున్న పరిపూర్ణతను ప్రశంసిస్తూ 'నా వ్యాకరణం తెలిసినవాడు దేవుణ్ణి తెలుసుకుంటాడు' అన్నాడు. (ఏషియాటిక్ సొసైటీ వ్యవస్థాపకుడు సర్ విలియం జోన్స్ 'సంస్కృతభాషకి – దాని ప్రాచీనత విషయం ఏమైనా – దానికి అద్భుతమైన ఒక నిర్మాణ క్రమముంది. అది గ్రీకు భాషకంటే పరిపూర్ణమైనది. లాటిన్ కంటె విస్తృతమైనది. ఈ రెండింటికంటె ప్రశస్తంగా పరిష్కృతమైనది' అంటాడు.)

సంస్కృతంలోనే మహాభారతం, రామాయణం మొదలైన లౌకిక వాఙ్మయ సృష్టి జరిగింది. ఆ భాషకే సంస్కృతభాష అనే పేరు ప్రసిద్ధి. సంస్కృత భాష బ్రాహ్మణగ్రంథాలలో ఉంది. అందుచేతనే బ్రాహ్మణ, ఉపనిషత్తులు అవగాహనకు దగ్గరగా ఉన్నాయి. వేదసంహితలలోని భాష అవగాహనకు కష్టంగా ఉంది.

వేదాలను రచించిన కాలంలో ప్రజల ఆర్థిక, ధార్మిక, సాంఘిక పరిస్థితులలో ఆ పదాల, సమాసాల, వృత్తాంతాల అర్థాలు తరువాత మారిపోయాయి. భాషా నిర్మాణ పద్ధతి కూడా మార్పు చెందింది. వైదిక భాషలోని కాలభేదాలు తరువాత భాషలో సులభతరమైనవి. లౌకిక భాష వైదిక భాష అంత క్లిష్టంగా కాకుండా సులువుగా చేయబడింది. దానితో వేదాల మూల అర్థం, అర్థం కావడం కష్టమైంది.

వేదాల అభ్యాసానికి, అవగాహనకు వీలుగా వేదాంగాలు అవతరించాయి. యాస్కుని నిరుక్తంలో వేదమంత్రాలలోని వ్యుత్పత్త్యర్థం వివరించబడింది. ఈ నిరుక్తంకు ముందున్నవి నిఘంటు గ్రంథాలు. వీటిలో కఠినమైన పదాలు క్రమబద్ధంగా సంకల్పితమైనాయి. కఠినమైన వేదపదాలను వివరించడానికి, స్పష్టం చేయడానికి నిఘంటువులు మొదట ప్రయత్నించాయి. తరువాత ప్రాతిశాఖ్య గ్రంథాలు వేదపదాలను, స్వరాలను, సంధులను గూర్చి వివరించాయి. ఈ విధంగా వేదాలు అర్థం కాకుండాపోయిన సమయంలో వాటి అవగాహనకు తోడ్పడే నిఘంటువు మొదలైన గ్రంథాలు వ్రాయబడ్డాయి. యాస్కుడు తన నిరుక్తంలో వేదపదాల అర్థం విషయలో ఇతర ఆచార్యుల అభిప్రాయాలను చాలాచోట్ల పేర్కొన్నాడు. తరువాత తరువాత వేదపదాలే కాకుండా వ్యాఖ్యానం లేకపోతే మంత్రాలే అర్థం కాకుండా పోయాయి. దాంతో పండితులు వేదాలకు వ్యాఖ్యానాలు వ్రాయడం మొదలుపెట్టారు.

హిందూదేశంలో బౌద్ధ, జైన మతాలు వ్యాపించాయి. వాసుదేవ కృష్ణ మొదలైన భక్తి మత ప్రచారం ప్రారంభమైంది. అప్పుడు వైదిక మతానికి, వైదిక కర్మకాండకి ప్రాముఖ్యం లేకుండా పోయింది. క్రీస్తుశకం ఏడవ శతాబ్దంలో కుమారిలభట్టు ఉద్యమించి వేద ప్రాధాన్యానికి పూనుకున్నాడు. అప్పుడు వేదాలకు మొదటిసారిగా మాధవభట్టు, స్కందస్వామి మొదలైనవాళ్లు భాష్యాలు రచించారు. అప్పటికే వేదాలు పూర్తిగా అర్థం తెలియకుండా పోయాయి. ప్రజలకి ఆ జ్ఞానాన్ని ప్రచారం చేయడానికి, అవి ప్రతి ఒక్కరికి అర్థం కావడానికి భాష్యాలు వ్రాయవలసిన అవసరం సంభవించింది. స్కందస్వామి తరువాత అనేకమంది పండితులు వేదాలకు భాష్యాలు రచించడానికి పూనుకున్నారు.

కాలక్రమాన ప్రజల భాషలో, మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. వేదాలకు వ్రాసిన భాష్యాలు అర్థం వెలువరించిన తీరులు భిన్నంగా ఉన్నాయి. వైదికభాష, మతం యొక్క రూపాలు మారుతు వచ్చాయి. ఆచార్యులలో అభిప్రాయభేదాలు వచ్చాయి. వేదమంత్రాలలో కొన్ని పదాలు పూర్తిగా వాడుకలోనే లేవు. అందుచేత వాటికి అర్థాలు చెప్పడం సాధ్యం కాలేదు. అప్పుడు ఆచార్యులు ఎవరికి తోచిన అర్థాలను వారు నిర్ణయించారు.

వేదకాలం నాటి జాతులు, తెగలు పోయి కొత్త కొత్త జాతులు, తెగలవారు హిందూ దేశంలో నిరంతరంగా ప్రవేశించారు. వారి వారి సాంప్రదాయాలు, ధార్మిక ఆలోచనలు ఇక్కడ నివసించే వారి మీద ప్రభావాన్ని చూపించాయి. ఆ జాతులు, తెగలు ఒకదానితో ఒకటి కలిసిపోయి కొత్త జాతులు, తెగలు – కొత్త సంప్రదాయాలు, ఆచారాలు, వ్యవహారాలు ఏర్పడ్డాయి. దాంతో వేదాలలో పేర్కొన్న జాతులు, తెగలు, వారి ఆచార వ్యవహారాలు వారి పరస్పర సంబంధాలు కాలగర్భంలో కలిసిపోయాయి. అప్పుడు ఆచార్యులు శాస్త్ర, పురాణ, ఇతిహాసాల ఆధారంగా వేదమంత్రాల అర్థాలను నిర్ణయించడానికి పూనుకున్నారు. ఆచార్యుల అర్థ నిర్ణయంలో మతభేదం వచ్చింది.

వేదకాలం నాటి వివిధ జాతులు, తెగలు తమ తమ మత ధార్మిక సంప్రదాయాలు కలిగి ఉండేవి. వారికి పూజనీయమైన దేవతలు భిన్నంగా ఉండేవారు. జాతులు, తెగల పరస్పర మేళనంతో మతధార్మిక సంప్రదాయాలలో మార్పులు వచ్చాయి. వాళ్లు ఆరాధించే దేవతలు ఒకరితో ఒకరు కలసి అభేదం కలగడం, లేకపోతే కొత్త దేవతలు వెలియడం జరిగి పాత దేవతల రూపురేఖలు మరచిపోవడం జరిగింది. అందుచేత వేదకాలం నాటి జాతుల, తెగలకు పూజ్యమైన దేవతల స్వరూపాలను, పూజావిధులను నిర్ణయించడం

చాలా కష్టంతో కూడుకున్నది. యుగయుగాలుగా జరుగుతూ వచ్చిన జాతుల సమ్మేళనంలో, సంస్కృతులలో, మత ధార్మిక పరిస్థితులలో మార్పులు రాక తప్పలేదు. అలాంటప్పుడు ప్రాచీనకాలంలోని సూక్ష్మమైన విషయాలు జనుల జ్ఞాపకానికి, అవగాహనకు దూరం కాక తప్పదు. అలా జరగడం చేతనే వేదమంత్రాల వ్యాఖ్యానంలో మత భేదాలు ఏర్పడి ఉండవచ్చు.

వేదాలలో ఉదహరించిన కొందరు దేవతల పేర్లు వేరైనా స్వరూప స్వభావాలు ఒకే తీరుగా ఉండి ఆ దేవతలు ఒక్కరా, వేరువేరా అని చెప్పడం కష్టం. వేదాలలో చెప్పబడిన బృహస్పతి, తరువాత పురాణాలలో చెప్పబడిన ఇంద్రుని గురువు బృహస్పతి ఒకరా, వేరువేరా చెప్పడం కష్టమే మరి. దీనితో వ్యాఖ్యాతల వ్యాఖ్యానంలో భేదం రావడానికి అవకాశం ఏర్పడింది. కొందరు దేవతల స్తుతులను బట్టి ఆ దేవతల స్వరూప స్వభావాలు నిర్ణయించడం కష్టం. కొందరు దేవతల ప్రస్తుతులు అస్పష్టంగా ఉండడంచేత అది ఏ దేవతో చెప్పడం కష్టం. ఒక సాహస కార్యం వేరు వేరు దేవతలు ఆచరించినట్లుగా చెప్పడంతో అవగాహనలో స్పష్టత లేదు. దేవతా నిర్ణయాన్ని నిరుక్తం మొదలైన గ్రంథాలు వివరించడానికి పూనుకున్నా, ఆ వివరాలు అంతగా లేవు. నిరుక్తం రచనా కాలం నాటికే వైదిక మంత్రాల, దేవతలు అస్పష్టమై మత భేదానికి ఆస్కారమైంది.

నిరుక్తం రచించిన యాస్కుడు మతభేదాలను వివరిస్తూ, తనకు పూర్వపు ఆచార్యులు పదిహేడు మంది అభిప్రాయాలను పేర్కొన్నాడు. ఆ ఆచార్యుల రచనలు ఏవీ ఇప్పుడు లభ్యం కావడంలేదు. వారు వేదశబ్దాలకు, సమాసాలకు, దేవతలకు – అర్థ నిర్ణయం, స్వరూప వివరణ విషయంలో వేరేవేరే విధంగా వ్యాఖ్యానించారు. వారి అందరి అభిప్రాయాలను తీసుకుని రచించిన యాస్కుని వివరణలే ఎక్కువమందికి అంగీకారం కావడంతో అతని రచనే జనాదరణ పొందింది. కాని ఆధునికులకు నిరుక్తకారుని వివరణ కూడా ఒక్కోసారి సమ్మతంగా లేదు. ఇలా అనేక కారణాలతో మంత్రాల అర్థవివరణ విషయంలో భేదం కలుగుతూ వచ్చింది.

హిందూ సాంప్రదాయం ప్రకారం ఉన్న వేదాలను, విజాతీయులు వాటి రూపాన్నీ, ఉచ్చారణను ఎక్కడ మారుస్తారో అనే భయంతో వారికి వేదపఠనం నిషిద్ధమనే నిర్బంధాన్ని ఏర్పరచారు. ఈ నిర్బంధం ఎందుకు వచ్చిందో అందరూ మరిచిపోయారు. అప్పుడు విపరీత వ్యాఖ్యానాలు ఉద్భవించాయి. కులవ్యవస్థ గట్టి పడడంతో వేదాల పఠనం అగ్రజాతీయులకే పరిమితమైంది. దాంతో వేదాధ్యయనం చేసేవారు తగ్గిపోయారు.

వేదమంత్రాలకు అర్థం చెప్పగలిగేవారు కనుమరుగైనారు. కొందరు ఆచార్యులు సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మంత్రాలకు వేదాలకు అర్థాలను వివరిస్తూ వచ్చారు. కాని మంత్రాల మూల అర్థాలను చెప్పలేకపోయారు.

వేద రచనల తరువాత భారతదేశంలో చాలా మత దార్శనిక సంప్రదాయాలు కొత్తవి వచ్చాయి. బౌద్ధ జైన మత సంప్రదాయాలు వేద ప్రామాణ్యాన్ని అంగీకరించలేదు. కాని అద్వైత, విశిష్టాద్వైత సంప్రదాయానుయాయులు తమ సిద్ధాంతాలను వేదబద్ధం చేయడానికి ప్రయత్నించారు. తమ తమ దార్శినిక సిద్ధాంతాలకు అనుగుణంగా వేదమంత్రాలకు, ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రచించారు. మధ్వాచార్యులు ఋగ్వేదానికి వ్రాసిన భాష్యం ఇటువంటిదే. శంకర రామానుజాది ఆచార్యులు ఉపనిషత్తులకు వ్రాసిన వ్యాఖ్యానాలు ఇలాంటివే. వేదాలలోని పదానికి, సమాసానికి లేనిపోని అర్థాలను ఆచార్యులు తమ పాండిత్యంలో వివరించారు. దాంతో ఒకే మంత్రానికి వేరు వేరు అర్థాలు వివరించే అవకాశం ఏర్పడింది.

ప్రాచీన కాలంలో ఋషులు వేదమంత్రాలకు కొన్ని నిగూఢమైన అర్థాలతో వ్రాశారు. వారు ఏ దృష్టితో ఆ మంత్రాలను రచించారో ఇప్పుడు చెప్పడం కష్టం. ఈ రోజున ఆ మంత్రాలకు నానా అర్థాలను వివరించడానికి అనువుగా ఉన్నాయి. ఎవరికి ఇష్టం వచ్చిన అర్థాన్ని వారు ఆ మంత్రాలకు వ్యాఖ్యానించి చెప్పారు. ఆ మంత్రాలకు ఖచ్చితమైన అర్థం ఇదే అని చెప్పలేము.

వేదాలు యజ్ఞయాగాల కర్మకాండలను వివరించే మతధార్మిక గ్రంథాలని కొందరు వ్యాఖ్యానిస్తే, మరికొందరు ఆధ్యాత్మిక అర్థాలను వివరించి భారతీయ సంప్రదాయం ప్రకారం వేదాలు సమస్త జ్ఞానానికి మూలం అని అన్నారు. సమస్త విజ్ఞానం వేదాలలో ఉన్నదని విశ్వసించి దయానంద సరస్వతి ఆధునిక శాస్త్రీయ విజ్ఞానమైన రైలు, టెలిఫోను కూడా వేదాలలో ఉన్నాయని వ్యాఖ్యానం చేశారు. అరవిందుడు వేదాలలో తత్త్వచింతన, ఆధ్యాత్మిక విజ్ఞానం ఉన్నట్టుగా వ్యాఖ్యానించారు. యోగ తపస్సుల శక్తితో ఋషులు తమ హృదయాలలో ప్రతిఫలించిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రకటించారని అరవిందుని అభిప్రాయం.

వేదాల అర్థాలను తెలియజేయడానికి మహానుభావులు కంకణం కట్టారు. ఉవ్వటుడు వేదములో విధి, యాచనా, ఆశః, స్తుతి, ప్రైష, ప్రహ్వాలికా, ప్రశ్న, వ్యాకరణ, తర్క, పురానుకీర్తన, అవధారణ, ఉపనిషత్ అంశాలు ఉన్నాయంటాడు. యాస్కుడు

వేదమంత్రాలను ప్రత్యక్ష కృత, పరోక్ష కృత, ఆధ్యాత్మికంగా విభజించి, తనకు ముందు ఉన్న నైదాన, నైరుక్త, ఐతిహాసిక, బ్రహ్మవాది, యాజ్ఞిక, పరివ్రాజిక, స్వరముక్త మొదలైన సంప్రదాయాలను పరిశీలించి తన నిరుక్తంలో వేదార్థం తెలియజేయ కృషి చేశాడు. సాయణుడు వేదభాషను సమాధిగత, పరకీయ, లౌకిక భేదం అని మూడుగా విభజించుకుని ప్రయాగ, నిరీక్షణ, వ్యవహార, నిర్వచన, అభ్యాస, సమానుగమ తత్త్వాలను పరిశోధించుతూ వేదభాష్యం వివరించాడు.

పాశ్చాత్యుల అభిప్రాయంలో వేదాలు మతగ్రంథాలు. ఆర్యులు ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ చెప్పిన ప్రస్తుతే వేదమంత్రాలని, ఆర్యుల పూజావిధానమైన కర్మకాండ అందులో చెప్పబడిందని అంటారు. భాష, మత, ధార్మిక, చరిత్రల ఆధారంతో ప్రపంచ చరిత్రలో వారు వేదాలను వ్యాఖ్యానం చేశారు. అంతేకాని సాయణాదుల భాష్యాలను ఉన్నదున్నట్లు తీసుకోలేదు.

వేదాలు పవిత్రగ్రంథాలని, వాటిలో అతి దురూహ్యమైన విషయాలు ఉన్నాయనే విశ్వాసం ప్రజలలో వ్యాపించింది. దాంతో వేదాలు అందరూ చదవదగినవి కావని, శూద్రులు, స్త్రీలు వాటిని వినరాదు, తాకరాదు అనేది కూడా ప్రచారమైంది. అలాంటప్పుడు వేదాలు మనం చదివేవికావు, పైగా అర్థమయ్యేవి అంతకన్నా కాదు అనే నమ్మకం చాలామందికి కలిగింది. పాశ్చాత్యుల పరిశోధనలతో ఈ అభిప్రాయం చదువుకున్నవారిలో లేకపోయినా, చాలామందిలో అదే భావం దృఢంగా ఉంది.

ఇతర మతాలకు చెందిన మతగ్రంథాలు వంటివే వేదగ్రంథాలు. వీటిలో మన ప్రాచీనుల మత తాత్త్విక ఆలోచనలు, దేవతాస్తుతులు ఉన్నాయి. వ్యాఖ్యానం సహాయంతో వాటిని అర్థం చేసుకోవచ్చును అనే భావం అందరిలోను కలిగించాలి. అప్పుడే ఆ ప్రాచీన గ్రంథాలు కనుమరుగు కాకుండా నిలుస్తాయి.

## పాశ్చాత్యుల పరిశోధన

ఎందరో ఆంగ్లేయులు, జర్మనులు, ఫ్రెంచివారు, రష్యన్లు ఎంతో శ్రమకోర్చి వేదాలపై పరిశోధనలు జరిపారు. దేశంలో ఎక్కడెక్కడో ఉన్న వేద పాఠాలను, తత్సంబంధమైన అనువాదాలను, సూత్రాలను సేకరించి ప్రచురించారు.

ఒక ఫ్రెంచి మిషనరీకి సంబంధించిన 'రాబర్ట్ డీసేబిలిస్' అనే అతను మొట్టమొదటిసారిగా యజుర్వేదాన్ని ఫ్రాన్స్ దేశానికి తీసుకువెళ్ళాడు. దానిని ప్రసిద్ధ ఫ్రెంచి రచయిత 'వాల్టేర్' చూచాడు. హిందువుల ఆచార, విద్యాబుద్ధులను, విజ్ఞానాన్ని

మహాద్భుతంగా ప్రశంసించాడు. కాని తరువాత తేలిందేమంటే అది నిజమైన ప్రతి కాదు, కల్పిత ప్రతి అని. దాంతో యూరోపియన్లకు సంస్కృత భాషమీద అవిశ్వాసం ఏర్పడి అశ్రద్ధ కలిగింది.

క్రీస్తుశకం 1805లో 'కోల్‌బ్రూక్' అనే పాశ్చాత్య రచయిత 'ఏషియాటిక్ రీసెర్చ్' అనే పత్రికలో వేదాల మీద ఒక వ్యాసం వ్రాశాడు. ఆ వ్యాసంలో అనేక వేద గ్రంథాల వివరణ ఉటంకించాడు. పాశ్చాత్యులకు వేదాలను పరిచయం చేసిన మొదటి వ్యాసం ఇదే. ఈ వ్యాసం పాశ్చాత్య పండితులను వైదిక సాహిత్య పరిశోధనకు పురికొల్పింది. అందులో భాగంగా క్రీస్తుశకం 1830లో 'రోజెన్' అనే జర్మన్ విద్వాంసుడు ఋగ్వేదానికి సంపాదకత్వం నిర్వహించాడు. కాని ఆయన అకస్మాత్తుగా మరణించడంతో ఆ పని ఆగిపోయింది.

క్రీస్తుశకం 1846లో 'రుడాల్ఫ్ రోథ్' అనే జర్మన్ పండితుడు భాషాశాస్త్రం, తులనాత్మక ధార్మికాధ్యయనాలను తీసుకుని వేదార్థాన్ని విశదపరుస్తూ 'వేద సాహిత్య చరిత్ర' అనే పుస్తకాన్ని రచించాడు. ఈ చిన్న పుస్తకం సంచలనం కలిగించి యూరప్ పండితులను వేదసాహిత్య పరిశోధన వైపు త్రిప్పింది. అప్పుడు 'సెయింటు పీటర్స్ బర్గ్' సంస్కృత – జర్మన్ కోశాన్ని తయారుచేశాడు. ఇది ఓ మహాయజ్ఞం వంటిది. దీనిలో వైదిక, లౌకిక సంస్కృత శబ్దాలను 'బోట్ లింక్' పరిశీలించాడు. సంస్కృత శబ్దాలను తెలుసుకోడానికి ఈ నిఘంటువులు చాలా తోడ్పడ్డాయి. రోథ్ తరువాత అతని సమకాలికులు, శిష్యులు వైదిక సాహిత్యాన్ని గురించి చాలా కృషి సల్పారు. రోధ్ శిష్యులలో ఛార్లెస్ లాన్‌మన్, డబ్ల్యు. డి. ల్విట్నీ, హెన్రిచ్ త్సిమర్, రిచర్డు గార్బే, కార్ల్, ఎఫ్. గెల్డనర్ ముఖ్యులు. వీరిలో గెల్డనర్ ఋగ్వేదాన్ని జర్మన్ భాషలోకి అనువదించాడు. ఈ రోజుకీ ఇది చక్కని అనువాదంగా పరిగణించబడుతుంది.

యూజీన్ బుర్నోఫ్ అనే ఫ్రెంచి పండితుని శిష్యులు మాక్స్ ముల్లర్, రోథ్. పారిస్‌లో గురువు ప్రేరణతో శిష్యులిద్దరూ వేద అధ్యయన పరిశోధనకు పూనుకున్నారు. ముల్లర్ ఋగ్వేదాన్ని సాయణ భాష్యంతో విమర్శనాత్మక పీఠిక టిప్పణులతో మొదటిసారిగా ప్రచురించాడు. ఈ రచన పాశ్చాత్య దేశాలలో వేద అధ్యయనాలకు పునాది వేసింది. మాక్స్‌ముల్లర్ 'ప్రాచీన వైదిక సంస్కృత సాహిత్య చరిత్ర' అనే రచనలో వైదిక సాహిత్యాన్ని సవిమర్శకంగా వివరించాడు. అతడు వెలువరించిన 'పవిత్ర ప్రాచ్య గ్రంథమాల' లోని పుస్తకాలలో పాశ్చాత్య పండితుల అనువాదాలతో వైదిక గ్రంథాలు కొన్ని ప్రచురించాడు.

జర్మన్ విద్వాంసుడు మాక్స్ ముల్లర్ సంస్కృత భాషకు చేసిన కృషి అనిర్వచనీయమైనది, అమోఘమైనది.

బ్రిటీషు పరిపాలనలో కలకత్తా హైకోర్టు న్యాయవాది సర్ విలియమ్ జోన్స్ స్థాపించిన 'ఆసియాటిక్ సొసైటీ' అనే సంస్థ ప్రచురించిన గ్రంథాలు మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఈస్టిండియా కంపెనీ సహాయంతో శాయనుని టీకతో ఋగ్వేదాన్ని చాలా సంపుటాలుగా వెలువరించాడు.

## వేదకాలం

ప్రాచీన భారతీయ సంప్రదాయం ప్రకారం వేదాలు అపౌరుషేయాలు, అనాది అయినవి. అందుకని వాటి రచనా కాలాన్ని వారెప్పుడూ నిర్ణయించడానికి ప్రయత్నించలేదు. యాస్కుని నాటికి వేదాలలో ఐతిహాసికత ఉన్నదన్న అభిమతమున్నా వాటి రచనా కాలాన్ని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఆధునిక యుగంలో వేదరచనా కాలాన్ని నిర్ణయించడానికి పండితులు ప్రయత్నించారు కాని వారిలో అభిమతైక్యత కుదరలేదు. గౌతమబుద్ధునికన్నా పూర్వ రచనలని, మహాభారత రచయిత వ్యాసుని నాటికి వాటి రచన పూర్తి అయిందని మాత్రం అంగీకరించారు.

వేదరచనా కాలాన్ని నిర్ణయించడం సులభమైన పని కాదని మాక్స్ ముల్లర్‌కి తెలుసు. కాలనిర్ణయంలో గల సాధక బాధకాలను పరిశీలిస్తూ మాక్స్‌ముల్లర్ వేదాలు ప్రపంచ సాహిత్యంలో ఆదిగ్రంథాలని, ప్రపంచంలో జ్ఞానోదయారంభం వీటితో జరిగిందని అంగీకరించాడు. భాషా దృష్టితోనే పరిశీలించి వేదకాల నిర్ణయం చేయాలని పూనుకున్నాడు.

మాక్స్‌ముల్లర్ ప్రకారం బౌద్ధమతం ఉదయించకముందే వైదిక సాహిత్యోదయ మైందని అభిప్రాయం. వైదిక సాహిత్యాన్ని అతడు నాలుగు యుగాలుగా విభజించి – ఋక్ యుగం, మంత్ర యుగం, బ్రాహ్మణ యుగం, సూత్రయుగమన్నాడు. ఒక్కొక్క యుగం వికసించడానికి రెండువందల సంవత్సరాల సమయాన్ని నిర్ణయించుకుని వేదరచనా కాలం క్రీస్తుకు పూర్వం 1200–1000 అని నిర్ధారించాడు. తరువాత కోల్‌బ్రూక్, విల్సన్, కీత్, మాక్ డొనెల్ మొదలైన పాశ్చాత్య పండితులు ఈ నిర్ణయాన్ని అంగీకరించారు.

లింటర్ నిట్చ్ – పాణిని వ్యాకరణంలో నిర్దేశింపబడిన మరియు క్రీస్తుకు పూర్వం మూడవ శతాబ్దం నాటి అశోకుని శిలాశాసనాల్లోని భాషకు, వేదాలలోని భాషకు చాలా దూరం లేదని క్రీస్తుకు పూర్వం 2500 నాటివని తేల్చాడు. బాలకృష్ణ దీక్షిత్ జ్యోతిష శాస్త్ర సహాయంతో వేదరచనా కాలాన్ని నిర్ణయించడానికి పూనుకున్నాడు. శతపథ

బ్రాహ్మణంలో చెప్పబడిన కృత్తికా నక్షత్ర స్థానాన్ని బట్టి క్రీస్తుకు పూర్వం 3500 లకు పూర్వమని నిర్ణయించాడు. యాకోబీ జ్యోతిష శాస్త్ర ప్రవీణుడు. కల్ప సూత్రంలోని వివాహ ప్రకరణంలోని ధ్రువ నక్షత్ర స్థితిని తీసుకుని క్రీస్తుకు పూర్వం 4500 అన్నాడు.

బాలగంగాధర తిలక్ యాకోబీ వలెనే జ్యోతిషశాస్త్ర ఆధారంగా వేదరచనా కాలాన్ని నిర్ణయించడానికి పూనుకున్నాడు. నక్షత్రాల స్థితి, కాలాన్ని బట్టి – సంహిత, బ్రాహ్మణాల రచనాకాలాన్ని నిర్ణయించాడు. బ్రాహ్మణాల కాలంలో మృగశిర నక్షత్రం రాత్రి పగళ్లు సమానంగా విభజించి లెక్కించడానికి తోడ్పడే స్థితిలో ఉండదని, లెక్కించి బ్రాహ్మణాల రచనాకాలం క్రీ.పూ. 6500 అని నిర్ణయించి, మంత్రసంహితల రచనలు అప్పటికి కొన్ని వందల సంవత్సరాలు కాక కొన్ని వేల సంవత్సరాలు పట్టిందని క్రీ.పూ. 8500 నాటి నుంచే మంత్ర రచనలు ఆరంభమైనవని తిలక్ అభిప్రాయం.

## జెంద్ అవెస్తా

పర్షియా (ఇరాన్) దేశంలోని జరతుష్ట్ర మతానికి, వైదిక మతానికి పోలికలు కనిపిస్తున్నాయి. 'జెంద్ అవెస్తా' పార్సీల పవిత్ర గ్రంథం. ఇందులో గాథలు అనబడే మంత్రాలలో కొన్ని క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దానికి చెందిన జొరొ ఆస్తర్ (Zoroaster) రచించినవి అని సంప్రదాయం. అవెస్తాలోని మంత్రాలకీ, ఋగ్వేదంలోని మంత్రాలకీ అర్థంలోనూ, శబ్దంలోనూ చాలా సామీప్యం ఉంది. కొన్ని అవెస్తా మంత్రాలలో ఒకటి రెండు వర్ణాలను మారిస్తే అవి ఋగ్వేద మంత్రాలతో ఇంచుమించు సమానం అయిపోతాయి. అందువల్ల ఋగ్వేదంలో కొంత భాగం ఆర్యులు భారతోపఖండానికి రాక ముందే రచించబడినదని పండితుల విశ్వాసం.

అవెస్తాలోని ప్రాచీనమైన భాషకీ, వేదాలలోని భాషకీ వాక్య నిర్మాణంలోనూ, పదాలలోనూ, ఛందస్సులోనూ, కవితా శైలిలోనూ ఎంత సాన్నిహిత్యం ఉందంటే – అవెస్తాలోని గీతాలలో, పదాలలో ధ్వనులకి, ధ్వని సూత్రానుసారంగా మార్పులు చేస్తే ఆ గీతాలు భాషలోనే కాక కవితాత్మలో కూడా సరిగా ఋక్కులు లాగే కనబడతాయి.

వ్యాసుడు వేదములను మూడుగా విభజించి వేదవ్యాసుడైనాడు. తరువాత కాలంలో అథర్వ వేదమును చేర్చి, వేదములు నాలుగన్నారు.

"త్రయో వేదా అజాయన్త, ఋగ్వేద ఏ వాగ్నేర జాయత, యజుర్వేదో వాయోః, సామవేద ఆదిత్యాత్" – ఐతరేయ బ్రాహ్మణము.

మూడు వేదములు పుట్టినవి. ఋగ్వేదము అగ్ని వర్ణనతో ప్రారంభమవుతుంది. అగ్నిమీళే... యజుర్వేదము వాయువు వర్ణనతో ప్రారంభమవుతుంది – ఇషేల్వోర్జేత్వా...

సామవేదము ఆదిత్య వర్ణనతో ప్రారంభమవుతుంది - అగ్ని ఆయాహి... (ఇక్కడ అగ్ని శబ్దము ఆదిత్య పరంగా వాడబడింది).

"త్రయీవై విద్య, ఋకో యంజూంషి, సామాని" - శతపథ బ్రాహ్మణము.

ఋక్కులు, యజస్సులు, సామములు అనే మూడే విద్యలు.

భారతీయులు వేదములను మూడు భాగములుగా విభజించినట్లు, పారశీకులు తమ అవెస్తాను మూడు భాగాలుగా విభజించారు.

అ.యస్న = యస్న యజ్ఞపద రూపాంతరము. అంటే యజర్వేదము.

ఆ.యస్ట = ఇష్టిపద రూపాంతరము. యష్టి ఇది సామవేదము.

ఇ.విదేవదాత్ = (విద్వేదూషణము) : రాక్షస దూషణము.

సంస్కృత కావ్య భాష కన్నా, అవెస్తా భాష, వేద భాషకు ఎక్కువ సన్నిహితంగా ఉందని పరిశోధకులు తేల్చారు. అవెస్తా, ఋగ్వేదములోని మాటల, సమాసముల పోలికే కాక మంత్రముల పోలికలు కూడా ఉన్నాయి.

"ఆషం వహూ, వహిష్టం అస్తి, ఉష్ట అస్తి, ఉష్ట అమ్మై, హ్యాత్ ఆషై, వహిష్టై ఆషం" - యస్న

ఇది యస్నలోని ఒక ఋక్కులోని పాదము. దీనిని కొద్దిగా మారిస్తే-

"ఆషం వసు, వసిష్టం అస్తి, ఉష్ట అస్తి, ఉష్ట అస్మై, స్యాత్ ఆషై, వసిష్టై ఆషం"గా మారుతుంది.

**తాత్పర్యం :** ఆషా మంచిది. అది ఉత్తమోత్తమమైనది. అది సంతోషము, అత్యుత్తమమైన మంచి కొరకు మంచితనము గలవాడు ఆనందం పొందును.

"తం అమవంతం యజతం శూరం ధమసు శవిష్టం మిత్రం యాజై హోత్రభ్యః"

**తాత్పర్యం :** చాలా అందమైన, బలవంతుడైన, శక్తి సంపన్నుడైన మిత్రుని ఆహూతులతో ప్రార్థింతును.

యజ్ఞ కర్మకి సంబంధించిన చాలా పదాలు సమానంగా ఉన్నాయి. వేదం - అవెస్తా, యజ్ఞ - యస్న, హోత - జవోతర్, అధర్వన్ - ఆధ్రవన్, ఋత - ఆష, సోమ - హవోమ. వీటిలో అన్నింటికన్న ముఖ్యమైనది సోమరసాన్ని సూచించే పదం. ఈ రెండు తెగల వారూ సోమలత నుంచి సోమరసాన్ని పిండి, జల్లెడతో వడబోసి, పాలతో

కలిపి, దాన్ని ముఖ్యమైన నివేదనగా దేవతలకు అర్పిస్తారు. రెండు గ్రంథాలలోనూ సోమలత లతల అధిపతిగాను, కొండల మీద మొలిచేది గాను, గ్రద్దల చేత కిందికి తీసుకు రాబడినదిగానూ వర్ణించబడింది.

అగ్ని – ఆతర్ అని సంబంధం లేని పేర్లు వాడినా భారతీయులు, పర్షియన్లూ నిప్పును పూజించేవారు. అంత తరచుగా కాకపోయినప్పటికీ, రెండు తెగలవారూ ఆపః – ఆపో అనే పేర్లుతో నీటిని పూజించేవారు. వేదాలలో మిత్రుడే సూర్యుడు, అవెస్తాలో మిథ్ర. ఆదిత్య భగుడికి అవెస్తాలో 'దేవుడు' అనే అర్థమిచ్చే బఘ సమాసం. వాయు – వయు, అపాంనపాత్ నీటికి కొడుకు/మనుమడు. అగ్ని – అపంనపాట్; గంధర్వ – గందరెవ; కృసను – కారెశాని అనే దేవతలు సోమ – హవోమ అనే దానికి సంబంధించిన వారు. 'త్రిత ఆప్త్య' అనే ఒక దేవుడికి సమానంగా అవెస్తాలో థ్రిత, ఆథ్వ్య అనే ఇద్దరు ఉన్నారు. అలాగే 'వృతహన్' అనే విశేషణం గల ఇంద్రుడికి సమానంగా 'ఇంద్ర' అనే భూతమూ, వెరెథ్రఘ్న అనే జయానికి అధిదేవతా ఇద్దరు ఉన్నారు. వివస్వత్ కొడుకూ, మరణించిన వారికి రాజు అయిన యముడికి సమానంగా వివఙ్హ్వంత్ కొడుకూ, స్వర్గానికి రాజు అయిన 'యిమ' ఉన్నాడు. వరుణుడికి పేరులో కాకపోయినా స్వభావంలో తుల్యుడుగా బుద్ధిశాలి అయిన భూతం 'అహురమజ్ద' ఉన్నాడు. రెండు మతాలలోనూ చెడు కలిగించే భూతాలకి పేర్లుగా ద్రుహ – ధ్రుజ్, యాతు అనేవి సమానంగా ఉన్నాయి.

పాశ్చాత్యులు ఎప్పుడైతే వైదిక ధర్మాన్ని గూర్చి తెలుసుకున్నారో, అప్పుడు వారికి ప్రాచీన యూరోపియన్ల మతానికి, వైదిక మతానికి చాలా పోలికలు కనిపించాయి. ప్రాచీన యూరోపియన్లు, ప్రాచీన వైదిక మతానుయాయులు ఒక జాతికి చెందినవారని, ఆ జాతికి ఆర్యులని నామకరణం చేశారు. సత్పురుషుని, సచ్ఛరిత్రుని, నాగరికతగల వ్యక్తిని ఆర్య అని సంబోధించడం ప్రాచీన భారతంలో ఉండేది. అదే అజ్జ, ఔ, అయ్య అని భారతీయ భాషలలో రూపాంతరం చెంది కనిపిస్తుంది. ప్రాచీన భారతీయ సాహిత్యంలో ఎక్కడా జాతిపేరు ఆర్య శబ్దం వాడబడలేదు. వేదాలలో యదు, తుర్వస, అను, ద్రుష్య, పురు అనబడే జాతులు, ఇవిగాక తృత్సు, నహుష, సంజయ, వృచీవంత, భరత (భరత జాతిలోని పురు మరొక శాఖ) జాతులు ఋగ్వేదములో పేర్కొనబడినవి కాని, ఆర్య జాతి పేరుతో ఎక్కడా పేర్కొనబడలేదు. ఆర్య జాతి నామకరణం ఆధునిక పాశ్చాత్య విద్వాంసులు చేసింది.

భారతీయ సనాతన విద్వాంసులు భారతదేశమే వైదిక ధర్మానికి జన్మభూమి అనీ, ఇక్కడ నుంచే అగ్ని, వరుణ, ఇంద్ర ఆరాధకులైన వైదిక జాతులు ఇరాన్ దేశం,

ఏసియా మైనర్ (టర్కీ)లకు వలసపోయి, తమ ధర్మాన్ని వ్యాపింప జేశారని, రాజ్యాలను స్థాపించారని అంటారు. అప్పుడు ఆఫ్ఘనిస్థాన్ వరకు భారతదేశంగానే పరిగణింపబడేది. కాబట్టి అప్పటి భారతీయ మత సంస్కృతులు దూర పశ్చిమ ప్రాంతాల వరకూ సులభంగా పాకినవని వారి అభిప్రాయం. సమస్త ప్రాచీన ధర్మాలకు అంటే జొరాష్ట్రియన్. గ్రీకు, రోమన్, యహూది మతాలకు వైదిక ధర్మమే ప్రాతిపదిక, మూలం అని వారి విశ్వాసం.

| | వేదము | అవెస్తా | | వేదము | అవెస్తా |
|---|---|---|---|---|---|
| 1. | సింధు | హిందు | 17. | మత్స్య | మస్య |
| 2. | సరస్వతి | హరస్వతి | 18. | యమ | యిమ |
| 3. | సూక్త | హూక్త | 19. | త్వష్ట | తిష్ట్య |
| 4. | సుమత | హుమత | 20. | అధర్వణ | అథ్రవాన్ |
| 5. | అసుర | అహుర | 21. | హోతృ | జోతర్ |
| 6. | వసు | వహు | 22. | మేదా | మజ్దా |
| 7. | సోమ | హోమ | 23. | యజ్ఞ | యస్న |
| 8. | సప్తసింధు | హప్తసింధు | 24. | విష్ణుః | రస్ను |
| 9. | దాస | దాహ | 25. | అగ్నిః | అతర్ |
| 10. | స్వర్ణా | హ్వార్నా | 26. | మఖః | మగ |
| 11. | సహస్రపతి | హుజారపతి | 27. | గంధర్వః | గందరేవ |
| 12. | అశ్వినులు | అస్పినా | 28. | మిత్రః | మిత్ర-మెహర్ |
| 13. | విష్టాశ్వః | విష్టాస్ప | 29. | శాసకః | షా |
| 14. | జవనాశ్వః | జమ్నస్ప | 30. | ఆపః | అపో |
| 15. | కశ్యపః | కరేస్ప | 31. | ఋతః | ఆషా |
| 16. | ఛంద్ | జంద్ | 32. | అనృత | ద్రుజ్ |

# ఋగ్వేద సంహిత

**నా**లుగు వేదాలలో ఋగ్వేదం మొట్టమొదటిది, ప్రధానమైనది. సంహితా సర్వస్వములో ఋగ్వేదం సగభాగం ఆక్రమించింది. పరిగణనలో ప్రాచీనతలో కూడా ఋగ్వేదమే ముఖ్యమైనది. సామవేదంలోని సూక్తాలన్నీ ఇంచుమించు ఋగ్వేదంలోనివే. అథర్వవేదంలో షుమారు పన్నెండువందల సూక్తాలు ఋగ్వేదములోనివి మరల వినిపిస్తాయి. యజుర్వేదంలో కూడా ఋగ్వేద మంత్రాలు చాలా కనిపిస్తాయి. అందువలన ఋగ్వేదము వేదములన్నింటికి మూలమనిపిస్తుంది.

మహాభాష్యకారుడైన పతంజలి ఋగ్వేదానికి ఇరవై ఒక్క శాఖలుండేవని పేర్కొన్నాడు. వాటిలో శాకల – బాష్కల – ఆశ్వలాయన – శాంఖాయన – మాండూకేయాలని అయిదు శాఖలు ప్రచారంలో ఉండేవని 'చరణ వ్యూహం'లో పేర్కొనబడింది.

ప్రధానమైన శాఖలకు కొన్ని ఉపశాఖలు ఉన్నాయి. శాకల శాఖకు – ముద్గల, గాలవ, శాలీయ, వాత్స్య, శైశిర శాఖలు ఉపశాఖలు. బాష్కల శాఖకు – బౌధ్య, అగ్నిమాఠర, పరాశర, జామాకర్ణ్య శాఖలు ఉపశాఖలు. శాంఖాయన శాఖకు – కౌషీతకి, మహాకౌషీతకి, శాంబవ్య శాఖలు ఉపశాఖలు. ఇవికాక బహ్వృచ, పైంగ్య, ఉద్దాలక (ఆరుణ), శత, బలాక్ష, గజ, బాష్కలి (భరద్వాజ), ఐతరేయ, వాసిష్ట, సులభ, శౌనక శాఖలున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం మనకు దొరుకుతున్నవి శాఖల, బాష్కల శాఖలు మాత్రమే.

ఛందస్సు నియమం కలిగి పాద వ్యవస్థలో ఉన్న మంత్రాలకు ఋక్కులని పేరు. సంహిత అంటే సంకలనమని అర్థం. యజ్ఞం చేసేటప్పుడు ప్రయోగించే మంత్రవిధానాలను దృష్టిలో పెట్టుకుని సంహితలు సంకలనం చేయబడ్డాయి. ఋగ్వేదములో పదివేల ఐదు వందల ఎనభై మంత్రాలున్నాయి. వీటికి ఋక్కులని పేరు. ఈ మంత్రాలలో అనేక విషయాలుంటాయి. ఒక మంత్రంలో ఒకానొక దేవత స్తుతి, ఒక మంత్రంలో పూర్వ వృత్తాంత కథనము, ఒక మంత్రంలో ఉపదేశం, ఒక మంత్రంలో ప్రశ్న – ఇలా అనేక విషయాలుంటాయి.

ఋగ్వేదాన్ని రెండు రకాలుగా విభజించారు. మంత్రము లేక ఋక్ అనేది అన్నింటికన్నా చిన్న విభాగము. కొన్ని ఋక్కులు కలిస్తే ఒక సూక్తమవుతుంది. ఒక సూక్తానికి ఒక్కడే ఋషి. దేవతలు ఒకరుగాని, ఎక్కువమందికాని ఉంటారు. ఇలాంటి సూక్తాలు ఋగ్వేదంలో ఒక వెయ్యి ఇరవై ఎనిమిది ఉన్నాయి. కొన్ని సూక్తాల కలయిక అనువాకము. అనువాకముల సంఖ్య ఎనభై అయిదు. కొన్ని అనువాకాల సమూహానికి మండలమని పేరు. మండలములు పది. ఇది ఒక పద్ధతి.

వేరొక పద్ధతిలో ఋగ్వేదము ఎనిమిది అష్టకములుగా, ప్రతి అష్టకము ఎనిమిది అధ్యాయాలుగా, అధ్యాయము ముప్పై మూడు వర్గములుగా, వర్గము కొన్ని మంత్రాలుగా విభజించబడింది. ఈ పద్ధతిలో ఋగ్వేదములో ఎనిమిది అష్టకములు, అరవై నాలుగు అధ్యాయములు, రెండువేల పదహారు వర్గములు ఉన్నాయి. అష్టక విభాగం కొత్తగా ఏర్పడింది. ఇది శాస్త్రీయమనడానికి వీలులేదు. మండల విభాగము శాస్త్రీయమైనది, చారిత్రాత్మకమైన విలువ గలది. అందువలన ఈ విభాగము చాలా ప్రాచీనమైనది.

వేదములోని మంత్రాలనే కాకుండా అక్షరాలను కూడా సర్వానుక్రమణిక అనే గ్రంథంలో లెక్కించి పెట్టారు. అందుచేత కొత్త మంత్రాలే కాదు, కొత్త అక్షరాలు కూడా అదనంగా చేరడానికి అవకాశం లేదు. ఈ అక్షరగణనలో వాలఖిల్య సూక్తాలు లేవు. ఎనభై సూక్తాలు గల అష్టమ మండలములోని నలభై తొమ్మిది మొదలు యాభై తొమ్మిది వరకు గల పదకొండు సూక్తాలను 'వాలఖిల్య' పేరుతో ప్రసిద్ధి చెందాయి. కాని వాటి పాఠం లభ్యం కావడం లేదు.

మహర్షి శౌనకుని ప్రకారం ఋగ్వేదములో మొత్తం పదివేల ఐదు వందల ఎనభై ఋక్కులున్నాయి. పదముల (శబ్దాల) సంఖ్య ఒక లక్షా యాభై మూడువేల ఎనిమిది వందల ఇరవై ఆరు. అక్షరాలు నాలుగు లక్షల ముప్పై రెండువేలున్నాయి. కాని కొందరు పదివేల నాలుగు వందల రెండు ఋక్కులు అని, మరికొందరు పదివేల ఆరువందల ఇరవై రెండు ఋక్కులున్నాయంటారు. ఋగ్వేదములోని ఋక్కుల గణనలో మతభేదం కనబడుతుంది. శాఖల భేదం వలనే ఈ తేడా ఏర్పడింది. అదీకాక ఆధునికుల లెక్కలో నాలుగు పాదాలు గల కొన్ని ఋక్కులను రెండు పాదాలుగా లెక్కించడం చేతకూడా సంఖ్యాభేదం ఏర్పడింది.

(శతపథ బ్రాహ్మణం ప్రకారం ప్రజాపతి సంవత్సరానికి 10,800 ముహూర్తాలు (MOMENTS)గా గణించారు. ఒక సంవత్సరానికి 12 మాసాలు, మాసానికి 30 రోజులు,

రోజుకు 60 ఘడియలు. అనగా ఒక సంవత్సరానికి 12 × 30 × 60 ఘడియలు కాగా, రెండు ఘడియలు ఒక ముహూర్తం. అనగ ఒక సంవత్సరానికి 12 × 30 × 30 ముహూర్తాలు. అనగా 10,800 ముహూర్తాలు.

ఋగ్వేదంలో 10,800 భాగాలున్నాయి. ప్రతి భాగానికి 40 పదాలున్నాయి. కాబట్టి ఋగ్వేదములోని మొత్తం పదాలు 4,32,000. ఈ సంఖ్య విశేషమేమంటే ఇది ఇప్పుడు మనం వర్ణించే కలియుగ సంవత్సరాలు. ఎందుకంటే ఒక దివ్య సంవత్సరానికి 360 మానవ సంవత్సరాలు. మరో లెక్క ప్రకారం కలియుగం 4,32,000 సంవత్సరాలు. దానికి రెండురెట్లు ద్వాపరయుగం. మూడురెట్లు త్రేతాయుగం. నాలుగురెట్లు కృతయుగం. కాగా ఈ నాలుగూ కలిపి ఒక మహాయుగం. అవి 43,20,000 సంవత్సరాలు అవుతుంది.)

ఋగ్వేదంలో ఉన్న మంత్రాలను ఋక్కులంటారు. ఈ ఋక్కులు నాలుగు పాదాలు, మూడు పాదాలు, రెండు పాదాలు గల ఛందస్సులో ఉన్నాయి. గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి మొదలైన ఛందస్సులు ఋగ్వేదములో ప్రయోగించబడినవి.

ఋగ్వేదములోని రెండవ మండలము నుండి ఏడవ మండలము వరకు గల భాగం అత్యంత ప్రాచీనమైందని పాశ్చాత్యుల అభిప్రాయం. భాష, ఛందస్సులను బట్టి, నవీన దేవతల ప్రసక్తి, నవీన దార్శనికతాధ్యాలు ఉండడం వలన దశమ మండలము నవీనమని ఆధునికుల అభిప్రాయం.

ఋగ్వేదములోని మంత్రాలను రచించినవారు ఋషులు. వేదాలు అపౌరషేయములు కాబట్టి వీళ్ళని మంత్రకర్తలనకుండా మంత్రద్రష్టలన్నారు. మొదటి మరియు పదవ మండలములకు ఋషులు అనేకమంది ఉన్నారు. వీళ్ళలో కొంతమంది స్త్రీలు కూడా ఉన్నారు. వాక్, విశ్వవారా, శ్రద్ధా, సూర్యా మొదలగు స్త్రీలు ఋగ్వేదములోని కొన్ని సూక్తాలను రచించారు. ఒకో మండలం ఒకో ఋషితో గాని, ఋషి వంశస్తులతోగాని సంబంధం కలిగి ఉంది. ఋషి వంశాలలో ఆయా మండలాలు సంబంధించి ఉండడం చేత పాశ్చాత్యులు వీటిని వంశమండలాలని పిలిచారు.

మొదటి మండలంలో విశ్వామిత్ర పుత్రుడు మధుచ్ఛందుని ద్వారా దర్శించబడిన ఋక్కులు ఉన్నాయి. రెండవ మండలంలో గృత్సమదుడు, మూడులో విశ్వామిత్రుడు, నాలుగులో వామదేవుడు, ఐదులో అత్రి, ఆరులో భరద్వాజుడు, ఏడులో వసిష్ఠుడు,

ఎనిమిదిలో కణ్వ అంగిరసులు దర్శించిన ఋక్కులున్నాయి. తొమ్మిదో మండలములోని సోమస్తుతి అనేకమంది ఋషుల చేత చేయబడింది. సోమరసాన్ని తయారుచేయడం, దాన్ని తాగడం వల్ల కలిగే ఆనంద ఉల్లాసాలు ఈ మండలములో వర్ణించబడ్డాయి. 'సోమ'ను 'పవమాన' అని కూడా పిలుస్తారు. అందుకే తొమ్మిదో మండలానికి పవమాన మండలమని కూడా పేరు.

ఋగ్వేదాన్ని సుమారు నాలుగు వందల ముగ్గురు మహర్షులు దర్శించారు. వారికి సంబంధించిన విశేషాలు సంహితలో ఎక్కువగా తెలియదు. సంహితల తరవాతి సాహిత్యంలో వివరించడం జరిగింది. ఎక్కువ మంత్రాలను దర్శించిన మహర్షులు – వసిష్టుడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, వామదేవుడు, గృత్సమదుడు, దీర్ఘతముడు, అగస్త్యుడు, గౌతముడు మొదలగువారు. వీరుకాక – దేవలుడు, అసితుడు, శ్యావాశ్వుడు, మేధాతిథి, అత్రిభౌముడు, అగ్నిసౌచీకుడు (కశ్యపుడు) (మారీచుడు), కుత్సుడు (ఆంగిరసుడు), కృష్ణుడు (ఆంగిరసుడు), గౌరీవీతి, జమదగ్ని, త్రితుడు, నారదుడు, నృమేధుడు, కక్షీవంతుడు, అయాస్యుడు (ఆంగిరసుడు), అర్చనానా, అవత్సారుడు, ఇరింబిఠి, ఉచథ్యుడు. ఉశనసులు, ఋజిశ్వ, ఋషభుడు, కణ్వుడు (ఘౌరుడు), కవషుడు (ఐలూషుడు), కవి (భార్గవుడు), కురుసుతి, కుసీది, గాధి (కౌశికుడు), త్రసదస్యుడు, త్రితుడు (ఆప్త్యుడు), దేవరాతుడు, నాభాకుడు, నారదుడు, నోధాగౌతముడు, పరాశరుడు, పరుచ్ఛేపుడు, ప్రగాధుడు, ప్రజాపతి (వాచ్యుడు), ప్రజాపతి (వైశ్వామిత్రుడు), ప్రభువు, వసువు, ఆంగిరసుడు, ప్రస్కణ్వుడు, ప్రియమేధుడు, బంధవు (గౌపాయనుడు లేక లౌపాయనుడు), బృహదుక్థుడు, మధుచ్ఛందుడు, మనువు (వైవశ్వతుడు), మేధ్యాతిథి, మేధ్యుడు, వత్సప్రి (బాలందనుడు), వసుకృత్తు (వాసుక్రుడు), వసువు (భరద్వాజుడు), శంయువు, శునఃశేపుడు (ఆజీగర్తి), శ్రుత బంధువు, సవ్యుడు, సుతంభరుడు (ఆత్రేయుడు), సౌభరి (కాణ్వుడు), సోమాహుతి (భార్గవుడు), హిరణ్యస్తూపుడు మొదలగువారు కూడా దర్శించారు.

వేదవ్యాసుని ద్వారా ఋగ్వేదాన్ని అధ్యయనం చేసినవాడు పైలుడు. పైలుడు ఇంద్రప్రమతికి, బాష్కలునికి ఉపదేశించాడు. ఇంద్రప్రమతి మండూకేయునికి, మండూకేయుడు సత్యశ్రవుడు – సత్యహితునికి, సత్యహితుడు సత్యశ్రీకి అధ్యాపన చేశారు. సత్యశ్రీకి ముగ్గురు శిష్యులు – వేదమిత్ర శాకల్యుడు (శాకలుడు), రధీతరశాకపూణి, బాష్కలి భరద్వాజులు. వీళ్ళు ముగ్గురు సత్యశ్రీ ద్వారా ఋగ్వేదాన్ని అధ్యయనం చేశారు.

శాకల్యుడు – ముద్గల, గాలవ, గ్వాలీయ, వాత్స్య, శైశిరులనే వారికి ఉపదేశించాడు. ఈ విధంగా ఇంద్రప్రమతి పరంపర విస్తరించింది.

రెండవవాడు బాష్కలుడు. ఇతనికి బౌధ్య, అగ్నిమాఠర, పరాశర, జాతూకర్ణ్యులనే నలుగురు శిష్యులకు తన శాఖను అధ్యయనం చేశాడు. ఈ శాఖ అంతగా విస్తరించలేదు.

ఋగ్వేదములో అనేక దేవతాస్తోత్రాలు ఉన్నాయి. దేవతలస్తుతి సుందరమైనటు వంటి భావాలతో కూర్చబడి, కవి హృదయాన్ని చూపిస్తుంది. ఋగ్వేదములో అగ్ని, ఇంద్ర, వరుణ, ఉషస్సు, సవిత, పూష, మిత్ర, విష్ణు, రుద్ర, మరుత్, పర్జన్యులు మొదలైన దేవతలు ప్రస్తుతించబడ్డారు.

వైదిక దేవతలు – ద్యుఃస్థానీయులు, అంతరిక్ష స్థానీయులు, పృథ్వీస్థానీయులు అని మూడు విధములు. పృథ్వీస్థానీయ దేవతలలో అగ్ని ఋగ్వేదములో షుమారు రెండువందల మంత్రాలలో స్తోత్రం చేయబడ్డాడు. అంతరిక్ష స్థానీయ దేవతలలో ఇంద్రుడు ప్రధానంగా వర్ణించబడ్డాడు. అలాగే ద్యుఃస్థానీయులలో సూర్యుడు ముఖ్యంగా స్తుతించ బడ్డాడు. వేరువేరు పేర్లతో వీరే మరల మరల స్తుతించబడ్డారు. ఋగ్వేదము ననుసరించి పృథ్వీస్థానీయులు పదకొండుమంది, అంతరిక్ష స్థానీయులు పదకొండుమంది, ద్యుః స్థానీయులు పదకొండుమంది – మొత్తం ముప్పై ముగ్గురు దేవతలు ముఖ్యులు. ఋగ్వేదములో స్థానాంతరమున దేవతల సంఖ్య మూడువేల మూడువందల ముప్పై తొమ్మిదిగా చెప్పబడింది. విశాల మహిమాన్వితులు, అనంతశక్తి సంపన్నులు అయిన దేవతల సంఖ్య ఎలా ఎంతని చెప్పినా అది అపచారమే అని, వాస్తవానికి అందరూ చేరి ఒకే నిత్య సత్యమైన పరతత్త్వమునకు అంగరూపాలని చెబుతారు.

ఋగ్వేదములో వర్ణించిన దేవతలంతా ఒకే ఒక పరతత్త్వమునకు పరిపరి విధాలుగా కల్పించుకొన్న నామరూపాలు. ఏ దేవతను వర్ణించినపు డా దేవత అందరిని మించిన దేవతగా వర్ణించబడింది. మరల ఒక దేవత ఇంకో దేవతతో అభేదము చెప్పబడింది. వేరువేరుగా వర్ణిస్తూనే చివరకన్నీ ఒకటే అని చెప్పబడింది. ఒకరు సత్యమై తక్కినవా రసత్యమగుటకాని, ఒక దేవత కింకొక దేవత చిన్నచూపు చూడడంగాని, స్త్రీ, పురుష విభేదము కూడా పరతత్త్వములో కనిపించదు. ఒకే దేవతను అనేక విధాలుగా కల్పించినట్లే వేరువేరు దేవతలను ఒక దేవతగా సాక్షాత్కరింపజేసుకోవడం కనిపిస్తుంది.

ఋగ్వేదములో దేవతాస్తుతులే కాకుండా దార్శనిక, లౌకిక విషయాల చర్చలు కూడా ఉన్నాయి. కొన్ని సూక్తాలు నిగూఢార్థ నిబద్ధమై విభిన్నమైన వ్యాఖ్యానాలకు తావు ఇచ్చినట్లుగా ఉన్నాయి. ఋగ్వేదములోని సంవాద సూక్తాలలో ఊర్వశి పురూరవ, యమ యమీ, సరమ ఫణి సంవాదాలు ప్రసిద్ధమైనవి, రమ్యమైనవి. ఋగ్వేదములోని కొన్ని సూక్త విషయాలు తరువాత పురాణాలలో కథలుగా వికసించాయి. నాసదీయ, హిరణ్యగర్భ, వాక్సూత్రాలు ప్రసిద్ధమైన దార్శనిక సూక్తాలు. దశమ మండలములోని పురుషసూక్తం కూడా దార్శనికార్థానికి ప్రసిద్ధమైంది. పరమాత్మ స్వరూపుడైన పురుషుని ఆధ్యాత్మిక కల్పన దానిలో చాలా గొప్పగా చేయబడింది. అనేక దేవతల స్తుతులు కలిగిన అనేక దేవతాత్మకమైన వైదికమతంలో ఋగ్వేదము కాలమునాడే ఏకేశ్వర రూపమైన పరమాత్మ కల్పన చేయబడింది. పదో మండలములో అనేక లౌకిక వ్యవహారాలకి, చికిత్సా విధానానికి సంబంధించిన సూక్తాలు కూడా ఉన్నాయి. శ్రాద్ధ, వివాహాది భౌతిక విషయాల చర్చలు, జూదం, తాగుడు, వ్యవసాయం, రాక్షసుల విఘ్నాల నుండి రక్షింపబడే ఉపాయాలు, ఓషధులు, రాజధర్మాలు, రాజనీతులు, దానస్తుతి, దానమహిమ, దానం యొక్క ఆవశ్యకత దానిలో వర్ణించబడింది.

వైదికార్యులు కన్యలను గౌరవించారు. ధనధాన్యాలిచ్చి సాలంకారంగా కన్యాదానం చేశారు. దౌహిత్రులను వారసులుగా అంగీకరించి స్త్రీని గృహస్వామిగా, సామ్రాజ్ఞిగా పేర్కొన్నారు. విదుషీమణులైన లోపాముద్ర, ఘోష, విశ్వావార, లోమశ, శుచి మొదలైన వారు మంత్రద్రష్టలైన ఋషికలుగా ఎంచబడ్డారు. స్త్రీలు యుద్ధకార్యాలలో పాల్గొనేవారు. వీరపత్నులై వీరమాతల మనిపించుకోవడం వారి ఆదర్శం. వేదకాలం నాటి ప్రజలు ఆత్మకు చావు లేదనేవారు. సత్కర్మలకు సద్గతులును, దుష్కర్మలకు దుర్గతులును ఫలాలని గుర్తించారు. చనిపోయిన వ్యక్తికి ఉత్తర గతులలో యముడు తోడ్పడుతాడని నమ్మారు.

అవతలి వ్యక్తిలో ఉన్న గొప్పతనాన్ని గుర్తించడం, ప్రపంచంలో పరమాత్మను సందర్శించడం ఆనాటి వారి ఆలోచనలలో స్పష్టంగా కనబడుతుంది. భగవంతుని అన్వేషించడం ఆరాధించడం చక్కని మార్గం. ఆ మార్గంలోకి అందరూ ఆహ్వానింపబడేవారు ఆనాడు. భగవంతుని స్వరూపం వాచామగోచరం అనే భావం ఋగ్వేదం నాటికి ప్రజల్లో ప్రబలంగా నాటుకున్నది. దేవుడు మనల్ని ఎల్లప్పుడూ కాపాడుతున్నాడనే నమ్మకం అందరిలోను ఉండేది. ఆనాటి వారు కాలాన్ని బహు చక్కగా పరిశీలించారు. మనకు –

దేవుడికి ఉన్న తేడాను చాలా సుస్పష్టంగా పరిశీలించారు ఋగ్వేదద్రష్టలు. ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడం ముఖ్యమనే భావన ఆనాడే ఉంది. దేవుడు, జగత్తు వేదంపైనే ఆధారపడి ఉన్నారని ఋగ్వేదం నొక్కి చెబుతుంది.

సామూహికంగా అందరికి మంచి జరగాలనే భావం కనబడుతుంది. భగవద్భక్తుడు తన రక్షణ కోసం ఆలోచించనక్కరలేదని ఆనాటి వారి దృఢ విశ్వాసం. అగ్ని విశ్వానికి సర్వస్వం ఇచ్చేవాడుగా కీర్తించబడ్డాడు. భగవంతుడు దుష్టులను శిక్షించడం, శిష్టులను రక్షించడం పేర్కొనబడింది. వైదిక విజ్ఞానవాహిని యొక్క తత్త్వం అందంగా పరిశీలించబడింది. సత్పురుషుల ప్రవృత్తిని గురించి వివరించబడింది. భగవంతుని గుర్తించినవాడిని వేదాలు ప్రేమిస్తాయని వివరించబడింది. భగవంతునికి భక్తుడు ఆత్మార్పణం చేయడం గోచరిస్తుంది. పరమాత్మ వాచామగోచరుడు. మన శక్తికి అందని వాడు. ఆనాటి సంఘాన్ని, సామాన్య మానవుడి గురించిన పరిశీలన కనబడుతుంది.

నోటికి వచ్చే ప్రతిమాట దేవుని స్తుతించేదిలా ఉండాలని, ఆ దేవుడు ప్రజలకు సేవచేసే శక్తి తనకివ్వమని కోరడం, అప్పులతో బాధలు కలుగకుండా ఉండాలని ఆకాంక్షించడం ఉంది. వివేకం కలవారు అజ్ఞానులకు దూరంగా ఉండడం, భగవంతుడు తన విశ్వరూపాన్ని భక్తునికి వివరించడం ఉంది. పవమాన సోముడి వర్ణన అమోఘము. వర్గభేదం లేకుండా, దరిద్ర నారాయణులను సేవించాలని, సమాన భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని, రైతులకు మంచి పంట పండాలని సూచిస్తుంది. దేవుణ్ణి గుర్తించకపోవడం, జూదగుణం మంచిదికాదని వివరిస్తుంది.

ఋగ్వేద భాష్యకారులలో స్కందస్వామి ఒకడు. గుజరాత్‌లోని వలభిప్రాంతం వాడు. ఇతని తండ్రి భర్తృధ్రువుడు. ఇతని గురువు శతపథ బ్రాహ్మణ భాష్యకారుడు హరిస్వామి. దీనిని బట్టి స్కందస్వామి క్రీ.శ. ఆరువందల ఇరవై ఐదు ప్రాంతం వాడు. స్కందస్వామి ఋగ్వేద భాష్యం చాలా వివరంగా ఉంది. ప్రతి మంత్రద్రష్ట ఋషిపేరు, దేవత పేరు ఇచ్చాడు. నిఘంటు, నిరుక్తాల నుంచి ప్రమాణాలను స్కందస్వామి ఉద్ధరించాడు. వ్యాకరణ సంబంధమైన వివరణలు కూడా ఉన్నాయి. భాష్యం సరళమైన భాషలో విశదంగా ఉంది. స్కందస్వామి ఋగ్వేద భాష్యం సగభాగం అనగా నాలుగవ అష్టకం వరకే లభిస్తుంది. మిగిలినది ఇద్దరు ఆచార్యులు పూర్తి చేశారు. స్కందస్వామి ప్రభావం సాయణుని మీద చాలా ఉంది.

స్కందస్వామి భాష్యం పూర్తి చేసిన ఆచార్యులలో నారాయణుడు ఒకడు. సామభాష్యకారుడు మాధవుని తండ్రి అయిన నారాయణుడు, ఇతడు ఒక్కరే అని అంటారు కాని దీనికి ప్రామాణమేమీ లేదు. రెండవ ఆచార్యుడు ఉద్గీథుడు. ఋగ్వేదంలోని చివరి భాగాలకు భాష్యం వ్రాశాడు. కర్ణాటక దేశంలోని వనవాసి ప్రాంతం వాడని చెప్పుకున్నాడు. ఇతని భాష్య ప్రభావం సాయణుని భాష్యం మీద చూడవచ్చును.

మాధవ పేరుతో నలుగురు భాష్యకారులు కనిపిస్తున్నారు. ఒకరు సామవేద సంహితకు భాష్యం వ్రాసిన మాధవుడు. ముగ్గురు మాధవులు ఋగ్వేదానికి భాష్యం వ్రాశారు. ఒకరు సాయణ మాధవుడు, ఇంకొకరు వేంకట మాధవుడు, మరొకరు మాధవభట్టు. మాధవభట్టు ఋగ్వేదం మొదటి ఎనిమిది అష్టకాలకు వ్రాసిన భాష్యం సంక్షిప్తంగా, విపులార్థ బోధకంగా, సారగర్భితంగా ఉంది. మాధవభట్టు, వేంకట మాధవుడు ఒక్కరే అని కొందరు, కాదని కొందరు. ఇద్దరి శైలిలో బాగా తేడా ఉంది. మాధవభట్టు ఋగ్వేద భాష్యాన్ని స్కందస్వామి, సాయణ వేంకట మాధవులు అనుసరించారు కాబట్టి మాధవభట్టు స్కందస్వామి కంటే పూర్వంవాడని కొందరు విమర్శకుల అభిప్రాయం.

వేంకట మాధవుడు ఆంధ్రదేశం వాడు, గొప్ప పండితుడు. ఇతని పితామహుడు మాధవుడు. తండ్రి వేంకటాచార్యుడు. వేంకట గోవిందులు ఇతని కొడుకులు. సంకర్షణుడు ఇతని తమ్ముడు. సాయణుని కంటే పూర్వం వాడని పండితుల అభిప్రాయం. కీ.శ. పదవ శతాబ్దం వాడని నిర్ణయించారు. వేంకట మాధవుని ఋగ్వేద భాష్యం సంక్షిప్త రూపంలో ఉంది. మంత్ర పదాల అర్థాలను మాత్రమే ఇచ్చి మంత్రార్థాలను స్పష్టం చేయడానికి పూనుకున్నాడు. ఇతనికి బ్రాహ్మణగ్రంథాల జ్ఞానం అపారంగా ఉంది. వేదాల యథార్థ జ్ఞానం బ్రాహ్మణ గ్రంథాల వలననే కలుగుతుందని ఇతని నమ్మకం.

క్రీ.శ. పధ్నాలుగవ శతాబ్ధం పూర్వం వాడైన ధానుష్కయజ్వ మూడు వేదాలకు వ్రాసిన భాష్యాలు ఉన్నాయని వేదాచార్యుడు తన సుదర్శన మీమాంసలో ఉదహరించాడు. ధానుష్కయజ్వ వైష్ణవాచార్యుడు. ఇతని భాష్యాలు దొరకడం లేదు.

ఆనంద తీర్థునికి మధ్వాచార్యుడని పేరు. ఇతడు ద్వైత సిద్ధాంత స్థాపకుడు. మధ్వాచారుడు వైష్ణవ సంప్రదాయ ప్రవర్తకుడు. ఋగ్వేదంలోని మొదటి మండలములోని నలభై సూక్తాలకు వ్యాఖ్యానాలు వ్రాశాడు. ఈ భాష్యం పద్యరూపంలో ఉంది. ఆధ్యాత్మి కార్థాలను చక్కగా వివరించాడు. ఇది మాధ్వ సంప్రదాయానికి అనుకూలంగా వ్రాయబడింది.

ఋగ్వేదంలోని అస్యవామీయ సూక్తానికి ఆత్మానందుడు భాష్యం వ్రాశాడు. ఇతడు సాయణునికి తరువాత వాడు. స్కందస్వామి భాష్యం యజ్ఞపరమైంది. నిరుక్తం మొదలైనవి దైవపరమైనవి. తన భాష్యం ఆధ్యాత్మిక విషయమైనదని ఆత్మానందుడు చెప్పుకున్నాడు.

సాయణ మాధవాచార్యులు క్రీ.శ. పధ్నాలుగవ శతాబ్ధం వాడు. ఇతడు నాలుగు వేదాలకు వ్యాఖ్యానం వ్రాశాడు. అవి అన్నీ ఇప్పుడు ఉపలభ్యంగా ఉన్నాయి. సాయణుడు తైత్తిరీయ (కృష్ణయజుర్వేద), ఋగ్వేద, సామవేద, కాణ్వ (శక్లయజుర్వేద), అథర్వవేద సంహితలు ఐదింటికి మరియు పదమూడు బ్రాహ్మణ గ్రంథాలకు వ్యాఖ్యానాలు రచించాడు. ఒక్క చేతి మీదుగా ఇన్ని వ్యాఖ్యానాలు అంతకు పూర్వం ఎవరూ రచించలేదు. వ్యాఖ్యానించేప్పుడు పురాణ, ఇతిహాస, స్మృతుల నుంచి ప్రమాణాలను ఉద్ధరించాడు. సాయణుని భాష సులభంగా, సుందరంగా ఉంది. యజ్ఞపరంగా ఎక్కువగాను, ఆధ్యాత్మిక పరంగా తక్కువగాను ఉంది ఈ భాష్యం. ఆంధ్రదేశంలో ఉన్న వైదిక కర్మలు సాయణుడు బాగా ఎరిగినవాడు.

దయానంద సరస్వతి క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్ధం వాడు. ఆర్య సమాజ స్థాపకుడు. వేదాలు అనాది అని విశ్వసించాడు. వేదమంత్రాలలో సమస్త జ్ఞానం నిక్షిప్తమై ఉన్నదని ఇతని అభిప్రాయం. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానమైన రైలు, టెలిఫోన్, విమానం కూడా వేదాలలో ఉన్నవని ఇతని విశ్వాసం. ఋక్, యజుర్వేదాలకు సరళమైన సంస్కృత భాషలో వ్యాఖ్యానం రచించాడు.

అరవిందఘోష్ దేశభక్తుడు, విప్లవవాది, గొప్ప ఆధ్యాత్మికవేత్త. ఆధునిక తత్త్వవేత్తలలో అగ్రగణ్యుడు. వేదమంత్రాలకు ఆధ్యాత్మిక యౌగికమైన అర్థాలను వివరించాడు. వేదాలు కర్మాకాండ ప్రతిపాదకాలు అనటాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు.

ఆనంద కుమారస్వామి పండితుడు. భారతీయ కళలను, ప్రాచీన భారతీయాత్మను వివరించి చెప్పడంలో మంచి నేర్పరి. వేదాలకు విశిష్ట వ్యాఖ్యానం చేశాడు. వేదాలలో మార్మికత ఉన్నదని అతని నమ్మకం. బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ మతగ్రంథాలలోని అనుభూతులే వేదాలలోను ఉన్నాయంటాడు.

బంకుపల్లి మల్లయ్యశాస్త్రి ఋగ్వేదాన్ని, దాశరథి రంగాచార్య నాలుగువేదాలను తెలుగులో సరళవచనంలో రచించారు.

పాశ్చాత్యులలో మాక్స్‌ముల్లర్ అనే జర్మన్ విద్వాంసుడు ఋగ్వేదాన్ని సాయణ భాష్యంతో విమర్శనాత్మకమైన పీఠిక టిప్పణులతో మొదటిసారిగా ప్రచురింపజేశాడు.

ఈ ఋగ్వేద ప్రతి పాశ్చాత్యదేశాలలో వేద అధ్యయన, అధ్యాపనలకు పునాది వేసింది. అవుఫ్‌రెస్ట్ అనే జర్మన్ పండితుడు ఋగ్వేదాన్ని బాగా పరిశోధించి చక్కని ప్రతిని రోమన్‌లిపిలో తీసుకువచ్చాడు. హెచ్. హెచ్. విల్సన్ సాయణ భాష్యంతో ఋగ్వేదాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాడు. గ్రాస్‌మన్ అనే పండితుడు ఋగ్వేదాన్ని జర్మన్ భాషలో పద్యాలుగా అనువదించాడు. రోథ్ వ్యాఖ్యానాలను అనుసరించాడు కాని గ్రాస్‌మన్ సాయణుడిని అనుసరించలేదు. గ్రాస్‌మన్ గణిత శాస్త్రజ్ఞుడు. సరదాగా సంస్కృతం నేర్చుకుని ఋగ్వేద పదకోశం రచించాడు. తరువాత ఋగ్వేద అనువాదానికి పూనుకున్నాడు. ఆల్ఫ్రెడ్ లుడ్విగ్ విపులమైన వ్యాఖ్యానంతో ఋగ్వేదాన్ని జర్మన్ భాషలో గద్యంలో అనువదించాడు. గ్రిఫిత్ సాయణ భాష్యం సహాయంతో ఋగ్వేదాన్ని పద్యరూపంలో ఇంగ్లీషులోకి అనువదించాడు. ఓల్డెన్ బెర్గ్ అనే జర్మన్ పండితుడు చక్కని విశదమైన వ్యాఖ్యానాన్ని జర్మన్ భాషలో ప్రచురించాడు. దీనిలో మొదట పూర్వాచార్యుల అభిప్రాయాలను ఇచ్చి, తరువాత విమర్శనాత్మకమైన తన వివరణ ఇచ్చాడు. ఋగ్వేద ఛందస్సుల వివేచనను వేరొక గ్రంథంలో చేశాడు. ఋగ్వేదాన్ని ప్రాచీన, నవీన దృష్టితో తులనాత్మకంగా గ్రహించడానికి ఓల్డెన్‌బెర్గ్ వ్యాఖ్యానం చాలా మహత్వపూర్ణమైనది. గెల్డనర్ ఋగ్వేదాన్ని జర్మన్ భాషలోకి అనువదించాడు. ఈ రోజుకి చక్కని అనువాదంగా పరిగణించబడుతుంది.

ఋక్సంహిత 'అగ్నిమీడే పురోహితం' అనే అగ్నిసూక్తంతో మొదలై, 'సమానీవ ఆకూతిః' అనే సంజ్ఞాన మంత్రంతో పూర్తవుతుంది.

# యజుర్వేద సంహిత

**వే**ద సంహితలలో రెండవది యజుర్వేదము. యజుర్వేదంలో ముఖ్యంగా దేవతలను ఆహ్వానించే యజ్ఞవిధులను చెప్పే మంత్రాలున్నాయి. ఏ యజ్ఞకర్మలో ఏ మంత్రాలు ఉపయోగించాలో యజుర్వేదంలో వివరంగా చెప్పబడింది. ఋగ్వేదంలోని మంత్రాలు చాలావరకు దీనిలో ఉన్నాయి. అదే మాదిరి సామవేదంలో కూడా ఋగ్వేద మంత్రాలు చాలా కనిపిస్తాయి.

యజస్సుల కూర్పు కలది యజుర్వేదం. అక్షరాల నియమము లేనిది యజస్సు. ఋక్కు, సామంల కంటే భిన్నమయినది. అంటే గద్యాత్మకమైన మంత్రాలే యజస్సులని చెప్పబడుతుంది.

యజ్ఞం చేయడానికి కావలసిన కాలజ్ఞానానికి జ్యోతిష శాస్త్రమును, యజ్ఞవేదిక నిర్మించడానికి వాస్తు శాస్త్రమును, మంత్రాల అర్థాలను నిర్ణయించడానికి శిక్షా వ్యాకరణ శాస్త్రాలు యజుర్వేదము ప్రకారము వికసించాయి. యజ్ఞములు హవిర్యజ్ఞ, సోమయజ్ఞ, పాక యజ్ఞములని మూడురకాలు. ఇవి మరల ఒక్కొక్కటి ఏడు విధాలు. గృహస్థులు రోజూ చేసే దేవ, ఋషి, పితృ, మనుష్య, భూత తర్పణాలు కూడా యజ్ఞాలే. రాజసూయము, అశ్వమేథము, సర్వమేథము మొదలైనవి విశేష యజ్ఞాలు. ఇవి చాలా కాలం జరిగే యజ్ఞాలు, రాజులు, రారాజులు నిర్వహించేవి.

యజుర్వేదం బ్రహ్మ సంప్రదాయము, ఆదిత్య సంప్రదాయము అని రెండు విధాలుగా ప్రచారమైంది. మొదట దీనిని వ్యాసుని దగ్గర వైశంపాయనుడు అభ్యసించాడు. అతని దగ్గర నేర్చుకున్న శిష్యులలో యాజ్ఞవల్క్యుడు అనే అతను ప్రతిభాశాలి. ఎందువలనో ఏమో అతనికి గురువుతో గొడవ జరిగింది. అప్పుడు వైశంపాయనుడు తాను ఇచ్చిన విద్యను తిరిగి తనకిచ్చి వెళ్ళిపొమ్మన్నాడు. యాజ్ఞవల్క్యుడు తాను నేర్చినదంతా కక్కి వెళ్ళిపోయాడు. అతడు విడిచిన దానిని తిత్తిరి పక్షులు గ్రహించాయి. తరువాత ఇది 'కృష్ణ యజుర్వేద'మనే పేరుతో లోకంలో ప్రచారమైంది. దీనినే బ్రహ్మ సంప్రదాయమని కూడా చెబుతారు.

యాజ్ఞవల్క్యుడు వైశంపాయనుడి దగ్గర నుండి వెళ్ళి సూర్యుని ఆరాధించాడు. సూర్యుడు అతని తపస్సుకు మెచ్చి వాజి రూపంలో ప్రత్యక్షమై అతనికి వేదవిద్య ప్రసాదించాడు. ఈ విధంగా సూర్యుని చేత ప్రసాదింపబడి యాజ్ఞవల్క్యుని చేత ప్రచారానికి వచ్చిన వేదము 'శుక్ల యజుర్వేద' మనే పేరుతో ప్రసిద్ధమైంది. దీనిని ఆదిత్య సంప్రదాయానికి చెందినదని అంటారు. యాజ్ఞవల్క్యుని పూర్వులు అన్నదానం చేసి 'వాజసేని' అని బిరుదు పొందారట. వాజసనేయుడైన యాజ్ఞవల్క్యునికి, వాజి రూపుడైన సూర్యుని చేత మధ్యాహ్నవేళ లభించడం చేత శుక్ల యజుర్వేదానికి 'వాజసనేయ సంహిత' అని, 'మాధ్యందిన సంహిత' అని కూడా పేర్లు. శుక్ల యజుర్వేదులు ఉత్తర భారతదేశంలో ఎక్కువ. కృష్ణ యజుర్వేదులు దక్షిణ భారతదేశంలో ఎక్కువ. ఈ రెండింటికి ఏమంత తేడా లేదు. కాని రచనలో శుక్ల యజుర్వేదం కేవలం మంత్రాలతో ఉంది. కృష్ణ యజుర్వేదంలో మంత్రభాగంతోపాటు బ్రాహ్మణ భాగం కూడా కలిసి గద్య, పద్యాలతో కనిపిస్తుంది.

యజుర్వేదానికి సూతసంహిత, బ్రహ్మాండ పురాణము, స్కాంద పురాణము, ముక్తికోపనిషత్తు మొదలైనవి వందకు పైగా శాఖలున్నట్లు చెబుతారు. పతంజలి దీనికి నూరు శాఖలున్నట్లు చెప్పాడు. చరణ వ్యూహములో దీనికి ఎనభై ఆరు శాఖలున్నట్లు వ్రాయబడింది. కాని నేడు శుక్ల యజుర్వేద శాఖకు – మాధ్యందిన, కాణ్వశాఖలు; కృష్ణ యజుర్వేద శాఖకు – కాఠక, కపిష్ట (స్థ)ల కఠ, మైత్రాయణి, తైత్తిరీయ శాఖలకు మాత్రమే సంహితలు లభిస్తున్నాయి. వాటికి తిరిగి కొన్ని ఉపశాఖలున్నాయంటారు.

యజుర్వేదంలోని ఒక భాగంలో కేవలం విశుద్ధమైన మంత్రాలుండటం చేత ఈ భాగానికి శుక్ల అని పేరు కలిగిందని, మంత్రాలతో పాటు బ్రాహ్మణ భాగాలు కలిసి ఉండటంచేత ఇంకొక భాగానికి కృష్ణ అనిపేరు కలిగిందని ఆధునిక విమర్శకుల అభిప్రాయం. కృష్ణయజుర్వేద శాఖ కంటే శుక్ల యజుర్వేద శాఖ నవీనమైనది.

యజుర్వేదంలో నలభై అధ్యాయాలున్నాయి. వాటిలో చివరి పదిహేను అధ్యాయాలు ఖిలరూపాలని ప్రసిద్ధి. శుక్ల యజుర్వేదానికి మాధ్యందిన, కాణ్వ అనే రెండు శాఖలు ప్రధానమైనవి. ఈ రెండు సంహితలు మాత్రమే లభిస్తున్నాయి. మాధ్యందిన సంహితలోకన్నా కాణ్వ సంహితలో నూట పదకొండు మంత్రాలు ఎక్కువ ఉన్నాయి. అధ్యాయాలు అన్నీ కలిపి మూడువందల మూడు అనువాకములుగా, పందొమ్మిది వందల డెభై అయిదు కండికలుగా విభజించబడ్డాయి. కండికలే మంత్రాలు. ఈ సంహితలో

మొదటి అధ్యాయానికి ప్రజాపతి, చివరి అధ్యాయానికి దంద్య అధర్వ్యణుడు ఋషులుగా చెప్పబడ్డారు. సంహితలో చేర్చకుండా నూరు అధ్యాయాలుగల శతపథ బ్రాహ్మణము ఈ సంహితకే సంబంధించింది.

వాజసనేయ సంహితలో నలభై అధ్యాయాలున్నాయి. పంతొమ్మిది వందల డెభై ఐదు ఖండికలు, మూడు వేల తొమ్మిది వందల ఎనభై ఎనిమిది మంత్రాలు ఉన్నాయి. ఒకటి నుండి ముప్పై తొమ్మిది అధ్యాయాలు కర్మ విధులను బోధిస్తున్నాయి. (16వ అధ్యాయం శతరుద్రీయం, ముప్పై ఒకటవ అధ్యాయం పురుష సూక్తం, ముప్పై నాలుగువ అధ్యాయంలోని మొదటి ఆరు మంత్రాలు శివ సంకల్పముగా ప్రసిద్ధి చెందాయి.) నలభైవ అధ్యాయం బ్రహ్మ జ్ఞానాన్ని బోధిస్తుంది.

మొదటి, రెండవ అధ్యాయాలలో దర్శపూర్ణమాసేష్ఠి మంత్రాలు, పిండం పితృ యజ్ఞ మంత్రాలున్నాయి. మూడవ అధ్యాయంలో అగ్న్యుపస్థాపన, చాతుర్మాస్య యజ్ఞాలు చెప్పబడ్డాయి. నాలుగవ అధ్యాయంలో అగ్నిష్టోమ యాగానికి సంబంధించిన ఋత్విక్ యజమానుల శాలాప్రవేశ మంత్రాలున్నాయి. అయిదవ అధ్యాయంలో సౌమికవేది నిర్మాణం, ఆతిథ్యం, యూపనిర్మాణం వర్ణించబడ్డాయి. ఆరులో యూప సంస్కారం, సోమాభిషవ మంత్రాలున్నాయి. ఏడులో ఉపాంశుగ్రహం మొదలగు యజ్ఞాలలో చెప్పాల్సిన దక్షిణా దాన మంత్రాలున్నాయి. ఎనిమిదిలో తృతీయ సవనంలోని ఆదిత్య గ్రహాది మంత్రాలు ఉన్నాయి. తొమ్మిది మరియు పది అధ్యాయాలలో వాజపేయ, రాజసూయ, సౌత్రామణి యజ్ఞాలు చెప్పబడ్డాయి. పదకొండు నుండి పదిహేనవ అధ్యాయాలలో అగ్నిచయనం సాంగోపాంగంగా వివరించబడింది. పదహారవ అధ్యాయంలో శతరుద్రీయం మంత్రాలున్నాయి. పదిహేడవ అధ్యాయంలో చిత్య పరిషేకం మొదలగు జపపర్యంత మంత్రాలున్నాయి.

పద్దెనిమిదవ అధ్యాయంలో వసోర్ధారాది మంత్రాలు, పంతొమ్మిది మరియు ఇరవైవ అధ్యాయాలలో సౌత్రామణి మంత్రాలు, ఇరవై ఒకటిలో యాజ్యాదిప్రేషణ మంత్రాలున్నాయి. ఇరవైరెండు నుండి ఇరవై ఐదవ అధ్యాయాలలో అశ్వమేథయాగం వర్ణించబడింది. ఇరవై ఆరులో ఖిల సంజ్ఞకల మంత్రాలు, ఇరవై ఏడు, ఇరవై ఎనిమిది, ఇరవై తొమ్మిదిలలో ఇప్పటివరకు తెలియజేసిన కర్మల్లో వినియోగించదగిన అనేక రకాలయిన మంత్రాలున్నాయి. ముప్పైవ అధ్యాయంలో పురుషమేధం వివరించబడింది. ఇందులో బలి ఇవ్వదగిన నూట నలభై నాలుగు రకాల వ్యక్తుల పట్టిక ఉంది. ముప్పై

ఒకటవ అధ్యాయంలో పురుషసూక్తం ఉంది. ముప్పై రెండవ అధ్యాయంలో సృష్టికర్త అయిన ప్రజాపతి స్వరూపం విలక్షణంగా వర్ణింపబడింది. ముప్పైమూడు మరియు ముప్పై నాలుగు అధ్యాయాలలో సర్వమేధ మంత్రాలున్నాయి. ముప్పై నాలుగవ అధ్యాయంలోని మొదటి ఆరు మంత్రాలు శివసంకల్పోనిషత్తుగా పరిగణించబడుతుంది. ముప్పై ఐదవ అధ్యాయంలో పితృమేధ మంత్రాలు, ముప్పై ఆరవ అధ్యాయంలో శాంతి మంత్రాలు ఉన్నాయి. ముప్పై ఏడు, ముప్పై ఎనిమిది మరియు ముప్పై తొమ్మిదవ అధ్యాయాలలో ప్రవర్గ్యమనే యాగం వర్ణించబడింది.

నలభైవ అధ్యాయంలో బ్రహ్మవిద్య ఉపదేశింపబడింది. 'ఈశావాస్యమిదం సర్వం' అని ఆరంభమవడం చేత దీనికి ఈశావాస్యోపనిషత్తు అనిపేరు. ఇది సంహితలో ఒక భాగంగా ఉండడం చేత సంహితోపనిషత్తు అనీ, ఛందోబద్ధాలైన మంత్రరూపంలో ఉండడం చేత మంత్రోపనిషత్తు అనీ గౌరవించబడుతుంది. ఇందులో సత్యసిద్ధాంతం, జ్ఞానమార్గం, కర్మమార్గం, ఆత్మస్వరూపం, జీవిత గమ్యస్థానం వర్ణింపబడ్డాయి.

కృష్ణయజుర్వేదమునకు చెందిన శాఖలలో నేడు మనకు తైత్తిరీయ, మైత్రాయణీ, కఠ శాఖలకు సంబంధించినంతవరకు సంపూర్ణ సంహితలు లభిస్తున్నాయి. కపిష్ఠల – కఠ శాఖకు చెదిన సంహిత అసంపూర్తిగా ఉన్నది. వీటిలో తైత్తిరీయ శాఖ మిక్కిలి ప్రసిద్ధమైంది. యాజ్ఞవల్క్యుడు పవనము చేసిన వేదమును తిత్తిరి పక్షులు గ్రహించినవని, ఆ కారణంగా ఈ శాఖకు తైత్తిరీయ శాఖ అనిపేరు వచ్చిందని అంటారు. కాని తిత్తిరి అనే ఋషిచే ప్రచారమునకు తేబడిన శాఖ అవడం వలన తైత్తిరీయమని పిలువబడిందని కూడా అంటారు. దీనికి సంబంధించినంత వరకు సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు, శ్రౌత సూత్రములు, గృహ్య సూత్రములు మొదలైన సాహిత్యమంతా లభిస్తున్న సమగ్రమైన వేదశాఖ ఇది.

తైత్తిరీయ సంహిత ఏడు కాండలుగాను, నలభై నాలుగు ప్రపాఠకాలుగాను, ఆరువందల ముప్పై అయిదు అనువాకాలుగాను ఉన్నది. (అనువాకాలను ప్రశ్నలని కూడా వ్యవహిస్తారు. మూలాన్ని పరిగణించేటప్పుడు కాండలను అష్టకాలని, భాష్యంలో అష్టకాలను కాండలని అనడం జరుగుతుంది.) ఈ సంహితలో యజ్ఞ సంబంధమైన విషయాలున్నాయి. యజ్ఞం ద్వారా దేవతలను పూజించడం, సమాజాన్ని ఒకచోట కలపడం, దానం చేయడం జరుగుతుంది.

మొదటి కాండలో ఎనిమిది ప్రపాఠకాలు, నూట నలభై అనువాకాలున్నాయి. ఈ కాండలో దర్శపూర్ణమాస యాగ మంత్రాలు, సోమ యాగాంగమైన దేవయజన స్వీకారము, సోమక్రయణం, ఆతిథ్యేష్టి చెప్పబడినాయి. హవిర్ధానం, సామిధేని, యాజ్యా–పురోనువాక్యా మంత్రాలు, వైసర్జనహోమం, పశ్వంగయూపచ్ఛేదనం, యూపస్థాపనం, యూపస్తంభానికి పశువును బంధించే ఉపకరణం మొదలగు కర్మలు వివరించబడ్డాయి. సోమలతాగ్రహణం, సోమాభిషవం, కొయ్యతో చేసిన అంతర్యామి పాత్రలో సోమరసాన్ని నింపడం, దక్షిణను స్వీకరించడానికి అర్హతలు, అపభృథం చెప్పబడినాయి. మరియు ఆశ్రవణం, ఇడాప్రశంస, అన్వాహార్యవిధి, వాజపేయ మంత్రాలు, ఉజ్జితి మంత్రాలు, రాజసూయ యాగం చెప్పబడింది. ప్రధాన కర్మలైన సౌత్రామణి, సాకమేధం, మహా పితృ యజ్ఞం, త్ర్యంబకపురోడాశలు, ఇంద్రతూర్యం, ఇధ్మీయం, అపామార్గం, ప్రతిరోజు చేసే రత్నిహవిస్సులు, దేవసూహవిస్సులు, జలసంస్కార మంత్రాలు, పది సంసృప హవిస్సులు, దశపేయం, రాజు శ్రమ నివారణ కోసం చేసే అవేష్టులు మొదలగునవి నిరూపించ బడినాయి.

రెండవ కాండలో ఆరు ప్రపాఠకాలు, డెబ్భై అయిదు అనువాకాలున్నాయి. అగ్ని సర్వదేవతా స్వరూపుడు. విష్ణువు సర్వయజ్ఞ స్వరూపుడు. మానవులు అగ్నినేత్రంతోను, దేవతలు యజ్ఞనేత్రంతోను చూస్తున్నారు. ఘృతము తేజస్సు. నేత్రం కూడా తేజస్సే. తేజోరూపమైన నెయ్యి వల్ల తేజోరూపమైన నేత్రం వృద్ధి చెందుతుంది. ఇంద్రాగ్నులను ఆరాధించాలి. అగ్ని పశువులను ఇస్తాడు. ఇంద్రుడు వాటిని వృద్ధి చేస్తాడు. పెరుగు, తేనె, నెయ్యి, వేయించిన బియ్యం – వీటిని పంచద్రవ్యాలంటారు. ఈ అయిదు హవిస్సులు పశురూపాలు. ఈ పంచద్రవ్య రూపమైన హవిస్సు ప్రజాపతి దేవతాకం. ఆదిత్య దేవతాక యాగం గూర్చి చెప్పబడింది. మిత్రావరుణ దేవతాకమైన అమిక్షాయాగం అమావాస్యనాడు చేయాలని చెపుతుంది.

మూడవ కాండలో రథాంతరసామ, బృహత్సామల ప్రశంస ఉంది. నాకు మేధను, సంతానాన్ని, తేజస్సును కలిగించమని అగ్నిని ప్రార్థించడం కనబడుతుంది. ప్రకృతికి సంబంధించిన నిత్యసత్యాలు ప్రతిపాదించబడినాయి. సకల ప్రాణులకు అధిపతి అగ్ని, లోకపాలకులకు అధిపతి ఇంద్రుడు. పృథివికి అధిపతి యముడు. నక్షత్రాలకు చంద్రుడు, బ్రాహ్మణులకు బృహస్పతి, సత్యానికి మిత్రుడు, నీటికి వరుణుడు, ప్రవాహాలకు అధిపతి సముద్రుడు, సామ్రాజ్యాలకు అధిపతి అన్నం. అలాగే సోముడు ఓషధులకు, సూర్యుడు

అనుజ్ఞులకు, రుద్రుడు పశువులకు, త్వష్ట రూపాలకు, విష్ణువు పర్వతాలకు, మరుత్తులు గణాలకు అధిపతులని, వాళ్ళంతా లోకాన్ని రక్షించాలని ఈ కాండలో పేర్కొనబడింది.

నాలుగవ కాండలో ఏడు ప్రపాఠకాలు, డెబ్భైరెండు అనువాకాలు ఉన్నాయి. అగ్ని స్తుతితో ఈ కాండ మొదలవుతుంది. వ్యవసాయానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. అయిదవ ప్రపాఠకంలో శతరుద్రీయం ఉంది. దీన్నే 'నమక'మంటారు. ఈశ్వరుని విశ్వరూప భావన ఇందులో సాక్షాత్కరిస్తుంది. ఆరో ప్రపాఠకంలో విశ్వసృష్టికి సంబంధించిన జిజ్ఞాస కనబడుతుంది. పితృదేవతల ప్రస్తావన కూడా ఉంది. ఏడో ప్రపాఠకంలో 'చమకం' ఉంది. పంచభూతాలు, అష్టదిక్కులు, ఆరు ఋతువులు, సమస్త ప్రకృతి మంచి చేయాలనే శుభకామన ఇందులో ప్రధానాంశం. ఈ వేదం యజ్ఞమయ, స్నేహమయ జీవనాన్ని సాగించమని ప్రబోధిస్తోంది.

ఐదవ కాండలో ఏడు ప్రపాఠకాల, నూట ఇరవై అనువాకాలున్నాయి. దీనిలో అశ్వమేధ విధి నిరూపించబడింది. అశ్వమేధ యాగం ఆచరించి గోవధ రూపమైన ఉపపాతకాన్ని, బ్రహ్మ హత్యా రూపమైన మహాపాతకాన్ని పోగొట్టుకున్నారని చెప్పబడింది. ఆరవ కాండలో ఆరు ప్రపాఠకాలు, అరవై ఆరు అనువాకాలున్నాయి. దేవతలు ఉపసద్ధోమం చేసి అగ్నిదేవతాకమైన, సోమదేవతాకమైన, విష్ణుదేవతాకమైన బాణాలను ప్రయోగించి రాక్షసుల పురభేదనం చేశారు. పురాలను భేదించేవి కనుక ఈ ఆహుతులు 'ఉపసత్తు' లని పిలువబడినట్టు ఈ కాండ వివరిస్తుంది.

ఏడో కాండలో అయిదు ప్రపాఠకాలు, నూట ఏడు అనువాకాలున్నాయి. పంచరాత్ర యాగంలో అగ్నిష్టోమం (త్రివృత్‌స్తోమం), పంచదశస్తోమం, ఉక్థ్యం (సప్తదశస్తోమం), అగ్నిస్టోమం (పంచవింశేన ఏకీనస్తోమేన), విశ్వజిత్ అనే అయిదు యాగాలు అయిదు రోజులలో ఆచరించబడతాయని చెప్పబడింది. ఈ కాండలో అశ్వమేధయాగ స్వరూపం వివరించబడింది. షడ్రాత్ర, సప్తరాత్ర, అష్టరాత్ర, నవరాత్ర, దశరాత్ర, ఏకాదశ రాత్ర, ద్వాదశ రాత్ర యాగాలు, సంవత్సర సత్రం సవిస్తారంగా చెప్పబడినాయి.

కృష్ణ యజుర్వేదానికి చెందిన ఇంకొక శాఖ మైత్రాయణీయ శాఖ. దీనికి కలావశాఖ అని వేరే పేరు. దాని ఉపశాఖలు మను, వరాహ శాఖలు ప్రసిద్ధమైనవి. మనుస్మృతి, వరాహకల్ప సూత్రములు అనేవి వీటికి సంబంధించిన గ్రంథాలు. మైత్రాయణీయ సంహిత మంత్ర బ్రాహ్మణములు కలసి నాలుగు కాండలు, యాభై

నాలుగు ప్రపాఠకములు, ఆరు వందల ముప్పై నాలుగు అనువాకములు కలిగి రెండువేల నూటనలభైనాలుగు మంత్రాలతో ఉంది. దీనిలో ఒక వెయ్యి ఏడువందల ఒకటి వరకు ఋగ్వేదమంత్రాలే మళ్ళీ వినిపిస్తాయి.

కృష్ణయజుర్వేదమునకు చెందిన కాఠకశాఖ పతంజలి భాష్యం ప్రకారం మధ్యదేశంలో బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. కఠ సంహితలో ఇఠమిక, మధ్యమిక, ఓరమిక, యాజ్యానువాక, అశ్వమేథ అనే అయిదు ఖండాలున్నాయి. ఈ ఖండములలోని అవాంతర భాగాలకు స్థానకములని పేరు. అవి మరల అనువచనక, అనువాక, మంత్ర భాగాలుగా విభజించబడ్డాయి. ఈ సంహితలో కూడా పురోడాశ, అథర్వ, పశుబంధ, వాజపేయ, రాజసూయాలతోపాటు సావిత్రి, పంచచూడ, స్వర్గదీక్షిత, ఆయుష్యసత్ర, ప్రాయశ్చిత్త, సవ, సౌత్రామణ్యాలనే ఎన్నో యజ్ఞ యాగాలు వివరించబడ్డాయి.

కృష్ణ యజుస్సంహితలు అన్నీ ఇంచుమించుగా ఒకే విషయాలు వివరిస్తున్నాయి. కాని పద్ధతి మాత్రం భిన్నంగా ఉంది. ఋగ్వేదానికున్నన్ని వివరణ గ్రంథాలు యజుర్వేదానికి అంతగా లేవు.

శుక్ల యజుర్వేద భాష్యాలు వ్రాసిన వారిలో ఉవటుడు ఒకడు. ఇతడు అవంతీపుర నివాసి, బోజుని కాలం వాడు, వజ్రటుని కొడుకు, కావ్యప్రకాశకారుడు ముమ్మటుని అనుజుడని తెలుస్తున్నది. ఉవటుడు మాధ్యందిన యజుర్వేద సంహితకు భాష్యం వ్రాశాడు. ఇతడు వేదమంత్రాలకు ఆధ్యాత్మిక పరమైన అర్థాలను ఇచ్చాడు. ఈ భాష్యమే కాకుండా ఇతడు యజుఃప్రాతిశాఖ్యకు టీక, ఋక్ సర్వానుక్రమణికకు వ్యాఖ్య, ఈశావాస్య ఉపనిషత్తుకు వ్యాఖ్యలను రచించాడు. ఇతడు గొప్ప వేద పండితుడు.

శుక్ల యజుర్వేదం మాధ్యందిన సంహితకు మహీధరుడు వేదదీపమనే వ్యాఖ్యానాన్ని రచించాడు. ఇతడు కాశీ నివాసి. ఇతడు ఉవటుని వ్యాఖ్యానాన్ని అనుసరించాడు. ఇతని వ్యాఖ్యానం స్పష్టంగా విశదంగా ఉంది. ఇతడు వైదికుడైనా తంత్ర శాస్త్రం తెలిసినవాడు. మంత్ర మహోదధి అనే తంత్ర శాస్త్రాన్ని కూడా రచించాడు.

శుక్ల యజుర్వేదం కాణ్వ సంహితకు హలాయుధుడు భాష్యాన్ని రచించాడు. ఇతడు సాయణునికి పూర్వపువాడు. ఇతని భాష్యంపేరు 'బ్రాహ్మణ సర్వస్వం'. ఇతడు బెంగాల్ రాజు లక్ష్మణసేనుని ఆస్థాన పండితుడు, ధర్మాధికారి. సాయణుడు మాధ్యందిన సంహితకు భాష్యం వ్రాయలేదు. అతడు కాణ్వ సంహితకే భాష్యాన్ని వ్రాశాడు. హలాయుధుడు గొప్ప వేద పండితుడు. ఇతడు వేద భాష్యాన్నే కాక మీమాంస సర్వస్వం,

వైష్ణవ సర్వస్వం, శైవ సర్వస్వం, పండిత సర్వస్వం మొదలైన గ్రంథాలను రచించాడు. ఇతడు శైవ, వైష్ణవ ఆగమాలను తెలిసినవాడు, మీమాంసకుడు కూడా.

అనంతాచార్యుడు కాణ్వసంహిత ఉత్తరార్థ భాగానికి భాష్యం వ్రాశాడు. మహీధరుని వ్యాఖ్యాన ప్రభావం ఇతని మీద కన్పిస్తుంది. అక్కడక్కడ కొన్ని మంత్రాలను విష్ణుపరంగా అన్వయం చేసి చెప్పాడు. శుక్ల యజుః ప్రాతిశాఖ్యకు కూడా వ్యాఖ్యానం వ్రాశాడు.

కృష్ణ యజుర్వేద భాష్యాలు విషయంలో సాయణుడు మొట్టమొదటి భాష్యం వ్రాశాడు. శాకల్యుడు క్రమపాఠం వ్రాశాడు. గాలవుడు పదపాఠము చేర్చాడు. కొందరు ఈ పదపాఠం ఆత్రేయ చేత వ్రాయబడిందంటారు. కుండినుడు తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాసినట్టు తెలుస్తుంది. ఇతడు గుప్తుల కాలం వాడని తెలుస్తుంది. భవస్వామి కూడా తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాసినట్లు ఆధారాలున్నాయి. కాని ఇది దొరకడం లేదు. గృహదేవుడు కూడా తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాశాడు. దేవరాజు యజ్వ తన నిఘంటువు భాష్యంలోను, ఆచార్య రామానుజుడు తన వేదార్థ సంగ్రహములోను గృహదేవుని పేర్కొన్నారు. క్షురుడు కూడా తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాసినట్లు తెలుస్తుంది. దీనిని గురించి సాయణుడు మాధవీయ ధాతువృత్తిలో పేర్కొన్నాడు. తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాసిన భట్ట భాస్కరుడిని సాయణుడు పేర్కొన్నాడు. ఈ భాష్యం పేరు జ్ఞానయజ్ఞం. భట్ట భాస్కరుడు గొప్ప వైదిక పండితుడు. అనేక వైదిక గ్రంథాలు మరుగునపడగా, బయటికి తీసి ఉద్ధరించిన మహానుభావుడు.

వేబర్ అనే జర్మన్ సంస్కృత పండితుడు యజుర్వేద తైత్తిరీయ సంహితకు సంపాదకత్వం వహించి ప్రచురించాడు. అతడు 'ఇండిషే స్టూడియన్' అనే పత్రికను నడిపి వైదిక గ్రంథ పరిశోధనా కార్యం నిర్వహించాడు. గ్రిఫిత్ మాధ్యందిన యజుర్వేద సంహితను పద్యరూపంగా ఇంగ్లీషులోకి అనువదించాడు. కీథ్ తైత్తిరీయ సంహితను ఇంగ్లీషులోకి  అనువదించాడు.

యజుస్సంహిత 'ఇషే త్వోర్జే త్వా' అనే పలాశ శాఖాచ్ఛేదన మంత్రంతో మొదలై 'సముద్ర ఉదరమన్తరిక్షం పాయుః' అనే అశ్వమేధాంగ మంత్రంతో పూర్తవుతుంది.

# సామవేద సంహిత

**వే**ద సంహితలలో మూడవది సామవేద సంహిత. 'సా' అంటే ఋక్కు అని అర్థం. 'ఆమ' అంటే గాంధర్వ స్వరాలు. 'సామ' అంటే ఋక్కుల యొక్క స్వర ప్రధానమైన గానం అని అర్థం. ఏ ఋక్కులనైతే సామరూపంలో గానం చేస్తారో వాటిని వైదికులు 'సామ యోని' అంటారు. జైమిని 'సామ' శబ్దానికి 'గాన'మనే అర్థం చెప్పాడు.

సామశబ్దానికి సుందర సుఖకర వచనమని కూడా అర్థం. సంగీతం సుఖకరమైంది, ఆనందదాయకమైంది. అందువలన సామ శబ్దానికి సంగీతమనే అర్థం చెప్పవచ్చు. ఉద్గాత తన సామవేదగానం ద్వారా దేవతలను ప్రశంసిస్తాడు. సామగానం సోమరసం తయారు చేసేటప్పుడు, చంద్రలోకం దేవతల స్తుతి సమయంలో చేయబడుతుంది.

సామమెరిగిన వాడికే తత్త్వజ్ఞానం అబ్బుతుందని చెప్పబడింది. ఋగ్వేదంలో చాలా చోట్ల సామము ప్రశంసించబడింది. వైరూప, బృహత్, గాయత్రి, భద్ర మొదలైన సామములు ఋగ్వేదంలో పేర్కొనబడినాయి. యజుర్వేదంలో రథంతర, వైరాజ, వైఖానస, వాసుదేవ్య, శాక్వర, రైవత, అభివర్త సామములు పేర్కొనబడినవి. ఐతరేయమున నైధన, కారవ, యాథాజియ, అగ్నిష్టోమీయ సామములు స్మరించబడినాయి. సామము లేనిదే యజ్ఞము లేదని చెప్పబడింది. సామవేదంలోని మంత్రాలు నూటికి తొంభై అయిదుపాళ్ళు ఋగ్వేదం నుండి తీసుకున్నవే. కేవలం డెభై అయిదు మంత్రాలు మాత్రం స్వతంత్రంగా కూర్చబడినాయి. సామవేదంలో మొత్తం ఒక వెయ్యి ఎనిమిదివందల డెభై అయిదు మంత్రాలు ఉన్నాయి. ఋక్కులు గానం చేయబడితే 'సామం' అనబడతాయి. యజ్ఞ యాగ కర్మలలో ఉద్గాత అనే ఋత్విజుడు సామవేదాన్ని గానం చేస్తాడు.

వేదాలలో మూడు రకాలైన మంత్రాలున్నాయి – ఋక్కు, యజస్సు, సామగీతి. ఋక్కులు గేయ, అగేయాలని రెండు రకాలు. సామవేదంలో గేయ 'అర్చిక' అని, యజస్సులను 'సోక్త' అని అంటారు. వేదవ్యాసుని వద్ద మొదట ఈ సామవేదమును జైమిని చదివాడు. అతని వద్ద నుండి అతని శిష్య ప్రశిష్యులకు సంక్రమించింది. సామవేదానికి వెయ్యి శాఖలుండేవని తెలుస్తుంది. ఇప్పుడు పదమూడు శాఖల పేర్లు మాత్రమే ఉన్నాయి – రాణాయన, సత్యముద్ర, వ్యాస, భాగురి, ఔలుండి, గౌల్ములవి,

భాను, మనేపమన్యవ, కారాటి, మశక, గార్గ్య, వార్షగణ్య, కౌథుమ, శాలిహోత్ర, జైమిని. కాని వీటిలో మూడు మాత్రమే ఇప్పుడు దొరుకుతున్నాయి. అవి కౌథుమీయ, రాణాయనీయ, జైమినీయ, వీటిలో కౌథుమీయ శాఖ గుజరాత్‌లోని నాగర బ్రహ్మణుల్లో ఈనాటికీ ప్రచారంలో ఉంది. రాణాయనీయశాఖ మహారాష్ట్రలో, జైమినీయశాఖ తమిళదేశంలో ప్రచారంలో ఉన్నాయి.

కౌథుమీయ సంహిత గొప్పది. దీనికి సాయణాచార్యుడు భాష్యం వ్రాశాడు. ఈ సంహిత పూర్వార్చికమని, ఉత్తరార్చికమని రెండు భాగాలు. పూర్వార్చికమునకు ఛందసీ, ఛాందసికా అని కూడా పేర్లున్నాయి. ఇది ఆరు ప్రపాఠకములుగా విభజించబడింది. ప్రతి ప్రపాఠకమునకు రెండు అధ్యాయములు. అవి తిరిగి కొన్ని ఖండాలుగా విభజించబడింది. మొదటి అయిదు ప్రపాఠకములు ఆగ్నేయ, ఇంద్ర పవమాన పర్వములకు సంబంధించినవి. ఆరవ ప్రపాఠకములో ఆరణ్యక పర్వములున్నాయి. ఉత్తరార్చికము కూడా తొమ్మిది ప్రపాఠకములుగా, ఇరవై తొమ్మిది అధ్యాయములుగా విభజించబడింది. దీనిలో దశరాత్ర, సంవత్సర, ఏకాహ, అహీన, సత్ర, ప్రాయశ్చిత్త, క్షుద్ర భాగములు వర్ణింపబడినవి. రాణాయనీయ సంహిత కూడా ఇదే విధముగా పూర్వార్చికము ఆరుప్రపాఠకములుగా, ఉత్తరార్చికము తొమ్మిది ప్రపాఠకములుగా విభజించబడింది. ఉత్తరార్చికములో మొదటి అయిదు ప్రపాఠకములు రెండేసి అర్ధములుగా, చివరి నాల్గింటికి మూడేసి అర్ధములు ఏర్పడినాయి. ప్రతి అర్ధమును కొన్ని ఖండములుగా పూర్వోత్తరార్చికములు రెండింటిలోను గల ఒక వెయ్యి ఎనిమిది వందల ఇరవై నాలుగు మంత్రములలోని కొన్ని మంత్రాలు పునరుక్తాలై వినిపిస్తున్నాయి. ఇంచుమించుగా మంత్రములన్నీ ఋగ్వేదము లోనివే.

సామ సంహితలన్నీ ఆర్చికములని, గానములని రెండు విధాలు. ఋక్కులకు ఆర్చికములని పేరు. ఆర్చికములలో సామగానానికి ఉపకరించే మంత్రాలన్నీ సంగ్రహించబడ్డాయి. గాన సంహితలో అవే మంత్రాలు గేయరూపంలో సంతరించు కున్నాయి. సామగానము నాలుగు రకాలు. గ్రామ గేయగానము – ఇది గ్రామాలలో పాడదగినది. అరణ్యగేయగానము – ఇది అరణ్యములో పాడదగినది. గ్రామ, అరణ్యగేయములను ప్రకృతి గానములని పిలుస్తారు. వాటిని అనుసరించి ఊహాగానము, ఊహ్యాగానము వికసించాయి. మొదటి రెండు పూర్వార్చికానికి, చివరి రెండు ఉత్తరార్చికానికి సంబంధించినవి.

పూర్వార్చికలో ఆరు ప్రపాఠకములున్నాయి. దీనిలో ప్రధానంగా అగ్ని – ఇంద్ర – సోమ దేవతలు స్తుతించబడ్డారు. అగ్ని మొదటి పన్నెండు దశతులలోను, తరువాతి ముప్ఫై ఆరు దశతులలో ఇంద్రుడు, చివరి పదకొండు దశతులలో సోముడు వరుసగా స్తుతి చేయబడ్డారు.

మొదటి ప్రపాఠకములో పది దశతులున్నాయి. ఇది ప్రధానంగా అగ్ని స్తుతి పరమైనకు బ్రాహ్మణ స్తుతి. ఇంద్ర, పూష, అంగిరసుల స్తుతులు కూడా ఇందులో ఉన్నాయి. రెండవ ప్రపాఠకములో కూడా పది దశతులున్నాయి. అగ్ని, ఇంద్రుడు, సవిత మొదలగు దేవతలు వీటిలో స్తుతించబడ్డారు. మూడవ ప్రపాఠకములో కూడా పది దశతులున్నాయి. ఇంద్రుడు, వరుణుడు, అశ్వినులు, మరుత్తులు, ఆదిత్యుడు, సూర్యుడు మొదలగు దేవతల స్తుతి కనబడుతున్నాయి. నాలుగవ ప్రపాఠకములో కూడా పది దశతులున్నాయి. ఇంద్రుడు, ఉషస్సు, అగ్ని, విశ్వదేవులు, ద్యావా పృధ్వులు మొదలగు దేవతలు స్తుతించబడ్డారు. అయిదవ ప్రపాఠకంలో పది దశతులున్నాయి. ఇంద్రుడు, ఆదిత్యుడు, విశ్వ దేవతలు, అశ్వినులు, సోముడు, పవమానుడు, అగ్ని, సూర్యుడు, సవితల స్తుతులున్నాయి. ఆరవ ప్రపాఠకంలో తొమ్మిది దశతులు మాత్రమే ఉన్నాయి. పవమానుడు, సోముడు, ఇంద్రుడు దీనిలో స్తుతించబడ్డారు.

ఉత్తరార్చికంలో తొమ్మిది ప్రపాఠకములున్నాయి. ఇంద్రుడు, అగ్ని మొదలగు దేవతల స్తుతులున్నాయి. మొదటి ప్రపాఠకములో పన్నెండు దశతులలో అగ్ని, ఇంద్రుడు, మిత్రావరుణులు, పవమాన, సోముల స్తుతులున్నాయి. రెండవ ప్రపాఠకములో పన్నెండు దశతులలో పవమానుడు, సోముడు, అగ్ని, మిత్రావరుణులు, ఇంద్రుడు స్తుతించబడ్డారు. మూడవ ప్రపాఠకములో పధ్నాలుగు దశతులున్నాయి. పవమానుడు, సోముడు, అగ్ని, ఇంద్రాగ్నులు స్తుతించబడ్డారు. నాలుగవ ప్రపాఠకములో పదమూడు దశతులున్నాయి. పవమానుడు, సోముడు, అగ్ని, ఆదిత్యుడు, ఇంద్రుడు, విశ్వదేవుల స్తుతులున్నాయి. అయిదవ ప్రపాఠకములో పన్నెండు దశతులలో పవమానుడు, సోముడు, అగ్ని, ఇంద్రుడు స్తుతించబడ్డారు. ఆరవ ప్రపాఠకములో పాపముల నుండి విముక్తి ప్రస్తావించబడింది. ఏడవ ప్రపాఠకములో పదకొండు దశతులలో ఇంద్రుడు, పవమానుడు, సోముడు, అగ్ని, విశ్వదేవుల స్తుతులున్నాయి. ఎనిమిదవ ప్రపాఠకంలో పదమూడు దశతులున్నాయి. అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, వాయువు, పవమానుడు, సోముడు మొదలగు దేవతా స్తుతులున్నాయి. తొమ్మిదవ ప్రపాఠకంలో తొమ్మిది దశతులలో పవమానుడు, సోముడు, ఇంద్రుడు, అగ్ని, మరుత్తులు, సూర్యుడు మొదలగు దేవతల స్తుతులున్నాయి.

సామవేదంలో సృష్టికర్త అయిన దేవుణ్ణి బ్రహ్మతత్త్వంగా అభివర్ణించడం జరిగింది. ప్రతి ఒక్క మానవుడిలో, ఈయన్ని జీవాత్మ అంటారు. బ్రహ్మ శబ్దం 'బృహ్' ధాతువు నుంచి వచ్చింది. ఈ ధాతువుకు 'విస్తరించడం' అని అర్థం. దివ్యశక్తి దానంతట అది పెరగడం, అంటే సృజనాత్మక కార్యకలాపంలోకి దూకడం అనే వైదికార్థాన్ని తెలియ జేస్తుంది ఇది. ఈ విశ్వం సాలెగూడు మాదిరిగా, ఆయన సత్తాలోంచే వివర్తం చెందుతుందని (వికురితే) చెబుతారు. ఎరుకతో, ఆత్మను బ్రహ్మ పదార్థంలో లీనం చేయడం – అంటే జీవాత్మను పరమాత్మలో ఐక్యం చెయ్యడమే – వేదాల మొత్తం సారమని చెప్పవచ్చు.

సామవేదం గానం చేసే పద్ధతులను తెలియజేసే పుస్తకాలున్నాయి. వాటిని 'గణా'లని అటారు. మంత్రాలను గానం చేసేటప్పుడు మాత్రలను దీర్ఘం, ప్లుతం, పునరావృత్తి చేసే విధానాలు, ఇంకా ఇతరత్రా మార్పులు, నియమాలు వీటిలో ఇవ్వబడినాయి. సామగాన సమయంలో దుందుభి, వీణ, వేణు మొదలైన వాద్యాలు ఉపయోగింపబడేవి. సామవేదం నుంచే గాంధర్వవేదం పుట్టింది.

యజ్ఞాలలో సోమపానం ఎంత రుచికరమో, సామగానము అంత మధురమైనది. దేవతా స్తోత్రంగా నామములు గొంతెత్తి గానం చేసేప్పుడు ఉద్గాత మొదలైన ఋత్విజుల ఉత్సాహము సభికులను కూడా ఉత్సాహపరుస్తుంది. ఒక విధమైన వాతావరణం యాగశాలలో నెలకొంటుంది. ఈ గాన రసానికి సోమరసం చేయూతనిస్తుంది.

సోమమనేది ఒక లత, ఋగ్వేదంలో ఈ లత మూజవత పర్వత ప్రాంతంలో, కురుక్షేత్రంలోని శరణ్యావత్ ప్రదేశంలో దొరుకుతుందని చెప్పబడింది. నదీ తీరాలలో ఇది నాచులా పెరుగుతుందట, పర్వతాలలో లతలా పెరుగుతుందట. దీనికి పర్వతావృధ, గిరిష్ఠ అనే పేర్లు ఉన్నట్లు చెప్పబడింది. చంద్రునితో సామ్యము చెప్పి చంద్రకళలతో పాటు పెరుగుతు తరుగుతు ఉండే ఆకులు గలదిగా వర్ణించబడింది. కొందరు ఇది అరటిదుంప లాంటిదని, లతలా ప్రాకుతుందని, నీటిలో తేలుతుందని, పదిహేను ఆకులుంటాయని, అధర్మంగా ప్రవర్తించే వారికి కనబడదని అంటారు. ఈనాడు లేదు. ఆపస్తంబుని నాటికే ఈ లత దేశంలో లేదని, అంటే దీనికి ప్రత్యమ్నాయంగా యజ్ఞంలో సోమలతకు బదులు కారుగచ్చనో, తిప్పతీగనో వాడమని చెప్పాడు.

(సోమరసాన్ని సోమలత లేదా సోమవల్లితో తయారు చేస్తారు. ఈ సోమవల్లిని ఇప్పుడు గుర్తించడం సాధ్యం కాదని పండితులు వెల్లడించారు. కాని మన తెలుగు

నిఘంటుకారులు (సి.పి. బ్రౌన్ మినహా) తిప్పతీగ, పొన్నగంటి అనే అర్థాలు వ్రాశారు. సోమవల్లి ఋగ్వేదకాలంలో పుష్కలంగా, సులభంగా కొండ ప్రాంతాలలో (ముఖ్యంగా హిమాలయాలలో) దొరికేదట. దానిని కిరాతులు సేకరించి తీసుకురాగా, వారినుండి కొనేవారట. కిరాతుని హీనంగా చూచినా, వారినుంచి కొన్న సోమవల్లిని మహా పవిత్రంగా పరిగణించి - అనంత, అమృత, ఇందులేఖ, కుండలి, కుల్వ, చంద్రిక, చక్రలక్షణ, ఛిన్న, ఛిన్న మహా, జీవంత, తంత్రిక, నిర్జర, దేవనిర్మిత, మధుక, మధుపర్జి, వత్సాదని, వయస్థ, విశల్యాది మొదలైన ఘనాతి ఘనమైన పేర్లతో పిలుస్తూ, దాన్ని వారు కళ్ళకు అద్దుకునేవారట!)

సోమయాగంలో సోమాహరణమే ఒక పెద్ద పని. సోమాహరణ సూక్తాలకు సౌపర్ణసూక్తాలని పేరు. సోమలతను అధ్వర్యుడు, యజమాని కొంటారు. దానిని ముప్పై ఆరు అంగుళముల పొడవు, పద్దెనిమిది అంగుళముల వెడల్పు గల అభిషరణ ఫలకముపై కృష్ణాజినము పరచి, దానిపై ఉంచుతారు. దానిని అభిమంత్రిస్తూ నీటితో తడుపుతూ నాలుగు శిలలతో నూరుతారు. ఆ తరువాత దానిని ఆహవనీయ పాత్రలో వేసి నీరువంచి, లతను పిండి నీళ్ళలో కలుపుతారు. పిప్పి తీసిన లతకు 'ఋజీష' అని పేరు. దీనిని దశాపవిత్ర గుడ్డతో మూటకట్టినట్లుగా కట్టి రసము ధారగా పడేటట్లు వడగడతారు. ఇలా పిండిన రసము ముందుగా దేవతలకిచ్చి హోమం చేస్తారు. ఆ తరువాత హోమావశేషాన్ని ఉద్గాత, యజమాని, బ్రహ్మ, సహస్రకుడు గ్రహిస్తారు. ఆ ఆ దేవతలకు అప్పగించేప్పుడే సోమరసాన్ని పాలు, పెరుగు, నెయ్యి, బంగారం పొడి, తేనె మొదలైన వాటితో కలుపుతారు. ఈ విధంగా రోజుకు మూడుసార్లు చేస్తారు. సోమరసాన్ని మధువనీ, మదుమత్ అని, పీయూషమనీ వ్యవహరిస్తారు. ఆ ఆ వస్తువులను కలిపినప్పుడు దీనిని ఆశిర, గవాశిర, యవాశిర మొదలైన పేర్లతో పిలుస్తారు.

సుశ్రుతములో సోమరస భేదాలు ఇరవై నాలుగు వరకు వేదోక్తములుగా వర్ణించ బడింది. దీనిని బంగారు పాత్రలో త్రాగాలని, దీనివలన సంతోష ఆనందాలే కాకుండా బ్రహ్మ జ్ఞానోదయానికి అనుకూలించే స్వస్థత కలుగుతుందని ఉంది. ఇది అమృతం. సుర కన్నా సోమం గొప్పదని, అది మత్తును కలిగిస్తే, ఇతి చిత్త స్వాస్థ్యమిస్తుందని తెలియజేసే మంత్రాలు ఋగ్వేదంలో చాలా చోట్ల కనిపిస్తాయి.

దేవకీ కుమారుడైన శ్రీకృష్ణునికి అంగిరస మహర్షి వేదాంతోపదేశం చేస్తూ మొదట సామవేద గాన విధిని నేర్పాడట. దాని పేరు 'ఛాలిక్య' విధి. శ్రీకృష్ణుడు ఆ విధిలో ప్రావీణ్యం సంపాదించి తన మురళి మీద పాడాడని ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడింది.

సామవేదానికి పూర్తిగా వ్యాఖ్యానం వ్రాసినవారు ముగ్గురు కనిపిస్తున్నారు. మాధవుడు సామసంహితకు మొదటి భాష్యకారుడు. సామవేదంలోని పూర్వఆర్చికకు, ఉత్తర ఆర్చికలకు రెండు భాగాలకూ ఇతడు వ్యాఖ్యానం వ్రాశాడు. ఈ భాష్యం తాళపత్రాలలో ఉంది కాని, ముద్రించబడలేదు.

సామవేదానికి భరతస్వామి కూడా భాష్యం వ్రాశాడు కాని ముద్రణ కాలేదు. సామవేదంలోని అన్ని మంత్రాలకు ఇతడు వ్యాఖ్యానం వ్రాశాడు. భరతస్వామి కాశ్యపగోత్రుడు. ఇతని తండ్రి నారాయణుడు. నివాసం శ్రీరంగం. హోయసలరాజు రామనాథుని సమకాలికుడు. భరతస్వామి సామవేద భాష్యం మీద మాధవుని భాష్య ప్రభావం కనిపిస్తుంది. ఇతని భాష్యం సంక్షిప్తంగా, చక్కగా ఉంది.

గుణవిష్ణువు సామవేదంలో నిత్యనైమిత్తిక విధులకు ఉపయోగపడే మంత్రాలకు మాత్రమే వ్యాఖ్యానం రచించాడు. ఈ వ్యాఖ్యానం మిథిల, బెంగాల్ ప్రాంతాలలో బాగా వ్యాప్తిలో ఉంది. గుణవిష్ణువు భాష్యాన్ని సాయణుడు కొంతవరకు అనుసరించాడు. గుణవిష్ణువు ఛాందోగ్యమంత్ర భాష్యాన్ని కూడా రచించాడు. ఇది సామవేదం కౌథుమ శాఖకు వ్రాయబడింది.

బెన్ఫీ, కౌథుమ సామ సంహితను జర్మన్ అనువాదంతో ప్రచురించాడు. గ్రిఫిత్ సామవేదాన్ని ఇంగ్లీషులోకి అనువదించాడు. స్టీవెన్‌సన్ అనే పండితుడు రాణాయనీయ సామసంహితను ఇంగ్లీషు అనువాదంతో ప్రచురించాడు.

సామసంహిత 'అగ్ని ఆయాహి వీతయే' అనే అగ్ని దేవతా మంత్రంతో ప్రారంభమై 'స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః' అనే స్వస్తి మంత్రంతో పూర్తవుతుంది.

# అథర్వవేద సంహిత

**నా**లుగు వేదాలలో చివరిది అథర్వవేదము. ఋగ్వేదాదులు ఆముష్మిక ఫలాన్ని ఇచ్చేవి అయితే, అథర్వవేదము ఐహిక ఫలాన్ని ఇచ్చేది. ఐహిక జీవితం సుఖమయం, సంతోషదాయకం చేసుకొనే సాధనాలు దీనిలో ఉన్నాయి.

యజ్ఞ నిర్వహణానికి బ్రహ్మ, అధ్వర్యుడు, హోత, ఉద్గాత అని నలుగురు ఋత్విక్కులు కావాలి. వారిలో అతి ముఖ్యమైన బ్రహ్మ ఆ స్థానాన్ని నిర్వహించడానికి అథర్వవేదం తప్పక తెలుసుకుని ఉండాలి. అథర్వ వేదానికి మూలభూతుడైన అథర్వఋషి ఈ యజ్ఞ ప్రక్రియకు మూలభూతుడు. అతడే దీన్ని లోకానికి చాటి చెప్పాడు. ఈ విషయం ఋగ్వేదము లోను, అథర్వవేదంలోను చెప్పబడింది.

ఈ వేదానికి 'అథర్వవేద'మని పేరున్నా, మొదట దీనికి 'అథర్వాంగి రసవేద'మని పేరుందని అంటారు. ఈ వేదంలోనే 'అథర్వాంగి రసాః' అన్న ద్వంద్వ బహువచనాంత నామము ఉంది. అథర్వుడు, అంగిరసుడు అనే ఇద్దరు ఋషులు ఈ వేదానికి ప్రవర్తకులైనందున ఈ పేరు వచ్చిందని అంటారు. పూర్వం సృష్టికోసం స్వయంభువు బ్రహ్మ తపస్సు చేశాడు. అతని రోమకూపముల నుండి చెమట పుట్టింది. అందులో అతని ప్రతిబింబం చూడగానే అతని రేతస్సు చలించిందట. ఆ రేతస్సు, చెమట కలిసి రెండు భాగాలయి, ఒకదానినుండి భృగుమహర్షి పుట్టాడు. అతను బ్రహ్మను చూడాలనుకుని 'అథర్వమ్ ఏనమ్' అని అన్నందువలన అతను అథర్వుణుడయ్యాడట! మిగిలిన సగము రేతస్సు చేరుట వలన వరుణాఖ్య బ్రహ్మ నావరించి యాతడు తపస్సు చేయగా సర్వాంగము నందు రసమై ప్రసరించెనట. అంగిరసము నుండి అంగిరస ఋషి పుట్టెనట. వీరిద్దరి వలన ఇరవైమంది అథర్వాంగిరసులను ఋషులు పుట్టిరట. వాళ్లు ఇరవైమంది కావున అథర్వాంగిరస వేదములో ఇరవై కాండములు కలవట. అలాగే భృగ్వాంగిరసమని కూడా అంటారు. భృగువు అంగిరసుని శిష్యుడట. గోపథ బ్రాహ్మణములో ఈ ఆ పేర్లతోపాటు బ్రహ్మవేదమని కూడా చెప్పబడింది. అథర్వవేదములో యజ్ఞానికి సంబంధించినవి, బ్రహ్మ విద్యకు సంబంధించిన విషయాలు ఉన్నాయి. బ్రహ్మజ్ఞానం ఉండడంచేతనే ఈ వేదానికి బ్రహ్మవేదమని పేరు కలిగింది.

ప్రాచీన కాలంలో అగ్న్యారాధకుడైన పురోహితుని 'అథర్వన్' అని పిలిచేవారని, 'అథర్వన్'కు అవసరమయ్యే మంత్రాలు దీనిలో ఉండడంచేత దీనికి ఆ పేరు వచ్చి ఉంటుందని ఆధునికుల అభిప్రాయం. అథర్వవేదము అథర్వన్, అంగిరస భాగాలుగా విభజించబడుతుంది. అథర్వన్ భాగంలో మంత్ర తంత్ర ఔషధాలను గురించి చెప్పే మంత్రాలు ఉన్నాయి. మారణ, ఉచ్చాటన (చేతబడి) విషయాలు గల మంత్రాలు అంగిరస భాగంలో ఉన్నాయి.

అథర్వ వేదము ఏ రాజు రాజ్యంలో పాఠం చేయబడుతుందో, ఆ రాజు రాజ్యంలో ఉపద్రవాలు ఉండవని ప్రాచీనుల నమ్మకం. అథర్వ వేదములోని చాలా మంత్రాలు ఐహిక సుఖాల కొరకు, చేతబడులు మొదలైన వాటికి ఉపయోగపడేవి ఉన్నాయి. అందుకే అథర్వ వేదానికి గౌరవస్థానం ఇవ్వక ప్రాచీనులు వేదాలు మూడు (త్రయి) అని అన్నారని ఆధునికులు తలచారు.

అథర్వవేదములో ఇరవై కాండలున్నాయి. ఏడువందల ముప్పై రెండు సూక్తాలు, ఐదు వేల తొమ్మిది వందల ఎనభై ఏడు (ఐదు వేల తొమ్మిది వందల పద్దెనిమిది) మంత్రాలు ఉన్నాయి. వేదవ్యాసుని శిష్యులలో సుమంతుడు ఈ వేదాన్ని అభ్యసించాడు. అతని శిష్య ప్రశిష్యుల ద్వారా ప్రచారానికి వచ్చిన ఈ వేదము తొమ్మిది శాఖలుగా విస్తరించిందని పతంజలి పేర్కొన్నాడు - పిప్పలాద, స్తౌద (తౌద), మౌద, శౌనకీయ (శౌనక), జాజల, జలద, బ్రహ్మపద, దేవదర్శ, చారణవైద్య. చరణ వ్యూహం యొక్క ఇంకొక పాఠం ప్రకారం - పిప్పల, శౌనక, దామోద, తోత్తాయన, జాబాల, కునఖి, బ్రహ్మపలాశ, దేవదర్శ, చారణవైద్య. కాని ఇప్పుడు దొరికేవి మాత్రం పిప్పలాద మరియు శౌనక శాఖలు మాత్రమే.

కాశ్మీర దేశంలో రాస్ దొరకు పిప్పలాద సంహిత ఒకటి దొరికింది. ఇది భూర్జ పత్రముల మీద శారద లిపిలో వ్రాసి ఉన్నది. ఈ లిపి కాశ్మీర దేశంలో వాడుకలో ఉంది. దీనిలో ఇరవై కాండలున్నాయి. కాని దీనికి శౌనక శాఖ సంబంధమై వాడుకలో ఉన్న సంహితకు చాలా భేదం ఉంది. పిప్పలాదుని ప్రశంస ప్రశ్నోపనిషత్తులో కనిపిస్తుంది. దీని బ్రాహ్మణము ఎనిమిది అధ్యాయముల గ్రంథమని తెలుస్తుంది. అయితే ప్రచారంలో ఉన్నది శౌనకశాఖ మాత్రమే. శౌనక శాఖీయులు గుజరాతు, మహారాష్ట్ర ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తుంది. గోపథ బ్రాహ్మణ మీ శౌనక సంహితకే సంబంధించింది.

విష్ణుపురాణములో ఈ వేదము యొక్క శాఖా భేదములు ఇంకో విధంగా ఉన్నాయి. వేదవ్యాసుడు తన శిష్యుడైన సుమంతుడుకు అథర్వవేదము చెప్పాడు.

సుమంతుడు కబంధుడికి చెప్పాడు. కబంధుడు దానిని రెండు భాగాలు చేసి, ఒక భాగం దేవదర్శుడికి, వేరొక భాగం పథ్యుడికి చెప్పాడు. దేవదర్శుడు నాలుగు విభాగములు చేసి మేధ, బ్రహ్మబలి, శౌష్కాయనుడు (శౌల్కాయని), పిప్పలాదుడు అనే నలుగురు శిష్యులకు చెప్పాడు. పథ్యుడు మూడు విభాగములు చేసి జాబాలి, కుముదుడు, శౌనకుడు అనేవారికి చెప్పాడు. శౌనకుడు రెండుగా విభజించి బభ్రువుకు, సైంధవునికి చెప్పాడు. సైంధవుడు తాను ఒక శాఖకు ప్రవర్తకుడై, ముంజకేశుడిని మరియొక శాఖకు ప్రవర్తకునిగా చేసినట్లు విష్ణుపురాణంలో ఉంది.

అథర్వవేద సంహిత ఇరవై కాండలుగా ఉన్నది. (కాండము సూక్తములుగా, సూక్తములు మంత్రములుగా విభజించబడి ఉంటుంది.) ఒకటి నుండి ఏడవ కాండము వరకు సూక్తములు, వానిలోని మంత్రముల సంఖ్యను అనుసరించి ఏర్పాటు చేసినట్లు కనబడుతుంది. ఒకటవ కాండములో ప్రతి సూక్తములో సరాసరి నాలుగు ఋక్కులును, రెండవ కాండములోని ప్రతి సూక్తములో అయిదు ఋక్కులును, మూడవ కాండమందలి ప్రతిసూక్తము నందు ఆరు ఋక్కులును, నాలుగవ కాండములో ఏడు ఋక్కులును, ఐదవ కాండములోని ప్రతి సూక్తములో ఎనిమిది మొదలు పద్దెనిమిది వరకు ఋక్కులును, ఆరవ కాండమందలి ప్రతి సూక్తంలో మూడు ఋక్కులును, ఏడవ కాండములో సగం కంటే ఎక్కువ సూక్తములందు ఒక్కొక్క ఋక్కు కలవు. ఎనిమిది మొదలు పన్నెండవ కాండము వరకు పెద్ద పెద్ద సూక్తములు ఉన్నాయి. ఇందులో విషయాన్ని బట్టి సూక్తములు ఏర్పాటు చేయలేదు. సమ్మిశ్రమముగా ఉన్నాయి. పదమూడు నుండి పదిహేడవ కాండము వరకు విషయములననుసరించి సూక్తము లేర్పాటు చేయబడినవి. పధ్నాలుగవ కాండములోని సూక్తములు వివాహ సంబంధమైన విషయాలు. ఇందులోని ఋక్కులు చాలా భాగం ఋగ్వేదములోని వివాహ విషయం ఋక్కులే. పదిహేనవ కాండమున 'వ్రాత్యస్తుతి' ఉంది. పదహారు, పదిహేడవ కాండములలో అభిచార మంత్రాలున్నాయి. పదహారవ కాండం మొత్తం, పదిహేడవ కాండములోని కొంత భాగం గద్యములో ఉంది. ఈ గద్యము బ్రాహ్మణముల గద్య రచనవలె ఉంది. పదహారు, పదిహేడు కాండములు చాలా చిన్నవి. పద్దెనిమిదవ కాండములో అంత్యవిధిని గురించి, పితృగణము గురించి ఉంది. ఇది ఋగ్వేదము ఇరవైవ మండలము నుండి గ్రహించిన ఋక్కులే. చివరివైన పంతొమ్మిది, ఇరవై కాండములు రెండు వెనుక నుండి కలుపబడినవని కొంతమంది పండితుల అభిప్రాయం. అథర్వవేద ప్రాతిశాఖ్యమును వైదిక వ్యాకరణంలో ఈ రెండు కాండలు ఉదహరించలేదు. పంతొమ్మిదవ కాండములోని సూక్తములు కలగాపులగంగా ఉన్నాయి. ఇరవైవ కాండములోని సూక్తములు అన్నీ ఇంద్ర సూక్తములు. ఇవి

ఋగ్వేదములోని సూక్తాలను మక్కీకి మక్కీ ఏ విధమైన మార్పులు చేయకుండా ఎత్తి వ్రాయబడినవి. అథర్వవేదంలో అయిదవ భాగము, అనగా పన్నెండువందల మంత్రాల వరకు ఋగ్వేదము లోనివే. అవి ఋగ్వేదములోని ప్రథమ, అష్టమ, దశమ మండలాలలో ఉన్నాయి.

వేదమంత్రాలను రచించినవారు మంత్రద్రష్టలు (ఋషులు). ఏ యే మంత్రమునకు కర్త ఎవరో సాధారణంగా ఋగ్వేదాది మంత్రాల వలన తెలుస్తుంది. కాని అథర్వ వేద మంత్రాల వలన కర్త ఎవరో తెలియదు. కొంతమంది కర్తలను మంత్రములోని విషయం వలన తెలిసినా, ఎక్కువమంది కర్తలను తెలుసుకునే వీలు అథర్వవేద మంత్రాలలో లేదు. బృహదనుక్రమణిక (పంచపటలిక)లో అథర్వవేదపు ఋషుల పేర్లు ఇవ్వబడినవి. ఈ ఋషులు దరిదాపు ఎనభైమంది ఉన్నారు. పట్టికలో కొంతమంది ఋషుల పేర్లు కల్పితమేమో ననిపిస్తుంది. అంత్యవిధికి యముడు, వివాహమంత్రములకు సూర్యా, సవిత, పాము మంత్రాలకు గరుత్మంతుడు, పురుష సూక్తమునకు నారాయణుడు ఋషులుగా చెప్పడం బట్టి అనుక్రమణులు వ్రాసినవారు వారి ఊహలను బట్టి దేవతలను కూడా మంత్రద్రష్టలుగా చెప్పారేమో అనిపిస్తుంది. ఈ ఋషులలో 'బాదరాయణి' అన్న ఋషి ఎవరై ఉంటారు ? వ్యాసునకు కుమారుడు శుకుడు లేక మరియొక బాదరాయణి పూర్వ ఋషులలోఉండెనా ? వీరిలో ఎక్కువమంది ఋగ్వేదాది ఋషులే.

పట్టికలోని అథర్వవేద ఋషులు – అంగిరసుడు, అగస్త్యుడు, అథర్వాంగి రసుడు, అథర్వణుడు, అప్రతీర్థుడు, అంగిరస ప్రాచేతసుడు, అథర్వవీతహవ్యుడు, అథర్వాచార్యుడు, అథర్వుడు, ఉచ్చోచనుడు, ఉన్మోచనుడు, ఉద్దాలకుడు, ఉపరిబభ్రవుడు, ఋభు కపింజలుడు, కబంధుడు, కశ్యపుడు, కాంకాయనుడు, కుత్సుడు, కస్యప మారీచుడు, కణ్వుడు, కారుపతి, కౌశికుడు, గరుత్మంతుడు, గోపథ భరద్వాజుడు, గార్గ్యుడు, గోపథుడు, చాతనుడు, జగద్బీజం పురుషుడు, జాతికాయనుడు, జమదగ్ని, త్వష్ట, ద్రవిణోదాసుడు, ధ్రువహణుడు, నారాయణుడు, పతివేదన, ప్రత్యాంగిరసుడు, ప్రశోచనుడు, ప్రజాపతి, ప్రమోచనుడు, ప్రక్షృన్యుడు, బభ్రు పింగళుడు, బృహచ్ఛుక్రుడు, బృహద్విప అథర్వణుడు, బృహస్పతి, బ్రహ్మ స్కందుడు, భరద్వాజుడు, భార్గవ వైదర్భి, భృగువు, భృగ్వంగిరసుడు, బాదరాయణి, బ్రహ్మ, భగుడు, భాగలి, భార్గవుడు, భృగు అథర్వుణుడు, భృగ్వాంగిరసబ్రహ్మ, మయోభువు, మారీచుడు, మేథాతిథి, మాతృనామ, మృగారుడు, యముడు, వరుణుడు, వామదేవుడు, విహవ్యుడు, వేనుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు, వీతహవ్యుడు, శంభువు, శుక్రుడు, శౌనకుడు, శాంతాతి, శునః శేపుడు, సవిత, సింధుద్వీపుడు, సావిత్రీసూర్య, సింధు ద్వీప అథర్వాకృతి మొదలగువారు.

విషయ విధానాన్ని అనుసరించి అథర్వ సూక్తములను పదమూడు వర్గాలుగా విభజించవచ్చును. ఒకటి – రోగనివారణమునకు, దయ్యములు వదలుటకును మంత్రములు (భేష జ్యాని – భేషజ్యాని అనగా రోగనివారణ సంబంధములైన సూక్తములని అర్థం). వేరు వేరు రోగములు పోవుటకు వేరు వేరు మంత్రములు చెప్పబడినవి. ఆయుర్వేద వైద్యశాస్త్రానికి ఇవి బీజ భూతములట. ఇందులో చెప్పబడిన మంత్రములు, తాయత్తులు, మూలికలు మూఢవిశ్వాసములుగా నున్నవి. జ్వరము, పరుసజ్వరము, పసరికలు, దగ్గు, రక్తము కారుట, అజీర్ణము, జలోదరము, కుష్టు, గాయములు, క్రిములు పడుట, పశురోగములు, విషమ మొదలైన లెక్కకు మించిన రోగముల నివారణోపాయములైన మంత్రాలున్నాయి. ఇవి మందులు కావు, మంత్రములు. ఈ మంత్ర పఠనము వలన ఇవి పోవునని అర్థం. కొన్నిచోట్ల సహజమగు కొన్ని మందులు కూడా చెప్పబడినవి.

రెండు – దీర్ఘాయువు, ఆరోగ్యము నిచ్చుటకు ప్రార్థనలు (ఆయుష్యాణి) – మామూలుగా వేరువేరు రోగములు పోగొట్టడానికి ఉపయోగించు సూక్తములకు, ఆయుష్యాణి సూక్తములకు తేడా ఉంది. రోగములతో సంబంధం లేకుండా ఆరోగ్యమును, ఆయుష్షును కోరేవి ఈ ఆయుష్యాణి సూక్తములు. ఆయుష్షు, ప్రాణము, వర్చస్సు, బలము మొదలైనవి కోరే సూక్తాలు. నిండు నూరేళ్లు హాయిగా బ్రతకాలని కోరే మంత్రాలు. మరణములన్నీ కలిసి నూట ఒక్క విధానాలు అని ఈ వేదాభిప్రాయం. యముడు, మృత్యువు, ఆంతకుడు, నిర్మతి అనేవారు మృత్యుదేవతలు. ఋగ్వేదకాలపు యమునికి, అథర్వ కాలపు యమునికి తేడా ఉంది. ఋగ్వేదములోని యముడు అంత భయంకరుడు కాదు. ఆయువు పెరగడానికి కొన్ని తాయెత్తులు మొదలైనవి చెప్పబడినవి. దాక్షాయణులు శతానీకునకు దీర్ఘాయువుకై బంగారు తాయెత్తు నిచ్చారట. దానిని ధరిస్తే ఏ విధమైన రోగము కాని, పిశాచాదికములు ఆశింపవు. అంజనము, ముత్యము, ముత్యము చిప్ప, ఒక వనస్పతి, మేఖల (ఒడ్డాణము) మొదలైనవి ఆయువు పెరగడానికి, ఆరోగ్యంగా ఉండటానికి సహకరించే తాయత్తులుగా చెప్పబడినవి.

మూడు – భూతములను, మంత్రగాండ్రను, శత్రువులను పరిభవించుటకు శాపములు (అభిచారికాని, కృత్యాప్రతిహరణాని). అథర్వసూక్తముల మూడవ విభాగమునకు అభిచారికాని, కృత్యాప్రతిహరణాని అని పేర్లు. అథర్వవేదాది సూత్రాలలో అభిచారికా కర్మమనగా సపత్న బాధనము, వినాశనము, పీడనము, మారణము, వశీకరణము, విద్వేషణము, మోహనము, స్తంభనము, శాటనము, ఉచ్చాటనము. ఒకరిని చెరుపుటకై మనము చేయు కట్టుబోతుతనమునకు 'అభిచారిక'మని పేరు. ఒకరు మనకు

చేసిన ప్రయోగమును త్రిప్పుటకు చేస్తే దానిని 'ప్రత్యభిచారము' అని పేరు. దీనినే కృత్యాప్రతిహరణాని అంటారు.

నాలుగు – స్త్రీ సంబంధములైన మంత్రములు (స్త్రీ కర్మాణి). స్త్రీ కర్మాణి అనగా స్త్రీలకు సంబంధించిన సూక్తములు. ఈ వేదములో స్త్రీల గురించి వచ్చిన సూక్తములు ముఖ్యంగా మొదటి ఏడు కాండాలలో వాటిని తీసి, కౌశిక సూత్రాలలో ఏ ఏ సూక్తం ఎక్కడెక్కడ ఉపయోగించాలో సూత్రకర్త చెప్పాడు. ఇందులోని వివాహ సంబంధమైన మంత్రాలు ఋగ్వేదం నుండి తీసుకోబడినవి. పురుషుని స్త్రీ అన్వేషించడం, గర్భాదానాది కర్మలు – ఈ వేదానికి ఇతర వేదాలకి ఒకే విధము. కాని ఈ వేదంలో పురుషులు స్త్రీని, స్త్రీ పురుషుని వశపరచుకోవడం, సపత్నీ బాధనము, అన్యస్త్రీ యొక్క చక్కదనం హరించడం, పురుషుని మగతనం పోయేటట్లు చేయడం మొదలైన కర్మలను వర్ణించే మంత్రాలు చాలా ఉన్నాయి.

అయిదు – ఐక్యాభివృద్ధికి, అధికారం పెరగడానికి మంత్రాలు (సామనస్యాని). సామనస్యమంటే మనసు కలిసి ఉండడం. ఐక్యాభివృద్ధికి ఈ సూక్తాలను ఉపయోగిస్తారు. కుటుంబంలోగాని, గ్రామంలోగాని అందరూ ఏకాభిప్రాయంతో ఉండడమే ఈ మంత్రాల ప్రయోజనం. కొన్ని సూక్తములలో అభిచార సంబంధం కూడా ఉంది. ఐక్యంగా ఉండాలంటే 'నేను అనుకొన్నట్లు, అందరూ అనుకోవాలి. నేను చెప్పినట్లు అందరూ వినాలి. నాకు అందరూ వశులు కావాలి' అని అర్థం. అట్లా జరగడానికి మంత్ర తంత్రములు చెప్పబడినాయి.

ఆరు – రాజునకు సంబంధించిన మంత్రములు (రాజ కర్మాణి). రాజునకు, రాజ్యమునకు సంబంధించిన సూక్తములకు రాజకర్మాణి అని పేరు. రాజ్యాభిషేకము, రాజు యశోవృద్ధి, ఇతర రాజులను వశపరచుకొనుట, సార్వభౌమత్వము, యుద్ధములో జయము, యుద్ధమునకు పోవునప్పటి మంత్రములు, యుద్ధభూమిలో రాక్షస పిశాచాదులకు సంబంధించిన మంత్రములు, యుద్ధములో చేసే ప్రార్థన మొదలైన విషయాలు ఈ సూక్తములలో ఉన్నాయి.

ఏడు – బ్రాహ్మణులకు సంబంధించిన మంత్రములు ఈ వేదములో చాలా ఉన్నాయి. ఇతరులకంటే బ్రాహ్మణులు ఎక్కువ అని, ఇతరులకంటే వారికి హక్కులు చాలా ఉన్నాయని అథర్వవేదకాలంలో స్థిరంగా ఉంది. పురోహితుని, బ్రాహ్మణుని పొగిడిన సూక్తాలు అక్కడక్కడ ఉన్నాయి. బ్రాహ్మణునకి ఇవ్వవలసిన దానములు, బ్రాహ్మణులు సంతోషంగా ఉంటేనే రాజుకు జయమని ఉదహరించబడింది.

ఎనిమిది – యోగక్షేమాభివృద్ధికి మంత్రములు (పౌష్టికాని). ధనధాన్యాధికముల అభివృద్ధి కొరకు పుట్టిన మంత్రాలు ఈ పౌష్టికాని శీర్షిక లోనివి. అది కావలెను, ఇది కావలెను, దానినిమ్ము, దీనినిమ్ము అని కోరే మంత్రాలన్నీ ఇవే. ఇలాంటి సూక్తాలు అథర్వవేదంలో అయిదవ వంతు ఉన్నాయి. ఋగ్వేదము మొదలుకొని శ్రౌత గృహ్యా సూత్రాల వరకు వైదిక వాఙ్మయమంతా ఈ 'పౌష్టికాని కర్మాణి' అనే వాటితో నిండి ఉన్నాయని చెప్పవచ్చు. ఇల్లు వాకిలి, పొలము వర్షము, పైరు పంట, ధనము ధాన్యము, పశువులు వరక్తకము, ద్యూతము మొదలైన ఐహిక సంబంధమైన సంపద రావాలని, అభివృద్ధి చెందాలని మానవులకందరికీ ఉన్న అభిలాష ఈ సూక్త రూపంలో వెలువడింది.

తొమ్మిది – ప్రాయశ్చిత్త మంత్రములు (ప్రాయశ్చిత్తాని). దోష పరిహారార్థము చేసే కర్మ ప్రాయశ్చిత్తము. తల్లిదండ్రుల విషయంలో ఆచరించిన పాపములు, ఋణము ఎగవేయడం, మరపు వలన జరిగిన దోషములు మొదలైన స్వాచరణమందలి దోషాలకు ప్రాయశ్చిత్తాలు చాలా చెప్పబడినాయి. ఇవికాక యజ్ఞయాగాలలో జరిగే లోపాల వలన కలిగే దోషములు పోవడానికి ఎన్నో సూక్తాలు రచించబడ్డాయి. మానవులు చేసే దోషాలకు ప్రాయశ్చిత్తములు, మానవుడి దోషం లేకుండానే సంభవించే పాపములకు, అధి వ్యాధులకు, దుస్స్వప్నములకు, దుష్టపక్షులు మొదలైనవి కనబడిన శకునములకు కూడా ప్రాయశ్చిత్తములు చెప్పబడినాయి.

పది – సృష్టి సంబంధమైనవియు పరతత్త్వ సంబంధమైన సూక్తములు. సృష్టిలోని స్వాభావిక శోభలను వర్ణించడం, సృష్టికర్త గుణాలను ఊహించి స్తుతించడం మానవజాతికి ఆనవాయి. సూర్యుడు, ఉషస్సు, మేగములు మొదలైన వాటి శోభలను ఋగ్వేదాదికాలలో వర్ణించబడింది. తిట్లు, శాపములు, మంత్రములు, తంత్రములు మొదలైన వాటితో నిండి ఉన్న అథర్వవేదములో అచ్చుటచ్చుట ఈ వర్ణనములు ఆనందం కలిగిస్తాయి. దీనిలో పృథ్వీ సూక్తం కొనియాడదగినదని అంటారు. ఇది అరవైమూడు ఋక్కులు ఉన్న పెద్ద సూక్తం. ఇదే విధంగా అంతరిక్షం, సూర్యుడు మొదలగు ప్రకృతిపరమైన వాటిని చక్కగా స్తుతి రూపంలో వర్ణించబడింది. స్వభావ వర్ణనములే కాకుండా పరతత్త్వ విచార సంబంధమైన సూక్తాలు కూడా ఉన్నాయి. ఋగ్వేదములో మాదిరి అగ్ని, ఇంద్రుడు, ద్యావాపృథివి, సవిత, వరుణుడు, ఉషస్సు మొదలైన దేవతల స్తోత్రములున్నాయి. అలాగే ఋగ్వేదంలోని పురుషసూక్తం ఈ వేదములో కొన్ని మార్పులతో పఠించబడింది. ఋగ్వేదము నుండి గ్రహించకుండా, కేవలం అథర్వణిక మనదగిన సూక్తమొకటి ఈ వేదంలో ఉంది. దానికి 'వరుణ సూక్తము' అని పేరు.

పదకొండు - సంస్కార సంబంధమైన సూక్తములు. సంస్కారములు రెండు రకములు. ఒకటి శ్రౌత సంస్కారములు, రెండు గృహ్య సంస్కారములు.

పన్నెండు - వేరువేరు విషయములను గురించి చర్చించు కాండములు.

పదమూడు - కుంతాప సూక్తములు.

అథర్వవేదములోని మంత్రములలో ప్రాచీన మానవ సమాజానికి చెందిన విశ్వాసాలు, క్రియాకలాపాలు కూర్చబడ్డాయి. మొత్తం మీద అథర్వవేద విషయాలన్నీ ఆధ్యాత్మ, అధిభూత, అధి దైవత అని మూడు విధాలుగా విభజించ వచ్చును. ఆధ్యాత్మ ప్రకరణాలలో బ్రహ్మ పరమాత్మ జ్ఞానం, ఆశ్రమ ధర్మాలను గురించి చెప్పబడింది. అధిభూత ప్రకరణాలలో రాజులు, రాజశాసనాలు, యుద్ధాలు, శత్రు పరాజయ ఉపాయాలు చెప్పబడినాయి. అధిదైవత ప్రకరణాలలో వివిధ దేవతల స్తుతి, యజ్ఞవిధులు చెప్పబడినాయి. సమకాలిక జన జీవితాన్ని అథర్వవేదం ఎంతగానో ప్రతిబింబింప చేస్తున్నది.

అథర్వవేదానికి సాయణుడు వ్రాసిన భాష్యం సమగ్రంగా కాక అక్కడక్కడ మాత్రమే కనబడుతుంది. కాశ్మీర పాఠమనే ప్రసిద్ధి గల పిప్పలాద శాఖను యం. బ్లూమ్‌ఫీల్డ్, ఆర్. గోర్బుస్తుత్‌గార్త్ అనేవారు 1901లో 'ది కాశ్మీరియన్ అథర్వవేద' అని ప్రచురించారు. ప్రామాణికపాఠమైన శౌనక శాఖను డబ్ల్యూ.డి. విట్నీ, ఆర్. రోథ్‌లు 1856లో సంపాదించి బెర్లిన్‌లో ప్రకటించారు. ఈ పాఠాన్నే సాయణ భాష్యంతో మన దేశంలో శంకర్ పి. పండిట్ నాలుగు భాగాలుగా 1895-98లో బొంబాయిలో ప్రచురించారు. అథర్వ వేదానికి పూర్తిగా ఆంగ్లానువాదం 1895లో ఆర్.టి.హెచ్. గ్రిఫ్ఫిత్ చేసిన అనువాదం మొదటిది. విట్నీ చేసిన అనువాదం (సి. ఆర్. లాన్‌మన్ సంపాదించినది) రెండవది. ఇది 1905లో కేంబ్రిడ్జిలో ప్రకటించబడింది.

కాశ్మీరులో దొరికిన పిప్పలాద శాఖ ప్రతి భూర్జపత్రాల్లో శారద లిపిలో వ్రాయబడింది. కాశ్మీర మహారాజు రణవీర్‌సింగ్ ద్వారా దీని ప్రతిని రుడాల్ఫ్ రోథ్ సంపాదించాడు. దీని ఫొటోకాపి 1901లో బాల్టీమోర్ నగరం నుండి ప్రచురించబడింది. తరువాత ఈ సంహితకు దేవనాగర లిపిలో రెండు ప్రతులేర్పడ్డాయి. అందులో ఒకటి పూనాలోని భండార్కర్ పరిశోధనాలయంలోను, రెండవది ముంబాయిలోని రాయల్ ఏషియాటిక్ సొసైటీలోను ఉన్నాయి.

అథర్వసంహిత 'యేత్రిషప్తాః పరియన్తి' అనే వాచస్పతి దేవతాకమైన మంత్రంతో ప్రారంభమై 'వనాయ్యం తదశ్వనా కృతం' అనే అశ్వినీ దేవతాక మంత్రంతో ముగుస్తుంది.

# బ్రాహ్మణాలు

వైదిక వాఙ్మయములో సంహితల తరువాత రెండవ రంగము బ్రాహ్మణాలది. వేద సంహితలలో దేవతాస్తుతి రూపాలుగా ఉన్న మంత్రాలను యజ్ఞయాగాలలో ఎలా వినియోగించాలో బ్రాహ్మణాలు చక్కగా వివరిస్తున్నాయి. ఛందోబద్ధంగా ఉన్న వేదసంహితలు మూలాలైతే, గద్య రూపంలో ఉన్న బ్రాహ్మణాలు వాటికి వ్యాఖ్యానాలు.

'బ్రహ్మ' పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. వాటిలో మంత్రమనేది ఒకటి. వైదిక మంత్రాలను వివరించేవి కాబట్టి ఈ గ్రంథాలకు బ్రాహ్మణ గ్రంథాలని పేరు కలిగిందని అంటారు. 'బ్రహ్మ' పదానికి యజ్ఞమని మరొక అర్థం. యజ్ఞ విధానాలు వివరించబడినవి కాబట్టి వీటిని బ్రాహ్మణ గ్రంథాలని అంటారు. యజ్ఞకర్మల యొక్క వైజ్ఞానిక, అధిభౌతిక, ఆధ్యాత్మిక మీమాంస ఈ గ్రంథాలలో చక్కగా వివరించబడింది. యజ్ఞాలు ఎప్పుడు ఎట్లా చెయ్యాలో వివరణలు వీటిలో ఇవ్వబడినాయి. ప్రాచీనుల నిష్ఠ నియమాలను యజ్ఞకర్మలు ప్రతిబింబింప జేస్తున్నాయి. ప్రాచీన సమాజములోని ప్రజల ఆచార నియమాలకు, సత్య వ్రతాదులకు ప్రతీకలుగా ఉన్నాయి.

అనేక విషయాలను బ్రాహ్మణాలు ప్రతిపాదించినా, వాటిలో 'విధి' యే ప్రధానమైనది. మిగిలినవి దానికి అంగభూతాలుగానే వివరించబడ్డాయి. యజ్ఞ యాగాది కర్మలు ఈ గ్రంథాలలో వివరంగా వివరించబడ్డాయి. విస్తరించిన యజ్ఞవిధులను, వాటి అనుష్టానాన్ని, సులభం చేయడానికి తరువాత శౌత్రసూత్ర గ్రంథాలు వెలువడ్డాయి.

పూర్వం, ప్రస్తుతం లభించే బ్రాహ్మణ గ్రంథాలకన్నా చాలారెట్లు ఎక్కువ బ్రాహ్మణ గ్రంథాలు వుండేవట! చాలా కాలగర్భంలో కలిసిపోయాయి. యజ్ఞ కర్మల విధానంలో గల విభేదాలను బట్టి, మత భేదాలను బట్టి వేరు వేరు బ్రాహ్మణ గ్రంథాలు వెలువడ్డాయి. బ్రాహ్మణ గ్రంథాలు వేదంలో భాగంగానే పరిగణించబడ్డాయి. సంహిత, బ్రాహ్మణాలను కలిపి వేదంగా గ్రహించాడు ఆపస్తంబుడు. (సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు – మొత్తం కలిసి సంపూర్ణవేదం అవుతుంది.)

బ్రాహ్మణ గ్రంథాలను నాలుగు భాగాలుగా విభజించారు – విధి విభాగం, అర్థవాద విభాగం, ఉపనిషత్ విభాగం, ఆఖ్యాన విభాగం. విధి విభాగంలో కర్మకాండ

సంబంధమైన వివరణ వుంది. దీనిలో వేదమంత్రాల అర్థమీమాంస, వైదిక పదాల నిష్పత్తిని గురించిన చర్చలు ఉన్నాయి. అర్థ విభాగంలో యజ్ఞ విధులను గూర్చిన చర్చలు ఉన్నాయి. యజ్ఞాలను చేయడం వలన కలిగే ఫలితాలు మొదలైనవి చెప్పబడ్డాయి. ఉపనిషత్ విభాగంలో బ్రహ్మతత్త్వాన్ని గురించిన విషయ చర్చలు ఉన్నాయి. ఆఖ్యాన విభాగంలో ఋషివంశాలు, రాజవంశాలు, వాటికి సంబంధించిన ఆఖ్యానాలు చెప్పబడ్డాయి.

యజ్ఞం సమస్త కార్యాలలోకి గొప్పదిగా బ్రాహ్మణ గ్రంథాలు చెపుతున్నాయి. యజ్ఞ కర్మ వలన సమస్త పాపాలు పోతాయి. యజ్ఞాలలో దేవతలకివ్వబడిన హవిస్సులు గాలిలో కలసి, అంతరిక్షంలో వ్యాపించి సూర్యుని వరకు చేరుకుని, మేఘాలతో కలసిపోయి, వర్షించి భూమిని అభిషేకం చేసి పంట బాగా పండేట్లు, ప్రజలు సుఖంగా వుండేట్లు చేస్తాయి అని బ్రాహ్మణ గ్రంథాల విశ్వాసం. బ్రాహ్మణ గ్రంథాలు వైదిక సాహిత్యంలో ఉత్తమమైనవి. ప్రాచీనకాలంలో భారతీయుల ధార్మికస్థితి తెలుసుకోవడానికి బ్రాహ్మణ గ్రంథాలు చాలా ఉపయోగపడతాయి. వాటిలో సత్యమహిమ వేనోళ్ళ చాటబడింది. బ్రాహ్మణ గ్రంథాలను ఆధారం చేసుకునే ఆచార్యులు వేదాలకు భాష్యాలు వ్రాశారు.

బ్రాహ్మణాల ననుసరించి సంవత్సరానికి మూడువందల అరవై రోజులు. మానవ శరీరంలో ఎముకలు మూడువందల అరవై. మానవ ఆయుర్ధాయ పరిమితి నూరేండ్లు. ఋతు సంధులలో వ్యాధులు సంభవిస్తాయి. అగ్ని రక్షోగణముల నపహరించును. హిరణ్యము దీర్ఘాయువు యిస్తుంది.

దేవ, ఋషి, పితృ ఋణముల నుండి విముక్తుడవడానికి పురుషుడు ప్రేమ పూర్వకముగా వివాహమాడాలి. భార్య అర్థాంగి. అపత్నీకుడు అగ్నిహోత్రమాచరించ కూడదు. అపుత్రునికి సద్గతి లేదు. బ్రాహ్మణాలు నీతికి ప్రాధాన్యమిస్తాయి. సత్యం మహోన్నత ధర్మముగా చెపుతాయి. ఒక పాపము ఇంకొక పాపమునకు దారి తీస్తుందని హెచ్చరిస్తాయి. కర్మను ఆచరించేపుడు శ్రద్ధతో చేయమని ఉపదేశిస్తాయి. ఆతిథ్యము ఉత్తమ ధర్మమని చెపుతాయి.

బ్రాహ్మణాలలో స్త్రీలు లక్ష్మీస్వరూపులుగా, మంగళదాయినులుగా వర్ణించబడ్డారు. స్త్రీలను హింసించరాదని చెప్పబడింది. పాతివ్రత్యము, వీరమాతృత్వము స్త్రీలకు ఆదర్శనీయాలు.

బ్రాహ్మణాలలో కురుపాంచాల దేశములు వర్ణించబడ్డాయి. సరస్వతీనది అంతర్వాహినిగా (భూమిలోపల ప్రవహించడం) మారడం, యమునా ప్రవాహ భూమి, సరస్వతీ - దృషద్వతీ సంగమ స్థానం చెప్పబడ్డాయి. ఈ ప్రదేశమును మనుస్మృతిలో బ్రహ్మావర్తము అన్నారు. సరస్వతి, దృషద్వతిలనే దేవనదుల మధ్య ప్రదేశమును దేవ నిర్మితము లేక బ్రహ్మావర్తము అన్నారు. ఈ దేశములో పుట్టిన బ్రాహ్మణుల వలన భూమిపైనున్న మానవులందరూ తమ తమ ఆచారములు తెలుసుకుంటారు!

బ్రాహ్మణాలు గద్యము (వచనము)లో ఉన్నా కూడా మంత్రాలకు మాదిరిగా వీటికి కూడా స్వరము ఉంటుంది. వేదకాలపు సంస్కృత భాషకు, అనంతరకాలపు వ్యావహారిక సంస్కృత భాషకు మధ్యకాలపు సంస్కృత భాషాశైలి బ్రాహ్మణాలలో కనబడుతుందని పండితుల అభిప్రాయం. బ్రాహ్మణాల కాలం నాలుగువేల సంవత్సరాల క్రితము అని పరిశోధకుల అభిప్రాయం. దీనికి మైత్రీ ఉపనిషత్తు ఆధారంగా చూపుతారు. విమర్శకుల నిర్ణయం ప్రకారం క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దంలో బ్రాహ్మణాల కాలం మొదలైంది.

బ్రాహ్మణ గ్రంథాలు గద్యంలో వ్రాయబడినవి. అక్కడక్కడ పరిచయం లేని పదాలు కనిపిస్తాయి. ఈ పదాలు తరువాత ప్రచారంలో లేకపోవడంతో నమ్మకం పోవడం సహజం. భక్తి ఉద్యమ వ్యాప్తితో వైదిక కర్మకాండలు వెనుకబడ్డాయి. బ్రాహ్మణ గ్రంథాల ప్రయోజనం పోయి ప్రచారంలో లేకుండాపోయాయి. ఆధునికయుగంలో బ్రాహ్మణ గ్రంథాలను బయటకు తీసిన ఘనత పాశ్చాత్య పండితులదే! పదకొండు వందల ముప్పై వైదిక సంహితలకు పదకొండు వందల ముప్పై బ్రాహ్మణ గ్రంథాలు ఉండేవి. కాని సంహితలతో పాటు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడు పన్నెండు బ్రాహ్మణ గ్రంథాలు మాత్రమే దొరుకుతున్నాయి. వీటిలో ఏడు బ్రాహ్మణాలు మాత్రమే ప్రసిద్ధి.

| | | |
|---|---|---|
| **ఋగ్వేదం** | : | ఐతరేయ బ్రాహ్మణం<br>కౌషీతకి (శాంఖాయన) బ్రాహ్మణం |
| **యజుర్వేదం** | : | తైత్తిరీయ బ్రాహ్మణం (కృష్ణ యజుర్వేదం)<br>శతపథ బ్రాహ్మణం (శుక్ల యజుర్వేదం) |
| **సామవేదం** | : | తలవకార (జైమినీయ) బ్రాహ్మణం<br>తాండ్య బ్రాహ్మణం |

ఛాందోగ్య బ్రాహ్మణం
సామవిధాన బ్రాహ్మణం
దేవతాధ్యాయ బ్రాహ్మణం
సంహితోపనిషద్బ్రాహ్మణం
వంశ బ్రాహ్మణం

**అథర్వవేదం** : గోపథ బ్రాహ్మణం

## ఋక్సంహిత - బ్రాహ్మణాలు :

ఋక్సంహితకు ఇరవై ఒక్క శాఖలున్నట్లు ప్రసిద్ధి. ఇరవై ఒక్క బ్రాహ్మణాలు ఉండాలి. కాని ఐతరేయ బ్రాహ్మణం, కౌషీతకి (శాంఖాయన) బ్రాహ్మణం, పైంగి బ్రాహ్మణం, బహ్వ్రృచ బ్రాహ్మణం, ఆశ్వలాయన బ్రాహ్మణం, గాలవ బ్రాహ్మణం అని ఆరు బ్రాహ్మణాలుండేవని అంటారు. కాని మొదటి రెండు బ్రాహ్మణాలు మాత్రమే ఇప్పుడున్నాయి. మిగిలిన నాలుగు నామమాత్రంగానే చరిత్రలో మిగిలిపోయాయి. ఐతరేయ బ్రాహ్మణానికే బహ్వ్రృచ బ్రాహ్మణమని పేరని కొందరి అభిప్రాయం.

## ఐతరేయ బ్రాహ్మణం :

ఋగ్వేద సంహితకు సంబంధించి రెండు బ్రాహ్మణ గ్రంథాలు లభిస్తున్నాయి. ఐతరేయ, శాంఖాయన బ్రాహ్మణ గ్రంథాలు. ఐతరేయ బ్రాహ్మణాన్ని మహిదాసు ఐతరేయుడు రచించాడు. ఇతడు ఋషి మహిదాసుకు, ఇతరా అనే శూద్రకన్యకు జన్మించాడు. ఇతరా కుమారుడు కాబట్టి ఐతరేయుడైనాడని సాయణుని వివరణ.

ఐతరేయ బ్రాహ్మణ గ్రంథములో నలభై అధ్యాయాలున్నాయి. తొమ్మిది పంచికలుగా విభజించి, ప్రతి పంచికను ఖండలుగా విభజించారు. దీనిలో రెండువందల ఎనభై అయిదు ఖండలు ఉన్నాయి. యజ్ఞంలో ఋత్విజుని కార్యకలాపాలను ఈ గ్రంథం వివరిస్తుంది. ఋత్విజునికి 'ఐత్రేయ' అని మరొక పేరని జరోష్ట్రియన్ల మత గ్రంథము 'అవెస్తా'ను బట్టి తెలుస్తుంది. ప్రథమ, ద్వితీయ పంచికలలో అగ్నిష్టోమ యాగం; తృతీయ, చతుర్థ పంచికలలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్ర సవనాలు; పంచమ పంచికలో ద్వాదశాహ యాగాలు; షష్ఠి పంచికలో కొన్ని వారాలు సాగే సోమయాగం; సప్తమ పంచికలో రాజసూయ యాగము; అష్టమ పంచికలో ఐంద్ర మహాభిషేకము, చక్రవర్తి మహాభిషేకాలు; నవమ పంచికలో హరిశ్చంద్ర - శునశ్శేపుల కథ వివరించబడినాయి.

ఐతరేయ బ్రాహ్మణం ఇతర బ్రాహ్మణాల్లాగా సోమయాగాన్ని, ఇతర యాగాలను వివరించినప్పటికీ, సమాజానికి కావలసిన ఎన్నో మహత్తర విశేషాలను, ప్రకృతి రహస్యాలను అందిస్తూ ప్రసిద్ధి పొందింది. ఈ బ్రాహ్మణానికి సాయణ, షడ్గురుశిష్య, గోవిందస్వాములు వ్రాసిన మూడు వ్యాఖ్యానాలు లభిస్తున్నాయి.

ఐతరేయ బ్రాహ్మణాన్ని మొట్టమొదట మార్టిన్ హాగ్ అనే పాశ్చాత్య పండితుడు ఆంగ్లభాషలో బొంబాయిలో 1863లో ప్రచురించాడు. తరువాత థ్యూడర్ ఔఫ్రిత్, సాయణ భాష్యం ఆధారంగా బాన్‌లో 1879లో ప్రకటించాడు. ఆ తరువాత సాయణ భాష్యం ఆధారంగా 1906లో సత్యవ్రతసామాశ్రమి ఈ బ్రాహ్మణాన్ని నాలుగు భాగాలుగా కలకత్తాలో ప్రచురించాడు. 1896లో కాశీనాథశాస్త్రి ఆగాశె, సాయణ భాష్యం ఆధారంగా వ్రాయగా పూనా ఆనందాశ్రమం వారు రెండు భాగాలుగా ప్రకటించారు. షడ్గురు శిష్యుని 'సుఖప్రద' వృత్తితో అసంపూర్ణంగా త్రివేంద్రం నుంచి మూడు భాగాలుగా అనంత కృష్ణశాస్త్రి ప్రచురించాడు. దానిని ఎ.బి. కీత్ ఆంగ్లంలోకి అనువదించాడు. 1925లో బొంబాయిలోని నిర్ణయసాగర్ ప్రెస్ వారు మూలం ప్రచురించారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయ పండితుడు సుధాకర మాలవీయ 'వేదార్థ ప్రకాశ' అనే సాయణ భాష్యంతో 'సరళ' అనే హిందీ వ్యాఖ్యానంతో 1980లో ఈ బ్రాహ్మణాన్ని ప్రకటించాడు.

## కౌషీతకి (శాంఖాయన) బ్రాహ్మణం :

ఋగ్వేదానికి గల శాఖలలో శాంఖాయన శాఖ ఒకటి. ఈ శాంఖాయన శాఖకు సంబంధించింది కౌషీతకి బ్రాహ్మణం. అందుకని దీన్ని శాఖాపేరుతో శాంఖాయన బ్రాహ్మణమని అంటారు. కొందరి అభిప్రాయంలో శాంఖాయన బ్రాహ్మణం కౌషీతకి బ్రాహ్మణం కంటే విభిన్నమైందని. కౌషీతకి బ్రాహ్మణానికే శాంఖాయన బ్రాహ్మణమని పేరు అని చాలామంది విమర్శకుల అభిప్రాయం. దీనిని ఇంకొందరు సాంఖ్యాయన బ్రాహ్మణమని కూడా పిలుస్తారు.

కుషీతక మహర్షి కొడుకు కౌషీతకుడు లేక కౌషీతకి. ఇతడు వ్రాసింది కావున ఇది కౌషీతకి బ్రాహ్మణం. ఉద్దాలకుని శిష్యుడు గుణాఖ్య శాంఖాయనుడు. కహోల కౌషీతకి ఇతని దగ్గర అధ్యయనం చేశాడు. గురువు శాంఖాయనుడుగాని, శిష్యుడు కౌషీతకి గాని ఈ బ్రాహ్మణాన్ని రచించి ఉంటారని కొందరు విమర్శకుల అభిప్రాయం. ఒకవేళ గురువు శాంఖాయనుడు రచిస్తే, శిష్యుడు కౌషీతకి ప్రచారం చేసి ఉండవచ్చు!

కౌషీతకి బ్రాహ్మణం మూడు దశకాలుగా విభజించబడింది. పది అధ్యాయాలకు దశకమని పేరు. ఇందులో ముప్పై అధ్యాయాలున్నాయి. రెండువందల ఇరవై ఆరు ఖండలుగా విభజించబడింది. (కొందరు రెండువందల డెబ్బై ఆరు ఖండలంటే, మరికొందరు రెండువందల డెబ్బై రెండు ఖండలన్నారు).

కౌషీతకి బ్రాహ్మణం మొదటి అధ్యాయంలో –అగ్న్యాధేయం; రెండవ అధ్యాయంలో – అగ్నిహోత్రం; మూడవ అధ్యాయంలో – దర్శ పూర్ణమాసలు నిరూపింపబడ్డాయి. నాలుగవ అధ్యాయంలో – అనిర్వాప్యేష్టి, అభ్యుదితేష్టి, అభ్యుద్దృష్టేష్టి, దాక్షాయణ యజ్ఞం, ఇళాదధేష్టి, సార్వసేని యజ్ఞం, శౌనక యజ్ఞం, వసిష్ఠ యజ్ఞం, సాకంప్రస్థాయ్యేష్టి, మున్యయనేష్టి, తురాయణేష్టి, ఆగ్రయణేష్టి అనే పన్నెండు వికృతేష్టులు నిరూపింపబడ్డాయి. అయిదవ అధ్యాయంలో – వైశ్వదేవ పర్వ, వరుణ ప్రఘాస పర్వ, సాకమేధ పర్వ, శునాసీర్యపర్వ అనే నాలుగు చాతుర్మాస్యయాగాలను; ఆరవ అధ్యాయంలో – శూలగవం, బ్రహ్మత్వమీమాంస, ప్రాయశ్చిత్తాహుతులను ప్రతిపాదిస్తున్నాయి. ఏడు నుండి ముప్పైవ అధ్యాయం వరకు సోమయాగమే వివరిచబడింది. అందులో దీక్షణీయ, ప్రాయణీయ, ఆతిధ్యేష్ఠులు, ప్రవర్గ్య, అగ్నిష్టోమీయ పశువు, ఆపోనప్త్రీయం, ఉక్థ్యం, షోడశి, అతిరాత్రం, ఉదవసానీయేష్టి అఖిప్లవషళహం, విశ్వజిత్, గవామయనం మొదలైన సోమయాగ కర్మలు చోటు చేసుకున్నాయి.

కౌషీతకి బ్రాహ్మణానికి సాయణుడు భాష్యం వ్రాయలేదు. మాధవభట్టు కుమారుడు వినాయకభట్టు వ్యాఖ్యానం వ్రాశాడని అంటారు. ఇ.ఆర్. శ్రీకృష్ణశర్మకు ఈ బ్రాహ్మణానికి ఉదయనుడు వ్రాసిన భాష్యం దొరికింది. అది 1973లో జర్మనీలో ప్రచురించబడింది. పదో అధ్యాయానికి సంబంధించిన వ్యాఖ్యానాన్ని 1908లో ఆర్. లొబ్బెక్ ఆంగ్లంలో ప్రచురించాడు. కౌషీతకి బ్రాహ్మణ వ్రాతప్రతిని గురించి వేబర్ 1853లో తన రచన ఇండిషె స్టుడియన్ రెండవ భాగంలో విపులంగా పేర్కొన్నాడు. 1887లో బి. లిండ్నెర్ మొదటిసారి కౌషీతకి బ్రాహ్మణాన్ని ప్రచురించాడు. 1911లో పూనా ఆనందాశ్రమం వారు గులాబ్‌రాయ్ వఝేశంకర సంపాదకత్వంలో ఈ బ్రాహ్మణాన్ని 'ఋగ్వేదాన్తర్గతం శాంఖాయన బ్రాహ్మణమ్' అని ప్రచురించారు.

### యజుస్సంహిత–బ్రాహ్మణాలు :

యజుర్వేదానికి కృష్ణ – శుక్ల అని రెండు ప్రధాన శాఖలున్నాయి. వాటిలో కృష్ణ యజుర్వేదానికి గల తైత్తిరీయ శాఖకు సంబంధించి తైత్తిరీయ బ్రాహ్మణం; శుక్ల

యజుర్వేదానికి – మాధ్యందిన, కాణ్వ భేదంతో రెండు శాఖలున్నాయి. వాటికి విడివిడిగా మాధ్యందిన శతపథ బ్రాహ్మణం, కాణ్వ శతపథ బ్రాహ్మణం అని రెండు బ్రాహ్మణాలున్నాయి. యజుర్వేదానికి సంబంధించి కాలగర్భంలో కలిసిపోయినవి – చరక బ్రాహ్మణం, శ్వేతాశ్వతర బ్రాహ్మణం, కాఠక (శతాధ్యయన) బ్రాహ్మణం, మైత్రాయణీ బ్రాహ్మణం, జాబాల బ్రాహ్మణం, ఖాండికేయ బ్రాహ్మణం, ఔఖేయ బ్రాహ్మణం, హారిద్రవిక బ్రాహ్మణం, తుంబుర బ్రాహ్మణం, అహ్వారక బ్రాహ్మణం, కంకతి బ్రాహ్మణం. ఛాగలేయ బ్రాహ్మణం మొదలగు పన్నెండు బ్రాహ్మణాలు పేరుకే చరిత్రలో ఉన్నాయి.

## తైత్తిరీయ బ్రాహ్మణం :

యజుర్వేద సంహితలో శుక్ల యజుర్వేదానికి శతపథ బ్రాహ్మణం, కృష్ణ యజుర్వేదానికి తైత్తిరీయ బ్రాహ్మణం లభిస్తున్నాయి.

కృష్ణ యజుర్వేదానికి గల శాఖలు ఎనభై ఆరు. అందులో చాలా శాఖలు నశించి పోయాయి. మిగిలినవి నాలుగు శాఖలు. అందులో ప్రధానమైనది తైత్తిరీయశాఖ. ఆ శాఖకు సంబంధించిన బ్రాహ్మణమే తైత్తిరీయ బ్రాహ్మణం. దీనిని 'పరాయాత' అని వైదికులు పిలుస్తారు.

వైశంపాయనుని శిష్యుడు పైంగియాస్కుడు. అతని శిష్యుడు తిత్తిరి మహర్షి. ఉఖ మహర్షి తిత్తిరి శిష్యుడు. ఆత్రేయుడు తిత్తిరి ప్రశిష్యుడు. తిత్తిరి మహర్షి తైత్తిరీయశాఖా ప్రవర్తకులలో మధ్య మణిలాంటివాడు. అతడు రచించిన ఈ బ్రాహ్మణం తైత్తిరీయ బ్రాహ్మణం.

తైత్తిరీయ బ్రాహ్మణం మూడు కాండలుగా విభజించబడింది. మొదటికాండకు 'పారక్షుద్ర'మని, రెండోకాండకు 'అగ్నిహోత్ర'మని పేరు. మూడోకాండలో గల విభాగాలకు విడివిడిగానే పేర్లున్నాయి. మొదటి రెండుకాండలలో ఎనిమిదెనిమిది ప్రపాఠకాలు, మూడోకాండలో పన్నెండు ప్రపాఠకాలున్నాయి. ప్రపాఠకాలలో గల అనువాకాల తక్కువ సంఖ్య ఆరు, ఎక్కువ సంఖ్య ఇరవై మూడు. మూడు కాండలను అష్టకాలని, ప్రపాఠకాలను అధ్యాయాలని అంటారు. మొత్తం అనువాకాలు మూడువందల ముప్పై ఎనిమిది.

తైత్తిరీయ బ్రాహ్మణంలోని మొదటికాండలో అగ్న్యాధానవిధి, గవామయనశేషవిధి, వాజపేయ–సోమాయ విధి, నక్షత్రేష్టకామంత్రాలు, రాజసూయం నిరూపింపబడ్డాయి. రెండో కాండలో అగ్నిహోత్రవిధి, ఉపహోమాలు. సౌత్రామణి, ఒకేరోజు చేయవలసిన

'సవం' అనే పేరు గల యాగాలు, కామ్యపశుయాగాలు ప్రస్తావించబడినాయి. మూడో కాండలో నక్షత్రేష్టి, దర్శపూర్ణ మాసవిధి, మనుష్యపశువిధి, అశ్వమేథం, సావిత్రచయనం, నాచికేతాగ్ని చయనం, చాతుర్హోత్రవైశ్వసృజాగ్ని చయనాలు ప్రతిపాదించబడినాయి.

తైత్తిరీయ బ్రాహ్మణానికి సాయణుడు, భట్ట భాస్కరుడు భాష్యాలు వ్రాశారు. ఈ బ్రాహ్మణాన్ని సాయణ భాష్యంతో 1862లో మిత్ర రాజేంద్రలాల్ కలకత్తా నుండి ప్రకటించాడు. నారాయణశాస్త్రి గోడ్ బోలే సంపాదకత్వంలో 1934లో పూనాలోని ఆనందాశ్రమం వారు ప్రకటించారు. భట్ట భాస్కరుని భాష్యంతో మహాదేవ శాస్త్రి, శ్రీనివాసాచార్య తైత్తిరీయ బ్రాహ్మణాన్ని మైసూరు నుండి ప్రకటించారు.

## శతపథ బ్రాహ్మణం :

శుక్ల యజుర్వేదానికి గల ఒకే ఒక బ్రాహ్మణం శతపథ బ్రాహ్మణం. నూరు అధ్యాయాలు గల గ్రంథము కాబట్టి దీనికాపేరు వచ్చింది. మాధ్యందిన – కాణ్వ శాఖల భేదం వలన ఈ బ్రాహ్మణం మాధ్యందిన శతపథ బ్రాహ్మణం, కాణ్వ శతపథ బ్రాహ్మణం అని రెండు ఉన్నాయి. చిన్న చిన్న తేడాలు తప్ప రెంటికీ పెద్ద భేదం ఏమీ లేదు. యాజ్ఞవల్క్య మహర్షి రచించాడని కొందరు విమర్శకులంటారు. దీనిని వాజసనేయి బ్రాహ్మణమని కూడా పిలుస్తారు.

మాధ్యందిన శతపథ బ్రాహ్మణంలో పద్నాలుగు కాండలు, నూరు అధ్యాయాలు ఉన్నాయి. కాణ్వ శతపథ బ్రాహ్మణంలో పదిహేడు కాండలు, నూటనాలుగు అధ్యాయాలు ఉన్నాయి. శతపథ బ్రాహ్మణంలో యజ్ఞయాగాలు విపులంగా వివరించబడి వైదిక కర్మకాండల అవగాహనకు దోహదపడుతుంది. కద్రూ సవర్ణ, పురూరవ ఊర్వశి, అశ్వినీ కుమారుల కథలు దీనిలో ఉన్నాయి. దీనిలోనివి తరువాత మహాభారతంలో చోటు చేసుకున్నాయి. ఈ బ్రాహ్మణం ఒక విజ్ఞాన సర్వస్వం వంటిది. శతపథ బ్రాహ్మణకాలంలో వైదిక కర్మకాండలు గండకీ నదీతీరం వరకు ప్రసరించనట్లున్నది. మిథిలాధిపతి జనకుని ప్రసక్తి, జనమేజయుని ప్రసక్తి, దుష్యంత భరతులు అశ్వమేథం చేసినవారుగా వుంది. యాజ్ఞవల్క్యుని గురువు ఉద్దాలక, ఆరుణి పాండిత్య ప్రశంస దీనిలో చాలా గొప్పగా చేయబడింది. ఈ బ్రాహ్మణం అమూల్యమైన తత్వాలెన్నో ప్రతిపాదింపబడి ప్రసిద్ధి పొందింది.

మాధ్యందిన శతపథ బ్రాహ్మణానికి హరిస్వామి 'శ్రుత్యర్థ వివృతి' అనే భాష్యం రచించాడు. కాని సమగ్రంగా దొరకడం లేదు. సమగ్రమైన భాష్యం సాయణుడు

రచించాడు. 1808లో శ్రీ గణేశశాస్త్రి పాఠక్ 'సర్వ ప్రకాశం' అనే భాష్యం రచించాడు. ఆ వ్రాతప్రతి ముకుందపాఠక్ దగ్గర ఉన్నట్లు శ్రీధరశర్మ శతపథ బ్రాహ్మణోపోద్ఘాతంలో ఉదహరించాడు. కాణ్వ శతపథ బ్రాహ్మణానికి భాష్యాలు లేవు. కాని మహాభారతానికి వ్యాఖ్యానం వ్రాసిన నీలకంఠుడు దీనికి భాష్యం వ్రాసినట్లు నీలకంఠ వ్యాఖ్యలో ఉన్నది.

1885లో ఎ. వేబర్ లండన్‌లో శతపథ బ్రాహ్మణాన్ని సాయణ భాష్యంతో ప్రచురించాడు. 1902లో అజ్మీర్‌లో ప్రకటించబడింది. 1905లో కలకత్తాలో ఏషియాటిక్ సొసైటీవారు సాయణభాష్యంతో సత్యవ్రతసామాశ్రమి ప్రకటించాడు. ఎగ్గలింగ్ ఈ బ్రాహ్మణం ఆంగ్లానువాదాన్ని 'సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్' లో ప్రకటించాడు. లాహోరు, బెనారస్‌లలో కూడా శతపథ బ్రాహ్మణం వెలువడింది. కాశీ అచ్యుత గ్రంథమాల ద్వారా విద్యాధరశర్మ, చంద్రధరశర్మల సంపాదకత్వంలో; చిన్నస్వామి శాస్త్రి, పట్టాభి రామశాస్త్రుల సంపాదకత్వంలో చౌఖంబా సంస్కృత సిరీస్ ద్వారాను ఈ బ్రాహ్మణం ప్రచురించబడింది. బొంబాయిలో శ్రీధరశర్మ సంపాదకత్వంలో గంగా విష్ణు శ్రీకృష్ణ దాస్ సాయణ భాష్యంతో అయిదు భాగాలు ప్రకటించాడు.

## సామసంహిత – బ్రాహ్మణాలు :

సామవేదశాఖకు సంబంధించి మూడు ప్రధాన బ్రాహ్మణాలు, నాలుగు ఉపబ్రాహ్మణాలు ఉన్నాయంటారు. తలవకార బ్రాహ్మణం దీనికే జైమినీయ బ్రాహ్మణం అని ప్రసిద్ధి. తాండ్య బ్రాహ్మణం దీన్ని పంచవింశ లేక పౌఢ బ్రాహ్మణం అనికూడా అంటారు. ఛాందోగ్య బ్రాహ్మణం దీనికి మంత్ర బ్రాహ్మణమని పేరు. ఇవి కాకుండా సామవిధాన బ్రాహ్మణం, దేవతాధ్యాయ (దేవత) బ్రాహ్మణం, వంశ బ్రాహ్మణం, సంహితోపనిషద్బ్రాహ్మణం అని నాలుగు ఉపబ్రాహ్మణాలున్నాయి. ఈ నాలుగింటిని కొందరు అను బ్రాహ్మణాలని అంటారు. సామవేద సంహితకు సంబంధించి – ఖాల్లవి బ్రాహ్మణం, కాలబవి బ్రాహ్మణం, రౌరికి బ్రాహ్మణం. శాట్యాయన బ్రాహ్మణం అని నాలుగు సామవేద బ్రాహ్మణాలు పేరుకు మాత్రమే ఉన్నాయి కాని దొరకడం లేదు.

## తలవకార (జైమినీయ) బ్రాహ్మణం :

వేదవ్యాసుని శిష్యుడు జైమిని. జైమిని శిష్యుడు తలవకారుడు. జైమిని చేత రచించబడిన, శిష్యుడైన తలవకారుని చేత ప్రచారంలోకి వచ్చిన బ్రాహ్మణం ఇది. కొందరు జైమినీయ బ్రాహ్మణమని పిలిచినా, తలవకార బ్రాహ్మణమనే పేరు పొందింది.

సామవేదానికి గల వెయ్యి శాఖలలో తలవకారశాఖ ఒకటి అని, ఆ శాఖకు సంబంధించినది కాబట్టి తలవకార బ్రాహ్మణమనే పేరు వచ్చిందని కొందరంటారు.

తలవకార బ్రాహ్మణంలో ఆగ్నేయ – ఇంద్ర – పవమాన – ఆరుణ – శుక్రియాలనే పేరుతో అయిదు కాండలున్నాయి. నాలుగవ కాండకు ఉపనిష ద్బ్రాహ్మణమని పేరు. చివరి కాండకు ఆర్షేయ బ్రాహ్మణమని పేరు. తలవకార బ్రాహ్మణంలోని ఖండల విభాగములో భిన్నాభిప్రాయాలున్నాయి. దీనిలోని ఖండలు పధ్నాలుగు వందల ఇరవై ఏడు అని కొందరు తేల్చారు.

అగ్నిష్టోమ – గవామయన – ఏకాహ – అహీన – సత్రయాగాలను ఇతర బ్రాహ్మణాలలో మాదిరే ఈ బ్రాహ్మణం కూడా ప్రతిపాదిస్తుంది. కాని ఇందులో పేర్కొనబడ్డ ద్వాదశాహ యాగాలు ఈ బ్రాహ్మణానికి ప్రసిద్ధిని ఆపాదించాయి. దీనిలో చాలా లోకోక్తులు, చారిత్రక, వైజ్ఞానిక విషయాలు, ధార్మిక–ఆధ్యాత్మిక తత్వాలు అద్భుతంగా వివరించబడినాయి.

ఈ బ్రాహ్మణానికి భాష్యాలు ఏమీ లేవంటారు. సాయణాచార్యుడు వ్రాయలేదు. భవత్రాతుడు భాష్యం వ్రాసాడని అంటారు కాని, లభించడం లేదు. పారిస్‌లో జైమినీయ బ్రాహ్మణంలోని ఉపాఖ్యానాలను ఎ.సి. బర్నెల్, డబ్ల్యూ. విట్నీ 1884లో, హెచ్. ఓర్టెల్ 1897లో ప్రచురించారు. ఈ బ్రాహ్మణంలోని కొన్ని భాగాలు డబ్ల్యూ. కాలండ్ జర్మన్ భాషానువాదంతో 1919లో ప్రచురించాడు. 1954లో రఘువీర, లోకేశచంద్రలు నాగపూర్‌లో జైమినీయ బ్రాహ్మణం మూడు కాండలను ప్రచురించారు.

**తాండ్య బ్రాహ్మణం :**

సామవేదంలోగల కౌథుమ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం తాండ్య బ్రాహ్మణం. దీనికి తాండ్య మహాబ్రాహ్మణమని, మహాబ్రాహ్మణమని, పంచవింశ బ్రాహ్మణమని, ప్రౌఢ బ్రాహ్మణమని కూడా పేర్లున్నాయి. తాండి మహర్షి ప్రవర్తకుడు కావడం వల్ల తాండి లేక తాండ్య బ్రాహ్మణమని అంటారు. గ్రంథం యొక్క పరిమాణం, దీనిలోని విషయాల మహత్వాన్ని బట్టి మహాబ్రాహ్మణమంటారు. ఇరవైఐదు అధ్యాయాలుండటం వల్ల పంచవింశ బ్రాహ్మణమని పిలుస్తున్నారు. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఇరవై ఆరవ అధ్యాయమే 'షడ్వింశ బ్రాహ్మణం'. ఇందులో ఆరు ప్రపాఠకాలున్నాయి. కాని చివరి ప్రపాఠకాన్ని అద్భుత బ్రాహ్మణమంటారు. దీనిలో రెండు ఖండికలున్నాయి.

తాండ్య మహా బ్రాహ్మణంలో ఇరవై ఐదు ప్రపాఠకాలున్నాయి. సాయణుడు తన భాష్యంలో ఈ ప్రపాఠకాలనే అధ్యాయాలని వ్యవహరించాడు. ఇందులో మొత్తం మూడు వందల నలభై ఏడు ఖండలున్నాయి.

ఒకరోజు నుండి వేయి సంవత్సరాల వరకు నడిచే నూట ఎనభై యజ్ఞాలను గురించిన వివరణ దీనిలో ఉంది. సాయణాచార్యుడు దీనికి సమగ్రమైన భాష్యం వ్రాయడం వల్ల ఇది ఎంతో ప్రసిద్ధి పొందింది. సామబ్రాహ్మణాలలో విశిష్టస్థానం పొందింది.

చిన్నస్వామి శాస్త్రి 1935లో సాయణ భాష్యంతో ఈ బ్రాహ్మణాన్ని సంపాదించగా చౌఖంబా సంస్కృత సిరీస్, వారణాసి వారు ప్రచురించారు. ఆనందచంద్ర వేదాంత వాగీశుడు సాయణ భాష్యంతో ఈ బ్రాహ్మణాన్ని కలకత్తా నుంచి ప్రచురించాడు. 1909లో ఇ.డబ్ల్యూ. హోప్కిన్స్ 'మహా బ్రాహ్మణంలోని దేవతలు, ఋషులు' అనే వ్యాసాన్ని ప్రచురించాడు. డబ్ల్యూ. కాలండ్ ఈ బ్రాహ్మణం పైన కొంత టిప్పణిని 1918లో ప్రచురించాడు.

## ఛాందోగ్య బ్రాహ్మణం :

సామవేదానికి గల కౌథుమశాఖకు సంబంధించిన బ్రాహ్మణం ఛాందోగ్య బ్రాహ్మణం. దీనిని మంత్ర బ్రాహ్మణమని కూడా అంటారు. దీనిని ఎవరు సంకలనం చేశారో తెలియడం లేదు. దీనిలో యజ్ఞయాగాల ప్రస్తావన లేదు. ఈ బ్రాహ్మణంలో చివరి ఎనిమిది ఖండలు ఛాందోగ్యోపనిషత్తుగా ప్రసిద్ధి.

ఛాందోగ్య బ్రాహ్మణంలో రెండు ప్రపాఠకాలుగాను, ఒక్కొక్క ప్రపాఠకంలో ఎనిమిదెనిమిది ఖండలుగా, రెండువందల యాభై ఏడు మంత్రాలుగా విభజించబడింది. ఈ బ్రాహ్మణం సామవేదానికి సంబంధించినదైనా, దీనిలో నాలుగువేదాలలోని మంత్రాలను పేర్కొనబడింది. వివాహం, గర్భాదానం, సీమంతం మొదలైన గృహ్యా కర్మలను వివరిస్తుంది. దీనిలో విశదపరిచిన విషయాలు అన్ని కాలాల్లోను మానవజాతి ఉన్నంత వరకు విలువ తగ్గనివి.

ఛాందోగ్య బ్రాహ్మణానికి రెండు భాష్యాలు ఉన్నాయి. ఒకటి గుణవిష్ణువు 'ఛాందోగ్య మంత్ర భాష్య'మనే పేరుతోను, రెండోది సాయణుడు 'వేదార్థ ప్రకాశిక'మనే పేరుతో రచించినవి ఉన్నాయి.

మంత్ర బ్రాహ్మణమనే ఛాందోగ్య బ్రాహ్మణాన్ని 1872లో సత్యవ్రతసామాశ్రమి ప్రచురించాడు. దీన్ని 'మంత్ర బ్రాహ్మణం' అనే పేరుతో జర్మన్ భాషానువాదంతో హెన్రిచ్

స్టోనర్ హోలే 1901లో ప్రచురించాడు. ఇందులో మొదటి ప్రపాఠకం మాత్రమే ఉన్నది. 1911లో హన్స్ జోర్గెన్సన్ దార్మ్‌స్తత్ మంత్ర బ్రాహ్మణమనే పేరుతో రెండవ ప్రపాఠకాన్ని సాయణ భాష్యంతో జర్మన్ భాషానువాదంతో ప్రచురించాడు. గుణ విష్ణువు భాష్యాన్ని కలకత్తా సంస్కృత సాహిత్య పరిషత్ పుస్తకమాల వారు 1930లో 'ఛాందోగ్య మంత్ర భాష్య'మనే పేరుతో ప్రచురించారు. దుర్గామోహన్ భట్టాచార్య ఛాందోగ్య బ్రాహ్మణాన్ని పూర్తిగా గుణవిష్ణువు, సాయణ భాష్యాలతో సంపాదించి కలకత్తా సంస్కృత కళాశాల తరఫున 1958లో ప్రచురించారు.

## సామవిధాన బ్రాహ్మణం :

సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణం ఇది. దీనిలో యజ్ఞయాగాల ప్రసక్తి లేదు. మానవుడు పరలోకంలో, మరోజన్మలో శాశ్వత సుఖాన్ని అనుభవించడానికి కృషి చేయాలి. ఈ జీవితంలో కోరికలను సఫలీకృతం చేసుకోడానికి వైదిక సాహిత్యంలో ఎన్నో మార్గాలున్నాయి. సామాలను గానం చేయడం ద్వారా తమ ఇష్టసిద్ధిని సంపాదించుకోవచ్చని ఈ బ్రాహ్మణం తెలుపుతుంది. ఆయా కోరికలు సిద్ధించడానికి ఇది సామాలను విధిస్తున్నది కావున దీనికి సామవిధాన బ్రాహ్మణమనే పేరు వచ్చింది. ఈ బ్రాహ్మణంలో మూడు ప్రపాఠకాలున్నాయి. మొదటి ప్రపాఠకంలో ఎనిమిది అనువాకాలు, రెండవ ప్రపాఠకంలో ఎనిమిది అనువాకాలు, మూడవ ప్రపాఠకంలో తొమ్మిది అనువాకాలున్నాయి.

సామవిధాన బ్రాహ్మణానికి రెండు భాష్యాలు లభిస్తున్నాయి. ఒకటి 'వేదార్థ ప్రకాశ' మనే సాయణ భాష్యం, రెండోది 'పదార్థ మాత్రవివృతి' అనే భరతస్వామి భాష్యం.

సామవిధాన బ్రాహ్మణాన్ని 1873లో లండన్‌లో ఎ.సి. బర్నెల్, సాయణ భాష్యంతో రోమన్‌లిపిలో ప్రచురించాడు. 1895లో కలకత్తాలో సత్యవ్రతసామాశ్రమి దేవనాగర లిపిలో సాయణ భాష్యంతో ప్రచురించాడు. 1964లో తిరుపతిలో కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం వారు బి. ఆర్. శర్మగారిచే సాయణ, భరతస్వామి భాష్యాలతో విలక్షణమైన విపులమైన విమర్శనాత్మక సంస్కరణగా వెలువరించారు.

## దేవతాధ్యాయ బ్రాహ్మణం :

సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణం. సామలు ఎన్ని ఉన్నాయి, సామగానానికి దేవతలు ఎందరు, ఏ ఏ సామాలకు ఎవరెవరు అధిదేవత ఈ బ్రాహ్మణం వివరిస్తుంది. అందువలన దీన్ని 'దేవతా బ్రాహ్మణ'మని కొందరంటారు. కొందరు దీనిని

'అగ్ని బ్రాహ్మణ'మని కూడా పిలుస్తారు. అనేక రకాలైన ఛందస్సులకు రంగులు, దేవతలు కూడా ఇందులో పేర్కొనబడింది.

దేవతాధ్యాయ బ్రాహ్మణానికి సాయణుని పేరుతో ఒక భాష్యం చెలామణిలో ఉన్నది. ఇది సాయణుని రచన కాదని బి. ఆర్. శర్మ, సత్యవ్రతసామాశ్రమి అభిప్రాయపడ్డారు గాని, సాయణుని పేరుతోనే ప్రసిద్ధి పొందింది. ఈ బ్రాహ్మణంలో మూడు ఖండలున్నాయి. మొదటి ఖండలో ఇరవై ఆరు, రెండో ఖండలో పదకొండు, మూడవ ఖండలో ఇరవై అయిదు ఖండికలున్నాయి.

1849లో దేవతాధ్యాయ బ్రాహ్మణాన్ని కలకత్తా నుంచి సత్యవ్రతసామాశ్రమి ప్రచురించాడు. తరువాత 1881లో జీవానంద విద్యాసాగర భట్టాచార్య మళ్ళీ ముద్రించాడు. 1959లో మద్రాసు నుంచి యం. రామనాథ దీక్షితార్ ప్రకటించాడు. 1965లో తిరుపతి కేంద్రీయ సంస్కృత పీఠం వారు బి.ఆర్. శర్మచే ముద్రితాముద్రిత ప్రతులను పరిశోధించి ఈ బ్రాహ్మణాన్ని రూపొందించి ప్రకటించారు.

## సంహితోపనిషద్బ్రాహ్మణం :

సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణం. మంత్ర సముదాయాన్ని సంహిత అంటారు. కాని ఇక్కడ సంహిత అంటే గానమని అర్థం. సామవేదంలోని ఋక్కులే గానం చేయబడి సామలని పిలువబడ్డాయి. 'ఉపనిషత్' అంటే రహస్యమని అర్థం. సామగానంలో ఉండే విశేషాలను, రహస్యాలను తేటతెల్లం చేసేది కాబట్టి ఈ బ్రాహ్మణానికి 'సంహితోపనిషద్బ్రాహ్మణ'మని పేరు వచ్చింది. ఈ బ్రాహ్మణంలో ఒకే ఒక ప్రపాఠకం ఉన్నది. అందులో అయిదు ఖండలున్నాయి.

సంహితోపనిషద్బ్రాహ్మణంలోని ప్రథమఖండ వరకు సాయణ భాష్యం ఉన్నది. ద్విజరాజభట్టు వ్రాసిన భాష్యం ఒకటి పూర్తిగా ఉన్నది.

సంహితోపనిషద్బ్రాహణాన్ని ఎ.సి. బర్నెల్ 1877లో మంగుళూరులో ద్విజరాజ భట్టు భాష్యంతో ప్రచురించాడు. ఇది రోమన్ లిపిలో ఉన్నది. 1959లో బి.ఆర్. శర్మ తిరుపతి కేంద్రీయ సంస్కృత పీఠం నుంచి ఈ బ్రాహ్మణాన్ని ప్రకటించాడు.

## వంశ బ్రాహ్మణం :

సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణమిది. వేదాధ్యయనం గురు శిష్య పరంపరగా వస్తున్నది. ఈ పరంపరలోని మహర్షుల, మహానుభావుల వంశక్రమం ఈ

బ్రాహ్మణంలో ఉన్నది. అందువలన దీనిని వంశ బ్రాహ్మణమన్నారు. ఈ బ్రాహ్మణం చాలా చిన్నది. దీనిలో మూడు ఖండలు మాత్రమే ఉన్నాయి.

వంశ బ్రాహ్మణానికి సాయణాచార్య భాష్యం మాత్రమే లభిస్తున్నది. ఈ బ్రాహ్మణాన్ని మొట్టమొదట ఎ. వేబర్ తన ఇండిషె స్టుడియన్‌లో ప్రకటించాడు. తరువాత కలకత్తాలో సత్యవ్రతసామాశ్రమి సాయణ భాష్యంతో 1849లో బెంగాలీ అనువాదం ప్రకటించాడు. మంగుళూరు నుంచి 1873లో ఎ.సి. బర్నెల్ రోమన్ లిపిలో ప్రచురించాడు. 1965లో బి.ఆర్. శర్మ తిరుపతి నుంచి విపుల పరిశోధకంగా ప్రకటించాడు.

## గోపథ బ్రాహ్మణం :

అథర్వ వేదానికి సంబంధించి గోపథ బ్రాహ్మణం ఒక్కటే ఉన్నది. దీనిలో కర్మ లోపం వల్ల కలిగిన దోషాన్ని వారించడానికి ప్రాయశ్చిత్తాలు చెప్పబడ్డాయి. సకలకర్మ లోపాలను బ్రహ్మ పూర్తి చేస్తాడని, ఋత్విక్కులలో బ్రహ్మకు ఉన్న ఉన్నత స్థానాన్ని ఈ బ్రాహ్మణం విశదపరుస్తుంది.

అథర్వ చరణవ్యూహంలో ఈ బ్రాహ్మణం నూరు ప్రపాఠకాలు కలదిగా ఉన్నది. కాని ఇప్పుడు పదకొండు ప్రపాఠకాలు మాత్రమే దొరుకుతున్నాయి. పతంజలి పేర్కొన్న అవ్యయలక్షణం ఈ బ్రాహ్మణంలోనిదే. ఓంకార స్వరూపాన్ని, ప్రతివేద బ్రహ్మచర్యాన్ని, గాయత్రి మంత్ర రహస్యాన్ని ఈ బ్రాహ్మణం తెలియజేస్తుంది.

గోపథ బ్రాహ్మణం పూర్వవిభాగం, ఉత్తర విభాగం అని రెండుగా విభజించ బడింది. పూర్వ విభాగంలో అయిదు ప్రపాఠకాలు, ఉత్తర విభాగంలో ఆరు ప్రపాఠకాలు ఉన్నాయి. పూర్వ విభాగంలో – భగవంతుడు సృష్టి చేయాలని సంకల్పించడం, సముద్రాలు, భృగువు పుట్టడం, అథర్వ మహర్షి ఉత్పత్తి, అథర్వవేదావిర్భావం, బ్రహ్మసృష్టి, ఓంకారోత్పత్తి, గాయత్రీ మాహాత్మ్యం, బ్రహ్మచారి ధర్మాలు, యుగాలలో బ్రహ్మ స్థానం, దేవయజనం, బ్రహ్మోదనం, ఆత్రేయ యజ్ఞం, ఋత్విక్కుల అర్హతలు, స్వాహాశబ్ద వ్యుత్పత్తి, యజమాని మొదలగువారి దీక్ష, యజ్ఞయాగాదులలో మంత్రాల ఉపయోగం మొదలైన విషయాలు చర్చించబడ్డాయి.

ఉత్తర విభాగంలో – యజమాని అతిధులు, నక్షత్రోత్పత్తి, చాతుర్మాస్య యాగాలు, దేవాసుర యుద్ధం, అగ్నీధ్రనియమనం, వషట్కార విశేషాలు, దక్షిణ, ఉక్థ దేవతలు,

షోడశి నిర్వచనం, శర్వం, వాజపేయ ప్రశంస, ఆప్తోర్యామప్రశంస, సంపాతమంత్రోత్పత్తి, అహీన యాగ వైశిష్ట్యం మొదలగు విషయాలు ప్రతిపాదించబడ్డాయి.

వేదకాలంలో యజ్ఞం చేయడమే ఉత్తమమైన కార్యం అని భావించారు. యజ్ఞం ప్రజాపతికి ప్రతీక. యజ్ఞం చేయడం ద్వారా ప్రకృతిపై ఆధిపత్యం సంపాదించవచ్చని భావించారు. యజ్ఞాల వల్ల వర్షాలు కురిసి, దేశం సుభిక్షంగా ఉంటుందని వారి అభిప్రాయం.

గోపథ బ్రాహ్మణంలో యజ్ఞ స్వరూపం వివరించబడింది. యజ్ఞ ప్రక్రియలో ఏడు సోమ సంస్థలు, ఏడు పాక యజ్ఞాలు, ఏడు హవిర్యజ్ఞాలు ఉన్నాయి. సోమ సంస్థలు – అగ్నిష్టోమ, అత్యగ్నిష్టోమ, ఉక్థ్య, షోడశి, అతిరాత్ర, అప్తోర్యామ, వాజపేయ. పాక యజ్ఞాలు – అష్టక, పార్వణ స్థాలీపాక, మాసిక శ్రాద్ధ, పిండపితృ శ్రావణి, ఆగ్రహాయణి, చైత్రి, ఆశ్వీయుజి. హవిర్యజ్ఞాలు – అగ్న్యాధాన, అగ్నిహోత్ర, ధర్మ, పూర్ణమాస, చాతుర్మాస్య, నిరూఢ పశుబంధ, సౌత్రామణి.

యజ్ఞాలు చేయడం వలన చెడు తొలగిపోతుంది. పౌర్ణమినాడు యజ్ఞాలు చేయడం శుభప్రదంగా తలచబడింది. యజ్ఞానికి 'అథర్వ'మనే పర్యాయపదం ఉంది. థర మంటే హింస. అథర్వమంటే హింస లేని కార్యం. యజ్ఞంలో జరిగే పశువధ హింసగా భావించలేదు. హింస అంటే శత్రుత్వ భావంతో, ద్వేషంతో ప్రాణులను గాయపరచడం, చంపడం అన్నారు.

గోపథ బ్రాహ్మణానికి ఎవరూ భాష్యం గాని, వ్యాఖ్యానం గాని వ్రాయలేదు. 1872లో కలకత్తాలో రాజేంద్రలాల్ మిత్ర, హరచంద్ర విద్యాభూషణులు ఇద్దరు గోపథ బ్రాహ్మణాన్ని ప్రచురించారు. 1929లో లైడన్ నుండి డి. గాస్త్ర సంపాదించి ప్రచురించాడు. 'అథర్వ వేదం – గోపథ బ్రాహ్మణం' పేరుతో యం. బ్లూమ్ ఫీల్డ్ ఒక విమర్శ గ్రంథం ప్రచురించాడు. దీనిని సూర్యకాంత హిందీలోకి అనువదించాడు.

# ఆరణ్యకాలు

వైదిక వాఙ్మయం సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులని నాలుగు భాగాలుగా విభజించబడింది. ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు పరిశిష్ట భాగం. యజ్ఞాలలోని రహస్యాలను మహర్షులు అరణ్యాలలో చర్చించారు. వాటి పాఠమే ఆరణ్యకాల్లో కనబడుతుంది. అరణ్యాలలో ప్రశాంతంగా జీవిస్తూ మననం చేసుకోవలసిన విషయాలు ఆరణ్యకాలలో ఉన్నాయి. అందుకే వీటికి ఆరణ్యకాలని పేరు వచ్చింది. 'అరణ్యే పాఠ్యతాత్ ఆరణ్యకమ్' అరణ్యాలలో పఠించేవి కాబట్టి వీటికి ఆరణ్యకాలని సాయణాచార్యుడు ఐతరేయ బ్రాహ్మణంలో నిర్వచించాడు.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలు మన పూర్వులు అనుసరించిన చతురాశ్రమ ధర్మాలు. అరణ్యవాసం చేసే వానప్రస్థులకు యజ్ఞయాగాది విధానాలను గురించి చెప్పేవి ఆరణ్యకాలు. సంసార బంధాలకు దూరంగా, జన నివాసాలకు దూరంగా వనాలలో ఉంటూ ఋషులు బ్రహ్మవిద్యా సాక్షాత్కారం చేసుకున్నారు. ఆ విద్యయే ఆరణ్యకాలలో సంగ్రహించబడింది.

గృహస్థాశ్రమంలో చేయదగిన యజ్ఞయాగాది విధులు బ్రాహ్మణాలలో చెప్పబడగా, వానప్రస్థ ఆశ్రమంలో చేయదగిన యజ్ఞ వ్రత కర్మాది విధులను గురించి ఆరణ్యకాలు చెప్తున్నాయి. అంతేకాక ఆధ్యాత్మిక తత్త్వాలు కూడా వివరించబడ్డాయి. అరణ్యాలలో ప్రశాంత వాతావరణంలో ప్రాణ విద్య వికసించటానికి అవకాశం కలిగింది. వేద సంహితలలోనే ఈ విద్య ప్రతిపాదించబడినదని అంటారు. కానీ ఆరణ్యకాలలోనే దీని బీజాలు అంకురించాయి. ఇంద్రియాలన్నింటిలో ప్రాణం శ్రేష్ఠమైంది. ప్రాణం దైవదత్తం, ఋషి రూపం. ప్రాణశక్తి ద్వారానే ప్రపంచమంతా తన స్థానంలో ఉన్నదని, అది విశ్వధారకమని, రక్షకమని ఆరణ్యకాలు చెపుతున్నాయి.

ప్రాణవిద్యకి ప్రమాణంగా ఋగ్వేద మంత్ర భాగముల ఉదహరించారు. ప్రాణం 'గోప' శబ్దముచే వ్యవహరించబడుతుది. ప్రాణం సర్వత్రా వ్యాపించిందని చెప్పబడింది. పగలు ప్రాణరూపమనీ, రాత్రి అపానరూపమని వర్ణించబడింది. ఉదయకాలమున ప్రాణం ఇంద్రియాలను శరీరములో వ్యాపింప జేస్తుంది. అది ప్రతననము. ఆ కారణమున దానికి ప్రాతఃకాలమని పేరు. సాయంకాలమున అది ఇంద్రియాలను తిరిగి సంకోచింప

జేస్తుంది. అది సమాగకము. కనుకనే దానికి సాయంకాలమని పేరు. ప్రాణం దేవాత్మకము. హిరణ్యవదనుడను ఋషి ఈ ప్రాణవిద్యను దర్శించాడట. ప్రాణమే ఋషి రూపము. గత్సమద, విశ్వామిత్ర, వామదేవ, అత్రి, భరద్వాజులందరూ ప్రాణస్వరూపులే. సమస్తము ప్రాణస్వరూపమే.

ఆరణ్యకాలలో చెప్పబడిన ఆధ్యాత్మిక విషయాలే ఉపనిషత్తులలో వికసిత రూపంలో కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాచీనమైన ఉపనిషత్తులు ఆరణ్యకాలలో అంగరూపంగా కనిపిస్తున్నాయి. ఆరణ్యకాలు నూటముప్పై వరకూ ఉండేవి. కానీ చాలావరకు కనుమరుగైనాయి. ఇప్పుడు ఆరు ఆరణ్యకాలు మాత్రం లభిస్తున్నాయి.

ఆరణ్యకాలలో ప్రతిపాదించిన విషయాలు అత్యంత రహస్యాలు. దీక్షితులు కాని వాళ్ళకు ప్రమాదకరమైన వంటారు. అందువలననే అవి అరణ్యాలలో అధ్యయనం చేయాలి గాని ఇతరత్రా (జననివాసాల్లో) నిషిద్ధమేర్పడింది. ఇవి యజ్ఞానుష్ఠాన ప్రక్రియలను, అనేక వ్రత నియమాలను, యజ్ఞాలలోని అంతరార్థాలను, సాంకేతికార్థాలను వివరిస్తూ చక్కని వ్యాఖ్యానాలనందిస్తున్నాయి.

ఆరణ్యకాలు ఇటు యజ్ఞయాగాదుల స్వరూపాన్ని నిరూపించే బ్రాహ్మణాలకు; ఆత్మ తత్వాన్ని, భగవతత్త్వాన్ని, సృష్టిని వివరించే ఉపనిషత్తులకు మధ్య వారథిగా ఉంటూ కర్మకాండ నుండి మానవుడి మనస్తత్వం జ్ఞానకాండవైపు ఎలా నడిచిందో స్పష్టం చేస్తున్నాయి. ఆరణ్యక వాఙ్మయంలో బ్రాహ్మణాల ప్రభావం, ఉపనిషత్తుల ప్రభావం విశదంగా కనిపిస్తుంది.

ఋషి అంటే జ్ఞానమూర్తి. పాంచభౌతిక శరీరముతో కదలాడుతున్నా, లోకసంగ్రహం కోసం కర్మలను, ఉపాసనలను ఆచరిస్తున్నా, వాటితో ఏ విధమైన సంపర్కం లేకుండా నిజరూపమై స్వయంప్రకాశమైన జ్ఞానంతో వెలుగొందే మహానుభావులు ఋషులనిపించుకుంటారు. స్వయంజ్యోతి అయిన పరమాత్మ తనంతట తానుగా వీరిని పొందింది. అందువలననే వీరు ఋషులైనారు. ఋషులలో ఉత్తమోత్తమముగా జీవించినవారు మహర్షులైనారు.

వివాహం లేకుండా అధ్యయనం కొనసాగించేవారు 'అరణు'లని, 'అరణమాను' లని పిలవడుతుండేవారు. అరణులు నివసించే ప్రదేశం అరణ్యం. వారి ఆలోచనలు, విద్యాధారలు ఆరణ్యకంలో నిక్షిప్తమైనాయి.

వృక్షాలు, మహావృక్షాలు, పుష్పవృక్షాలు, ఫలవృక్షాలు, తీగలు, పొదరిల్లు, ఓషధులు, సెలయేళ్ళు, నదులు, ఉపనదులు, పశుపక్ష్యాదులు మొదలైన ప్రకృతిసిద్ధమైన సంపదలతోను, సహజ సౌందర్యముతోను నాటి అరణ్యాలు భాసించుతుండేవి. అవి మనసును పరవశం చేస్తాయి. మనిషిని ఏకాగ్రతతో ఉంచుతాయి. సృష్టిని తనవితీర అనుభవించడానికి, తత్త్వాన్ని పరామర్శించి నిర్ధారించడానికి అనువైన ప్రదేశాలు అరణ్యాలే. అవే తపస్సుకు సిద్ధి క్షేత్రాలు. అందుచేతనే మహర్షులు వాటిని తమ కార్యక్షేత్రంగా మలచుకుని స్థిరపరచుకున్నారు. ఋషుల నివాసాలు ఆశ్రమాలు. సత్యధర్మాలకు అవి నిలయాలు. కర్మ, ఉపాసన, జ్ఞానం అనే మూడు ఆర్ష సంస్కృతీ స్రవంతులకు ఆశ్రమాలు సంగమస్థానాలు.

దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్య యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం అనే అయిదు యజ్ఞాలను ప్రతిరోజు నిర్వర్తించడం మహర్షుల జీవిత విధానంలో నిత్యకృత్యం. ఇంద్రాది దేవతలను ఉద్దేశించి అగ్నిలో హోమం చేయడం దేవయజ్ఞం. పితృదేవతలకు శ్రాద్ధకర్మను ఆచరించడం కాని, నీటిలో తర్పణం చేయడంగాని పితృయజ్ఞం. పశు పక్ష్యాదులకు, క్రిమికీటకాదులకు యధాశక్తి అన్నపానాదులు అందించడం భూతయజ్ఞం. వచ్చిన అతిథులకు గౌరవాదరణలు చూపడం మనుష్యయజ్ఞం. వేదవేదాంగాలను తాను చదువుకోవడంగాని, ఒకరికి చెప్పడంగాని బ్రహ్మయజ్ఞం.

వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు చేయదగిన మహావ్రతాలు – మహానామ్ని, ప్రవర్గ్య, పితృమేధం మొదలైనవి ఆరణ్యకాలలో వివరించబడ్డాయి. అంతేకాక నివృత్తి మార్గానికి చెందిన వైరాగ్య సూత్రాలు, వేదరహస్యాలు ఆరణ్యకాలలో ఉన్నాయి.

మహావ్రతం ఒక సంవత్సరంపాటు సాగే 'గవామయనం' అనే సత్రయాగంలో చివరిరోజుకు ముందురోజు జరుపబడుతుంది. పూర్వం గోవులు ఈ యాగాన్ని సంవత్సరం పాటు ఆచరించినట్లు గోపథ బ్రాహ్మణంలో చెప్పబడింది. అందుచేతనే దీనికి గవామయనం అనే పేరు వచ్చింది. ఇందులో ప్రాయణీయ, చతుర్వింశ మొదలగు ఇరవై అయిదు అహాలను అనేకసార్లు అనుష్ఠించాలి. ఇందులో యజమానులందరూ ఋత్విక్కులే. మహావ్రతంలో అనేక హోమాలు జరపడంతోపాటు స్తోత్రాలను, శస్త్రాలను (దేవతాస్తుతి పరమైన ఋక్కులు) పఠించడం జరుగుతుంది.

ఐతరేయారణ్యకంలో సకృదుక్తి ఖండాధ్యాయం ఉంది. ఇందులో పదకొండు ఋక్కులున్నాయి. సామవేదానికి మూలమైన 'మహానామ్ని' అనే పేరుగల తొమ్మిది

ఋక్కులతో కూడిన మంత్రమిది. ఆరురోజులు జరిగే 'పుష్యా' అనే యజ్ఞంలో అయిదవరోజు మధ్యాహ్నం పఠించే ఈ మంత్రాలు సామాన్ని తెలియజేస్తాయి. ఈ మహానామ్ని మంత్రాలు మూడు భాగాలుగా విభజించబడినాయి. ఈ మంత్రాలతో కూడా మరొక తొమ్మిది మంత్రాలు పఠించబడతాయి. వాటికి పురీషపదాలు అని పేరు. మహానామ్ని మంత్రాలు, పురీషపద మంత్రాలు పఠించేటప్పుడు భేదం ఉంది. మహానామ్ని మంత్రాలు నిలిపి నిలిపి పఠించాలి. పురీషపద మంత్రాలు పఠించేటప్పుడు పూర్తయ్యే వరకు నిలపాల్సిన అవసరం లేదు.

మతపరమైన ఆచారాల్లో తాయత్తులు (మణులు) ధరించడం కూడా ఒక భాగం. అంతులేని సంపదను, ఆరోగ్యాన్ని, శత్రువులపై విజయాన్ని కోరే వ్యక్తి 'బిల్వమణి' (మారేడు తాయత్తు) ని ధరించాలి. దీనిని ధరించకోరే వ్యక్తి మూడు రాత్రులు కేవలం పూలు మాత్రం ఆహారంగా తీసుకుంటూ ఏనుగునీడలో గాని, పులిచర్మం మీదగాని అగ్నిని ప్రతిష్టించి కొన్ని హోమాలు చెయ్యాలి. బిల్వమణిని మొదట తేనెలో, తరువాత నేతిలో, అటు తరువాత అన్నంలో ఏడు లేదా మూడేసి రాత్రులపాటు నానబెట్టాలి. ధరించడానికి ముందు ప్రార్థనా పూర్వకమైన మంత్రాలు చదవాలి. ఈ బిల్వమణిని ధరించిన వానికి అపజయమన్నది లేదు. దొంగలవల్లగాని, ఇతరులవల్లగాని అతనికి ఎలాంటి ఇబ్బందులు రావు. రాక్షస పిశాచాదులు అతనికి ఎట్టి హాని కలిగించవు. ఇలాగే ఆముదపు చెట్టు, చంద్ర చెట్టు యొక్క తాయత్తుల గురించి చెప్పబడింది.

వైదికమతంలోని మరొక ప్రధానభాగం ప్రాయశ్చిత్త కాండ. తెలిసికాని, తెలియక కాని చేసిన అనేక అపరాధాలకు పరిహారంగా కూశ్మాండ హోమ మంత్రాలలో చెప్పబడింది. దేవతలను అవమానించడం, తీసుకున్న అప్పు ఎగవేయడం, గర్భపాతం మొదలగు చెడుపనుల వల్ల కలిగిన పాపాలను ఈ కూశ్మాండ హోమం చేయడం వలన విముక్తి లభిస్తుంది. అంతేకాక వ్యాధి రూపంలో పీడిస్తున్న పాపాలు కూడా తొలగిపోతాయి.

'ప్రవర్గ్య' మనే మరో వైదిక కర్మ రెండు ప్రపాఠకాలలో విస్తృతంగా వర్ణించబడింది. ఈ ప్రవర్గ్య కర్మ సోమయాగానికి అంగంగా జరుపబడుతూ ఉంటుంది. దీనిని స్వతంత్రంగా కూడా ఆచరించవచ్చు. ఇది శరీరంలో శిరస్సు వలె యజ్ఞాలలో అతి ముఖ్యమైనది. ప్రవర్గ్యమనేది ఈ కర్మకే కాకుండా, ఇందులో ఉపయోగించే కుండకు కూడా ప్రవర్గ్యమనే పేరు. దీనికి 'మహావీర' మనే పేరు కూడా ఉంది. ఈ యాగానుష్టానం వల్ల కలిగే దీప్తి, స్వర్గప్రాప్తి మొదలైనవే కాక ప్రవర్గ్యం పూర్తి అయిన తరువాత మహావీరపాత్ర మొదలగు

వాటిని విసర్జించే చోటునుబట్టి రకరకాల ఫలితాలు కలుగుతాయి. ఉద్వాసన ఉత్తరవేదితో జరిగితే యజమానికి అన్నలోపం ఉండదు. నీటిలో విసర్జిస్తే తేజస్వి అవుతాడు. తాను ద్వేషించే వ్యక్తి ఉన్న దిశకు విసర్జిస్తే, ఆ శత్రువు నశిస్తాడు. మేడికొమ్మపైన ఉద్వాసన జరిగితే శారీరక పుష్టి కలవాడవుతాడు. దర్భ దుబ్బులపైన ఉద్వాసన చేస్తే, సకాలంలో వర్షాలు పడతాయి.

మరణించినవారి కోసం జరిపే పైతృక కర్మలను గురించి పితృమేధం అనేపేరు గల ప్రపాఠకంలో వివరించబడింది. పైతృక కర్మలో ప్రధానాంశం శవదహనం. శరీరాన్ని విడిచిన తరువాత ఆ ప్రాణిని 'ప్రేత' అని సంబోధిస్తారు. ప్రేతాన్ని ఉద్దేశించి అనేక హోమాలు, ప్రార్థనలు జరుగుతాయి. జీవించి ఉన్న పుత్రపౌత్రాదులు, బంధువులు మొదలగు వారికి కష్టాలు, నష్టాలు, రోగాలు, అకాల మరణాలు సంభవించకుండా చూడమని ప్రార్థించడం జరుగుతుంది. ఆ మంత్రాలలో అతని గమ్యస్థానమైన యమ సదనాన్ని గురించీ, దానికి సంబంధించిన మార్గాన్ని గురించి, అందులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి వివరించబడింది. 'నళము' అనే గడ్డిని విసరివేస్తూ 'ఓ ప్రేతమా! నీవు దీనిని నావగా ఉపయోగంచుకో' అని – రెల్లుగడ్డిని విసరివేస్తూ 'దీనితో రాక్షసుల నుంచి నిన్ను నీవు కాపాడుకో' అని – దర్భలను విసిరివేస్తూ 'దీనిని ఓషధిగా వాడుకో' అని చెప్పడం జరుగుతుంది. పితృదేవతలకు యముడు రాజు. అతడిని ఉద్దేశించినవి అనేక ప్రార్థనలు, ఆహుతులు ఉన్నాయి.

శాశ్వత పురుషార్థమైన మోక్షం, దాన్ని పొందడానికి కావలసిన ఉపాయాన్ని బోధించడమే ఆరణ్యక గ్రంథాల ముఖ్యోద్దేశం. పెరుగునుంచి వెన్నను, మలయ పర్వతం నుంచి చందనాన్ని, వేదాల నుంచి ఆరణ్యకాన్ని, ఓషధులనుంచి అమృతాన్ని సారంగా గ్రహించాలని మహాభారతం వేదసారంగా ఆరణ్యకాలను పేర్కొంటున్నది.

## ఋగ్వేదం – ఆరణ్యకాలు :

ఋగ్వేదానికి సంబంధించి 21 శాఖలుండేవి. వాటిలో నశించిపోయినవి పోగా ఐతరేయ, కౌషీతకి (శాంఖాయన), పైంగి, బహ్వృచ, ఆశ్వలాయన, గాలవ బ్రాహ్మణాలు ఆరు ఉండేవి. కాని వాటిలో చివరి నాలుగు నశించిపోయి ఐతరేయ, కౌషీతకి బ్రాహ్మణాలు రెండే మిగిలి ఉన్నాయి. ఆరణ్యకాలు బ్రాహ్మణాలకు పరిశిష్ట భాగాలు కాబట్టి ఋగ్వేదానికి ఐతరేయ – కౌషీతకారణ్యకాలు రెండే ఇప్పుడు దొరుకుతున్నాయి. పైంగ్యారణ్యకం, బహ్వృచారణ్యకం, ఆశ్వలాయనారణ్యకం, గాలవారణ్యకం పేరుకు మాత్రమే మిగిలి ఉన్నాయి.

## ఐతరేయారణ్యకం :

ఋగ్వేదానికి గల శాకల శాఖకు సంబంధించింది ఐతరేయారణ్యకం. యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు. ఆయన పెద్ద భార్యపైన ఆసక్తితో ఆమెను ప్రియురాలని, రెండవ భార్య మీద ప్రేమ తక్కువగా ఉండటం చేత ఆమెను 'ఇతర' అని పిలుస్తుండేవాడు. 'ఇతర' అని మహర్షి చేత నిరాదరణతో చూడబడే రెండవ భార్య కుమారుడు మహిదాసు. ఇతడు ఐతరేయుడు అని ప్రసిద్ధి. ఇతడు తన పేరున ఐతరేయ బ్రాహ్మణము, ఐతరేయారణ్యకం రచించాడు.

ఐతరేయారణ్యకంలో గల అరవై ఒక్క ఖండలు కొన్ని అధ్యాయాలుగా, ఆరణ్యకాలుగా విభజించబడ్డాయి. ఈ ఆరణ్యకంలో రెండు రకాల అధ్యాయ విభాగాలు కనబడుతున్నాయి. షడ్గురు శిష్యుడు వ్రాసిన వ్యాఖ్యానం "మోక్షప్రద" అనుసరించి ఒక విభాగము, సాయణాచార్యుని భాష్యంలో కనబడే విభాగం ఇంకొకటి. మోక్షప్రద ప్రకారం ఈ ఆరణ్యకం నాలుగు భాగాలు చేయబడింది. ప్రతి భాగానికీ ఆరణ్యకమనే పేరున్నది. ప్రతి ఆరణ్యకం కొన్ని అధ్యాయాలుగా, అధ్యాయాలు కొన్ని ఖండలుగా విభజించబడింది. మూడు, నాలుగు ఆరణ్యకాల మధ్య భాగంలో గల అధ్యాయాన్ని సకృదుక్తి ఖండాధ్యాయ మని మోక్షప్రద పేర్కొంటున్నది. ఇందులో మహానామ్ని అనే పేరుగల తొమ్మిది ఋక్కులున్నాయి.

సాయణాచార్య భాష్యంలో అయిదు ఆరణ్యకాలుగా విభజించబడింది. రెండో ఆరణ్యకంలో ఏడు అధ్యాయాలు, మూడో ఆరణ్యకంలో రెండే అధ్యాయాలు ఈ భాష్యంలో చోటు చేసుకున్నాయి. సకృదుక్తి ఖండాధ్యాయాన్ని మూడో ఆరణ్యకం తరువాత మోక్ష ప్రద పేర్కొన్న భాగాన్ని సాయణుడు ప్రత్యేకారణ్యకంగా వివరించాడు.

ప్రథమారణ్యకంలో గవామయన, మహావ్రతాల వర్ణన, ప్రాతస్సవనము, మాధ్యందిన సవనం, సాయం సవనలనే యాగాల గురించి వివరించబడింది. ఐశ్వర్యం, భోగభాగ్యాలు, కీర్తి ప్రతిష్టలు, సంతానం, పశువులు, ధానాది ద్రవ్యాలను కోరేవారు ఈ మహావ్రతాన్ని చేయాలి. ఈ యాగాన్ని చేయవలసిన కాలం, హోమాలు, మంత్రాలు, క్రమం స్పష్టంగా వివరించబడింది.

రెండవ ఆరణ్యకంలో జ్ఞానం, కర్మ ఈ రెండింటి ఆవశక్యత. దానివల్ల పరబ్రహ్మ ప్రాప్తి ఇందులో వివరించబడింది. వైదికానుష్టాన్ని అనుసరించేవాళ్లు, దాన్ని ఉల్లంఘించే వాళ్లు ఎలాంటి గతులను పొందుతారో వివరించబడింది.

తృతీయారణ్యకంలో ఆత్మకు సృష్టికి గల సంబంధం, శరీరం భౌతికమనే భావన తెలియజేయబడినాయి. చతుర్థారణ్యకంలో మహానామ్ని ఋక్కుల సంగ్రహం ఉంది. పంచమారణ్యకంలో మనుష్య శరీరోత్పత్తి ప్రకారం జనన-మరణ చక్రంలో భ్రమిస్తూం డటం వల్ల జీవుడనుభవించే క్లేశాలు, ఆత్మస్వరూపం మొదలగు విషయాలు వర్ణించబడింది. మహావ్రతానికి సంబంధించిన సామిధేని మొదలగు ఋక్కుల వివరణ ఉంది. నిష్కైవల్య శాస్త్రము (మంత్రోపతోప యోగి మంత్రభాగము)చివరి అధ్యాయంలో వర్ణించబడి ఉంది.

సర్వవ్యాప్తమైన భగవతత్త్వాన్ని అనుభవములోకి తీసుకువచ్చే ప్రయత్నమే ఉపాసన. ఉపాసన మోక్షసాధనం. ఆరణ్యకాలలో, ఉపనిషత్తులలో మోక్షసాధనాలైన ఎన్నో ఉపాసనలను ఉద్దేశించబడ్డాయి. ఉపాసన అంటే అనుష్టానం, ఏకాగ్రచిత్తవృత్తి, తనలో ఉన్న స్మృతి సంతతి, జ్ఞాన విశేషం, భక్తి, సేవ, దర్శన సమాకారమనే అర్థాలు ఉన్నాయి.

ఐతరేయారణ్యకంలో - హింకారోపాసన, ఉదరోపాసన, హృదయోపాసన, ప్రాణోపాసన, ఆత్మోపాసన, సంహితోపాసన, నిర్భుజోపాసన ఉపదేశించబడ్డాయి. ఈ అదే ఆరణ్యకంలోని మొదటి మూడు భాగాలకు ఇతరా పుత్రుడు ఐతరేయ మహిదాసుడును, నాల్గవ దానికి ఆశ్వలాయనుడు, అయిదవ భాగానికి శౌనకుడు ఋషులుగా చెప్పబడ్డారు.

ఐతరేయారణ్యకాన్ని సాయణ భాష్యంతో రాజేంద్రలాల్‌మిత్ర కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీ తరఫున 1876లో ప్రచురించాడు. పూనాలోని ఆనందాశ్రమం ద్వారా బాబాశాస్త్రి ఫడకే 1898లో సాయణ భాష్యంతో ప్రచురించాడు. ఎ.బి.కీత్ ఆంగ్లానువాదంతో ఆక్స్‌ఫర్డ్‌లో 1919లో ప్రచురించాడు. 'మోక్షప్రద' వృత్తితో 1968లో ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ తరఫున కె. రాఘవపిళ్లై ప్రచురించాడు. మంగళదేవశాస్త్రి 'ఐతరేయారణ్యక పర్యాలోచనం' అనే విమర్శ రచించి 1953లో బెనారస్ నుండి ప్రకటించాడు.

## కౌషీతకి (శాంఖాయన) ఆరణ్యకం :

ఋగ్వేదానికి సంబంధించిన శాంఖాయన శాఖకు సంబంధించినది కౌషీత కారణ్యకం లేక కౌషీతక్యారణ్యకం. ఋగ్వేదములో ప్రసిద్ధమైన శాఖలో శాంఖాయన శాఖ ఒకటి. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం శాంఖాయన బ్రాహ్మణం. దీనిని కౌషీతకి బ్రాహ్మణము అని కూడా అంటారు. ఉద్దాలకుని శిష్యుడు గుణాఖ్య శాంకాయనుడు. కహోల కౌషీతకి ఇతని దగ్గర వేదాధ్యయనం చేశాడు. ఆయన

ప్రవర్తింపజేసిన బ్రాహ్మణం కాబట్టి దీనికి కౌషీతకి బ్రాహ్మణమని పేరు వచ్చింది. శాఖా ప్రవర్తకుడు శాంఖాయనుడు కాబట్టి ఆ పేరుతోనూ ఈ బ్రాహ్మణం పిలవబడుతుంది. ఈ బ్రాహ్మణానికి పరిశిష్టంగానే శాంఖాయనారణ్యకమనే ప్రసిద్ధి గల కౌషీతకారణ్యకం ఏర్పడింది.

కౌషీతకారణ్యకంలో పదిహేను అధ్యాయాలున్నాయి. ఈ అధ్యాయాలలో నూట ముప్పై ఏడు ఖండాలున్నాయి. మొదటి రెండు అధ్యాయాలు శాంఖాయన బ్రాహ్మణమని, మిగిలిన పదమూడు అధ్యాయాలు మాత్రమే శాంఖాయనారణ్యకమని కొందరి అభిప్రాయం. ఆరణ్యకాలలో బ్రాహ్మణ గ్రంథ ఛాయలు, ఉపనిషత్తుల ఛాయలు కొన్ని ఉండడం సహజం. మహావ్రతాన్ని వర్ణించే మొదటి రెండు అధ్యాయాలు ఆరణ్యకమే కాని బ్రాహ్మణం కాదన్నారు కొందరు.

ప్రథమాధ్యాయంలో మహావ్రతం నిరూపించబడింది. ద్వితీయాధ్యాయంలో హింకారవర్ణనం. తృతీయాధ్యాయంలో చిత్రగాంగాయని – శ్వేతకేతు – ఆరణి తత్త్వవిషయక చర్చ. నాలుగో అధ్యాయంలో కౌషీతకి, పైంగ్య, శుష్క బృంగారోక్తమైన కల్పాలు, వాటి వాటి గొప్పతనాన్ని చాటుకోవడానికి వాదించుకునే ఇంద్రియాల కథ, అందులో ప్రాణశ్రేష్టత్వ నిరూపణ వివరించబడింది. పంచమాధ్యాయంలో దివోదాస పుత్రుడైన ప్రతర్ధనునికి – ఇంద్రునికి జరిగిన సంవాదం వివరించబడింది.

ఆరవ అధ్యాయంలో గార్గ్యుడైన బాలాకి – అజాత శత్రువుల మధ్య జరిగిన బ్రహ్మ విషయక సంవాదం వివరించబడింది. ఏడో అధ్యాయంలో సంహితోపనిషత్తు వివరించబడింది. ఎనిమిదవ అధ్యాయంలో ప్రాణోపాసన గొప్పదనం; శరీర పురుష, చందఃపురుష, వేదపురుష, మహాపురుషులని నాలుగు విధాల పురుషుల స్వరూపం విశదీకరించబడింది. తొమ్మిదో అధ్యాయంలో గాయత్రీ మహిమ, ప్రాణం యొక్క జ్యేష్ఠత్వ, శ్రేష్ఠత్వ గుణాలను ప్రతిపాదిస్తూ ప్రాణమే బ్రహ్మగా ఉపాసించాలని చెప్పబడింది. పదో అధ్యాయంలో ఆధ్యాత్మికమైన ఆన్తరాగ్నిహోత్రం అభివర్ణింపబడింది.

పదకొండో అధ్యాయంలో అగ్న్యాది దేవతలలో పురుషరూపోపాసన, మరణ సూచకాలైన కొన్ని అరిష్టాలు, కొన్ని దుఃస్వప్నాలు, వాటి ఫలితాలు, వాటి పరిహారం కోసం చేయవలసిన హోమాలు, కొన్ని ఆశీస్సులు, ప్రార్థనలు వివరించబడ్డాయి. పన్నెండో అధ్యాయంలో ఇరామణికల్పం విపులంగా వర్ణించబడింది. పదమూడో అధ్యాయంలో వైరాగ్యం చేత సుసంస్కృతమైన శరీరముతో బ్రహ్మ యజ్ఞనిష్టతో ఉన్నవాడికి అపమృత్యు

భయం లేదని చెప్పి, ఆత్మదర్శనం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేస్తూ, బ్రహ్మచర్యంతో శ్రద్ధతో జీవితాన్ని యజ్ఞ భావనతో గడిపితే బ్రహ్మైక్యం సిద్ధిస్తుందని ప్రతిపాదించబడింది. పధ్నాలుగో అధ్యాయంలో వేదాధ్యయనం చేయనివాని జీవితం వ్యర్థమని చెప్పి, వేదాధ్యయనం చేసి అర్థం తెలుసుకోకుండా ఊరికే వల్లెవేసేవాడు భారహరుడేనని, అర్థం తెలుసుకోగలిగితే సకల సంపదలను చివరకు స్వర్గాన్ని పొందగలరని వివరించబడింది. పదిహేనో అధ్యాయంలో ఈ శాఖకు సంబంధించిన పరంపర పేర్కొనబడింది.

స్వయంభూ బ్రహ్మతో ప్రారంభమై, ప్రజాపతి, ఇంద్రుడు, విశ్వామిత్రుడు, దేవరాతుడు, సాకమశ్వడు, వ్యశ్వడు, విశ్వమనసుడు, ఉద్దాలకుడు, సుమ్నయువు, బృహద్దివుడు, ప్రతివేశ్యుడు, సోమపుడు, ప్రియవ్రతుడు, ఆరుణి, కౌషీతకి, శాంఖాయనుడు మొదలగు ఋషి పరంపరగా ఈ ఆరణ్యకం అధ్యయనం చేయబడింది.

ఈ ఆరణ్యకంలో మహావ్రతోపాసన, సంహితోపాసన, అక్షరోపాసన, ప్రాణోపాసన, పురుష చతుర్విధం, ణ కార ష కారాల ప్రాధాన్యం మొదలగు అంశాలు విపులీకరించబడింది.

శాంఖాయనారణ్యకానికి ఎవరూ భాష్యం కాని, వ్యాఖ్యానాలు గాని వ్రాసిన దాఖలాలు లేవు. ఉదయనుడు వ్రాసిన వ్యాఖ్యానం శాంఖాయన బ్రాహ్మణానికే గాని, ఆరణ్యకానికి వ్రాసినట్లు లేదు.

శాంకాయనారణ్యకాన్ని మొట్టమొదట ఇ.బి. కోవెల్ సంపాదకత్వంలో 1861లో కలకత్తా నుంచి వెలువడింది. ఈ ఆరణ్యకంలోని మొదటి రెండు అధ్యాయాలు వాల్టర్ ఫ్రెండ్‌లండర్ సంపాదకత్వంలో ఆంగ్లానువాదంలో 1900లో బెర్లిన్ నుంచి ప్రచురించ బడింది. ఈ ఆరణ్యకం ఏడో అధ్యాయం నుండి పదిహేనో అధ్యాయం వరకు ఎ.బి. కీథ్ సంపాదకత్వంలో 1909లో ఆక్స్‌ఫర్డ్ నుంచి వెలువడింది. 1922లో పూనాలోని ఆనందాశ్రమం తరఫున పూర్తి శాంఖాయనారణ్యకాన్ని శ్రీధరశర్మ పాఠక్ ప్రచురించాడు.

## యజుస్సంహిత – ఆరణ్యకాలు :

యజుర్వేదం శుక్ల – కృష్ణ భేదంతో రెండు విధాలు. అందులో శుక్ల యజుర్వేదానికి మాధ్యందిన – కాణ్వ భేదంతో రెండు శాఖలున్నాయి. ఈ రెండు శాఖలకు విడివిడిగా శతపథ బ్రాహ్మణాలు ఉన్నాయి. చిన్న చిన్న తేడాలు తప్ప విషయలో భేదం లేదు. ఈ బ్రాహ్మణాలు రెండింటిలో ఒక భాగంగా బృహదారణ్యకం ఉంది.

కృష్ణ యజుర్వేదంలోని తైత్తిరీయ శాఖకు సంబంధించినది తైత్తిరీయ బ్రాహ్మణం. ఆ బ్రాహ్మణానికి పరిశిష్టమే తైత్తిరీయారణ్యకం. కృష్ణ యజుర్వేదంలోని మైత్రాయణీయ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం మైత్రాయణీయ బ్రాహ్మణం. దీనికి పరిశిష్టమే మైత్రాయణీయారణ్యకం. దీన్ని కూడా చరక శాఖలకు సంబంధించిన బృహదారణ్యకం అంటారు.

యజుస్సంహితకు సంబంధించిన – చరకారణ్యకం, శ్వేతాశ్వరరారణ్యకం, కాఠకారణ్యకం, జాబాలారణ్యకం, ఖాండికేయారణ్యకం, ఔఖేయారణ్యకం, హారిద్రవికారణ్యకం, తుంబుర ఆరణ్యకం, ఆహ్వారకారణ్యకం, కంకత్యారణ్యకం, ఛాగలేయారణ్యకం మొదలగునవి పేరుకున్నాయి గాని, లభించడం లేదు.

## తైత్తిరీయారణ్యకం :

కృష్ణ యజుర్వేదానికి గల తైత్తిరీయ శాఖకు సంబంధించిన ఆరణ్యకం తైత్తిరీయారణ్యకం. తైత్తిరీయ బ్రాహ్మణ పరిశిష్ట భాగమే తైత్తిరీయారణ్యకం. వైశంపాయనుని శిష్యుడు పైంగియాస్కుడు. తిత్తిరి మహర్షి అతని శిష్యుడు. తిత్తిరి శిష్యుడు ఉఖుడు. ఉఖుని శిష్యుడు ఆత్రేయుడు. తైత్తిరీయ శాఖ ప్రవర్తకులలో తిత్తిరి మహర్షి ప్రముఖ స్థానంలో ఉండడంచేత దీనికి తైత్తిరీయమనే పేరు వచ్చింది.

తైత్తిరీయారణ్యకంలో పది ప్రపాఠకాలున్నాయి. ప్రతి ప్రపాఠకములో కొన్ని అనువాకాలు ఉన్నాయి. మొదటి రెండు ప్రపాఠకాలకు కాఠకమని పేరు. సాయణుడు పదో ప్రపాఠకము ఖిలకాండమని తన భాష్యంలో పేర్కొన్నాడు. ఏడు, ఎనిమిది, తొమ్మిది ప్రపాఠకాలు తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధి పొందింది.

మొదటి ప్రపాఠకంలో 'ఆరుణకేతుకం' లేక 'అరుణం' సూర్యుని వర్ణనం, మహత్త్వం, ప్రశంస మొదలైన అంశాలతో కూడిన మంత్రాలు దీనిలో పుష్కలంగా ఉన్నాయి. రెండవ ప్రపాఠకానికి 'స్వాధాయ బ్రాహ్మణం' అని పేరు. యజ్ఞోపవీతాన్ని (జందెం) ధరించే విధానం, దాని అవసరం, దాని ఫలితం, అర్ఘ్య ప్రదానం యొక్క ఔచిత్యం, వేదాన్ని అధ్యయనం చేసే తీరు మొదలైన విషయాలు దీనిలో ఉన్నాయి.

మూడు, నాలుగు, అయిదు ప్రపాఠకాలలో అగ్ని, ఇంద్రుడు, పూష మొదలైన దేవతలను స్తుతించే మంత్రాలే అధికంగా ఉన్నాయి. ఇవి పూర్తిగా యజ్ఞకర్మకు ఉపయోగించేవి. ఆరవ ప్రపాఠకం 'పితృమేధం' అనే అపకర్మకు వినియుక్తమైంది. యజ్ఞయాగాలు చేసినవారు, చేయవలసిన కర్మలను ఇది విశదం చేస్తుంది.

ఏడవ ప్రపాఠకం శిక్షావల్లి, ఎనిమిదవ ప్రపాఠకం ఆనందవల్లి, తొమ్మిదవ ప్రపాఠకం భృగువల్లి – ఈ మూడింటికి మొత్తంగా 'తైత్తిరీయోపనిషత్తు' అని పేరు. పదవ ప్రపాఠకానికి 'నారాయణోపనిషత్తు', 'యాజ్ఞిక్యుపనిషత్తు' అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. అందుచేత ఇది కేవలం బ్రహ్మ తత్త్వాన్ని చెప్పే ఉపనిషత్తని అనుకోనక్కరలేదు. వివిధ కర్మలకు, వివిధ ధర్మాలకు సంబంధించిన మంత్రాలు కూడా ఇందులో విరివిగా ఉన్నాయి.

తైత్తిరీయారణ్యకానికి భట్ట భాస్కరుడు, సాయణుడు వ్రాసిన భాష్యాలు లభ్యమవుతున్నాయి. ఔఫ్రిత్ తయారుచేసిన పుస్తక సూచిలో తైత్తిరీయారణ్యకానికి వరదరాజు భాష్యం వ్రాసినట్లు పేర్కొన్నాడు. కాని కాలగర్భంలో కలిసిపోయింది. భవస్వామి కూడా తైత్తిరీయారణ్యకానికి భాష్యం వ్రాసినట్లు తెలుస్తుంది కాని, లభ్యం లేదు.

తైత్తిరీయారణ్యకాన్ని 1872లో కలకత్తా నుంచి రాజేంద్రలాల్ మిత్ర సాయణ భాష్యంతో ప్రకటించాడు. 1898లో పూనా ఆనందాశ్రమం నుంచి బాబాశాస్త్రి ఫడకే ప్రచురించాడు. 1902లో భట్ట భాస్కర భాష్యంతో తైత్తిరీయారణ్యకం ప్రచురించబడింది. తరువాత ఆనందాశ్రమం వారి సంస్కరణం ఒకటి వెలువడింది.

## మైత్రాయణీయారణ్యకం :

కృష్ణ యజుర్వేదానికి గల నాలుగు శాఖలలో మైత్రాయణీయ శాఖ ఒకటి. ఇది చరక శాఖల్లో ఉంది. దీన్ని కాలాపశాఖ అని కూడా అంటారు. ఈ శాఖకు సంబంధించిన సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్తు మైత్రాయణీయమనే పేరుతో పిలువ బడుతుంది. మైత్రాయణి మహర్షి ఈ శాఖను మానవ, వరాహ, దుందుభ, ఛాగలేయ, హరిద్రవీయ, శ్యామాయనీయ అనే ఆరుగురు శిష్యుల ద్వారా ప్రవర్తింప చేశాడు. మైత్రాయణీయారణ్యకాన్ని కొందరు బృహదారణ్యకమని పిలుస్తారు.

మైత్రాయణీయ సంహితలోని నాలుగోకాండ మైత్రాయణీయ బ్రాహ్మణమని, దాని పరిశిష్టమే మైత్రాయణీయారణ్యకమని చరిత్రకారుల భావన. దీనినే మైత్రాయణీ యోపనిషత్తు అనికూడా అంటారు. మైత్రాయణీయారణ్యకంలో ఏడు ప్రపాఠకాలున్నాయి. డెబ్భైమూడు ఖండలున్నాయి.

మొదటి ప్రపాఠకంలో బృహద్రథుడనే రాజు వానప్రస్థుడై తపస్సు చేసి, పూజ్యుడైన శాకాయన్యుణ్ణి 'హేయమైన, అశాశ్వతమైన ఈ శరీరంతో క్షణికమైన భోగాలననుభవించడం

వివేకం కాదు. నన్ను ఉద్ధరించి తరుణోపాయాన్ని ఉపదేశించ'మని ప్రార్థిసాడు. రెండవ ప్రపాఠకంలో శాకాయన్యుడు ప్రాణస్వరూపాన్ని, సృష్టిస్వరూపాన్ని బృహద్రధునికి ఉపదేశిస్తాడు. తృతీయ ప్రపాఠకంలో భూతాత్మ స్వరూపం, శరీర స్వభావం పేర్కొనబడింది. నాలుగవ ప్రపాఠకంలో శబ్ద స్పర్శాదులకు లొంగిపోయినవాడు పరమపదాన్ని స్మరించడని, తపస్సు ద్వారా మనోనిగ్రహాన్ని సంపాదించాలని చెప్పబడింది. అయిదవ ప్రపాఠకంలో కాత్సాయని స్తుతి, ఆత్మస్వరూపం పేర్కొనబడింది. ఆరో ప్రపాఠకంలో ప్రాణస్వరూపం, సూర్యస్వరూపం, సూర్యమహిమ, కాలస్వభావం, శబ్ద బ్రహ్మస్వరూపం, చిత్తస్వరూపం నిరూపించబడినాయి. ఏడో ప్రపాఠకంలో ఆత్మ స్వరూపం, అవిద్యా స్వరూపం మొదలగు అంశాలు ప్రతిపాదించబడ్డాయి.

మైత్రాయణీయారణ్యకంలో పరబ్రహ్మోపాసన, ఆదిత్యోపాసన, అన్నోపాసన, షడంగయోగం, శబ్దోపాసన, ప్రణవోపాసన ఉపదేశించబడ్డాయి.

మైత్రాయణీయారణ్యకానికి రామతీర్థుడు వ్రాసిన దీపిక అనే వ్యాఖ్యానం లభిస్తుంది. ఈ ఆరణ్యకానికి సాయణాచార్యుడు భాష్యం వ్రాసిన దాఖలా లేదు. ఔఫ్రిత్ తన పుస్తక సూచిలో ఈ ఆరణ్యకానికి శంకరాచార్యుని భాష్యం, నారాయణుని దీపిక, ప్రకాశాత్ముని దీపిక, విజ్ఞాన భిక్షువు రచించిన 'ఆలోక' వ్యాఖ్యానాలున్నట్లు ఉంది.

మైత్రాయణీయారణ్యకానికి రామతీర్థుని దీపికా వ్యాఖ్యానంతో పూనాలోని ఆనందాశ్రమం తరఫున వినాయక గణేశ ఆప్టే 1925లో ప్రచురించాడు.

## బృహదారణ్యకం :

శుక్ల యజుర్వేదానికి సంబంధించిన శతపథ బ్రాహ్మణ పరిశిష్టమే బృహదారణ్యకం. మాధ్యందిన శతపథ బ్రాహ్మణంలో ఉన్న పధ్నాలుగు కాండల్లో చివరి కాండమే బృహదారణ్యకం. అందులోని చివరి ఆరు అధ్యాయాలు బృహదారకోపనిషత్తుగా ప్రసిద్ధి చెందింది. కాణ్వశాఖకు సంబంధించిన శతపథ బ్రాహ్మణంలో చివరి అయిదు అధ్యాయాలు బృహదారణ్యకంగా గుర్తించబడినాయి. మాధ్యందిన, కాణ్వ శాఖలకు సంబంధించిన బృహదారణ్యకాలు పేరుకు రెండుగా ఉన్న, అధ్యాయాల విభాగాల్లో చిన్న తేడాలు తప్ప విషయంలో మార్పు లేదు.

మాధ్యందిన శతపథ బ్రాహ్మణంలోని బృహదారణ్యకంలో ఆరు అధ్యాయాలున్నాయి. వాటిలో మొత్తం నలభై నాలుగు బ్రాహ్మణాలున్నాయి. ఈ బ్రాహ్మణాలు

మళ్ళీ ఖండాలుగాను, ఖండికలుగాను విభజించబడ్డాయి. కాణ్వశాఖకు చెందిన బృహదారణ్యకంలో కూడా ఆరు అధ్యాయాలే. వాటిలో నలభై ఏడు బ్రాహ్మణాలున్నాయి. అధ్యాయాల విభాగాలలో తేడా తప్ప రెండు ఆరణ్యకాల విషయంలో భేదం లేదు.

బృహదారణ్యకం మొదటి అధ్యాయంలో ప్రాణ స్వరూపాన్ని గురించి ఎన్నో విషయాలను తెలియజేయడం జరిగింది. రెండో అధ్యాయంలో యాజ్ఞవల్క్యుడు గార్గికి బ్రహ్మవిద్యోపదేశం చేయడం, గార్గి – అజాత శత్రువుల సంవాదం, స్వప్న వృత్తి స్వరూపం, సుషుప్తి స్వరూపం, మూర్తామూర్త భేదంతో బ్రహ్మద్వైవిధ్యం, యాజ్ఞవల్క్య – మైత్రేయీ సంవాదం, అమృతత్వాన్ని గురించి, మోక్షాన్ని గురించి యాజ్ఞవల్క్యుడు వివరించడం, మధువిద్య, ప్రాణ వర్ణనం మొదలగు అంశాలు నిరూపింపబడినాయి. మూడో అధ్యాయంలో ఎనిమిది గ్రహాలు, ఎనిమిది అతిగ్రహాలు, మృత్యువు, కాలం, ఆత్మ స్వరూపం, అంతర్యామి, అక్షర స్వరూపం, దేవతలు, ప్రాణం, దిక్కులు, హృదయ శరీరాలు మొదలగు విషయాలు విస్తారంగా వివరించబడ్డాయి. నాలుగో అధ్యాయంలో జనన మరణాలు, స్వప్నావస్థ, మోక్ష స్వరూపం, జ్ఞానం, ప్రాణం ఇంకో దేహంలో ప్రవేశించడం, మోక్ష విషయంలో భిన్నాభిప్రాయాలు, విద్య–అవిద్యల స్వరూపం, ఆత్మజ్ఞాని నిశ్చలత్వం, నిర్భయత్వం, అమృతత్వం, బ్రహ్మస్వరూపం, ప్రాణశబ్దార్థం, మరణ సమయంలో ఇంద్రియాలు సూక్ష్మ శరీరాన్ని చేరడం, జ్ఞానం వల్ల పాపం దహించుకుపోవడం, సృష్టికి ముందుగల బ్రహ్మస్వరూపం మొదలగు అంశాలు వివరించబడినాయి. అయిదో అధ్యాయంలో 'ద' కారోపదేశం, హృదయమంటే ఏమిటి ? మనోమయ పురుషోపాసన, విద్యుద్బ్రహ్మోపాసన, వాక్కును ధేనువుగా ఉపాశించడం, వైశ్వానరాగ్ని స్వరూపం, ప్రాణోపాసన, గాయత్ర్యుపాసన, గాయత్రీ శబ్ద నిర్వచనం, గాయత్రీ మాహాత్మ్యం మొదలగు విషయాలు వివరించబడినాయి. ఆరో అధ్యాయంలో ప్రాణోపాసన, వాగుపాసన, చక్షురుపాసన, శ్రోత్రోపాసన మొదలగు అంశాలు విశేషంగా వివరించబడ్డాయి. చివరలో నామకర్మ, సంతానోత్పత్తి విధానం మొదలగు అంశాలు నిరూపింపబడినాయి.

మాధ్యందిన శాఖకు చెందిన బృహదారణ్యకానికి సాయణభాష్యం లభిస్తున్నది. శ్రీ గణేశశాస్త్రి పాఠక్ సర్వప్రకాశం అనే భాష్యం వ్రాశాడంటారు కాని, కనిపించడం లేదు. కాణ్వశాఖకు చెందిన బృహదారణ్యకానికి వ్యాఖ్యానాలు లేనేలేవు. బృహదారణ్యకానికి ఉపనిషత్తుగా ప్రసిద్ధి ఉండటం చేత శంకరాచార్యులు అద్వైతపరంగాను, శ్రీ రంగ రామానుజులు విశిష్టాద్వైతపరంగాను, ఆనందతీర్థులు ద్వైతపరంగాను భాష్యాలు వ్రాశారు.

శతపథ బ్రాహ్మణానికి లండన్ నుంచి సాయణ భాష్యంతో 1885లో ఎ. వేబర్ ప్రచురణ, 1902లో అజ్మీర్ నుంచి మరో ప్రచురణ, 1905లో కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీ ద్వారా సాయణ భాష్యంతో సత్యవ్రతసామాశ్రమి ప్రచురణ, సేక్రెడ్ బుక్ ఆఫ్ ది ఈస్ట్ గ్రంథమాలలో అయిదు సంపుటాలుగా ఆంగ్లానువాదంతో ఎగ్గలింగ్ ప్రచురణ, 1926లో లాహోరు నుంచి డబ్ల్యు. కాలండ్ ప్రచురణ, 1937లో కాశీ నుండి ఒక ప్రచురణ, 1940లో బొంబాయి నుంచి సాయణ భాష్యంతో శ్రీధరశర్మ ప్రచురణ ఏర్పడినాయి. వీటిలో బృహదారణ్యకం కలసి ఉన్నది.

## సామసంహిత-ఆరణ్యకాలు :

సామవేదానికి ఒకప్పుడు వెయ్యి శాఖలుండేవి. ఎన్నో శాఖలు నశించిపోగా రాణాయనీయ, కౌథుమ, జైమినీయ శాఖలు మూడు మాత్రమే మిగిలాయి. అందులో రాణాయని మహర్షి ప్రవర్తింపజేసిన రాణాయనీయ శాఖ కాగా, కుథుమి మహర్షి ద్వారా ఏర్పడిన శాఖ కౌథుమశాఖగా, జైమిని మహర్షి ద్వారా ప్రచారంలోకి వచ్చిన శాఖ జైమినీయ శాఖగా ప్రసిద్ధి పొందింది.

కౌథుమ శాఖకు సంబంధించిన బ్రాహ్మణాలు రెండున్నాయి. ఒకటి తాండ్య మహా బ్రాహ్మణం, రెండోది ఛాందోగ్య బ్రాహ్మణం. జైమినీయ శాఖకు చెందిన బ్రాహ్మణం తలవకార బ్రాహ్మణం. వీటిలో తాండ్య బ్రాహ్మణానికి ఆరణ్యకం, ఉపనిషత్తు లేవు. ఛాందోగ్య బ్రాహ్మణానికి ఆరణ్యకం లేదు గాని ఉపనిషత్తు మాత్రం ఉంది. అదే ఛాందోగ్యోపనిషత్తు. తరువాత జైమినీయ శాఖకు సంబంధించిన తలవకార బ్రాహ్మణానికి ఆరణ్యకం జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే పేరుతో ఉంది.

సామవేదానికి సంబంధించిన ఉపబ్రాహ్మణాలు-సామవిధాన బ్రాహ్మణం, దేవతాధ్యాయ బ్రాహ్మణం, సంహితోపనిషద్బ్రాహ్మణం, వంశ బ్రాహ్మణమని నాలుగున్నాయి. వీరు విషయ నిరూపణ పరిధి చాలా పరిమితం. ఇందులో ఆరణ్యక భాగాలేవీ కనబడటం లేదు.

సామవేదానికి సంబంధించి ఆరణ్యకం ఒకే ఒకటి జైమినీయోపనిషద్బ్రాహ్మణం అనే పేరుతో ఉన్నట్లు తెలుస్తుంది. భాల్లవ్యారణ్యకం, కాలబవ్యారణ్యకం, రౌరు క్యారణ్యకం, శాట్యాయనారణ్యకం మొదలైనవి పేరుకేగాని, లభ్యం కావడం లేదు.

## తలవకారారణ్యకం :

కృష్ణ ద్వైపాయనుడు వేదవిభాగం చేసి వేదవ్యాసుడైనాడు. వేదవ్యాసుని శిష్యుడు జైమిని. జైమిని శిష్యుడు తలవకారుడు. జైమినీయ బ్రాహ్మణమే అతని శిష్యుడైన

తలవకారుని ద్వారా ప్రచారంలోకి వచ్చి తలవకార బ్రాహ్మణమనే పేరుతో ప్రసిద్ధి పొందింది. తలవకార బ్రాహ్మణంలో అయిదు కాండలున్నాయి. మొదటి మూడు కాండలు బ్రాహ్మణానికి సంబంధించినవి. నాలుగోకాండ ఆరణ్యకానికి సంబంధించింది. దీనిని జైమినీయోపనిషద్బ్రాహ్మణమని, ఉపనిషద్బ్రాహ్మణమని, తలవకారారణ్యకమని వ్యవహరిస్తున్నారు. సామవేదానికి సంబంధించి లభ్యమవుతున్న ఒకే ఒక ఆరణ్యకం తలవకారారణ్యకం.

తలవకారారణ్యకంలో నాలుగు అధ్యాయాలున్నాయి. ముప్ఫై తొమ్మిది అనువాకాలుగా, నూట నలభై అయిదు ఖండలుగా విభజించబడింది. ప్రథమాధ్యాయంలో ఓంకార స్వరూపం; ద్వితీయాధ్యాయంలో శర్యాత వృత్తాంతము; తృతీయాధ్యాయంలో సుదక్షిణక్షైమి ప్రాచీనశాలి వృత్తాంతము, గాయత్రి ప్రభావం; చతుర్థాధ్యాయంలో భాగీరథ వృత్తాంతము, ఉచ్చైశ్శ్రవ కౌపేయ వృత్తాంతము మొదలగు అంశాలున్నాయి.

తలవకారారణ్యకంలో గాయత్రోపాసన, ఉద్గీథోపాసన, ప్రణవోపాసన, ప్రాణోపాసన, విద్యుదుపాసన, వేదత్రయోపాసనా తత్వాల్ని చక్కగా వివరిస్తుంది.

తలవకారారణ్యకానికి ఎవరూ భాష్యంగాని, వ్యాఖ్యానంగాని వ్రాసిన దాఖలాలు లేవు. భగవత్రాతుడు తలవరక బ్రాహ్మణానికి భాష్యం వ్రాశాడని అంటారు కాని, లభ్యం కావడం లేదు. అథర్వవేదానికి ఆరణ్యకగ్రంథాలు ఉండేవి. కాని అవీ లభ్యం కావడం లేదు. అథర్వవేదానికి ఉపనిషత్తులు చాలా ఉన్నాయి. కాని అవి ఆరణ్యక గ్రంథాలలోని భాగాలు కాకుండా స్వతంత్రమైనవి.

జైమినీయోపద్బ్రాహ్మణమనే ప్రసిద్ధిగల తలవకారారణ్యకానికి ఇప్పటికి మూడు ప్రచురణలు వెలువడ్డాయి. ఒకటి రోమన్ లిపిలో ఆంగ్లానువాదంతో అమెరికన్ ఓరియంటల్ సొసైటీ పదహారో సంపుటంగా హెచ్. ఓర్టెల్ 1874లో న్యూహెవెన్‌లో చేసిన ప్రచురణ. దీనికే దేవనాగర లిపిలో పునర్ముద్రణ 1921లో రామదేవ్ అనే విమర్శకుడు లాహోర్‌లో డి.ఎ.వి. కళాశాల పుస్తకమాలలో ప్రచురించాడు. ఇందులో హిందీ ఉపోద్ఘాతం కూడా ఉన్నది. ఇది రెండవ ప్రచురణ. బి.ఆర్.శర్మ తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం ద్వారా 1967లో జైమినీయోపనిషద్బ్రాహ్మణమనే పేరుతో చేసిన ప్రచురణ మూడవది.

# ఉపనిషత్తులు

ఉపనిషత్తులు వేదం యొక్క అంతిమ భాగాలు కాబట్టి వేదాంతమనే పేరుతో పిలువబడుతున్నాయి. అంతుని వేద సారస్వతాన్ని సొంతంగా, సంగ్రహంగా, సమర్థంగా సంతరించగల తపస్సంపన్నులు కాలక్రమంలో అంతరించారు. వారు చేసిన కృషికి ఫలితంగా వేదాంతం రూపొందింది. మామూలుగా వేదాంతమనే పదాన్ని తత్వచింతనకు పర్యాయపదంగా వాడుతుంటాము. కాని వేదాంతమనేది వేదవాఙ్మయంలో ఒక ప్రత్యేకమైన శాఖ. మానవుల ఆధ్యాత్మిక జ్ఞానానికి ఈ గ్రంథాలు అంతిమరూపాలు.

జ్ఞానప్రాప్తి కొరకు యజ్ఞాది కర్మలు సాధనాలు అని అవి అంగీకరిస్తున్నవి. కాని మోక్షప్రాప్తి మాత్రం కేవలం జ్ఞానం చేతనే లభిస్తుందని అవి ప్రతిపాదిస్తున్నవి. పాశ్చాత్యులు ఉపనిషత్తులలోని జ్ఞానమార్గానికి అత్యంత ఆసక్తులైనారు.

వేదాలకు రెండు భాగాలున్నాయంటారు. మొదటిది కర్మాకాండ – అంటే క్రతువుల నిర్వహణకి సంబంధించింది. రెండవది జ్ఞానకాండ – అంటే జ్ఞానానికి సంబంధించినది. వీటిలో పూర్వ మీమాంస అనీ, ఉత్తర మీమాంస అనీ అంటారు. ఎన్నో క్రతువులు, కర్మలూ, రకరకాల ఆరాధనా పద్ధతులూ సంహితల్లోనూ, బ్రాహ్మణాలలోనూ విశదీకరింప బడ్డాయి. జీవనయాత్రలో జ్ఞానాన్ని చేరుకోవడానికి సాధనాలు ఉపనిషత్తులే!

'ఉపనిషత్' శబ్దం 'ఉప', 'ని' అనే ఉపసర్గలు చేరి 'సద్' అనే ధాతువు నుంచి వచ్చిందంటారు. ఉపనిషత్తులు బ్రహ్మవిద్యాద్యోతకాలు, ముముక్షువుల అవిద్యను నాశనం చేసేవి, బ్రహ్మప్రాప్తిని కలిగించేవి, దుఃఖాలను శిథిలం చేసేవి – అందుకే వాటికి ఉపనిషత్తులని పేరు. 'నిషద్' అనగా కూర్చునునట్టిది. 'ఉప' అనగా సమీపమని అర్థం. అంటే గురుచరణాల సమీపంలో కూర్చుని సంపాదింపబడే జ్ఞానంతో ఉపనిషత్తులు కూడినవి. అందుకే వాటికి ఆ పేరు వచ్చిందని అంటారు. దాదాపుగా ఉపనిషత్తులన్నింటిలోనూ ప్రధానంగా ఈ లోకాన్ని గురించి, బ్రహ్మను గురించి, ఆత్మ (జీవుడు)ను గురించి, పునర్జన్మను గురించి, ముక్తిని గురించి చర్చించడం జరిగింది.

ఉపనిషత్తుల సంఖ్య సరిగా లెక్కపెట్టి చెప్పడం సాధ్యం కాదు. ఉపనిషత్ వాక్య మహాకోశంలో రెండు వందల ఇరవైమూడు ఉపనిషత్తులు పేర్కొనబడ్డాయి. శంకర రామానుజాచార్యుల సమయానికి ఉపనిషత్తుల సంఖ్య ముప్పై మాత్రమే. పధ్నాలుగవ

శతాబ్దానికి వాటి సంఖ్య అరవైకి పెరిగింది. ధార్మిక సంప్రదాయాలు పెరిగే కొద్దీ ఉపనిషత్తుల సంఖ్య పెరగసాగింది. శైవ, వైష్ణవ, శాక్తాది సంప్రదాయకులు తమ సిద్ధాంతాలను ప్రచారం చేయటానికి ఉపనిషత్ రచనలు చేశారు. ముంబాయిలోని నిర్ణయ సాగర్ ప్రెస్‌వారు నూట పన్నెండు ఉపనిషత్తులు అచ్చు వేశారు.

ఆది శంకరులు కేవలం పదకొండు ఉపనిషత్తులకు మాత్రమే భాష్యం వ్రాశారు. అందువలన దేవేంద్రనాథ్ ఠాగూర్ (రవీంద్రనాథ్ ఠాగూర్ తండ్రి) కూడా వాటిని పదకొండుగా మాత్రమే తలచారు. కాని ఆయన పరిశోధనలో అనూహ్యమైన రీతిలో అవి నూట నలభై ఏడు అయ్యాయి. ఆ అనుభవంతోనే ఆయన స్వీయ జీవితచరిత్రలో – 'ఉపనిషత్తుల మీద ఎప్పుడైతే భక్తి భావన ప్రబలిందో వేదాలు మొదలుకొని అన్ని శాస్త్రాలకు అవి తలమానికముగా నిలిచాయి. ఆ క్రమంలోనే శైవ, వైష్ణవ శాఖలు తమ తమ శాఖలకు సంబంధించిన దేవమూర్తులను పరమాత్మ స్థానంలో ప్రతిష్టించడానికి వారి ఆరాధనకు వారి వారి స్వంత ఉపనిషత్తులతో బయలుదేరారు. ఆ క్రమంలో కూర్చబడినవే 'గోపాల తపని ఉపనిషత్'. అందులో పరమాత్మ స్థానాన్ని శ్రీకృష్ణుడు ఆక్రమించాడు. ఆ ఉపనిషత్తులో మధురానగరిని బ్రహ్మలోకంగాను, శ్రీకృష్ణుని పరబ్రహ్మగాను ప్రతిష్ఠించారు. మళ్ళీ 'గోపి చందన ఉపనిషత్' అంటూ మరొకటి బయలు దేరింది. అందులో కృష్ణుడి నొసల దిద్దే తిలకం ఎలా తయారు చేయాలో, ఎలా దిద్దాలో నిర్దేశించారు. ఇలా వైష్ణవశాఖ తమ దైవమూర్తిని విభిన్నరీతుల్లో కీర్తించారు. దానికి ప్రతిగా శైవం 'స్కందోపనిషత్'లో తమ దైవం శివుణ్ణి కీర్తించారు. ఇంకా సుందరీతపని ఉపనిషత్, దేవీ ఉపనిషత్, కౌలోపనిషత్ అనేవి కూడా ఉన్నాయి. అందులో శక్తి మహిమలన్నింటినీ కీర్తించారు. చివరకు ఎవరుబడితేవారు, ఏదిబడితే అది ఉపనిషత్తుల పేరున ప్రచురించే స్థాయికి చేరిందీ ప్రక్రియ' అని వ్రాసుకున్నారు.

ముక్తికోపనిషత్తు ప్రకారం నాలుగు వేదాలకు పదకొండువందల ఎనభై శాఖలు, తరగతులు వాటికి అనుసంధించి ఒక్కో ఉపనిషత్తు ఉన్నట్టుగా తేలుతుంది. శతాబ్దాల కాలక్రమంలో అవి బహుశా గతించి ఉండవచ్చు. మాక్స్ ముల్లర్ తన జీవిత కాలంలో వాటిని నూటనలభై తొమ్మిదిగా లెక్క తేల్చారు. తరువాత మరో ఇరవై ఒక్కటి వచ్చి చేరి మొత్తం నూటడెభ్భైగా తేలాయి. ఆల్బర్ట్ వెబర్ ప్రకారం అవి రెండువందల ముప్పై అయిదు. కాని తరువాత ఒకే విధమైన పాఠం కలిగి వివిధ పేర్లతో చెలామణి అయ్యేవాటిని పరిష్కరిస్తే కె. నారాయణస్వామికి అవి నూట ఎనిమిదిగా మాత్రమే తేలాయి. ఈ నూట ఎనిమిదిలో ఎన్ని ఉపనిషత్తులు అసలు సిసలైనవి అంటే, ఎవరి ఊహ వారిదే!

ఉపనిషత్తులకున్న గౌరవ ప్రపత్తుల దృష్ట్యా చివరకు భారతీయ ముస్లింలు, క్రైస్తవులు కూడా తమ స్వంత ఉపనిషత్తులతో ప్రత్యక్షమయ్యారు. అక్బరు పరిపాలనా కాలంలో 'అల్లోపనిషత్' కూర్చబడింది. బ్రిటీషు పరిపాలనాకాలంలో ఆంగ్లంలో 'క్రీస్తోపనిషత్' వెలువడింది. అదే క్రమంలో 'సద్గురు ఉపనిషత్' వెలువడింది. దీని కల్పనాకర్త పురోహితస్వామి.

ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక మొదలైన పది ఉపనిషత్తులే ప్రాచీనమైనవి, ప్రామాణికమైనవని అంగీకరించబడినవి. ఇవికాక కౌషీతకీ, శ్వేతాశ్వతర, మైత్రాయణీయ అనే మూడు ఉపనిషత్తులు కూడా ప్రాచీనమైనవి, ప్రామాణికమైనవి. ఈ మూడు ప్రాచీన వేదాంత తత్త్వ ప్రతిపాదకాలైనవి. ఇతర ఉపనిషత్తులన్నీ ఆయా మత సంప్రదాయాల సమర్ధన కొరకు పుట్టినవి మాత్రమే. అలా పుట్టిన వాటిలో వైష్ణవ, శైవ, శాక్త, యోగవిషయక ఉపనిషత్తులున్నాయి.

వేదాలకు అంతిమభాగాలైన ఉపనిషత్తులలో వైదిక యజ్ఞయాగాది కర్మల ప్రసక్తి గాని, వివరణ కాని లేదు. తత్త్వజ్ఞాన సంబంధమైన విద్యకే దీనిలో ప్రాధాన్యమియ్యబడింది. ఉపనిషత్తులు క్రీ.పూ. 700-100 కాలమునకు చెందినవనియు, బౌద్ధ యుగమునకు పూర్వమే చాలా ఉపనిషత్తులు వెలువడ్డాయని పండితుల అభిప్రాయం.

వైదిక సాహిత్యాన్ని విషయదృష్టితో పరిశీలించినట్లయితే మూడుగా విభజించవచ్చు - కర్మ, ఉపాసన, జ్ఞానం అని. కర్మ విషయాలను సంహిత, బ్రాహ్మణ గ్రంథాలు చెబుతున్నాయి. సంహిత, ఆరణ్యకాలలో ఉపాసన చెప్పబడింది. జ్ఞాన విషయాలు ఉపనిషత్తులలో ప్రతిపాదించబడ్డాయి.

విద్యలు రెండురకాలని వేదాంతుల అభిప్రాయం. పర, అపర విద్యలు అని. వీటిలో పరవిద్య శ్రేష్టమైంది. దీనికి బ్రహ్మవిద్య అనిపేరు. ఈ పరావిద్యను ప్రతిపాదించేవి ఉపనిషత్ గ్రంథాలు. అపరావిద్య కర్మ ప్రధానమైంది. అంటే అది కర్మ విద్య. కర్మ విద్యా ఫలం వినశ్వరమైంది కాగా బ్రహ్మవిద్యా ఫలం అవినశ్వరమైంది. అపరావిద్య మోక్షకారకం కాకపోవచ్చు కాని పరావిద్య తప్పక మోక్షప్రదాయిని.

విషయదృష్టితో పరిశీలించినట్లయితే ఉపనిషత్తులను ఆరు భాగాలు చేయవచ్చును. మొదటిది వేదాంత సిద్ధాంత ప్రతిపాదితాలు. రెండవది యోగ సిద్ధాంత ప్రతిపాదితాలు. మూడవది సాంఖ్య సిద్ధాంత ప్రతిపాదితాలు. నాలుగవది వైష్ణవ సిద్ధాంత ప్రతిపాదితాలు.

అయిదవది శైవ సిద్ధాంత ప్రతిపాదితాలు. ఆరవది శాక్త సిద్ధాంత ప్రతిపాదితాలు. ప్రతి సిద్ధాంతం, ప్రతి ధార్మిక సంప్రదాయం తమ ఆలోచనలను ప్రతిపాదించే ఉపనిషత్ గ్రంథాలు ఉండాలనే అభిప్రాయం వల్ల వాటి సంఖ్య పెరుగుతూ వచ్చింది. వీటిలో కొన్ని వేదాలకు సంబంధించినవి కావు. కొన్ని మాత్రం ఏదో ఒక వేదానికి జోడింప చేసే ప్రయత్నం కూడా జరిగింది. ఋగ్వేదానికి సంబంధించి పది, శుక్ల యజుర్వేదానికి సంబంధించి పంతొమ్మిది, కృష్ణ యజుర్వేదానికి సంబంధించి ముప్పై రెండు, సామవేదానికి సంబంధించి పదహారు, అథర్వవేదానికి సంబంధించి ముప్పై ఒకటి ఉపనిషత్తులున్నాయి.

ఉపనిషత్తులు సూక్ష్మాతి సూక్ష్మమైన సత్యాలను వివరిస్తూ 'ఇది ఉపనిషత్' 'ఇది ఉపనిషత్' అంటూంటుంది. వేదాలలో నిక్షిప్తమైన దానిని 'రహస్య'మంటారు. యోగ్యులైన వారికి గోప్యంగా వ్యక్తిగతంగా ఇవ్వవలసిన ఉపదేశాలు ఉపనిషత్తులు. శంకర, రామానుజ, నింబార్క, వల్లభ, మధ్వ మొదలైన ఆచార్యులు అందరూ పన్నెండు ఉపనిషత్తులకు భాష్యాలు వ్రాశారు. ఉపనిషత్తులలో ఇవే ప్రముఖమైనవిగా గుర్తించబడ్డాయి.

## ఈశావాస్యోపనిషత్తు :

శుక్లయజుర్వేదం యొక్క మాధ్యందిన సంహితలోని చివరిదైన నలభైవ అధ్యాయం పేరే ఈశావాస్యోపనిషత్. ప్రారంభ వాక్యంలో 'ఈశావాసమ్' అన్న శబ్దం ఉండడం చేత దీనికి ఆ పేరు వచ్చింది. దీనిలో కేవలం పద్దెనిమిది మంత్రాలు లేదా శ్లోకాలు ఉన్నాయి. భారతంలోని పర్వాలు పద్దెనిమిది, గీతలో అధ్యాయాలు పద్దెనిమిది, పురాణాలు పద్దెనిమిది, కావ్యాలలో వర్ణించదగిన విషయాలు పద్దెనిమిది. సామాన్యంగా పద్దెనిమిది జయ సంఖ్యగా భావించబడుతుంది. ఈ జయసంఖ్య ఈశావాస్యోపనిషత్‌లోని మంత్ర సంఖ్య కావడం విశేషం. సంఖ్యలోనే కాకుండా సాంఖ్యంలో కూడా ఈ ఉపనిషత్ సకల దేవసారమని చెప్పవచ్చు. దీనిలో గీతాధ్యాయికి గీతార్థసారం, అద్వైతికి అద్వైతం, కర్మయోగికి అనాసక్తి యోగం, సన్యాసికి కర్మఫల సన్యాసం, భక్తునకు అనన్య పర్యుపాసన కనిపిస్తుంది. ఇంతటి ధ్వని ప్రధానమైన ఉపనిషత్తు మరొకటి లేదు. బ్రహ్మవిద్యను గూర్చిన చర్చ దీనిలో అద్వితీయంగా చేయబడింది. ఇది మంత్రభాగంలో చేరి ఉండడం చేత దీనికి మంత్రోపనిషత్తు అని కూడా పేరు. ఇది సంహితభాగం కాబట్టి ఈశ్వరీయమైంది. కాని, ఇతర ఉపనిషత్తులవలె ఆర్షం – అంటే ఋషిప్రోక్తం కాదు. అందుకే ఉపనిషత్తులలో ఇది ప్రముఖ స్థానాన్ని పొందింది.

ఈ ప్రపంచమంతటా ఈశ్వరుడు వ్యాప్తమై ఉన్నాడు. సర్వసంపదలూ అతడు ఇచ్చినవే. కనుక త్యాగబుద్ధితో భోగాలను అనుభవించాలి. ఇతరుల ధనానికి ఆశ పడకూడదు. శ్రమ చేస్తూ నూరేళ్లు (ఇక్కడ) బ్రతకాలన్న కోర్కె కలిగి ఉండు. అంతకంటే మరోమార్గం నీకు లేదు అని ప్రబోధిస్తున్నాడు ఈశావాస్యోపనిషత్తు మంత్రకర్త.

## కేనోపనిషత్తు

సామవేదం యొక్క జైమినీయ సంహితకు చెందిన బ్రాహ్మణ గ్రంథంలో తొమ్మిదవ అధ్యాయమే కేనోపనిషత్తు. సామవేదానికి సంబంధించిన తలవకారమనే బ్రాహ్మణం లోనిది అవటం వల్ల దీనిని తలవకారోపనిషత్తనీ, బ్రాహ్మణోపనిషత్తనీ కూడా అంటారు. 'కేన' శబ్దంతో ఈ ఉపనిషత్తు ప్రారంభమవడం చేత దీనికి కేనోపనిషత్తు అని పేరు వచ్చింది. కేన అంటే దేనివలన అని అర్థం. ఈ ప్రపంచానికి మూలకారణమేమిటి ? ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు అన్న భాగవత జిజ్ఞాసతో ఇందలి మీమాంస ఆరంభమవుతుంది. జీవితం చరితార్థమయ్యేందుకు సాధించవలసిన పరతత్వమేది అనే నిర్ణయంతో చర్చ ముగుస్తుంది.

బ్రహ్మతత్వాన్ని తెలుసుకున్నవారు మోక్షప్రాప్తిని పొందుతారని దీనిలో ప్రతిపాదించ బడింది. 'దొరకని దానికోసం కేనలో అన్వేషించు' అని ఒక నానుడి కూడా ఉంది. శంకర భాగవతాదులు దీనికి పద భాష్యం. వాక్య భాష్యం అని రెండు రకాల భాష్యం వ్రాశారు. ఈ ఉపనిషత్తు నాలుగు భాగాలుగా ఉంది. మొదటి రెండు భాగాలూ పద్యంలో సంవాదరూపంలోను, చివరి రెండు భాగాలూ గద్యంలోనూ ఉన్నాయి. మొదటి రెండు భాగాలలో ఆత్మను గురించి వివరించడం జరిగింది. ఆత్మ శరీరానికి భిన్నమైనది. ఇంద్రియాలకు ప్రేరణనిచ్చేది అంటాడు ఈ ఉపనిషత్కారుడు. ఇంద్రియ దర్శన విచారణ ద్వారా ఆత్మ తత్వానికి ఎలా చేరుకోవటమో.... మనసు, ఇంద్రియాల కార్యకలాపాల నుండి వివక్షించి వేరుపరచడం ద్వారా ఆత్మను లేదా శుద్ధ చైతన్యాన్ని ఎలా సాక్షాత్కరించు కోవడమో మొదటి రెండు భాగాలు వివరిస్తాయి. ఇంద్రియాలు దాన్ని దర్శించటానికి బొత్తిగా సామర్థ్యం లేనివి కాబట్టి ఈ సాక్షాత్కారం ఆత్మ స్వయం స్ఫురణ శక్తి ద్వారానే సాధ్యం.

ఆత్మను గురించి తమకు తెలుసుననుకున్న వారికి నిజంగా ఏమీ తెలియదు. తెలియదనుకున్న వారికే ఆత్మను గురించి అంతా తెలుసు. చెవి, మనస్సు, వచనమూ, ప్రాణమూ, కన్నూ తానై ఉన్నాడని బ్రహ్మ గురించి ఏ ధీరపురుషుడు తెలుసుకుంటాడో

అతడు ముక్తుడై, ఈ లోకం నుండి వెళ్ళాక అమృతత్వాన్ని పొందుతాడు. బ్రహ్మను కాక మరెవరినీ ఉపాసించరాదు. ఎవడైతే వాణి ద్వారా తెలియపరచబడడో, వాణినే తెలియబరుస్తూ వుంటాడో – అతడే బ్రహ్మ అని తెలుసుకో! అతణ్ణే ఉపాసించు – ఎవడైతే మనసు ద్వారా తెలుసుకొనబడడో, ఎవడి ద్వారా మనస్సే తెలుసుకొనబడుతుందో అతనే బ్రహ్మ అని తెలుసుకో! ఎవడు ప్రాణంతో జీవించడో – ఎవడి కారణంగా ప్రాణమే ఉనికిలో ఉన్నదో అతడే బ్రహ్మ అనుకో!

మూడవ భాగం మొదటి రెండు భాగాల్లోని సూత్రాలనే కథల్లా వర్ణిస్తుంది. ఇందులో దేవతలే ఇంద్రియాలు. నాలుగవ భాగంలో కర్తపక్షంగా, కర్మపక్షంగా బ్రహ్మను గూర్చిన ధ్యానమూ దాని ఫలితాలూ ఉన్నాయి. గద్యభాగంలో ఈ ప్రపంచం వెనుక ఉన్న అపరిమిత శక్తిని గురించి చెప్పాడు ఈ ఉపనిషత్కారుడు.

## కఠోపనిషత్తు

కృష్ణ యజుర్వేదం యొక్క కఠ సంహితలోని భాగమే కఠోపనిషత్తు. కొందరు సామవేదంలోని దంటారు. మరికొందరు అథర్వవేదానికి చెందినదని అంటారు. ఎలాగైనా దీని వైదిక ప్రామాణ్యాన్ని నిరూపించడం దాదాపు అసంభవం. ఎందుకంటే దీనిలోని కథ బ్రాహ్మణంలోగానీ, సంహితలోగానీ, కఠోపనిషత్తు ఉన్న సామవేదపు భాగంలోగానీ, అథర్వవేద భాగంలోగానీ ఏదీ ఇప్పుడు లభ్యం కావడం లేదు. కనుక ఈ ఉపనిషత్తుకు వేదంతోగల బంధం తెలియని రహస్యంగానే ఉంది. అయినా ఉదాత్తములైన వేదాంత సిద్ధాంతాలను అత్యంత మనోహరంగా కవిత్వపూర్ణంగా ప్రకటిస్తున్నందున చాలా కాలం నుండి ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసులకు కఠోపనిషత్తు ఎంతో ఆసక్తిదాయకంగా ఉండిపోయింది. దీనిలో రెండు అధ్యాయాలు, ఆరు పల్లులున్నాయి. ఇది గంభీరమైన అద్వైత తత్త్వానికి ప్రసిద్ధమైంది. ఈ ఉపనిషత్తులోని నచికేతుని కథ వేదాంతంలోని అత్యున్నత ఉపదేశాల నందించడానికి ఉపయోగపడింది. చావు బ్రతుకులు రెండూ తెలిసిన యముడు శృతివాక్కుగా, ప్రాపంచిక వాసనలు అంటని శ్రద్ధాపూర్ణుడైన నచికేతుడు ఉపదిష్టుడుగా ఈ కథ చెబుతుంది. దీని ద్వారా వేదాంత బోధకు గురువు ఎలాంటివాడో, శిష్యుడు ఎలాంటివాడో కూడా ఉపనిషత్తు స్పష్టంగా నిర్ధేశిస్తున్నది. దీని ఆరంభంలో ఉద్దాలక ఋషి విశ్వజిత యజ్ఞాన్ని చేసిన వృత్తాంతం ఉంది.

నచికేతుని తండ్రి తన సంపదనంతా దానం చేస్తున్నాడు. నచికేతుడు తండ్రి దగ్గరకి వెళ్ళి 'అయితే నన్నెవరికి దానం చేస్తున్నారు ?' అని అడిగాడు. తండ్రికి కోపం

వచ్చింది. 'నిన్ను మృత్యువుకి దాని ఇస్తున్నా' అన్నాడు. నచికేతుడు మృత్యుదేవుడైన యముడి దగ్గరకి వెళ్ళాడు. యముడు లేడు. యముడు వచ్చేవరకు మూడురోజులు అన్నం, నీరు ముట్టలేదు. తిరిగి వచ్చాక యముడు చాలా బాధపడ్డాడు. నచికేతుణ్ణి మూడు వరాలు కోరుకోమన్నాడు. నచికేతుడు కోరిన మూడవ వరం చాలా ప్రాముఖ్యత కలది. 'మానవుడు చనిపోయాక స్థితి సందేహాస్పదమైందిగా ఉంటున్నది. చనిపోయాక కూడా జీవుడుంటాడని కొందరంటున్నారు. ఉండడని కొందరంటున్నారు. మరి మనిషి చనిపోయాక జీవుడుంటాడో, ఉండడో – నిజం తెలుసుకునే వరం నాకు ఇవ్వు' అన్నాడు. కఠోపనిషత్‌కారుడు బ్రహ్మను గురించి వివరించాడు. బ్రహ్మను అనేక రకాలుగా వర్ణించాడు. జీవుడూ బ్రహ్మ ఒకటేనన్నాడు. అయితే 'జీవుడూ శరీరమూ ఒకటి కాదు. జీవుడు వేరు, శరీరం వేరు. ముక్తి అంటే దుఃఖాలనుండి విముక్తి పొందడం, బ్రహ్మను చేరడం. ముక్తిని పొందడానికి సాధన, జ్ఞానం ప్రధానమైనవి. బ్రహ్మను పొందడానికి జ్ఞానదృష్టి అవసరం. దాన్ని పొందడానికి ధ్యానం, ఏకాగ్రత కూడా అవసరం. బ్రహ్మను కంటితో చూడలేము. వచనము ద్వారా తెలుసుకోలేము. శుద్ధమైన జ్ఞానంతో విశుద్ధమైన ధ్యానంతో మాత్రమే బ్రహ్మను తెలుసుకోగలం, దర్శించగలం' అంటాడు.

## ప్రశ్నోపనిషత్తు

అథర్వవేదం యొక్క పిప్పలాద సంహితకు చెందిన బ్రాహ్మణ గ్రంథంలోని భాగమే ప్రశ్నోపనిషత్తు. పిప్పలాదుడనే ఋషిని ఆరుగురు ఋషులు బ్రహ్మవిద్యావిషయ సంబంధ ప్రశ్నలను అడిగి తెలుసుకుంటారు. ప్రశ్నోత్తర రూపంలో ఉండడంచేత దీనికీ పేరు కలిగింది. ఇది మంత్రోపనిషత్తయిన ముండకోపనిషత్తుకు బ్రాహ్మణంలోని పరిపూరకమని అంటారు. ముండకోపనిషత్తు కూడా అథర్వవేదం లోనిదే. ఆరు అధ్యాయాలు గల ప్రశ్నోపనిషత్తులో ప్రతి అధ్యాయమూ ఒక్కొక్క ప్రశ్నతో ప్రారంభమవుతుంది. మొదటిప్రశ్న సృష్టింపబడిన ప్రాణుల మూలకారణం గురించి, రెండవది మానవ ప్రకృతి గురించి, మూడవది ప్రాణస్వభావాన్ని, కారణాన్ని గురించి, నాలుగవది మానవ ప్రకృతిలోని మానసిక స్థితిని గురించి, అయిదవది ప్రణవాన్ని గురించి, ఆరవది మానవుడిలోని పారమార్థికతత్వాన్ని గురించీ ప్రశ్నిస్తుంది.

తైత్తిరీయోపనిషత్తులో కూడా జీవితంలోని స్థూల తత్త్వాల నుండి సూక్ష్మ తత్త్వాలకు క్రమంగా పాఠకుని కొనిపోతుంది. ఒకదాని తరువాత ఒకటిగా ఆత్మ నావరించి ఉన్న జడపదార్థపు ముసుగులనన్నిటినీ తెలియజేస్తుంది. అంతేకాక పదార్థం, శక్తుల నుండి సృష్టి ఉద్భవించినదని స్పష్టమైన ఉద్ఘాటన ప్రశ్నోపనిషత్తులో మాత్రమే చూస్తాం.

ప్రజాపతి (బ్రహ్మ) ప్రజను ఉత్పన్నం చేయాలనుకున్నాడు. అతడు తపస్సు చేశాడు. తనకోసం ప్రజోత్పత్తి చేయడానికి మిథునాన్ని – జంటను సృష్టించాడు. ఆ జంట 'రయీ–ప్రాణము'. రయీ అంటే ప్రకృతిలోని భౌతిక పదార్థము (స్థితి). ప్రాణం అంటే ఆ పదార్థంలోని జీవం (కాలం). చంద్రుడు రయీ – ఆదిత్యుడు ప్రాణం. ప్రజాపతి సంవత్సరం. అతడికి ఇరుపార్శ్వములా దక్షిణ – ఉత్తర ఆయనములున్నాయి. అవి రయీ – ప్రాణం. ఒకొక్క మాసం ప్రజాపతి. మాసంలోని కృష్ణపక్షం రయీ – శుక్లపక్షం ప్రాణం. అలాగే ప్రతిరోజూ ప్రజాపతి. రోజులోని పగలు ప్రాణం, రాత్రి రయీ.

ప్రాణం – జీవం, విజ్ఞానం – సర్వశ్రేష్ఠమైంది. స్వప్నావస్థలో జీవుడు బ్రహ్మను కలుసుకుంటాడు. నదులన్నీ సముద్రంలో కలిశాక తమ నామరూపాలు కోల్పోతాయి. కేవలం సముద్రంగా మాత్రమే అభివ్యక్తమౌతాయి. అంటే ముక్తావస్థలో వ్యక్తి తన పదహారు కళలను కోల్పోయి పరబ్రహ్మలో లీనం అవుతాడు. బ్రహ్మగా మాత్రమే మిగిలిపోతాడు అంటాడు పిప్పలాదుడు.

## ముండకోపనిషత్తు

అథర్వవేదం యొక్క శౌనక సంహితకు చెందింది ముండకోపనిషత్తు. ముండక అంటే గుండు చేయించుకున్న తల అని అర్థం. పరిణిత మనస్కులు, మమతా రహితులు, సన్యాసులు వంటి వారు ఆచరించవలసినది ముండకోపనిషత్తు. లయవిన్యాసాలు లేని 'అక్షరబ్రహ్మం' గురించి ఈ ఉపనిషత్తు తెలుపుతుంది. అక్షర అంటే శబ్దమూ, అక్షరమూ అని కూడా అర్థముంది. పంచాక్షరం (అయిదు అక్షరాలు), అష్టాక్షరం (ఎనిమిది అక్షరాలు), అక్షరానికి మూలం ప్రణవం (ఓం కారం). అక్షరబ్రహ్మని చేరుకోవడానికి ఓంకారం ముఖ్య సాధనం.

ముండకోపనిషత్తు మూడు ముండకాలుగా విభజించబడింది. ఒక్కొక్క ముండకంలో రెండు కాండాలున్నాయి. బ్రహ్మ తన జ్యేష్ఠపుత్రుడు అథర్వునికి బ్రహ్మ విద్యను ఉపదేశించడం దీనిలోని విషయం. వేదాంత శబ్దం మొదటిసారిగా దీనిలో ప్రయోగింపబడి కన్పిస్తున్నది. నిత్యమైన, శాశ్వతమైన, అమరమైన వాడు బ్రహ్మ. అతడు విశ్వమంతా నిండి ఉన్నాడు. ముందూ వెనుకా, ఉత్తర దక్షిణాల్లోనూ, క్రిందా పైనా – అంతటా వ్యాపించి ఉన్నాడు. ఉపనిషత్ అనే ధనస్సును తీసుకుని, ఉపాసన అనే పదునైన బాణాన్ని సంధించి, ఏకాగ్రచిత్తం అనే నారిని లాగిపట్టి, అక్షరుడైన బ్రహ్మకు గురిపెట్టు. ఉపనిషత్ ప్రతిపాదితమైన ప్రణవం (ఓం) ధనస్సు, చురుకైన ఆత్మ బాణం, లక్ష్యం

బ్రహ్మ. అంటే ప్రమాదానికి గురికాకుండా బాణం లాంటి చురుకైన, తిన్ననైన ఏకాగ్ర చిత్తంతో బ్రహ్మను ఛేదించమంటున్నాడు. బ్రహ్మ ఎవరిపట్ల దయచూపుతాడో, ఎవరినైతే ఎంచుకుంటాడో వారికే లభిస్తాడు.

'ఆత్మ'ను తెలుసుకో. ఇతర విషయాలు వదిలిపెట్టు. ఆత్మ మూర్తికి సేతువు. బ్రహ్మ జ్ఞానం గల ధీరపురుషుడు ఎల్లెడలా ఆ ఆత్మనే చూస్తాడు. అదే అమరమూ, ప్రకాశ వంతమూ, ఆనందమయమూ అయినది. నదులు నామరూపాన్ని త్యజించి సముద్రంలో కలుస్తాయి. అలాగే జ్ఞానవంతుడైన పురుషుడు నామరూపాన్ని త్యజించి బ్రహ్మసాహచర్యాన్ని పొందుతాడు. అలాంటివారు సర్వత్రా బ్రహ్మను దర్శిస్తారు. పూర్వ జ్ఞానాన్ని పొందుతారు. కృతకృత్యులౌతారు. వైరాగ్యాన్ని పొందుతారు.

దివ్యుడు, నిరాకారుడు, జనన మరణరహితుడు – అయిన పురుషుడు ఒకడున్నాడు. అతడు ప్రకృతికి దూరంగా ఎక్కడో ఉన్నాడు. అతడే ప్రాణాన్నీ, మనస్సునూ, ఇంద్రియాలనూ సృష్టించాడు. అతడే ఆకాశాన్ని, వాయువును, అగ్నినీ, జలాన్నీ – ఈ సమస్త విశ్వాన్ని రచించాడు. ఈ మహావిశ్వాన్ని భరిస్తున్న పృథ్విని అతడే సృజించాడు. అతడి నుండే అనేక రకాల దేవతలు ఉద్భవించారు. సాధ్యులు, దేవతలు, మనుషులు, పశువులు, పక్షులు, ధాన్యాలు – అన్నీ అతడినుండే పుట్టుకొచ్చాయి. అతడి నుండే తపం, శ్రద్ధా, బ్రహ్మచక్రం, సత్యం, పనివిధానం, సముద్రాలు, నదులు, పర్వతాలు పుట్టాయి.

ఈ విధంగా ముండకోపనిషత్ – బ్రహ్మ అక్షరుడనీ, అతడే సృష్టికి ఉత్పాదనా కారుడు, నిమిత్త కారణుడూ కూడాననీ చెపుతున్నది.

## మాండూక్యోపనిషత్తు

అథర్వవేదానికి సంబంధించిందే మాండూక్యోపనిషత్తు. మాండూకమంటే కప్ప. 'కప్ప ఉపనిషత్తు' అనే పేరు ఎందుకు వచ్చింది ? కప్ప మెట్లని ఎక్కేటప్పుడు ఒక్కొక్క మెట్టునీ ఎక్కదు. మొదటి మెట్టు నుంచి నాల్గవ మెట్టుకు గంతు వేయగలదు. మేల్కొని ఉండడం (జాగృతి), కలలు కనడం (స్వప్న), గాఢ నిద్రలో ఉండడం (సుషుప్తి) – ఈ మూడు స్థితులను దాటి ఆఖరి, నాల్గవ స్థితి అయిన తురీయ స్థితిని చేరుకోవటానికి మార్గం చూపుతుంది. ఈ ఉపనిషత్తు ఓంకారాన్ని జపించటం వల్ల నాల్గవస్థితిని (తురీయ స్థితిని) ఒక్కసారిగా చేరుకోవచ్చునంటుంది. అందుకే ఆ పేరు వచ్చిందేమోనంటారు

కొందరు. కొందరు ఆటవికులు కప్పని ఆరాధిస్తారు. ఈ ఉపనిషత్తు వారికి చెందినదని కొందరంటారు. కప్ప రూపంలో ఉన్న వరుణ ఋషికి ఈ ఉపనిషత్తు గోచరించిందంటారు.

మాండూక్యోపనిషత్తులో పన్నెండు మంత్రాలు మాత్రమే ఉన్నాయి. ఆకారంలో చిన్నదయినప్పటికీ ఆచార్యుల దృష్టిని ఎక్కువగా ఆకర్షించి, అర్థగౌరవం కలిగిన అనర్ఘ రత్నం. అన్నింటికి ఆద్యమయిన ఆత్మతత్వాన్ని గురించి ఐతరేయం వివరిస్తే, దాని అనాది నాదమైన ప్రణవతత్త్వంతో సమీకరించి, ఆత్మవైభవమంతా అకార – ఉకార – మకార సంయోగంతో ఏర్పడ్డ ఓంకారంలో ఉన్నదని ఈ ఉపనిషత్తు వివరిస్తుంది. ఓంకారంలో సమస్త సృష్టి అక్షరరూపంలో ఉంది అనే సూత్రవాక్యంతో ఉపనిషత్తు ప్రారంభమవుతుంది. దాని వ్యాఖ్యానమే భూత భవిష్యత్ వర్తమానాలట. అంతేగాక ఈ మూడు కాలాలకు మించిన మరో కాలమానాన్ని మనం ఊహించగలిగితే అదికూడా ఓంకారమేనని ఈ తొలి మంత్రం నొక్కి చెపుతుంది.

మహర్షులు పరిపరి విధాల ప్రశంసించిన ప్రణవతత్వాన్ని ఆత్మపరంగా అన్వయించి, అందులో అఖిల సృష్టి ఎలా ఇమిడి ఉందో ఈ ఉపనిషత్తు వివరంగా చెబుతుంది. ఓంకారం పరబ్రహ్మ స్వరూపం. ఆత్మ (జీవుడు) కూడా పరబ్రహ్మ స్వరూపమే. కాబట్టి ఓంకారమే ఆత్మ. ఓంకారంలో నాలుగు మాత్రలు (భాగాలు) ఉన్నట్టు ఆత్మస్వరూపుడైన ఈ బ్రహ్మకు నాలుగు పాదాలున్నాయి. అకార, ఉకార, మకారాలతో ఓంకారం ఏర్పడింది. కానీ అన్నింటి సమ్మేళనంతో మరోరూపం (నాలుగో పాదం) మాత్రారహితమైనది, కొలతలకు అతీతమైంది ఏర్పడుతుంది. ఈ నాలుగు మాత్రలకు అనుగుణంగా, ఆత్మ నాలుగు పాదాల్లో వ్యక్తమవుతుంది.

మొదటిది జాగృతావస్థ. దీన్ని వైశ్వానరపాదం అంటారు. జాగృతావస్థలో మనం మెలకువతో అన్ని పనులు చేసుకునే సమయంలో ఈ రూపం మనకు కనిపిస్తుంది. ఇది అందరికీ గోచరమయ్యే సర్వ సామాన్య రూపం కాబట్టి దీన్ని వైశ్వానరమన్నారు. ఈ పాదంలో ఆత్మ ప్రసరించేటప్పుడు నరుడు విశ్వరూపంలో విహరిస్తుంటాడు. ఈ రూపంలో నరుని ప్రజ్ఞ బహిర్ముఖంగా ఉంటుంది. సప్తలోకాలలో అతడు సంచరిస్తాడు.

కర్మేంద్రియాలు అయిదు, జ్ఞానేంద్రియాలు అయిదు, పంచప్రాణాలు, అంతః కరణ చతుష్టయం కలిపి – మొత్తం పంతొమ్మిది ముఖాలతో ఆత్మ వ్యవహరిస్తుంది. ఈ స్థితిలో స్థూల ఆహారం తీసుకుంటాడు జీవుడు. ఈ వైశ్వానరమే ఓంకారంలోని తొలినాదం – అకారం. శృతులు ఈ నాదాన్నే స్తుతించాయి.

రెండవది స్వప్నావస్థ. దీన్ని తైజస్ అంటారు. ఆత్మ తైజసరూపాన్ని ధరిస్తుంది. నిద్రలో కలలు కనే సమయంలో ఈ రూపం కనిపిస్తుంది. వైశ్వానరరూపంలో బహిర్ముఖంగా ఉన్న ప్రజ్ఞ, తైజసరూపంలో అంతర్ముఖమవుతుంది. ఈ రూపంలో కూడా ఆత్మ సప్తలోకాల్లో విహరిస్తుంది. పది ఇంద్రియాలు, అయిదు ప్రాణాలు, నాలుగు అంతః కరణాలు - మొత్తం పంతొమ్మిది ముఖాలు ఈ పాదంలో కూడా ఉంటాయి. కాని వైశ్వానరంలో స్థూలమైన అనుభూతిని పొందిన ఆత్మ, తైజసరూపంలో ఏకాంతమైన అనుభూతిని పొందుతుంది. మెలకువతో మనం చేస్తున్న పనులు స్థూలంగా అందరికీ గోచరించేవిగా ఉంటాయి. కాని స్వప్నదశలో మనం పొందే కష్టసుఖాలు, అనుభవించే వినోద విషాదాలు మనవరకే పరిమితమై ఉంటాయి.

మనం కలలో చూస్తున్న విషయాలు మన ప్రక్కనే ఉన్న వ్యక్తికి కూడా బోధపడవు. అవి అతని ఊహకు కూడా అందవు. అందువల్ల స్వప్నదశలో వ్యక్తమయ్యే ఆత్మ తన సృష్టిలో తాను లీనమై ఉంటుంది. ఇదే ఉకారం.

మూడవది సుషుప్తావస్థ. దీన్ని ఆనందమయి అంటారు. ఈ స్థితిలో జీవుడు లేక బ్రహ్మ గాఢనిద్రలో ఉంటాడు. ఈ స్థితిలో కోరికలు, కలలు, కలతలు, కదలికలు - అన్నీ అంతరించిపోతాయి. హాయిగా మైమరచి నిదురించటమే సుషుప్తి. జాగృతావస్థ లోనూ, స్వప్నదశలోనూ ఉన్న సప్తలోకాలు, పంతొమ్మిది ముఖాలు ఈ పాదంలో ఉండవు. జీవుడు కలల్ని కనడు. భోగాల్ని కోరడు. చైతన్య స్వరూపుడుగా ఉంటాడు. ఈ స్థితిలో ఆనందమే (ప్రజ్ఞానమే) అతడి భోజనం. ఈ సుషుప్త్యావస్థలోని బ్రహ్మనే సర్వేశ్వరుడంటారు. సర్వజ్ఞుడంటారు. అంతర్యామి అంటారు. ఇతడే ప్రాణులకు జన్మస్థానమైన యోని. ఇతడే జన్మలకు కారకుడు. ఈ పాదంలో ప్రచురించే ఆత్మకు ప్రాజ్ఞరూపం లభిస్తుంది. 'ఎరుక' తప్ప మరో చైతన్యం ఆత్మలో ఉండదు. ఇదే మకారం.

నాలుగవది తురీయావస్థ. ఇది నామరహితమైంది. ఈ స్థితిలో జీవుడు (బ్రహ్మ) ప్రజ్ఞాన ఘనుడు కాడు. ప్రజ్ఞాన ఘనుడు కాకుండాను ఉండడు. ఈ స్థితిలో జీవుడు అ-దృష్టుడు (కనబడడు), అ-వ్యవహార్యుడు, అ - వ్యపదేశ్యుడు (పేరులేనివాడు), ఆత్మరూపి, జ్ఞానసారం, ప్రపంచాన్ని ఉపశమింపచేసేవాడు. శాంతుడు, శివుడు, అద్వైతుడు, ఓంకారరూపుడు. ఊహకందని లోకోత్తరదశలో ఆత్మ ప్రవేశించినప్పుడు ఆత్మ పరమాత్మలో లీనమైపోతుంది. అదే జీవిత సాధనకు పరమావధి, ఓంకారానికి పరమావధి. పంచతత్వాలు, పంచభూతాలు, పంచేంద్రియాలు మొదలైన ప్రపంచమంతా ఉపశమించగా ఏర్పడ్డ శాంతిశివస్వరూపం, అద్వైత రస స్వరూపం - ఆ నాలుగో పాదంలో గోచరిస్తుంది.

## తైత్తిరీయోపనిషత్తు

కృష్ణ యజుర్వేదం యొక్క తైత్తిరీయ సంహితకు చెందిన తైత్తిరీయారణ్యకంలోని చివరి – అనగా ఏడు, ఎనిమిది, తొమ్మిది ఖండాలకే తైత్తిరీయోపనిషత్తు అనిపేరు. ఒక్కొక్క ఖండానికి ఒక్కొక్కపేరు ఉంది. అవి శిక్షావల్లి, బ్రహ్మానందవల్లి, భృగువల్లి. ఈ వల్లులు తిరిగి చిన్న చిన్న అనువాకాలుగా విభజించబడ్డాయి. శిక్షావల్లిలో పన్నెండు, బ్రహ్మానందవల్లిలో తొమ్మిది, భృగువల్లిలో పది – మొత్తం దీనిలో ముప్పై ఒక్క అనువాకాలున్నాయి.

వేదోచ్చారణ పద్ధతి తెలియజేయడంవల్ల శిక్షావల్లి అని, సంహితోపాసన ఉండడం వలన సాహితీ ఉపనిషత్తని మొదటి అనువాకం పిలవబడుతుంది. సత్యంవద, ధర్మం చర వంటి సూక్తులు, మాతృదేవోభవ,పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనే మంత్రాలు ఈ ఉపనిషత్తులోనివే.

బ్రహ్మము గురించి తెల్పడం వలన బ్రహ్మవల్లి అని, ఆనందం యొక్క మీమాంస చేయబడడం వలన ఆనందవల్లి లేక బ్రహ్మానందవల్లి అని రెండవ అధ్యాయానికి పేరు. సంప్రదాయకర్తలైన వరుణునిచే బ్రహ్మవిద్య ఉపదేశించబడడం వలన బ్రహ్మవల్లి, భృగువల్లి కలిపి వారుణీ ఉపనిషత్తు అనికూడా పిలవబడుతున్నాయి.

ఈ ఉపనిషత్తులో శిష్య, ఆచార్యులకు సంబంధించిన శిష్టాచారాలు, బ్రహ్మవిద్య, ఓంకార మాహత్యాలు చెప్పబడినాయి. ఇందులో బ్రహ్మ లేడనుకున్నవాడు తానూ లేకుండా పోతాడు. బ్రహ్మ ఉన్నాడు అనుకున్నవాడు తానూ ఉంటాడు. హృదయాకారంలో వన్నె పురుషుడు ఉంటాడు. ఆతడే బ్రహ్మ. అతడు మాట, కన్ను, చెవి, మనసు – వీటన్నిటికీ అధిపతి.

బ్రహ్మ అంతరాళంలో ఉండే ఆనందమయి ఆత్మ. అన్నరసంలో రూపుదాల్చిన ఈ శరీరమనే ఆత్మ లోపల ప్రాణమయమయిన ఆంతరిక ఆత్మ ఉంటుంది. అది ఈ శరీరమంతటా వ్యాప్తి చెంది ఉంటుంది. ప్రాణమయమయిన దానికి భిన్నమైందిగా మనోమయ ఆత్మ ఉంటుంది. మనోమయాత్మకు భిన్నమైనదిగా విజ్ఞానమయ ఆత్మ (జీవాత్మ) ఉంటుంది. దానితో ఈ శరీరం నిండి ఉంది. జీవాత్మకు భిన్నమైనది ఆనందమయ ఆత్మ.

మొదట ఈ విశ్వం శూన్యంగా ఉంది. అప్పుడు బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. అతడు తాను అన్నీ అయిపోవాలనుకున్నాడు. వివిధ జన్మలు ఎత్తాలనుకున్నాడు. అందుకోసం

తపస్సు చేశాడు. అప్పుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. తాను సృష్టించిన ప్రపంచంలోనే తాను లీనమయ్యాడు. అలా సృష్టిలో వ్యాపించినా తాను తానుగా ఉండగలిగాడు. ప్రకటింపబడినవాడూ, ప్రకటింపబడనివాడూ కూడా తానే అయ్యాడు. విజ్ఞానం, చైతన్యం, సత్తు, అసత్తు – అన్ని తానే అయ్యాడు. సత్యమూ – అసత్యమూ కూడా తనే అయ్యాడు.

వేదాభ్యాసం అయ్యాక గురువు 'సత్యాన్నే మాట్లాడు. ధర్మాచరణ కలిగి ఉండు. స్వాధ్యాయాన్ని మానకు. గురువుకు దక్షణ ఇవ్వు. సంతానోత్పతి మానకు. దేవకార్యానికీ, పితృకార్యానికీ – అభ్యంతరం రానీయకు. తల్లినీ, తండ్రినీ, గురువులనూ, అతిథినీ – దేవుడుగా భావించు. లోపరహితమైన పనులనే చేస్తుండు' అని శిష్యుడితో చెప్పాడు.

## ఐతరేయోపనిషత్తు

ఋగ్వేదము యొక్క ఐతరేయారణ్యకంలోని నాలుగు, అయిదు, ఆరు అధ్యాయాలకే ఐతరేయోపనిషత్తు అనిపేరు. ఇది మూడు భాగాలు. మొదటి భాగంలో బ్రహ్మ ఈ విశ్వాన్ని ఎలా సృష్టించాడు, రెండవ భాగంలో మూడు జన్మల వర్ణన, మూడవ భాగంలో బ్రహ్మవాదాన్ని ప్రతిపాదించడం జరిగింది.

జీవుడు తండ్రి నుండి తల్లి గర్భస్థమవటం, పాపపుణ్యాల ననుసరించి అనేక లోకాలలో జన్మలనెత్తటం, జనన మరణాల నుండి విముక్తి ఆత్మానుభూతి వల్లనే కలగటం – వీటి గురించి ఈ ఉపనిషత్తు చెపుతుంది. తల్లి గర్భంలోఉండగానే తన పూర్వజన్మ వృతాంతాన్ని ఎరిగి అన్ని అడ్డుగోడలనూ దాటి ఆకాశంలో ఎగిరే గరుడునివలె విముక్తి పొందిన వామదేవుడనే ఋషికథ ఈ ఉపనిషత్తులోనిదే.

ప్రథమంలో ఆత్మ ఒక్కటే జీవాన్ని కలిగి ఉండేది. అప్పట్లో ఈ సమస్త విశ్వం నిర్జీవంగా ఉండేది. ఆ ఆత్మ లోకాలను సృష్టించాలనుకుంది. నీటినీ, కిరణాలనూ సృష్టించింది. నీటినుండి పురుషుణ్ణి (జీవుణ్ణి) సృష్టించింది. క్రమంగా అతడికి ముఖాన్ని, వాణినీ, కండ్లనూ, పంచేంద్రియాలనూ ఏర్పరచింది. అతడే అనాది పురుషుడు. అతడే మహాబ్రహ్మ స్వరూపుడు. అతడికి ముక్కులోంచి గాలి, కండ్ల నుంచి సూర్యుడు, చెవుల్లోంచి దిశలు పుట్టుకొచ్చాయి. పురుషుని మనసులోంచి చంద్రుడు పుట్టాడు. ప్రజ్ఞామూర్తి, చైతన్య స్వరూపుడైన బ్రహ్మ నుంచి సమస్త విశ్వమూ పుట్టింది.

## ఛాందోగ్యోపనిషత్తు

సామవేదం యొక్క కౌథుమ శాఖకు సంబంధించిన కౌథుమ బ్రాహ్మణంలో చివరి పది అధ్యాయాలకే ఛాందోగ్యోపనిషత్తు అని పేరు. ఉపనిషతుల్లోకెల్లా ఇది ప్రౌఢ,

గంభీరమైంది. దీని చివరి మూడు అధ్యాయాలు ఆధ్యాత్మిక దృష్టితో మాహాత్మ్య పూర్ణమైనవి. దీనిలో సందర్భానుకూలంగా ఆఖ్యానాలున్నాయి. యాజ్ఞవల్క్యుడు ఈ ఉపనిషత్తులో ఉపదేష్ట. ఆరుణి, సత్యకామ, రైక్వులకు సంబంధించిన కథలెన్నో దార్శనిక రహస్యాలను బోధిస్తున్నాయి.

ప్రాణం కొరకు స్వాహా! వ్యాన్, అపాన్, సమాన్, ఉదాన్ – కొరకు స్వాహా!' ఈ మంత్రాన్ని అర్థం చేసుకోకుండా హోమం చేసినవాడు నిష్ప్రయోజనమైన పని చేసినవాడవుతాడు. పై మంత్రాన్ని అర్థం చేసుకుని అగ్నిలో హోమం చేసినవాడి సర్వపాపాలు (చెడులు) భస్మమౌతాయి. అలాంటివాడు తన ఉచ్ఛిష్టాన్ని, ఛండాలునికి పెట్టినా, అది అగ్నిహోత్రుడిలో హోమం చేసినట్లు అవుతుంది.

విద్యలు అనేక రకాలుగా ఉన్నాయి. అవిద్యలూ (అజ్ఞానం) అనేక రకాలుగా ఉన్నాయి. అయితే మనిషి తాను చేసే పనిని జ్ఞానం (విద్య)తో, శ్రద్ధతో, ఉపనిషత్తు (గురూపదేశం)తో చేసినప్పుడు ఆ పని శక్తివంతమైంది అవుతుంది.

ఛాందోగ్యోపనిషత్తులో మంచి నడవడిక ఏది ? చెడు నడవడిక ఏది ? అనేదాన్ని గురించి కూడా చర్చించడం జరిగింది. బంగారాన్ని దొంగిలించడం, సారాయి తాగడ, గురుపత్నితో సంగమించడం, బ్రాహ్మణుడ్ని హత్య చేయడం – ఈ నాలుగూ దురాచారాలు. సదాచారం మూడు రకాలు – యజ్ఞం చేయడం, వేదపాఠం, దానం చేయడం. ఈ మూడింటినీ ఆదర్శంగా తీసుకుని తపస్సు చేసుకుంటూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, గురుకులంలో ఉండే వ్యక్తి పుణ్యలోకాన్ని పొందుతాడు. అలాంటివాడు బ్రహ్మత్వాన్ని పొందగలడు. బ్రహ్మత్వమే మూర్తి, అమరత్వం.

'బాహ్యంగా మనకు కనిపిస్తున్న ఆకాశం కంటే కూడా ఈ శరీరంలో ఉన్న ఆకాశం చాలా పెద్దది. నక్షత్రలోకమూ, భూమి కలిసి ఈ శరీరం లోపలే ఉన్నాయి. ఈ అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఇవన్నీ ఈ శరీరంలో ఉన్నాయి. ఇవికాక భౌతిక ప్రపంచంలో లేనివి కూడా ఈ శరీరంలో ఉన్నాయి.

ఇంకా మనసు గురించి, సృష్టిని గురించి, ముక్తిని గురించి, పరలోకాన్ని గురించి, అనేక విషయాలను గురించి చెప్పడం జరిగింది. భారతీయ సాహిత్యంలో ప్రప్రథమంగా పునర్జన్మను గురించి ప్రస్తావించడం ఛాందోగ్యోపనిషత్తులో జరిగింది. 'ఎవరైతే ఈ లోకంలో రమణీయమైన ఆచరణను ఆచరిస్తారో అలాంటివారు రమణీయమైన యోనిని అంటే బ్రాహ్మణ యోని లేక క్షత్రియ యోని లేక వైశ్య యోనిని పొందుతారు. అలాకాక

ఎవరైతే చెడును ఆచరిస్తారో, అలాంటివారు చెడు యోనిని అంటే కుక్కయోనిని కానీ, పందియోనిని గానీ, ఛండాలయోనినిగానీ పొందుతారు. రమణీయమైన ఆచరణ కలవారి ఆత్మ లేక జీవుడు చనిపోయాక పితరుల మార్గాన్నుసరించి పైలోకాలకు వెళతాయి.

## బృహదారణ్యకోపనిషత్తు

బృహదారణ్యకోపనిషత్తు పరిమాణంలోకాక తత్త్వజ్ఞాన ప్రతిపాదనలోను గంభీరమైనది, ప్రామాణికమైంది. ఇది ప్రాచీనమైన ఉపనిషత్తులలో ఒకటి. దీనిలో ఆరు అధ్యాయాలున్నాయి. శుక్ల యజుర్వేదం యొక్క శతపథ బ్రాహ్మణంలోని చివరి ఆరు అధ్యాయాలకే బృహదారణ్యకోపనిషత్తు అనిపేరు. పేరునుబట్టి ఇది ఆరణ్యక, ఉపనిషత్తులు రెండూ చేరి ఉన్న గ్రంథమని తెలుస్తుంది. ఆరణ్యక భాగంకన్నా ఉపనిషద్భాగం ఎక్కువ. సృష్టి, బ్రహ్మతత్త్వాలను గురించిన చర్చలు దీనిలో ఉన్నాయి.

మొదటి అధ్యాయంలో మృత్యువు సమస్త వస్తువులను ఆక్రమించటం, ప్రాణం యొక్క శ్రేష్టత, సృష్టి సంబంధ విషయాలు చర్చించబడ్డాయి. రెండవ అధ్యాయంలో గార్గ్య, కాశిరాజు అజాతశత్రువుల సంవాదమున్నది. దీనిలోనే యాజ్ఞవల్క్యుడు, అతని ఇద్దరు భార్యలు – కాత్యాయని, మైత్రేయులకు సంబంధించిన కథ ఉంది. మూడవ అధ్యాయంలో జనకుని సభలో యాజ్ఞవల్క్యుడు బ్రహ్మజ్ఞానులను జయించే వృత్తాంతమున్నది. నాల్గవ అధ్యాయంలో జనకుడు యాజ్ఞవల్క్యుని నుంచి తత్త్వజ్ఞానాన్ని పొందే వృత్తాంతమున్నది.

అయిదవ అధ్యాయంలో నీతి, సృష్టి, పరలోక విషయ సంబంధమైన దార్శనిక చర్చలున్నాయి. ఆరవ అధ్యాయంలో ప్రవహణ, జైబలి, శ్వేతకేతు, ఆరుణీయుల సంవాదం ఉంది. మొదటి రెంటినీ కలిపి మధుకాండ అంటారు. తరువాత రెంటినీ కలిపి యాజ్ఞవల్క్యుని పేర మునికాండ అంటారు. ఆఖరి రెంటినీ కలిపి ఖిలకాండ అంటారు. మధువంటే ఆనందరసమని అర్థం చేసుకోవచ్చు. సమస్తమూ బ్రహ్మ స్వరూపంగా తెలుసుకున్న వారికి ప్రపంచం మొత్తం మధుమయంగా కనిపిస్తుంది. ఆత్మ అన్నిటికీ మధువు. అదే మధుకాండ తెలుపుతుంది.

బృహదారణ్యకోపనిషత్కారుడు వేదాలను కీర్తిస్తూ "ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం, ఇతిహాసం, పురాణం, విద్య, ఉపనిషత్తు, శ్లోకం, సూత్రం, ఆఖ్యానం – ఇవన్నీ ఆ మహాభూతం (బ్రహ్మ) యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే!"

"సూర్యుడు, చంద్రుడు, వాయువు, ఆకాశం, అగ్ని, నీరు, దర్పణం, ఛాయ, ప్రతిధ్వని, శబ్దం, నేత్రం – వీటన్నింటిలోనూ ఆ మహాపురుషుడు – జీవుడు – బ్రహ్మ ఉన్నట్లు భావించి స్తుతించు. బ్రహ్మను విశ్వాత్మ అనవచ్చు. ఈ ఆత్మ సర్వప్రాణులకు రాజులాంటిది. చక్రం యొక్క నాభిలో ఆకులన్నీ ఎలా చొచ్చుకుపోయి ఉంటాయో, అలాగే సర్వప్రాణులూ, సమస్త దేవతలూ, లోకాలూ, జీవాత్మలూ – అన్నీ ఈ విశ్వాత్మలో ఇమిడి ఉంటాయి.

"బ్రహ్మకు రెండు రూపాలున్నాయి. ఒకటి సాకారమైంది. అంటే ఈ విశ్వంలో దృశ్యమానమయ్యే సమస్తమూ బ్రహ్మ యొక్క బాహ్యరూపం. రెండవది నిరాకారమైనది. అది కనబడదు. కనబడే బాహ్య రూపం నశిస్తుంది. కానీ కనిపించని ఈ నిరాకారానికి నాశనం లేదు. ఇది శాశ్వతమైంది.

బ్రహ్మ స్థూలంగానూ ఉండదు, సూక్ష్మంగానూ ఉండదు, పొట్టిగానూ ఉండదు, పొడుగుగానూ ఉండదు, నల్లగానూ ఉండదు, ఎర్రగానూ ఉండదు, వెలుగూ కాదూ, చీకటికాదు. అతడికి రసగంధాలేమీ లేవు. కన్ను, ముక్కు, చెవి, మనసు, ప్రాణం, మాట, ముఖమూ – ఇవేమీ లేనివాడు. లోపలా ఉండదు, బైటా ఉండదు. అతడు దేన్నీ తినడు. అతణ్ణి ఏమీ తినలేవు.

సృష్టిని గురించి ఒకచోట – 'మొదట శూన్యం తప్ప మరేమీ లేదు. కేవలం జీవరహితమైన అనంత మృత్యువు మాత్రమే ఉండేది. ఆ మృత్యువే ఆకలి. అది శరీరధారణ చెయ్యాలనుకుంది. ముందుగా నీటిని సృష్టించాడు బ్రహ్మ. నీటిలోంచి పృథ్విని సృష్టించాడు. అతడు అలసిపోయాడు. అలసిన అతడి తేజస్సే అగ్ని అయింది' అని చెప్పబడింది.

మరొకచోట 'మొదట్లో బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. ఇంకేమీ లేదు. అంతా శూన్యమే. కటిక శూన్యం. బ్రహ్మ తన్ను తాను తెలుసుకున్నాడు. నేను బ్రహ్మను అనుకున్నాడు. కనుక అతను బ్రహ్మ అయ్యాడు. అలాగే దేవతలు కూడా తమని తాము తెలుసుకున్నారు. తామూ బ్రహ్మలమనుకున్నారు. వారూ బ్రహ్మలయ్యారు. అలాగే ఋషులు, మునులు ఎవరెవరు తాము బ్రహ్మలమని తెలుసుకోగలరో – వారందరూ బ్రహ్మలయ్యారు. అలా తెలుసుకోలేక బ్రహ్మ వేరూ, తాము వేరూ అనుకున్నవారు దేవతల పశువులుగా మిగిలిపోయారు.

నిప్పు నుండి నిప్పురవ్వలు లేచినట్లు, అనంతమైన, అనాదియైన విశ్వాత్మ (బ్రహ్మ) నుండి సమస్త ప్రాణులూ, లోకాలూ, దేవతలూ, భౌతిక పదార్థాలూ ఉద్భవించాయి, అని పేర్కొనబడింది.

## శ్వేతాశ్వతరోపనిషత్తు

కృష్ణయజుర్వేదం యొక్క శ్వేతాశ్వతర బ్రాహ్మణంలోని భాగమే శ్వేతాశ్వత రోపనిషత్తు. దీనిలో ఆరు అధ్యాయాలున్నాయి. ఆరు అధ్యాయాలు నూట పదమూడు మంత్రాలతో కూడి ఉంది. శ్వేతాశ్వర బ్రహ్మర్షి ఈ ఉపనిషత్తు తన శిష్యులకు బోధించగా ఆయన పేరు మీదనే ప్రసిద్ధమైందని కొందరంటారు.

దీనిలో శైవధర్మ ప్రతిపాదన కనిపిస్తుంది. మొదటిసారిగా ఈ ఉపనిషత్తులోనే భక్తితత్త్వం ప్రతిపాదించబడటం గమనించాలి. ఎన్నో తాత్త్విక విషయాలు సరళసుందరంగా చెప్పబడ్డాయి. ఈ ఉపనిషత్తులో ముఖ్యవిషయాలు మూడు – శివుడి మహిమ, త్రైతవాదం, యోగం. మొదటి అధ్యాయంలో త్రైతవాదాన్ని ప్రతిపాదించడం జరిగింది. అంటే అద్వైత బ్రహ్మస్థానాన్ని త్రైతవాదానికి ఇచ్చాడు. జీవుడు – ఈశ్వరుడు – ప్రకృతి కలిసి త్రైతవాదం అవుతుంది.

రెండవ అధ్యాయంలో యోగాన్ని గురించి వివరించాడు. మూడవ అధ్యాయంలో జీవాత్మ – పరమాత్మ గురించిన వర్ణన, శైవ సాంప్రదాయ వివరాలు, ద్వైతవాద వివరాలు ఉన్నాయి. నాలుగో అధ్యాయంలో త్రైతవాదంతోపాటు జ్ఞానాన్ని గురించి చెప్పడం జరిగింది. అయిదవ అధ్యాయంలో త్రైతవాదం – సృష్టి – బ్రహ్మజ్ఞానం – వీటి గురించిన చర్చ జరిగింది. చివరి అధ్యాయంలో భక్తితత్వం నిరూపించబడింది.

బ్రహ్మచక్రంలో హంస – జీవుడు తిరుగుతుంటాడు. జీవుణ్ణి తిప్పే బ్రహ్మ – ఆత్మ విడిగా ఉంటాడు. తనను బ్రహ్మ తిప్పుతున్నాడని జీవుడు తెలుసుకుంటాడు. అంతలో జీవుడు బ్రహ్మలో లీనమై అమరత్వాన్ని పొందుతాడు. జ్ఞ (జ్ఞాని – బ్రహ్మ), అజ్ఞ (అజ్ఞాని – జీవుడు) ఇద్దరూ అభవులు. వీరిలో బ్రహ్మ ఈశుడు. అంటే స్వతంత్రుడు. జీవుడు అనీశుడు – పరతంత్రుడు. మూడవది ప్రకృతి – ఇది అజా – ఇదీ అనుభవమే. ఇది భోక్త అయిన జీవుడు అనుభవించడానికి అవసరమైన పదార్థాలతో నిండి ఉంటుంది. ఆత్మ అనంతమైనది. నానా రూపాలు కలది. దీనికి కర్త అంటూ ఒకడు లేడు. ప్రకృతి క్షరలక్షణం కలది. ఈ ప్రకృతి మీదా, జీవుడి మీదా – అక్షరుడూ, హరుడు – అయిన ఈశుడు శాసనం నెరపుతుంటాడు. జీవుడిలో ఉండే బ్రహ్మను తెలుసుకోవడం ముఖ్యం. భోక్తజీవుడు, భోగ్య ప్రకృతి, ప్రేరితుడు బ్రహ్మ – దీన్నే 'త్రివిధ బ్రహ్మ' అంటారు.

ఎర్రని, తెల్లని, నల్లని – ఒకే ఆకారంగల అనేక రకాలైన ప్రజల్ని సృజిస్తోంది ప్రకృతి. దాన్లో భోగిస్తూ జీవుడు ఆసక్తి కలిగి ఉన్నాడు. జీవుడిచేత అనుభవింపబడుతూన్న

ఈ ప్రకృతిని బ్రహ్మ విడిచిపెట్టాడు. రెండు సహచర పక్షులు ఒక వృక్షాన్ని ఆక్రమించాయి. అందులో ఒకటి జీవుడు, రెండవది ఈశ్వరుడు. వాటిలో ఒకటి ఆ చెట్టు పండు తింటుంది. రెండవది ఆ చెట్టుపండు తినకుండా చెట్టు చుట్టూ తిరుగుతూ ఉంటుంది. మాయి – ఈశ్వరుడు – ఈ విశ్వాన్ని సృష్టించాడు. దాన్లో జీవుడు మాయచే బంధింపబడ్డాడు. ప్రకృతి మాయ, మహేశ్వరుడు మాయి. జీవాత్మ చాలా సూక్ష్మమైంది. ఒక వెంట్రుకను నిలువునా నూరుభాగాలు చేసి దానిలో ఒక భాగాన్ని తీసుకుని, తిరిగి దాన్ని నూరుభాగాలు చేస్తే – అందులో ఒక భాగం జీవాత్మ పరిమాణానికి సరిపోతుంది. ఇది శైవదర్శనం. ఇందులో శివుడే బ్రహ్మ. ఇతన్ని రుద్రుడనీ, మహేశ్వరుడనీ అంటారు. రుద్రుడు ఒక్కడే. అతడే సమస్త లోకాలనూ పాలిస్తున్నాడు. దేవుడి మీదా, గురువు మీదా – సమానమైన భక్తిగలవాడే పరమార్థ తత్త్వాన్ని తెలుసుకోగలడు.

## కౌషీతకోపనిషత్తు

ఋగ్వేదం యొక్క కౌషీతకీ బ్రాహ్మణంలోని భాగమే కౌషీతకారణ్యం. ఈ ఆరణ్యకంలో పదిహేను అధ్యాయాలున్నాయి. ఈ ఆరణ్యకంలోని మూడవ, ఆరవ అధ్యాయాలకే కౌషీతకోపనిషత్తు అని పేరు. దీనికి కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్తు అనికూడా పేరు. కషీతకీ అనే ఋషి ఈ గ్రంథంలో ఉపదేష్టి. దీనిలో నాలుగు అధ్యాయాలున్నాయి.

మొదటి అధ్యాయంలో ఛాందోగ్యో, బృహదారణ్యకాల్లో చెప్పిన పితృయాగాన్ని గురించి, దేవయానాన్ని గురించి విస్తారంగా వివరించడం జరిగింది. రెండవ అధ్యాయాలో పుత్ర సంతానాన్ని పొందడానికి కొన్ని చిట్కాలు సూచించారు. మూడో అధ్యాయంలో ఋగ్వేదకాలపు మహారాజు దివోదాసు సశరీరంగా ఇంద్రలోకానికి వెళ్ళడం, ఇంద్రుడితో జరిగిన సంభాషణ ఉంది. నాలుగో అధ్యాయంలో గార్గ్యుడు కాశీరాజైన అజాతశత్రువుకు బ్రహ్మవిద్య ఉపదేశించడానికి ప్రయత్నిస్తాడు. అజాతశత్రువు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, అతడికే శిష్యుడౌతాడు గార్గ్యుడు. జీవన చైతన్యాల తత్త్వం, బ్రహ్మవిద్య దీనిలో ప్రతిపాదించబడ్డాయి.

## మైత్రి (మైత్రాయణీయ) ఉపనిషత్తు

మైత్రి ఉపనిషత్తులో మొదటి నాలుగు అధ్యాయాలే దార్శనిక ప్రాధాన్యత కలవి. ఇవిగాక మరో మూడు అధ్యాయాలున్నాయి. అంటే మొత్తం ఏడు అధ్యాయాలు. మిగిలిన అధ్యాయాలలోనూ ఫలిత జ్యోతిషం సందర్భంగా శని, రాహుకేతుల గురించి వివరించడం

జరిగింది. మైత్రి రెండురకాల ఆత్మలున్నాయంటాడు. ఒకటి శుద్ధ ఆత్మ. ఇది శరీరంలోనే పుట్టి, తన మహిమవల్ల గొప్పగా వెలుగుతూంటుంది. రెండవది భూతాత్మ. ఇది భౌతికమైంది. దీనిమీద మంచి చెడ్డల ప్రభావం పడుతూ ఉంటుంది. ఈ భూతాత్మే మళ్ళీ మళ్ళీ పుడుతూ, గిడుతూ ఉంటుంది. కుమ్మరివాడు తన చక్రాన్ని తిప్పినట్లు శుద్ధాత్మ ఈ శరీరాన్ని నడుపుతూంటుంది.

ఏది శుద్ధమైందో, శాంతమైందో, శాశ్వతమైందో, అనుభవమూ, స్వాతంత్ర్యమూ, మహిమాన్వితమూ అయిందో – అదే ఈ శరీరాన్ని చైతన్యవంతం చేసి నడుపుతోంది. అదే ఆత్మ. శరీరంలో ఒకానొక భాగంలో బొటనవేలు ఆకారంలో, అణువు కంటే సూక్ష్మాతిసూక్ష్మ పరిమాణంలో ఉన్న ఆత్మను ధ్యానించినవాడే పరమ పదాన్ని పొందగలడు' అంటాడు ఈ ఉపనిషత్‌కారుడు.

(హిందూ–ఇస్లాంల సమన్వయానికి ఉపనిషత్తులు దోహదపడతాయనే ఉద్దేశంతో 17వ శతాబ్దం మధ్య భాగంలో షాజహాన్ పెద్దకుమారుడు దారాషుకో కాశీనుండి కొంతమంది పండితులను రప్పించి 50 ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువాదం చేయించాడు. 1657 సంవత్సరానికి ఈ పని పూర్తయింది. అవిశ్వాసిగా ఎంచి అతని సోదరుడు ఔరంగజేబు తిరుగుబాటు చేశాడు. తండ్రిని ఖైదు చేశాడు. దారాషుకోతో సహా ముగ్గురు సోదరులను చంపించి, సింహాసనం ఆక్రమించాడు. 50 ఉపనిషత్తులను నాశనం చేశాడు.

పాలేడ్యుసేన్ పెద్దవి, చిన్నవి కలిపి 60కి పైగా ఉపనిషత్తులను జర్మన్ భాషలోకి అనువదించాడు. 'ది ఫిలాసఫీ ఆఫ్ ది ఉపనిషద్స్', 'ఔట్‌లైన్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ' అనే గ్రంథాలను కూడా ప్రచురించాడు.)

# వేదాంగాలు

**వై**దిక కర్మ కలాపాలను ప్రతిపాదించే – సంహిత, బ్రాహ్మణ, ఆరణ్యక గ్రంథాలను మరియు బ్రహ్మవిద్యను బోధించే ఉపనిషత్తులను తెలుసుకోవడానికి ఉపయోగపడేవి వేదాంగాలు. 'అంగ' శబ్దానికి ఉపకారకం అని అర్థం. వేదాల భాష, భావాలు, విషయాలు రానురాను అర్థం కాకుండా పోయాయి. వేదార్థాలను, అవి ప్రతిపాదించే కర్మకాండలను తెలుసుకోవడానికి ప్రత్యేక శాస్త్రగ్రంథాలను సృష్టించారు. అలా సృష్టించిన శాస్త్రగ్రంథాలను వేదాంగాలన్నారు. వేదాంగాలు వేదాలను అర్థం చేసుకోవడానికి అవతరించాయి అంటారు.

వేదాంగ సాహిత్యం ఋషుల చేత సృష్టించబడింది. వేదాంగాలు ఆరు – శిక్ష, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం, కల్పం. ఋషి ఆశ్రమాలలో వేదాల అధ్యయన, అధ్యాపన చేయడానికి అనుకూలంగా ఈ వేదాంగాలు సృష్టించారు. వేదసాహిత్యం మొత్తాన్ని రెండు విభాగాలుగా విభజిస్తారు. పూర్వవైదిక యుగం, ఉత్తరవైదిక యుగం. మంత్ర సంహితల దగ్గర నుంచి ఉపనిషత్తుల వరకు ఉన్న సాహిత్యం పూర్వవైదిక యుగం. వేదాంగ సాహిత్యమంతా ఉత్తరవైదిక యుగం.

బ్రహ్మ స్వరూపమైన వేదాలకు ఆరు వేదాంగాలు, ఆరు శరీరాంగాలుగా పాణిని పేర్కొన్నాడు. ఆ వేద పురుషునికి శిక్ష – ముక్కు, వ్యాకరణం – నోరు, నిరుక్తం – చెవులు, ఛందస్సు – పాదాలు, జ్యోతిషం – కళ్లు, కల్పం – చేతులు.

## శిక్ష

మంత్రాలను సరైన రీతిలో సక్రమంగా పలకడానికి శిక్షాగ్రంథాలు సృష్టించారు. వైదిక యజ్ఞ యాగాలను వివరించడానికి ఏ మాదిరిగానైతే బ్రాహ్మణ గ్రంథాలు ఏర్పడ్డాయో, అదే మాదిరి వైదిక సాహిత్య అధ్యయన, అధ్యాపన సమయాలలో పాటించ వలసిన ఉచ్చారణ విధిని చెప్పడానికి శిక్షాగ్రంథాలు ఏర్పడ్డాయి. సమస్త సంస్కృత సాహిత్యంలో శబ్ద ఉచ్చారణకు మహత్తు ఉంది. అందులో వేదాలలో శబ్దోచ్చారణకే కాక, స్వరప్రక్రియకు కూడా మహత్తు ఉంది. ఉచ్చారణ సరిగా లేకపోతే అనేక అనర్థాలు వస్తాయని పూర్వీకుల గాఢ విశ్వాసం. అందువల్ల వీటిని గురించి వివరించే శిక్షాశాస్త్రం యొక్క అవసరం ఏర్పడింది.

వేద మంత్రాలలోని ప్రతి అక్షరాన్నీ శుద్ధంగా, కాల పరిమాణం ప్రకారం ఉచ్చరించాలి. దీనినే అక్షరశుద్ధి అంటారు. కాల పరిమాణమే కాకుండా, ఏ స్థాయిలో పలకాలో కూడా స్వరజ్ఞానం నిర్దేశించబడి ఉంది. హెచ్చు, తగ్గు, సమము – వీటిని ఉదాత్త, అనుదాత్త, స్వరితమంటారు. ఇవన్నీ సరైన ప్రమాణాలలో ఉన్నప్పుడే ధ్వని స్వర శుద్ధమై, స్వచ్ఛంగా వుంటుంది. అందువల్ల మంత్రాలు సత్ఫలితాల నివ్వాలంటే అక్షరశుద్ధి, స్వరశుద్ధీ పరిపూర్ణంగా ఉండాలి. మంత్రాల ఉచ్చారణకి ఎంతో ప్రాముఖ్యముంది. ఆ ఉచ్చారణకీ, స్వరానికీ, స్థాయికీ సంబంధించిన నియమాలు మంత్రాల అర్థం కంటె ముఖ్యం.

శిక్షాశాస్త్రం ప్రతి అక్షరాన్ని ఎలా పలకాలి, ఏ స్థాయిలో పలకాలి, ఏ అక్షరమెంత సేపు ఉచ్చరించాలి, ఎన్ని మాత్రల కాలముండాలి అని నిర్ణయిస్తుంది. హ్రస్వాక్షరాలు, దీర్ఘాక్షరాలను బట్టి ఏ అక్షరాన్ని ఎన్ని మాత్రలకాల ముచ్చరించవలెననేది నిర్ణయించ బడుతుంది. సంధులను విడదీయకుండా పదాలను ఉచ్చరించటం, వేదమంత్రాల పఠనకు అవసరమైన సూచనలు 'శిక్ష'లో ఉంటాయి. కొన్ని శబ్దాల ఉచ్చారణకు శరీరంలోని ఏ ఏ భాగాలు, ఏ ఏ కండరాలు కదలాలో నిర్దేశింపబడ్డాయి. వాటి ప్రకారం అభ్యాసం చేస్తే కేవలం స్వరజ్ఞానమును దాటి మంత్ర యోగాన్ని, శబ్దయోగాన్ని చేరుకుంటారని నమ్మకం.

శిక్షాశాస్త్రంలో వర్ణ విషయాలు ఆరు ఉన్నాయి. అవి వర్ణ (ఉచ్చారణ), స్వరం, మాత్ర, బలం, సామం, సంతానం (పదాలను సంధి చేయడం). వర్ణాలనగా అక్షరాలు. పాణిని ప్రకారం సంస్కృతంలో అరవైనాలుగు వర్ణాలున్నాయి. స్వరాలనగా ఉదాత్త (హెచ్చు), అనుదాత్త (తగ్గు), స్వరిత (సమము) స్వరాలు. మాత్రలంటే స్వరోచ్చారణలో పట్టేకాలం. హ్రస్వోచ్చారణకు ఒక మాత్రకాలం, దీర్ఘోచ్చారణకు రెండు మాత్రలకాలం, ప్లుతోచ్చారణకు మూడు మాత్రల కాలం పడ్తుంది. బలమనగా స్వరోచ్చారణ సమయంలో వాయువు ముఖంలో తగిలి ఏ స్థానం నుంచి బయటకి వస్తుందో ఆ స్థానం. అక్షరాలను ఉచ్చరించేప్పుడు చేసే ప్రయత్నాన్ని ప్రయత్నమంటారు. ఇది రెండు రకాలు – అభ్యంతరం, బాహ్యం. దోషరహితంగా మధురంగా ఉచ్చరించడం సామం. పదాల కలయిక అంటే స్వతంత్ర అస్తిత్వంగల పదాలు శీఘ్రంగా ఉచ్చరింపబడినప్పుడు సంధిరూపంలో ఉచ్చరింప బడడమే సంతానం. వ్యాకరణ శాస్త్రంలో దీన్ని గూర్చి విశదంగా చెప్పబడింది. ప్రాచీన ఋషులు ఏర్పరిచిన ఉచ్చారణ, నియమపాలన, ఆరాధనా రూపమైన దీక్ష ప్రశంసనీయం. వేదోచ్చారణ విషయంలో శిక్షాశాస్త్రం యొక్క పాత్ర చాలా ఉంది.

వేదాక్షరాలను స్పష్టంగా పలకాలి. శబ్దాలకి మచ్చ రాకూడదు. శబ్దం అణగి పోకూడదు. హీనమైపోకూడదు. పెరుగుతున్నట్లు ఉండకూడదు. శబ్దాలను అశ్రద్ధగా, పేలవంగా ఉచ్చరించకూడదు. కటువుగానూ ఉచ్చరించకూడదు. మాటలను సున్నితంగా, దృఢంగా పలకాలి అంటాడు పాణిని మహర్షి (వైయాకరణుడు) 'పాణనీయ శిక్ష'లో.

ఆ పాణినియే వ్యాకరణమనే వేదాంగానికి ఎంతో అమూల్యమైన సేవ చేశాడు. పాణినియేకాక ఇతర యోగులు కూడా 'శిక్ష' గురించి వ్రాశారు. దాదాపు ముప్ఫై గ్రంథాలున్నాయి ఈ విషయమై. వీటిలో పాణినిదీ, యజ్ఞవల్క్యునిదీ అతి ముఖ్యమైనవి.

మంత్ర పఠనంలో అప్రమత్తత అవసరం. శబ్దోచ్చారణలో పొరపాటు జరిగితే మంత్రం సరియైన ఫలితమివ్వకపోగా, హానినిగాని, వ్యతిరేక ఫలితాలనిగాని ఇస్తుందని నమ్మకం. తైత్తిరీయ సంహితలో ఈ విషయాన్ని తెలిపే కథ ఒకటుంది.

త్వష్టడికి ఇంద్రుడితో వైరం. ఇంద్రుని సంహరించల కుమారుడు కావాలని కోరుకుంటాడు. అందుకని 'ఇంద్ర శత్రుర్వర్ధస్వ' అన్న మంత్రాన్ని జపిస్తూ ఒక హోమం చేశాడు. ఈ మంత్రాన్ని సరిగా పఠించే పద్ధతిలో పలికితే 'త్వష్టని కుమారుడు పెరిగి ఇంద్రుని వధించుగాక' అనే అర్థం వస్తుంది. ఆ శబ్దప్రాబల్యం వలన ఆ కుమారుడు పెరిగి ఇంద్రుని వధింపగలిగేవాడు. కాని శబ్దోచ్చారణలో త్వష్టడు పొరపాటు చేశాడు. అందువల్ల అర్థం తారుమారైంది. అక్షరాలూ, పదాలూ మారకపోయినా, స్వరోచ్చారణ దోషం వల్ల త్వష్టడు ఆశించిన దానికి వ్యతిరేకంగా జరిగింది. అతని కుమారుని ఇంద్రుడే చంపేశాడు. అందువల్ల వృత్రుడన్న అతని కుమారుని వధకు త్వష్టడే కారణమయ్యాడు.

శిక్షాగ్రంథాలకు అంగరూపంగా ప్రాతిశాఖ్యలు సృష్టించబడ్డాయి. ఉచ్చారణ, స్వరవిధానం, సంధివిధానం, హ్రస్వ దీర్ఘ విధానాలు మొదలైన విషయాలను గూర్చి ప్రాతిశాఖ్య గ్రంథాలు చర్చిస్తున్నాయి. వ్యాకరణ సంబంధమైన సమస్త పారిభాషిక పదజాలం వీటిల్లో ఉంది.

## వ్యాకరణం

వేదాంగాలలో ఒకటైన వ్యాకరణం వేదమంత్రాలలోని శబ్దాల అర్థాలను బోధించటమే కాక, ఆ శబ్దాలు కాలగర్భంలో కలసిపోకుండా రక్షించాయి కూడా. శబ్దాల వ్యుత్పత్తిని గురించి చెప్పేది వ్యాకరణం. కాని తర్వాత వ్యాకరణం శబ్దాల వ్యుత్పత్తిని కాకుండా పద స్వరూపాన్ని గురించి చెప్పి, అర్థ నిర్ణయాన్ని చేస్తూ వచ్చింది.

ఋగ్వేదంలో ప్రశంసించినట్లు వ్యాకరణానికి నాలుగు కొమ్ములున్నాయి. అవి– నామ, ఆఖ్యాత, ఉపసర్గ, నిపాతాలు. వర్తమాన భూత భవిష్యత్తులు దానికి మూడు పాదాలు. సుప్, తిఙ్‌లు రెండు శిరస్సులు. ఏడు విభక్తులు ఏడు చేతులు. వ్యాకరణ రూపమైన వృషభం ఉరస్సు, కంఠం, శిరస్సు స్థానాలలో బంధింపబడింది. వరరుచి వ్యాకరణం యొక్క ప్రయోజనం అయిదు విధానాలు అని చెప్పాడు. పతంజలి ఆ ప్రయోజనాలను పదమూడు వరకు పెంచాడు. వాటిలో కొన్ని – రక్ష, ఊహ, ఆగమ, లఘు, అసందేహ, అపభాషణ, దుష్టశబ్ద, అర్థజ్ఞాన, ధర్మలాభ, నామకరణ అనునవి.

రక్ష అంటే వేదాల రక్షణ. ఊహ అంటే కొత్తపదాలను కల్పించటం. ఆగమ అంటే శ్రుతి అధ్యయనానికి ప్రమాణ రూపంగా నిలపటం. లఘు అంటే శబ్ద సముద్రాన్ని తరించటానికి వ్యాకరణమే లఘు ఉపాయం. అంటే వ్యాకరణ పఠన, పాఠనాలు అత్యావశ్యకమని చెప్పటం. అసందేహ మంటే శబ్ద విషయకమైన సందేహాలను వ్యాకరణం తీరుస్తుంది. అపభాషణం అంటే శబ్దాల శుద్ధి అశుద్ధులను బోధిస్తుంది. అర్థజ్ఞానం అంటే శబ్దార్థాల బోధకంగా తోడ్పడుతుంది. ధర్మలాభం అంటే వ్యవహారంలో శుద్ధమైన శబ్దాలను ప్రయోగించటం చేత వ్యక్తి స్వర్గలోకంలో అనంతమైన ఫలాన్ని అనుభవిస్తాడు. నామకరణం అంటే పిల్లల నామకరణంలో దోషం లేని జ్ఞానాన్ని కలిగిస్తుంది.

వైదిక శబ్దాల వ్యుత్పత్తి. అర్థవివేచనలు చేయబడిన ప్రాతిశాఖ్య గ్రంథాలు వ్యాకరణ శాస్త్రం యొక్క మొదటి రూపాలు. ఈ ప్రాతిశాఖ్యలకు మూల సూత్రాలు బ్రాహ్మణ, కల్పసూత్ర గ్రంథాలలో ఉన్నాయి. అందువలన వ్యాకరణ రచనలకు వైదిక సాహిత్యం నుంచే ప్రాచీనకాలంలోనే ప్రేరణ లభించి, అవసరం కలిగింది. గోపథ బ్రాహ్మణంలో వ్యాకరణ సంబంధమైన ధాతు, ప్రాతిపదిక, నామ, ఆఖ్యాత, లింగ, వచన, విభక్తి మొదలైన వాటి పారిభాషిక పదాలు పేర్కొనబడ్డాయి. దీనిని బట్టి గోపథం నాటికే వ్యాకరణశాస్త్రం వికసించింది. ఈనాటికీ వ్యాకరణ గ్రంథాలలో పాణినీయ వ్యాకరణమే ప్రాచీనమైంది. పాణిని ఇంద్ర వ్యాకరణాన్ని పేర్కొన్నాడు కాని అది కనుమరుగైంది. శకటాయన ఋక్ తంత్రాన్ని బట్టి వ్యాకరణాన్ని బ్రహ్మ బృహస్పతికి, బృహస్పతి ఇంద్రుడికి, ఇంద్రుడు భరద్వాజునికి, భరద్వాజుడు ఋషులకు, ఋషులు బ్రాహ్మణులకు బోధించారని తెలుస్తుంది.

వ్యాకరణ సంబంధమైన రచనలు ఎన్ని ఉన్నా ఎక్కువ ప్రాచుర్యం ఉన్నది పాణిని రచన. అది సుత్రాలతో నిండి ఉంది. ఆ సూత్రాలకు విపులమైన వ్యాఖ్య (వార్తికం)

వరరుచి రచించాడు. పతంజలి మహర్షి కూడా ఒక వ్యాఖ్యానం రాశాడు. ఈ మూడు గ్రంథాలూ వ్యాకరణ శాస్త్రంలో ముఖ్యమైనవి. ఇతర శాస్త్రాలకీ, వ్యాకరణానికీ తేడా ఉంది. ఇతర శాస్త్రాలలో సూత్రాలు భాష్యాల కంటే ప్రధానం. వ్యాకరణ విషయంలో సూత్రాలు కంటే భాష్యమే ప్రధానం.

## నిరుక్తం

అర్థాన్ని బోధించే పదసమూహం యొక్క సంగ్రహమే నిరుక్తం. నిరుక్తమంటే వ్యుత్పత్తి అని అర్థం. ప్రతి శబ్దం ఏదో ఒక ధాతువు నుంచి ఉత్పన్న మవుతుందని నిరుక్తకారుని అభిప్రాయం. అంటే ప్రతి శబ్దం వ్యుత్పన్నమని అతని అభిప్రాయం. ప్రాచీన వైయాకరణులలో శకటాయనుని అభిప్రాయం కూడా ఇదే. నిరుక్తకారుడు యాస్కుడు, శకటాయనుని స్మరించాడు. ఒక్కొక్కసారి ఒకే పదానికి వేరువేరు వ్యుత్పత్త్యర్థాలు కూడా ఇవ్వబడ్డాయి. ఈ పద్ధతి పాశ్చాత్యులను బాగా ఆకర్షించింది. వారివారి భాషాపదాలకు అర్థాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస వారికి దీని అధ్యయనం ద్వారా కలిగింది.

శబ్ద వ్యుత్పత్తిని చెప్పటం నిరుక్తశాస్త్ర ప్రయోజనం. వేదమంత్రాలను అర్థం చేసుకోవటానికి వాటిలోని పదాల వ్యుత్పత్త్యర్థం తెలుసుకోవడం చాలా అవసరం. మొదట్లో వ్యాకరణాలు కూడా శబ్దాల వ్యుత్పత్తిని గూర్చి చెప్పేవి. కాని అవి కేవలం వ్యుత్పత్త్యర్థాలను చెప్పడానికి పుట్టినవి కావు. నిరుక్తం కేవలం వేదశబ్దాలను వివరించడానికే పుట్టింది. కాని నిరుక్తకారునికి వ్యాకరణ జ్ఞానం చాలా అవసరం. నిరుక్తం నిఘంటువుకి టీకా వంటిదని చెప్పవచ్చును. మొదట నిఘంటు గ్రంథాలు వచ్చాయి. ఈ నిఘంటువులు పూర్వకాలంలో చాలా వుండేవి. కాని ఇప్పుడు ఒకటి మాత్రమే మిగిలిది. దానిని కశ్యపుడు కూర్చాడని మహాభారతంలో చెప్పబడింది. యాస్కుడు ఈ నిఘంటువుకు వ్రాసిన నిరుక్తమే మనకు ఇప్పుడు దొరుకుతుంది. నిఘంటువును కూడా యాస్కుడే కూర్చాడని అంటారు. నిరుక్త గ్రంథాలు కూడా పూర్వం చాలా ఉండేవి. యాస్కుడు పన్నెండు మంది నిరుక్తకారులను పేర్కొన్నాడు. వాళ్ళు - అగ్రాయణ, ఔపమన్యవ, ఔదుంబరాయణ, జీర్ణనాభ, కాత్థక్య, క్రౌష్టుకి, గార్గ్య, గాలవ, తైటికి, వార్షాయణి, శాకపూణి, స్థౌలాష్ఠీవి. ఈ నిరుక్తకారుల గ్రంథాలేవీ మనకు దొరకవు. యాస్కుని కాలం నాటికే వేదార్థ నిర్ణయంలో మతభేదాలు ఏర్పడ్డాయి. ఆ మత భేదాలు - అధిదేవత, ఆధ్యాత్మ, ఆఖ్యాన, ఇతిహాసిక, నైదాన, నైరుక్త, పరివ్రాజిక, యాజ్ఞిక అనునవి. యాస్కుని నిరుక్త గ్రంథ ప్రభావం తరవాతి తరవాతి వేద భాష్యకారుల మీద చాలా ఉంది. సాయణాదులు యాస్కుని ఆధారంగానే వేదార్థ నిర్ణయం చేయగలిగారు.

యాస్కుడు రచించిన నిరుక్తం వేదమంత్రాలకి అర్థం వివరించడంలో ప్రథమ ప్రయత్నం. వేదాలలో కొన్ని పదాలకి వాటి ధాతువుల నించి పుట్టినవిగా నిరూపించి అర్థనిర్ణయం చేయడం దాని ప్రధానోద్దేశం. దీనిలో పన్నెండు అధ్యాయాలున్నాయి. (మరో రెండు అధ్యాయాలు తరువాత కాలంలో చేర్చబడినాయట). నిరుక్తానికి ఆధారం యాస్కుని కాలానికే పరంపరాగతంగా వచ్చిన అయిదు అధ్యాయాలు ఉన్న నిఘంటువు. ఇందులో నైఘంటుకకాండ అనబడే మొదటి మూడు అధ్యాయాలలో ఒక అర్థం ఉన్న పర్యాయపదాల జాబితాలు ఉన్నాయి. నైగమకాండ అనబడే నాలుగో అధ్యాయంలో భిన్న అర్థాలు కల పదాల జాబితా ఉంది. దైవతకాండ అనబడే అయిదో అధ్యాయంలో దేవతల పేర్లు ఉన్నాయి. నిరుక్తం నిఘంటువుకి వ్యాఖ్యానం.

నిరుక్తంలో ప్రతిపాదింపబడిన సిద్ధాంతాలను చెప్పే మరొక గ్రంథం నిరుక్త చయనం. దీన్ని వరరుచి వ్రాశాడని అంటారు. నిరుక్తం, దాని వ్యాఖ్యానం, నిరుక్త చయనం ఆధారంగానే మధ్యయుగాల్లో ఆచార్యులు వేదమంత్రాలకు అర్థ వ్యాఖ్యానాలు చేయగలిగారు. వేదాధ్యయనానికి చాలా మహత్తు కలిగిన గ్రంథాలు ఇవి అంటారు.

## ఛందస్సు

వేదాల విశుద్ధమైన, లయబద్ధమైన ఉచ్చారణకు, పాఠానికి ఛందశ్శాస్త్రాధ్యయనం అవసరం. ఇది లేకుండా మంత్రాల యొక్క ఫలం లభించదని ప్రాచీనుల నమ్మకం. ప్రత్యేకమైన సూక్తానికి దేవత, ఋషితోపాటు ఛందో జ్ఞానం కూడా అవసరం.

ఛందస్సులో నియతవిచ్ఛేదం అనేక రకాలుగా ఉన్నది. అందులో ఆ వాక్య సమూహాన్ని లయానుగుణమైన పాదాలుగా, గణాలుగా విభజించడం ప్రధానమైంది. గణాలు గురు లఘువుల కూడిక వల్ల ఏర్పడుతున్నాయి. అక్షరాలకు గురుత్వంగాని లఘుత్వంగాని వాటి ఉచ్చారణాకాలాన్ని బట్టి చెప్పబడుతుంది. ఆయాపాదాల్లో గురు లఘువులుండే స్థానాల మార్పువల్ల ఛందస్సులో అనేకరకాల గమనాలు ఏర్పడుతున్నాయి. కాబట్టి వేదపురుషునికి ఛందస్సు పాదాలు (ఛందః పాదౌ తు వేదస్య) అని వర్ణించబడింది.

శ్లోకానికి నాలుగు పాదాలుండి, ఒక్కొక్క పాదానికి ఎనిమిది అక్షరాలుంటే దానిని "అనుష్టుప్" ఛందస్సంటారు. తొమ్మిది అక్షరాలుంటే 'బృహతీ' అవుతుంది. పది ఉంటే 'పంక్తీ', పదకొండు ఉంటే "త్రిష్టుప్', పన్నెండు ఉంటే 'జగతీ' అవుతుంది. పాదానికి ఇరవై ఆరు అక్షరాలు గల ఛందస్సు 'ఉద్కృతి' అంటారు. పాదానికి ఇరవై ఆరు కంటే ఎక్కువ అక్షరాలుంటే 'దండక' మవుతుంది. వీటిలో కూడా ఎన్నో రీతులున్నాయి.

వైదిక ఛందస్సులు అక్షరగణం మీద ఆధారపడ్డాయి. వీటిలో అక్షరాలు గురు లఘువుల్లో ఒక వరసగాని, ప్రత్యేక పద్ధతిగాని లేదు. లౌకిక ఛందస్సు వైదిక ఛందస్సు నుంచే వచ్చినా, దాని గురు లఘు నియమాలలో పద్ధతి ఉంది. వైదిక ఛందస్సులో పాద నియమం కూడా లేదు. వేదంలో ఒక్క పాదం, రెండు, నాలుగు పాదాలే ఉండాలని నియమం లేదు. గాయత్రి, ఉష్ణిక ఛందస్సులలో మూడు పాదాలే. పంక్తి అనే ఛందస్సులో అయిదు పాదాలు. వేదాలలోని ప్రధాన ఛందస్సులలో అక్షరాల సంఖ్య ఈ ప్రకారంగా ఉంది – గాయత్రి ఇరవై నాలుగు, ఉష్ణిక్ ఇరవై ఎనిమిది, అనుష్టుప్ ముప్పై రెండు, బృహతీ ముప్పై ఆరు, పంక్తి నలభై, త్రిష్టుపు నలభై నాలుగు, జగతి నలభై ఎనిమిది, అతి జగతి యాభై రెండు, శక్కరి యాభై ఆరు, అతి శక్కరి డెబ్భై ఆరు, కృతి ఎనభై, ప్రకృతి ఎనభై నాలుగు, ఆకృతి ఎనభై ఎనిమిది, వికృతి తొంభై రెండు, సంస్కృతి తొంభై ఆరు, అభికృతి నూరు, ఉత్కృతి నూట నాలుగు – ఈ విధంగా అక్షరాల సంఖ్య నిర్ణయించి ఉన్నా, అప్పుడప్పుడు పాదంలో ఒక అక్షరం తక్కువగా, ఒక్కొక్కసారి ఒక అక్షరం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు తక్కువగా ఉన్న దానికి 'నిచృత్' అని, ఎక్కువగా ఉన్న దానిని 'భురిక్' అని అంటారు.

గాయత్రి మంత్రానికి దేవత సవిత. గాయత్రి అన్నది ఛందస్సు పేరు మాత్రమే. కాని మంత్రానికి ఛందస్సు పేరు పెట్టారు. శబ్దానికీ, స్వరానికీ దివ్యశక్తి ఉన్నట్టుగానే – ఛందస్సుకీ, రచనకీ కూడా ఉన్నాయి. మంత్రానికైనా, శ్లోకానికైనా నాలుగు పాదాలుండాలి మామూలుగా. కాని గాయత్రికి మూడు పాదాలే వుంటాయి. గాయత్రి అనే ఛందస్సుకు మూడు పాదాలూ, పాదానికి ఎనిమిది అక్షరాలు – మొత్తం ఇరవై నాలుగు అక్షరాలుంటాయి. మూడు పాదాలు కలిగి ఉండడం వల్ల "త్రిపాద గాయత్రి" అంటారు. ఇతర గాయత్రీ రీతులు కూడా ఉన్నాయి. ఋగ్వేదపు మొదటి మంత్రం "అగ్నిమీడే" కూడా గాయత్రి ఛందస్సులోనిదే. కొన్ని స్తోత్రాలలో ఇరవైనాలుగు అక్షరాల గాయత్రిని నాలుగు పాదాలుగా, ఒక్కొక్క పాదానికి ఆరు అక్షరాలుగా విభజిస్తారు. ఒక్కొక్క పాదానికి ఏడు అక్షరాల చొప్పున మొత్తం ఇరవై ఎనిమిది అక్షరాలుంటే అది ఉష్ణిక్ ఛందస్సు అవుతుంది.

పాదంలో ఉండే అక్షర సంఖ్యను బట్టి ఛందస్సు పేర్కొనబడుతుంది. సాధారణంగా ఛందస్సులో నాలుగు పాదాలు ఉంటాయి. పాదంలో ఒకటి నుండి ఇరవై ఆరు వరకు అక్షరాలుంటాయి. కనుక ఇరవై అరు ఛందస్సులు ఉన్నాయి. అవి నాలుగు వర్గాలుగా విభజించబడ్డాయి.

**మొదటి వర్గంలో** - ఉక్త, అత్యుక్త, మధ్య, ప్రతిష్ట, సుప్రతిష్ట - వీటికి అనాదిష్ట ఛందస్సులని పేరు.

**రెండవ వర్గంలో** - గాయత్రి, ఉష్టిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి - వీటికి బృహచ్ఛందస్సులని పేరు.

**మూడవ వర్గంలో** - అతిజగతి, శక్కరి, అతిశక్కరి, అష్టి, అత్యష్టి, ధృతి, అతిధృతి - వీటికి అతిచ్ఛందస్సులని పేరు.

**నాలుగవ వర్గంలో** - కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అభికృతి, ఉత్కృతి - వీటి కృతి ఛందస్సులని పేరు.

**1. గాయత్రి :** 3 పాదాలు 8 + 8 + 8 = 24 అక్షరాలు

| | | |
|---|---|---|
| అ) అతి నిచృత్ | : | 7 + 6 + 7 = 20 అక్షరాలు |
| ఆ) పాద నిచృత్ | : | 7 + 7 + 7 = 21 అక్షరాలు |
| ఇ) వర్ధమానా | : | 6 + 7 + 8 = 21 అక్షరాలు |
| ఈ) విరాట్ | : | 9 + 6 + 7 = 22 అక్షరాలు |
| ఉ) యవమధ్యా విరాట్ | : | 7 + 8 + 7 = 22 అక్షరాలు |
| ఊ) నిచృత్ | : | 8 + 8 + 7 = 23 అక్షరాలు |
| ఋ) యవమధ్యా గాయత్రీ | : | 7+ 10 + 7 = 24 అక్షరాలు |
| ౠ) ఉష్ణిగ్గర్భా | : | 6 + 7 + 11 = 24 అక్షరాలు |
| ఎ) భురిక్ | : | 8 + 10 + 7 = 25 అక్షరాలు |
| ఏ) భురిక్ పద పంక్తి | : | 5 + 5 + 5 + 5 + 6 = 26 అక్షరాలు |

**2. ఉష్టిక్ :** 3 పాదాలు 8 + 8 + 12 = 28 అక్షరాలు

| | | |
|---|---|---|
| అ) కకుమ్న్యంకుశిరా-నిచృత్ | : | 11 + 12 + 4 = 27 అక్షరాలు |
| ఆ) కకుప్ | : | 8 + 12 + 8 = 28 అక్షరాలు |
| ఇ) పుర ఉష్టిక్ | : | 12 + 8 + 8 = 28 అక్షరాలు |
| ఈ) పిపీలికా మధ్యా | : | 11 + 6 + 11 = 28 అక్షరాలు |
| ఉ) తనుశిరా | : | 11 + 11 + 6 = 28 అక్షరాలు |
| ఊ) అనుష్టుప్గర్భా | : | 5 + 8 + 8 + 8 = 29 అక్షరాలు |

**3. అనుష్టుప్ :** 4 పాదాలు 8 + 8 + 8 + 8 = 32 అక్షరాలు

| | | |
|---|---|---|
| అ) కావిరాట్ | : | 9 + 12 + 9 = 30 అక్షరాలు |
| ఆ) విరాట్ | : | 10 + 10 + 10 = 30 అక్షరాలు |
| విరాట్ | : | 11 + 11 + 11 = 33 అక్షరాలు |
| ఇ) మహా పదపంక్తి : 6 పాదాలు | : | 5+5+5+5+5+6 = 31 అక్షరాలు |
| ఈ) నిచృత్ : 4 పాదాలు | : | 8 + 8 + 8 + 7 = 31 అక్షరాలు |
| ఉ) నష్టరూపి | : | 9 + 10 + 13 = 32 అక్షరాలు |
| ఊ) కృతి | : | 12 + 12 + 8 = 32 అక్షరాలు |
| ఋ) పిపీలికామధ్యా | : | 12 + 8 + 12 = 32 అక్షరాలు |

**4. బృహతి :** 4 పాదాలు 8 + 8 + 12 + 8 = 36 అక్షరాలు

| | | |
|---|---|---|
| అ) పిపీలికా మధ్యా | : | 13 + 8 + 13 = 34 అక్షరాలు |
| ఆ) ఊర్ధ్వబృహతి | : | 12 + 12 + 12 = 36 అక్షరాలు |
| ఇ) పురస్తాత్ | : | 12 + 8 + 8 + 8 = 36 అక్షరాలు |
| ఈ) ఉపరిష్టాత్ | : | 8 + 8 + 8 + 12 = 36 అక్షరాలు |
| ఉ) న్యంకుసారిణి/స్కందగ్రీలి/ ఉరోబృహతి | : | 8 + 12 + 8 + 8 = 36 అక్షరాలు |
| ఊ) విస్తార | : | 8 + 10 + 10 + 8 = 36 అక్షరాలు |
| ఋ) విషమపదా | : | 9 + 8 + 11 = 8 = 36 అక్షరాలు |
| ౠ) బృహతి | : | 8 + 8 + 2 + 8 = 26 అక్షరాలు |
| సతోబృహతి | : | 12 + 8 + 12 + 8 = 40 అక్షరాలు |

**5. పంక్తి :** 4 పాదాలు 12 + 8 + 12 + 8 = 40 అక్షరాలు.

| | | |
|---|---|---|
| అ) విరాజ్ | : | 10 + 10 + 10 + 10 = 40 అక్షరాలు |
| ఆ) విపరీత సతోబృహతి | : | 8 + 12 + 8 + 12 = 40 అక్షరాలు |
| ఇ) ఆస్తార | : | 8 + 8 + 12 + 12 = 40 అక్షరాలు |
| ఈ) ప్రస్తార | : | 12 + 12 + 8 + 8 = 40 అక్షరాలు |

ఉ) సంస్తార : 12 + 8 + 8 + 12 = 40 అక్షరాలు

ఊ) విస్తార : 8 + 12 + 12 + 8 = 40 అక్షరాలు

ఋ) పథ్యాపంక్తి : 5 పాదాలు : 8 + 8 + 8 + 8 + 8 = 40 అక్షరాలు

**6. త్రిష్టుప్ :** 4 పాదాలు 11 + 11 + 11 + 11 = 44 అక్షరాలు

అ) ఏకపాదా : 11 అక్షరాలు

ఆ) ద్విపాదా : 11 + 11 = 22 అక్షరాలు

ఇ) విరాట్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 42 అక్షరాలు

ఈ) నిచృత్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 43 అక్షరాలు

ఉ) అభిసారిణి : 10 + 10 + 12 + 12 = 44 అక్షరాలు

ఊ) విరాట్‌పూర్వా/పంక్త్యుత్తరా : 10 + 10 + 8 + 8 + 8 = 44 అక్షరాలు

ఋ) మహాబృహతి : 8 + 8 + 12 + 8 + 8 = 44 అక్షరాలు

ౠ) భురిక్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 45 అక్షరాలు

ఎ) స్వరాట్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 46 అక్షరాలు

**7. జగతి :** 4 పాదాలు 12 + 12 + 12 + 12 = 48 అక్షరాలు

అ) ఉపజగతి : 12 + 12 + 11 + 11 = 46 అక్షరాలు

ఆ) విరాట్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 46 అక్షరాలు

ఇ) నిచృత్ : 4 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 47 అక్షరాలు

ఈ) మహాపంక్తి : 6 పాదాలు : 8 + 8 + 8 + 8 + 8 + 8 = 48 అక్షరాలు

ఉ) మహాసతోబృహతి : 5 పాదాలు – అక్షరాల క్రమం లేదు – 48 అక్షరాలు

**8. అతిఛందస్సులు :**

అ) అతి జగతి : 52 అక్షరాలు

ఆ) శక్కరి : 56 అక్షరాలు

ఇ) అతిశక్కరి : 60 అక్షరాలు

ఈ) అష్టి : 64 అక్షరాలు

| | | | |
|---|---|---|---|
| ఉ) అత్యష్టి | : | 68 | అక్షరాలు |
| ఊ) ధృతి | : | 72 | అక్షరాలు |
| ఋ) అతిధృతి | : | 76 | అక్షరాలు |
| ౠ) కృతి | : | 80 | అక్షరాలు |
| ఎ) ప్రకృతి | : | 84 | అక్షరాలు |
| ఏ) ఆకృతి | : | 88 | అక్షరాలు |
| ఐ) వికృతి | : | 92 | అక్షరాలు |
| ఒ) సంకృతి | : | 93 | అక్షరాలు |
| ఓ) అభికృతి | : | 100 | అక్షరాలు |
| ఔ) ఉత్కృతి | : | 104 | అక్షరాలు |

ఈ విధంగా వేదకాలం నాటికే ఛందస్సులో, కావ్యరచనా కళలో ఎంతో వైవిధ్యం, అభివృద్ధి గోచరిస్తున్నాయి.

ఒక వేద సూక్తాన్ని గాని, మంత్రాన్ని గాని పఠించేటప్పుడు అది మూలం ప్రకారమే ఉన్నదో లేదో తెలుసుకోవడానికి ఛందస్సు ఉపయోగపడుతుంది. మంత్రంలోని అక్షరాలను లెక్కపెట్టి, లెక్క కుదరకపోతే తెలిసినవారిని అడిగి సరైన రూపాన్ని తెలుసుకొంటారు. వేదపాఠం ఆదిలో ఎలావుండేవో అలాగే ఒక్క అక్షరం ఎక్కువ, తక్కువా కాకుండా ఉండటానికి కారణం ఛందస్సు ఒక్కటే!

ప్రతి మంత్రమూ ఏదో దేవతకి అంకితమై ఉంటుంది. అంటే ప్రతి మంత్రానికి ఒక అధిష్టాన దేవత ఉంటుంది. దానికొక ఛందస్సు, దానిని లోకానికి అనుగ్రహించిన ఋషీ ఉంటారు. ఆయనే ఆ మంత్రానికి ఋషి. ఛందస్సు వేద పురుషుని పాదాలుగా భావిస్తారు. మంత్రజపంలో ప్రవేశమున్నవారు ఋషి యొక్క పేరు చెప్పి శిరస్సుని, ఛందస్సు పేరు చెప్పుకుని ముక్కుని, అదిష్ఠాన దేవత పేరు చెప్పి హృదయాన్ని తాకుతారు.

ఛందస్సు శాస్త్రానికి కూడా శివుడే ప్రథమ ప్రవర్తకుడు. శివుని దగ్గర నుండి బృహస్పతి, బృహస్పతి నుండి దుశ్చ్యవనుడు, అతని నుండి ఇంద్రుడు, ఇంద్రుని నుండి మాండవ్యుడు ఈ శాస్త్రాన్ని గ్రహించారు.

## జ్యోతిషం

వేదాంగాలలో జ్యోతిషం ఒకటి. ఈ శాస్త్రంలో మూడు విభాగాలు లేక మూడు స్కంధాలున్నాయి. అందువల్లనే ఈ శాస్త్రాన్ని 'స్కంధత్రయాత్మక' మంటారు. స్కంధ మంటే చెట్టు యొక్క ముఖ్యమైన శాఖ.

గార్గ, నారద, పరాశరాదులెందరో జ్యోతిషం గురించి గొప్ప గ్రంథాలు వ్రాశారు. ఈ శాస్త్రం ఒక విభాగాన్ని తీసుకుని దివ్య శిల్పి మయునకు సూర్యుడు బోధించాడంటూ ఒక గ్రంథముంది. అది 'సూర్యసిద్ధాంతం'. దేవతలు, ఋషులు రచించిన గ్రంథాలు చాలా ఉన్నాయంటారు. మానవులు రచించిన గ్రంథాలు కూడా ఉన్నాయి. వరాహ మిహిరుడు చాలా గ్రంథాలు వ్రాసినట్లు ప్రసిద్ధి. ఆర్యభట్టు, భాస్కరాచార్యుడు కూడా ఈ శాస్త్రానికి ఎంతో సేవ చేశారు.

వైదిక కర్మలను నిర్వహించటానికి గ్రహాల స్థితిని తెలుసుకోవాలని నియమా లున్నాయి. జ్యోతిషాన్ని 'నయన' మని కూడా అంటారు. అంటే కన్ను అని అర్థం. వైదిక కర్మలను నిర్వహించడానికి ముహూర్తాలను తెలిపి, జ్యోతిషం వాటిని నిర్వహించడానికి కంటి వలె మార్గాన్ని చూపుతుంది. వేదపురుషునికి నేత్రం వంటిది జ్యోతిషం.

ఒక్కొక్క గ్రహం క్రింద, నక్షత్రం క్రింది, ఒక్కొక్క తిథిలో జరిపే కర్మల సఫలిత విఫలితాలను తెలుసుకోవడానికి ఏర్పడింది జ్యోతిష శాస్త్రం మొదట్లో. అంటే ఏ కర్మలు చేయడానికి ఏ సమయాలు సానుకూలమో తెల్పడమే జ్యోతిషశాస్త్ర ముఖ్య ప్రయోజనం. అందువలననే ఈ శాస్త్రాలన్నీ వేదాలలో భాగంగా, వేదాంగంగా రూపొందింది. గ్రహాల గతులను సూచించటానికి చాలా లెక్కలు అవసరం గనుక గణితశాస్త్రం కూడా దీనిలో భాగమైంది. వైదిక యజ్ఞాన్ని నిర్వహించే ప్రదేశాన్ని 'యజ్ఞవేదిక' అంటారు. ఆ స్థలాన్ని నిర్ణయించడానికి ఎన్నో విపులమైన నియమాలున్నాయి. ఈ నియమాల ననుసరించి యజ్ఞవేదికను సరిగ్గా నిర్మిస్తే సత్ఫలితాలు వస్తాయి. కాబట్టి ఈ లెక్కలను అతి జాగ్రత్తగా నియమాల ప్రకారం చేయవలసిన అవసరమేర్పడింది. ఈ కారణంగానే గణితశాస్త్రం వేదాలకి ఉపాంగంగా రూపొందింది.

జ్యోతిషంలో మూడు స్కందాలున్నాయి. అవి సిద్ధాంతస్కందం, హోరస్కందం, సంహిత స్కందం. సిద్ధాంతస్కందంలో అంకగణితం, త్రికోణ గణితం, క్షేత్ర గణితం, బీజగణితం వివరింపబడ్డాయి.

దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల క్రితం భాస్కరాచార్య అనే ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడుండేవాడు. విధి బలీయమని చూపే సంఘటన ఆయన జీవితంలో సంభవించింది. గణిత శాస్త్రం పై గ్రంథం వ్రాసి ఆయన కూతురు లీలావతి పేరు పెట్టాడు. దీనిలో అంక గణితం, వృత్త గణితం, బీజగణితం మొదలైనవి ఉన్నాయి. గ్రహగతులను, స్థానాలను గణించటానికి 'సిద్ధాంత శిరోమణి' అనే గ్రంథం కూడా రచించాడు. 'ప్రాచీన లేఖమాల' అనేది పురాతన శాసనాల సంకలనం. గుజరాత్‌లో సింగన అనే రాజు భాస్కరాచార్యుని రచనలు ప్రచారంలోకి తీసుకురావడానికి కృషి చేసినట్లు ఈ గ్రంథం తెల్పుతుంది.

భాస్కరాచార్యునికి పూర్వం దాదాపు పదిహేను వందల సంవత్సరాల నాడు వరాహమిహిరుడనే గణిత శాస్త్రజ్ఞుడు 'బృహత్ సంహిత', 'బృహత్ జాతకం' వంటి గ్రంథాలు రచించాడు. బృహత్ సంహిత అనేక శాస్త్రాల సంక్షిప్త రూపం. బృహత్ జాతకం జ్యోతిషానికి సంబంధించిన అన్ని విషయాలను చర్చిస్తుంది. అదే కాలం వాడైన ఆర్యభట్టు 'ఆర్యభట్ట సిద్ధాంత'మనే గ్రంథం రచించాడు. ఆ రచనలోని సూత్రాల ననుసరించే ఇప్పటి 'అంకగణిత' మేర్పడింది. ఆధునిక గణిత శాస్త్రజ్ఞులు వరాహమిహురుని, ఆర్యభట్టుని ఆరాధిస్తారు. ఈ గణిత శాస్త్రాలు అన్నీ నవగ్రహాలు, నక్షత్రాలూ – వాటి సంచారం చెప్తాయి. కాని ఉన్నవి ఏడు గ్రహాలే. రాహు కేతువులు ఛాయాగ్రహాలు. సూర్య చంద్రుల గతికి వ్యతిరేకదిశలో సంచరిస్తాయి. వాటికి ప్రత్యేకమైన లెక్కలు కావాలి.

నక్షత్రాలు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తాయి. గ్రహాలు కూడా పశ్చిమంవైపే కదులుతాయి. కాని ప్రతిరోజు తూర్పువైపు కొంత కదులుతాయి. ఏడుగ్రహాలూ తూర్పువైపు కదులుతాయి. జ్యోతిష శాస్త్రం ఈ చలనాన్ని అధ్యయనం చేస్తుంది.

ఋగ్వేద కాలపు ఆర్యులు సంవత్సరమునకు పన్నెండు చంద్రమాసములని, మూడేండ్ల కొకసారి అధికమాసమని లెక్కకట్టారు. పన్నెండు మాసాలు వరుసగా – మధు, మాధవ, శుక్ర, శుచి, నభస్సు, నభస్య, ఇష, ఊర్జ, సహ, సహస్, తపస్, తపస్య మొదలగునవి.

వేదాంగ జ్యోతిష జ్ఞానం మొట్టమొదట బ్రహ్మకు లభించిందని, దాన్ని అతడు తన కుమారుడు వసిష్ఠునికి చెప్పాడని చెప్పబడింది. మరొక కథను బట్టి విష్ణువు సూర్యునికి జ్యోతిష జ్ఞానం ఇచ్చాడు. పులిశుడు ఒక సిద్ధాంతాన్ని వేరుగా నిర్మించి ఋషులకు

ఇచ్చాడు. సూర్యుడు శాపగ్రస్తుడై యవన జాతిలో జన్మించి రోమక సిద్ధాంతాన్ని నిర్మించాడని ఒక కథ. ఆర్యభట్టు, వరాహమిహిర, బ్రహ్మగుప్త, భాస్కరాచార్య మొదలైన జ్యోతిషవేత్తలు జ్యోతిషశాస్త్ర వికాసానికి చాలా తోడ్పడ్డారు.

## కల్పసూత్రాలు

వేదాంగ సాహిత్యంలో కల్పసూత్ర గ్రంథాలకు ప్రముఖమైన స్థానం ఉంది. ఇవి అతి ప్రాచీనమైన గ్రంథాలుగా చెప్పబడ్డాయి. వైదిక సాహిత్యానికి ఇవి సమకాలికమైన రచనలని, ఇవి దానిలోనే చేరాలనే అభిప్రాయాన్ని పండితులు వెలిబుచ్చారు. కాని వేదాలు అపౌరుషేయాలుగా, వేదాంగాలు పౌరుషేయాలుగా పరిగణించడం వలన ఇది సాధ్యం కాదు. బ్రాహ్మణ గ్రంథాలలో యజ్ఞ యాగాదుల వివరణ విస్తృతంగా అర్థం కానిదిగా ఉంది. కాలక్రమాన వాటిని క్రమబద్ధం చేయవలసిన అవసరం ఏర్పడింది. ఆ ఉద్దేశంతో వ్రాయబడినవే కల్పసూత్ర గ్రంథాలు. ఇవి ఋత్విజుల ఉపయోగార్థం వెలువడ్డాయి. ఇవి సూత్ర రూపంలో ఉండడం చేత విపులమైన వేద విధులు కంఠస్థం చేయడానికి సులభమైంది. తక్కువ శబ్దాలలో ఎక్కువ అర్థాన్ని బోధించడమే సూత్రం యొక్క ప్రయోజనం.

కల్పశాస్త్రాన్ని ఎందరో ఋషులు సంకలనం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కృష్ణ యజుర్వేదానికి సంబంధించిన పది కల్పసూత్రాలను రచించిన ఋషులు ఆరుగురు. వారు – ఆపస్తంబుడు, బోధాయనుడు, వైఖానసుడు, సత్యాషాఢుడు, భరద్వాజుడు, అగ్నివేషుడు. ఋగ్వేదానికి ఆశ్వలాయనుని కల్పమే ఎక్కువగా వాడుకలో ఉన్నది. సాంగాయనుని రచన కూడా ఒకటున్నది. శుక్లయజుర్వేదానికి కాత్యాయనుని సూత్రాలున్నాయి. సామవేదంలోని కౌథుమశాఖకి లాట్యాయనుడు, రాణాయనేయ శాఖకి ద్రాహ్యాయణుడు, తలవకారశాఖకి జైమిని – కల్పసూత్రాలు రచించారు. ప్రతి శాఖకి సంబంధించిన కల్పంలోనూ రెండు వర్గాల సూత్రాలుంటాయి. అవి గృహ్య సూత్రాలు, శ్రౌతసూత్రాలు. ఈ రెండు సూత్రాలూ గర్భంలో శిశువు ఉదయించినది మొదలు, దేహానికి దహనం జరిగేవరకు చేయవలసిన కర్మలను వివరిస్తాయి. దహన సంస్కారం కూడా ఒక క్రతువే. దానిని అంత్యేష్టి – అంటే ఆఖరి కర్మ అని అంటారు. ఇందులో దేహాన్నంతా అగ్నికి అర్పిస్తారు.

అగ్నిహోత్రాన్ని ఆధారంగా చేసుకుని బ్రాహ్మణుడు ప్రతిదినమూ ఇరవై ఒక్క యజ్ఞాలు చేయాలంటారు. అవి ఏడు హవిర్యజ్ఞాలు, ఏడు సోమయజ్ఞాలు, ఏడు భాగ

యజ్ఞాలు. వీటిలో హవిర్యజ్ఞాలు, సోమయజ్ఞాలు గృహ్యాసూత్రాలలో ఉండవు. శ్రౌత సూత్రాలలో ఉంటాయి. ఇవి నలభై కర్మలలో, సంస్కారాలలో ఉంటాయి. సంస్కారమంటే పరిశుద్ధం కావించేదని అర్థం. అగ్నిహోత్రాన్ని గృహంలో చెయ్యాలి. యజ్ఞాన్ని ఆరుబయట ఒక ఆచ్ఛాదన క్రింద చెయ్యాలి. శ్రౌత సూత్రాలు ముఖ్యమైన యజ్ఞాలను వివరిస్తాయి. గృహ్యాసూత్రాలు ఇంటిలో చేయవలసిన కర్మలను వివరిస్తాయి. కల్పసూత్రాలు – నలభై సంస్కారాలను, ఎనిమిది ఆత్మ గుణాలను వివరిస్తాయి.

హవిర్ – సోమయజ్ఞానికి సంబంధించిన పధ్నాలుగు యజ్ఞాలు మినహాయించి ఇరవై ఆరు కర్మలు గృహ్యాసూత్రాలలో ఉంటాయి. అవి – గర్భదానం, పుంసవనము, సీమంతము, జాతకర్మ, నామకరణం, అన్నప్రాసన, ముండనం, ఉపనయనం, వివాహం, అంత్యేష్టి వంటివి. ఎనిమిది ఆత్మ గుణాలు – దయ, క్షమ, ఓర్పు, అనసూయ (అసూయ లేకపోవడము), శౌచం (పరిశుద్ధత), మొండితనం లేకపోవడం, మధురస్వభావం, అత్యాశ లేకపోవటం, నిష్కామం – వీటిని సామాన్యధర్మాలని అంటారు.

ఏడు విధాలైన గృహ యజ్ఞాలు – పితృయజ్ఞం, పార్వణ, అష్టిక, శ్రావణి, ఆశ్వాయుజి, ఆగ్రహాయణేయ, చైత్రీ యజ్ఞాలు వివరించబడ్డాయి. ఇవి కాక దేవ, భూత, పితృ, మహా, మనుష్య అనే పంచ మహాయజ్ఞాలను గూర్చి చెప్పబడింది. వీటిలో గృహనిర్మాణం, గృహప్రవేశం, ప్రయాణ ముహూర్తాలు మొదలైనవి చాలా వివరించారు. చాతుర్వర్ణ్యాశ్రమాలు ధర్మసూత్రాలలో వివరించబడ్డాయి. రాజు పాటించవలసిన కర్తవ్యాలు కూడా చెప్పబడ్డాయి.

యజ్ఞవేదుల నిర్మాణ పద్ధతులు శుల్బసూత్రాలలో వివరించారు. ప్రాచీన భారతీయులు జ్యామిత (జామింట్రీ) విద్యలో సాధించిన జ్ఞానాన్ని వీటిలో చూస్తాము. యజ్ఞం నిర్వహించేప్పుడు 'చయన' మనే ప్రక్రియ ఒకటుంది. కల్పంలో దీనికి సంబంధించిన శుల్బసూత్రమనే ప్రత్యేక విభాగముంది. శుల్బసూత్రాలు రెండు రకాలు– సామాన్య సూత్రాలు, విశేష సూత్రాలు. కాత్యాయన, బోధాయన, హిరణ్యకేశులు – ఈ ముగ్గురు శుల్బ సూత్రాలను రచించారు. శ్రౌతము అనేది శృతిలో వేదంలో వస్తుంది. శ్రౌత కర్మలు పెద్దపెద్ద క్రతువులు. వీటిని ప్రత్యేకంగా బయట నిర్మించిన శాలలో నిర్వహించాలి. ఇంటిలో చేయగల చిన్నచిన్న కర్మలను గృహకర్మలంటారు.

# ఉపాంగములు

**చ**తుర్దశ విద్యలలో నాలుగు వేదాలూ, ఆరు వేదాంగాలూ తరువాతవి నాలుగు ఉపాంగాలు - మీమాంస, న్యాయం, పురాణము, ధర్మశాస్త్రము.

## మీమాంస

నిరుక్తంలో వేదమంత్రాల అర్థం ఉంటుంది. ఆ మంత్రాల ప్రాముఖ్యత, ఉద్దేశమూ, వాటి విశిష్టతా నిర్దిష్టంగా మీమాంస తెలుపుతుంది. వేదాలలో రెండు ప్రధాన విభాగాలున్నాయి. అవి కర్మకాండ, జ్ఞానకాండ. కర్మకాండని పూర్వభాగమని, జ్ఞానకాండని ఉత్తర భాగమని అన్నారు. అదే మాదిరి మీమాంసలో కూడా రెండు భాగాలున్నాయి- పూర్వమీమాంస, ఉత్తరమీమాంస. పూర్వమీమాంస కర్మకాండలో చెప్పబడిన కర్మల, యజ్ఞాల ప్రామాణ్యాన్ని విశదీకరిస్తుంది. ఉత్తర మీమాంస జ్ఞానకాండకు సంబంధించిన ఆత్మసాక్షాత్కార ప్రాముఖ్యాన్ని విశదపరుస్తుంది.

ప్రతి శాస్త్రానికి ఒక సూత్రం, ఒక వార్తికము, ఒక భాష్యం ఉంటాయి. పూర్వ మీమాంసకి జైమిని ఋషి సూత్రాన్ని, శబరస్వామి భాష్యాన్ని, కుమారిలభట్టు వార్తికాన్ని వ్రాశారు. కొద్ది తేడాతో ప్రభాకరుడు కూడా ఒక భాష్యం వ్రాశాడు.

జైమిని రచించిన పూర్వ మీమాంస బృహద్గ్రంథం. దానిలో పన్నెండు అధ్యాయాలు. ప్రతి అధ్యాయంలో చాలా పాదాలు, ఆ పాదాలకి అధికరణలు ఉన్నాయి. ఒక్కో అధికరణం ఒక్కో విషయాన్ని ప్రస్తావిస్తుంది. ఇవి వెయ్యి అధికరణాలున్నాయి. అందువలన పూర్వమీమాంసని 'సహస్రాధికరణి' అని కూడా అంటారు.

వేదంలోని ఒక విషయ వాక్యాన్ని తీసుకుని, ఆ వాక్యార్థమిదేనని సమస్య లేపుతారు. తరువాత ఆ అర్థానికి వ్యతిరేకంగా వాదించడం (పూర్వపక్షం) జరుగుతుంది. ఆ తరువాత పూర్వపక్షంలో చెప్పిన దానిని ఖడించడం. దీనిని ఉత్తరపక్షం అంటారు. ఆఖరి దశలో పూర్వాపరాలను గ్రహించి ఒక నిశ్చయానికి రావటం. దీనిని నిర్ణయమంటారు. ప్రతి విషయముపైన నిర్ణయాన్ని, ప్రతి అధికరణములోనూ చెప్తారు.

ఉత్తరమీమాంస అంటే వేదాంతం. జ్ఞానకాండకు సంబంధించిన ఉత్తర మీమాంసపై సురేశ్వరాచార్యుడు వార్తికాన్ని రచించాడు.

## న్యాయము

న్యాయశాస్త్రాన్ని తర్కమని కూడా అంటారు. ఔచిత్యమును తెలిపే శాస్త్రం తర్కం. దీనిని కూర్చినది గౌతమ మహర్షి. తర్కం (యుక్తుల) ద్వారా ఈ సృష్టికి కర్త పరమేశ్వరుడేనని నిరూపించటమే ఈ శాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ శాస్త్రానికి ముఖ్యమైన సాధనం తార్కిక పద్ధతి (హేతువిచారణ పద్ధతి). మీమాంస ప్రమాణం ద్వారా సహాయపడితే, న్యాయం యుక్తుల ద్వారా సహాయపడుతుంది.

వేదాలలో చెప్పిన వాటిని ధృవపరచటానికి వినియోగించే సాధనాలని న్యాయమంటారు. ఈ శాస్త్రకారుడు గౌతముడు. గౌతముడ్ని అక్షపాదుడని కూడా అంటారు. కణాదుడు కూడా వైశేషికమనే న్యాయశాస్త్రం రచించాడు.

రెండు పదార్థములు విభిన్నములని అంటే, ఆ రెంటిలో ఏదో ప్రత్యేకలుండడమే– ఒకదానిలోని లక్షణాలు రెండవదానిలో లేకపోవటం. ఈ విషయమే పరిశీలనకి మూలమవటం వల్ల ఆ పద్ధతిని వైశేషికమంటారు. న్యాయశాస్త్రం శాస్త్రీయ పద్ధతిలో నడుస్తుంది. జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, మోక్షం మొదలైన ఆధ్యాత్మిక విషయాలను ప్రస్తావించేటప్పుడు వైశేషికాన్ని చేరుతుంది. ఈ విషయాలనే వైశేషికులు 'అగ్నివర్గ' మంటారు. ఈ రెండూ తర్కాన్ని, తత్త్వాన్ని ఉపయోగిస్తాయి. తత్త్వాన్ని తర్కం ద్వారా బోధిస్తాయి.

మౌలిక సత్యాన్ని నాలుగు సాధనాల ద్వారా న్యాయశాస్త్రం చర్చిస్తుంది – ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం. మొదటిది ప్రత్యక్ష ప్రమాణమనేది మనకి జ్ఞానేంద్రియాల వల్ల అనుభవ సిద్ధమయ్యేది. రెండవది అనుమానం – తెలియని దానిని తెలిసిన దాని సహాయంతో గ్రహించటమే అనుమానం. ఉపమానమంటే లేనిదాన్ని గురించి ఉన్నదాని సహాయంతో తెలుసుకోవడం. శబ్ద ప్రమాణమనగా వేదాలుగాని, మహర్షుల వంటి మహనీయులుగానీ ఏదైనా చెప్తే దానిని ప్రమాణంగా స్వీకరించారు. వేదాలు భగవంతుని పలుకులేనని నమ్ముతారు. మనోవాక్కాయ కర్మలుగా సత్యవ్రతులైన మహనీయుల పలుకులు కూడా 'శబ్ద ప్రమాణం'గా పరిగణింపబడతాయి.

ఈ నాలుగు ప్రమాణాలూ కుమారిలభట్టు ప్రతిపాదించిన మీమాంస సిద్ధాంతంలో భాగాలు. 'అర్థాపత్తి', 'అనుపలబ్ధి' అనబడే మరో రెంటిని కూడా చేర్చి మొత్తం ఆరు ప్రమాణాలను చేశారు.

## పురాణము

వేదాలలోని సూక్తాలు క్లుప్తంగా ఉంటాయి. వాటిని కథలుగా, ఆఖ్యానాలుగా పెంచి చూపుతాయి పురాణాలు. వ్యాసుడే మనకు పద్దెనిమిది పురాణాలను ప్రసాదించాడని అంటారు. వ్యాసుని తండ్రి పరాశరుడు విష్ణుపురాణాన్ని మొదట వ్రాశాడని, వ్యాసుని తనయుడు శుక్రాచార్యుడు పరీక్షన్మహారాజుకి శ్రీమద్భారతాన్ని వినిపించాడని కూడా అంటారు. పద్దెనిమిది పురాణాలలో నాలుగు లక్షల 'గ్రంథాలు'న్నాయి. ముప్పై రెండు అక్షరాలుగల శ్లోకాన్ని 'గ్రంథ' మంటారు. వీటిలో దాదాపు లక్షగ్రంథాలు స్కాందపురాణం లోనివే. మిగిలిన పదిహేడు పురాణాలలో మూడు లక్షల గ్రంథాలున్నాయి. ఇవికాక లక్ష శ్లోకాలున్న మహాభారతాన్ని కూడా వ్యాసుడే వ్రాశాడంటారు.

ఒక్కొక్క పురాణం ఒక్కొక్క దేవతకి ప్రాధాన్యమిస్తుంది. పురాణాలను వైష్ణవ ధర్మానికి సంబంధించినవి, శైవధర్మానికి సంబంధించినవి. శాక్తేయధర్మానికి సంబంధించినవి అని మూడు విభాగాలుగా విభజించారు. అవి – బ్రహ్మపురాణం, పద్మపురాణం, విష్ణుపురాణం, శివపురాణం, శ్రీమద్భాగవతం, నారదపురాణం, మార్కండేయ పురాణం, అగ్నిపురాణం, భవిష్య పురాణం, బ్రహ్మ వైవర్త పురాణం, లింగపురాణం, వరాహ పురాణం, స్కాంద మహా పురాణం, వామన పురాణం, కూర్మ పురాణం, మత్స్య పురాణం, గరుడ పురాణం, బ్రహ్మాండ పురాణం మొదలైనవి. చరిత్ర, ఉపాఖ్యానం, తత్త్వం వీటిలో ఉన్నాయి.

పద్దెనిమిది పురాణాలకు తోడు పద్దెనిమిది ఉపపురాణాలున్నాయి. వీటిలోనివే వినాయక పురాణం, కల్కి పురాణం మొదలైనవి. పద్దెనిమిది ఉన్నాయన్నారు కాని అంతకంటే ఎక్కువే ఉన్నాయి – తులా పురాణం [ప్రతినెలా (మాసం) యొక్క ప్రాశస్త్యం చెప్పేది], నాగపురాణం, వైశాఖ పురాణం పద్దెనిమిది పురాణాలలోనూ, ఉపపురాణాల లోనూ ఉన్నాయి. ప్రతి తీర్థస్థలానికీ 'స్థలపురాణ' అని ఒకటి ఉంది. ఇవి కూడా పైన చెప్పిన పురాణాలలోనివే కాని ఇవి వేర్వేరు గ్రంథాలుగా ఉంటాయి.

గరుడ పురాణంలో ఉపపురాణాల పేర్లు ఇలా ఉన్నాయి – సనత్కుమార, స్కాంద, శివధర్మ, ఆశ్చర్య, నారదీయ, కాపిల, వామన, ఔశనస, బ్రహ్మాండ, వారుణ, కాళిక, మాహేశ్వర, సాంబ, సౌర, పరాశర, మారీచ, భార్గవ పురాణాలు.

వివిధ పురాణాలలో పరిశీలించగా ఉపపురాణాల సంఖ్య ముప్పై వరకు ఉన్నాయి– సనత్కుమార, నరసింహ, నారదీయ, శివధర్మ, దుర్వాస, కపిల, మానవ, ఉశనస్, వారుణ, కాళిక సాంబ, నందికేశ్వర, సౌర, పరాశర, ఆదిత్య, బ్రహ్మాండ, మాహేశ్వర, భాగవత, వాశిష్ట, కౌర్మ, భార్గవ, ఆది, ముద్గల, కల్కి, దేవి, మహాభాగవత, బృహద్ధర్మ, పరానంద, పశుపతి, హరివంశ పురాణాలు.

పురాణానికి అయిదు లక్షణాలు (పంచలక్షణ) ఉండాలి. అవి, మొదటిది సర్గ – సృష్ట్యాది అన్నమాట. రెండోది ప్రతిసర్గ – సృష్టి జరిగిన తరువాత కాలక్రమేణ ప్రపంచంలో వచ్చిన వికాసం. మూడు వంశ – ఆ వంశ చరిత్ర ఒక తరం నుండి వేరొక తరానికి రావడం. నాలుగు మన్వంతరం – మానవాళి అంతటికీ ఆద్యులైన మానవులు, వెయ్యి యుగక్రమాలు (ఒక్కొక్క యుగక్రమంలో నాలుగు యుగాలుంటాయి), వీటి చరిత్ర. అయిదు వంశాను చరిత్ర – దేశ పాలకుల వంశ చరిత్రలు సూర్యవంశం, చంద్రవంశం మరియు అంతరిక్షం యొక్క వర్ణనా ఉంటుంది.

వేదాలు ప్రభు సమ్మితాలు. పురాణాలు సుహృత్ సమ్మితాలు. కావ్యాలు కాంతా సమ్మితాలు. 'ఇట్లా చేయి, అట్లా చేయి' అని మాత్రమే వేదాలు అంటాయి. ఎందువల్లనో చెప్పవు. పురాణాలు ఇట్లా చేస్తే ఈ విధంగా మేలు కలుగుతుంది. అట్లా చేస్తే హాని కలుగుతుంది అని చెప్తాయి. ఏ పనినైనా ఒక విధంగా ఎందుకు చెయ్యాలో కథల ద్వారా చెప్తాయి. కథ ద్వారా సందేశాన్ని అందజేయటమే పురాణాల ధ్యేయం.

## ధర్మశాస్త్రం

పదునాలుగు విద్యలలోనూ చివరిది పురాణాల తరువాతది ధర్మశాస్త్రం. ధర్మసూత్రాలు– వ్యక్తిగత సామాజిక విధులను ఆయా వర్ణాల వారు జీవితంలో వారి వారి దశలను బట్టి అనుసరించవలసిన వాటిని చెప్తాయి. ఇవి ధర్మ సూత్రాలు (ఆపస్తంభునివి, గౌతమునివి మొదలగు వారివి) క్లుప్తంగా ఉంటాయి. ధర్మశాస్త్రాలు (స్మృతులు) శ్లోకరూపంలో ఉంటాయి.

మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, గౌతముడు, హరితుడు, యముడు, విష్ణువు, శంకుడు, లిఖితుడు, బృహస్పతి, దక్షుడు, అంగీరసుడు, ప్రచేతసుడు, సంవర్తుడు, ఆసనసుడు, అత్రి, ఆపస్తంభుడు, శతపుడు – ఈ పద్దెనిమిది మంది మహర్షులు తమ అలౌకిక శక్తితో వేదాలలోని విషయాన్ని గ్రహించి ధర్మశాస్త్ర రూపంలో వాటి సంకలనాలని వెలువరించారు. వీటినే మనుస్మృతి, పరాశరస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి – ఇలా ఆయా ఋషుల పేర్ల మీద సూచించారు. పద్దెనిమిది స్మృతులకు తోడు పద్దెనిమిది అనుబంధ ఉపస్మృతులు కూడా ఉన్నాయి.

కల్పసూత్రాలకు చెందిన ధర్మసూత్రాల ఆధారంగా స్మృతి గ్రంథాలు వ్రాయబడినవి. ప్రాచీన భారతీయ సామాజిక, థార్మిక, రాజకీయ సంబంధమైన జీవిత విధానాలను తెలుసుకోవడానికి తోడ్పడతాయి. ఆచార వ్యవహారాలను, నీతి ధర్మ విషయాలను, రాజనీతిని నిర్ణయించేటటువంటి గ్రంథాలు. మొత్తం మీద స్మృతుల సంఖ్య నూట యాభై రెండు వరకున్నాయని నిర్ణయించారు.

శృతి, స్మృతి, పురాణం – అన్నీ ధర్మానికి సంబంధించినవేనట!

## వేదాలు అనంతాలు!

**వే**దాలు అనంతాలు అనటానికి ఒక కథ ఉంది. భరద్వాజ మహర్షి మూడు జన్మలలో వేదాలను అధ్యయనం చేశాడు. పరమేశ్వరుడు ప్రత్యక్షమై 'నీ కింకొక జన్మనిస్తాను. ఏమి చేస్తావు దానితో ?' అని అడిగితే, భరద్వాజుడు 'ఆ అదనంగా లభించే జన్మ కూడా వేదాధ్యయనానికే వినియోగిస్తా'నన్నాడు. అన్ని వేదాలనూ, ఎన్ని జన్మల నెత్తినా పూర్తిగా అధ్యయనం చేయట మసంభవమని, ఋషి పట్ల జాలితో అతను ఎదుర్కొంటున్న సమస్య ఎంత జటిలమైందో తెలియజేయడానికి పరమేశ్వరుడు మూడు పెద్ద పర్వతాలను సృష్టించి, వాటి నుంచి గుప్పెడు మట్టిని తీసుకుని 'నీవిప్పుడు అధ్యయనం చేసినదంతా ఈ పిడికెడు మట్టితో సమానం. నీవు ఇంకా అధ్యయనం చేయవలసింది ఈ పర్వతాలంత మేర ఉన్నది' అన్నాడట! భరద్వాజునికి సంబంధించిన ఈ గాథ వేదములలో కాఠక భాగంలో ఉంది.

# అనుబంధం - ఒకటి

## గణితం

వైదిక కాలంలో గణితంలో లక్ష కోట్ల వరకు సంఖ్యామానం ఉండేది. ఇప్పుడు మన సంఖ్యామానం కోటి వరకే. అప్పటి సంఖ్యలు – దశ (10), శత (100), సహస్ర (1,000), అయుత (10,000), నియుత (1,00,000), ప్రయుత (10,00,000), అద్బుద (1,00,00,000), న్యద్బుద (10,00,00,000), సముద్ర (1,00,00,00,000), మధ్య (10,00,00,00,000), అంత (1,00,00,00,00,000), పరార్థం (10,00,00,00,00,000) లు. కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం మొదలగు గుణిత ప్రక్రియలన్నీ వారికి తెలుసు. వివిధ వేదీ నిర్మాణంలో నైపుణ్యం కలవారు కాబట్టి జ్యామితి (జామింట్రీ) గణితంలో కూడా నిపుణులు.

## ఋతువులు

ఋతువులకు ప్రభువు సంవత్సరం. సంవత్సర స్వరూపుడైన కాలపురుషుని ఆజ్ఞను ఋతువులు నిర్వర్తిస్తాయి. ఆనాటి ఋతువులు, మాసాలు –

| ఋతువు | అప్పటి మాసాలు | ఇప్పటి మాసాలు |
|---|---|---|
| వసంత | మధు, మాధవ | చైత్ర, వైశాఖ |
| గ్రీష్మ | శుక్ర, శుచి | జ్యేష్ఠ, ఆషాఢ |
| వర్ష | నభ, నభస్య | శ్రావణ, భాద్రపద |
| శరత్ | ఇష, ఊర్జ | ఆశ్వయుజ, కార్తీక |
| హేమంత | సహ, సహస్య | మార్గశీర్ష, పౌషి |
| శిశిర | తప, తపస్య | మాఘ, ఫాల్గుణ |

ఋతువులలో ముఖ్యమైనది వసంతం. ఈ ఋతువులో యజ్ఞయాగాది కర్మలు చేయబడతాయి. ప్రకృతి మనోహరంగా ఉంటుంది. గ్రీష్మం వసంతం కంటె అసాధారణంగా వుంటుంది. తాపాధ్యికం దీని అసాధారణ గుణం. సూర్యుడు నిరుపమాన

తేజస్సుతో భూమిని తపింపజేస్తాడు. వర్షఋతువు ప్రాణికోటికి వ్రీహి మొదలైన ధాన్యాలను, ఫలాలను సమకూరుస్తుంది. దీనికి ఆదిత్యులు ప్రభువులు. దీనివెంట శరదృతువు వస్తుంది. ఇందులో లోకమంతా ప్రసన్నంగా ఉంటుంది. దీనికి ప్రభువులు ఋభువులు. హేమంతానికి ప్రభువులైన మరుద్గణాలు విజృంభించటం వలన చలి తీవ్రత ఎక్కువవుతుంది. శిశిర ఋతువులో దారిలో నీరు లభించదు.

## వ్యవసాయము

వేదకాలంలో ప్రధాన వృత్తి వ్యవసాయము. పొలమును దున్ని సేద్యం చేసేవారు. కృషికర్మలో సాధనములు నాగలి, కాడి, మేడి కొన్ని సూక్తములలో పేర్కొనబడ్డాయి. యవలు, గోధుమలు, నువ్వులు, చామలు (శ్యామాకములు), నీవారములు (నెవరి ధాన్యము), మాషములు (మినుములు) మొదలైనవి పండించేవారు. ఋగ్వేదంలో ధాన్య శబ్దము కనబడుతుంది.

వ్రీవ, ప్రియంగు, ముద్గ, మాష, శ్యామాక గోధూమ, తిల, యవ, అణు, ఖల్వ, నీవారా, మసూర మొదలైనవి ధాన్యాలు. కృషికులు శునాసీర దేవతలను పూజించేవారు. 'శున' ద్యౌ దేవత. ఈ దేవత వర్షాన్ని, సూర్యకాంతిని ఇస్తుంది. 'సీర' హలదేవత. కర్షకులు భూమిని నాగళ్ళతో దున్ని, విత్తనాలు చల్లి, సస్యాలను పోషిస్తారు.

## పశుధనము

ప్రాచీన కాలంలో గోవులే ప్రధాన ధనము. అప్పటి వారి జీవితాలు గోవులతో ముడిపడ్డాయి. దక్షిణలు, అరణములు, కానుకలు గోరూపంలో ఇచ్చేవారు. వారికి గోవు ప్రత్యక్షదైవం. గోరక్షణ, గోవుల యెడ భక్తి అపారమైనది.

## నదులు

పూర్వం గంగా, యమున, సరస్వతి, సింధు, వరుణ, గోమతి, త్రిష్టామీ, సుపర్తు, రసా, శ్వేత, కుభా, మేహమ్న మొదలగు నదులు పేర్కొన్నారు. వీటిలో సరస్వతీ నది దేవతగా ఆరాధింపబడింది. ఇది నేటికి కాలగర్భంలో కలిసి, అంతర్వాహినిగా వుంది.

## జాతులు

వేదకాలంలోని అను, దృహ్యా, పురు, తుర్వశు, యదు జాతులు తరువాత తరువాత మరుగున పడినాయి. కురు, పాంచాల, వశ, ఉశీనర మొదలైన జాతులు ఆవిర్భవించాయి.

అప్పుడు కురుపాంచాల దేశాలు ఆదర్శదేశాలుగా, అందులోని ప్రజలు ఆదర్శవంతులుగా వర్ణించబడ్డాడు. మాగధులు, సాత్త్వతులు, నీచ్యులు, అపాచ్యులు, ఉదీచ్యులు, గాంధారులు మొదలైనవి దేశభేదంతో ఏర్పడినాయి.

## వర్ణాలు

సంఘజీవి అయిన మానవుని మనుగడ ఇచ్చి పుచ్చుకోవడాలపై ఆధారపడింది. పరస్పర సహకారంతోనే సాంఘికలైన చాలా అవసరాలు తీరాయి. మానవులు తమ తమ అవసరాలు తీర్చుకోవడానికి ఆ యా వృత్తులు చేపట్టారు. వృత్తులుబట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలుగా విభజించబడ్డారు.

## బ్రాహ్మణులు

నాలుగు వర్ణాలలోను ఉత్తమవర్ణంగా బ్రాహ్మణులు పరిగణించబడ్డారు. క్షత్రియుల అధికారం వారి నుంచి మూడువర్ణాల వారికే పరిమితం. బ్రాహ్మణులపై క్షత్రియులకు కూడా అధికారం లేదు. సోముడే బ్రాహ్మణులకు రాజట. దక్షిణలను, బహుమతులను తీసుకోవడం, యజ్ఞశేషాన్ని భుజించటం, ఇష్టం వచ్చినట్లు సంచారం చేయటం, అధ్యయనం (వేదాన్ని చదువుకోవడం), అధ్యాపనం (వేదాన్ని బోధించడం), యజనం (యాగాలు చేయడం), యాజనం (యాగాలు చేయించడం), బుద్ధికుశలతతో రాజుకు తగిన సలహాలివ్వడం వీరి విధులు. వీరు భూదేవులుగా కీర్తింపబడ్డారు.

## క్షత్రియులు

శౌర్య, బల, పరాక్రమాలకు చిహ్నంగా క్షత్రియుడు వర్ణించబడ్డాడు. భూమి అంతా క్షత్రియునిదే. బ్రాహ్మణ, వైశ్య, శూద్రులు భూమికోసం అతనిని అడగవలసిందే. ప్రజలు క్షత్రియునికి పన్నుల రూపంలో, కానుకల రూపంలో ధనాన్ని ఇచ్చి, దానికి ప్రత్యామ్నాయంగా అతని నుంచి రక్షణ పొందేవారు. క్షత్రియులకు కూడా యజ్ఞం చేసే అధికారం ఉంది. కాని హోమ శేషాన్ని భుజించే అధికారం లేదు. వీరు రథాలనెక్కి సంచరిస్తారు. శత్రువుల నుంచి దేశాన్ని రక్షించడం, దుండగులను శిక్షించడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ఇతని కర్తవ్యం. ఇతడే వర్ణాశ్రమ ధర్మాలను ప్రజలచేత ఆచరింపచేసే సామర్థ్యం కలవాడు. బ్రాహ్మణులు క్షత్రియులు పరస్పరం ఆశ్రయించి ఉండేవారు.

## వైశ్యులు

క్షత్రియుల తరువాత మూడవస్థానాన్ని అలంకరించిన వారు వైశ్యులు. వీరికి పై రెండు వర్ణాల మాదిరి ఉపనయనాధికారం, యజ్ఞాధికారం ఉన్నాయి. హోమశేషాన్ని భుజించే అధికారం లేదు. వాణిజ్యం, వ్యవసాయం, పశుపోషణ వీరి వృత్తులు. అందువలన వీరు సంఘానికి వెన్నెముకవంటివారు. వీరిని క్షత్రియులు, బ్రాహ్మణులు తమ అదుపు ఆజ్ఞలలో పెట్టుకునేవారు. వైశ్యులు, శూద్రులు అసంపూర్ణ వర్ణాలుగా వర్ణించబడ్డారు. వైశ్యులు తమ వాణిజ్యం, వ్యవసాయం, పశుసంపదలను రక్షించుకోవడానికి తమంతట తామే క్షత్రియులకు లోబడి, వారి రక్షణలో ఉండేవారు.

## శూద్రులు

ఆర్యులపై దాడి చేసేవారు దశ్యులు. వారికి లోబడి దాస్యం చేసేవారు దాసులు. ఈ దాసులే శూద్రులుగా మారారు. వీరి వృత్తి సేవచేయడం. వీరు అసురులనుంచి పుట్టినట్లు వర్ణించబడ్డారు. నాలుగు వర్ణాలలో అత్యంత హీనస్థితిలో ఉన్న వర్ణమిదే. వీరికి యజ్ఞాధికారం లేదు. అంతేకాకుండా యజ్ఞభూమిలోకి రాకూడదు, యజమానితో సంభాషించకూడదు. ఆవు పాలను పితకడానికి సైతం పనికిరారు. అనులోమ వివాహాలలో శూద్రస్త్రీలు పై వర్ణాలవారి చేత గ్రహించబడుతుండేవారు. అనులోమ వివాహాల వల్ల పుట్టిన సంతతి కూడా శూద్రులుగానే పరిగణించినప్పటికి, శూద్రులలోనే పైస్థాయి ఉండేది. నీచ్యులు, అపాచ్యులు అనేవారు శూద్రులకంటె హీనులుగా పరిగణింపబడేవారు.

## వృత్తులు

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల వృత్తులు ఇంతకుముందు వివరించడమైనది. అనులోమ ప్రతిలోమ వివాహాల వల్ల శూద్రులలో చాలా ఉచ్ఛ నీచ జాతులు పుట్టాయి. ఆయా జాతుల లాగానే వారి వారి వృత్తులు కూడా చాలా రకాలు.

మగధ (మంత్రి), శైలూష (నటుడు), సూత (రథచోదకుడు), సభాకార (సభా సమితులలో సభ్యుడు), రథాకార  (రథాలను తయారు చేసేవాడు), తక్ష (వడ్రంగి), కులాల (కుమ్మరి), కర్మార (కమ్మరి), మణికార (స్వర్ణకారుడు), వాప (మంగలి), ఇషుకార (బాణాలను చేసేవాడు), ధనుష్కార (ధనస్సులను చేసేవాడు), జ్యాకార (అల్లెత్రాడు తయారు చేసేవాడు), రజ్జుసర్జ (త్రాడు పేనేవాడు), మృగయ (వేటగాడు), శ్వని (కుక్కలను వేటకు

సిద్ధం చేసేవాడు), పుంజిష్ట (పిట్టలను పట్టేవాడు), విదలకారి (బుట్టలు అల్లేవాడు), కంటుకీకరి (ముళ్లలో పనిచేసేది), పేశస్కరి (ఎంబ్రాయిడరీ), భిషజ (వైద్యుడు), నక్షత్ర దర్శ (జ్యోతిష్కుడు), హస్తిప (మావటివాడు), అశ్వాప (గుర్రాలను చూసేవాడు), గోపాల (ఆలమందను కాచేవాడు), ఆవిపాల (గొర్రెల కాపరి), అజపాల (మేకల కాపరి), కీనాశ (వ్యవసాయదారుడు), సురాకార (మద్యం తయారు చేసేవాడు), గృహప (ఇళ్ళను రక్షించేవాడు). క్షత్త (రథికుడు), అనుక్షత్త (రథిక సహాయకుడు), ద్వారాహార (కట్టెలు అమ్మేవాడు), పేష్ట (ప్రతికృతి తయారు చేసేవాడు), వాసపల్పులి (చాకెత), రజయిత్రి (సాలె యువతి), పిశున (గూఢచారి), క్షత్త (ద్వారపాలకుడు), అనుక్షత్త (ద్వారపాలక సహాయకుడు), అశ్వసాద (అశ్వపాలకుడు), భాగదుఘ (పన్నులను వసూలు చేసేవాడు), అంజనీకారి (అంజనాలను, ప్రసాధన ద్రవ్యాలను చేసేది), కోరకారి (కత్తి ఒరలను తయారు చేసేది), అజినసన్ధ (జింక చర్మం తయారు చేసేవాడు), చర్మార (చర్మాన్ని బాగుచేసేవాడు), ధీవర (బెస్త), శేష్కల (ఎండుచేపలను అమ్మేవాడు), హిరణ్యకార (కంసాలి), వణిజ (వర్తకుడు), వనప (అడవులను రక్షించేవాడు), వీణావాద (వీణను వాయించేవాడు), తుణవధ్మ (వేణు వాదకుడు), శంఖధ్మ (శంఖపూరకుడు), వంశవర్తి (దొమ్మరి), గ్రామణి (గ్రామపెద్ద), గణక (జ్యోతిష్కుడు), అభిక్రోశకులు (ప్రచారకుడు), మొదలైన వృత్తులు ఉండేవి.

# అనుబంధం - రెండు

## సంహితలలో మంత్ర ద్రష్టలైన కొందరు మహర్షులు

### వసిష్ఠుడు

వసిష్ఠుడు అనే పేరుతో ఇతడు మూడు జన్మలనెత్తాడు. అందులో బ్రహ్మ మనస్సు నుండి మొదటిసారి జన్మించాడు. ఈ మొదటి జన్మలోనే అనేక వేద మంత్రాలను దర్శించాడు. ఇతని భార్య అరుంధతి. పృథ్వి, జలం మొదలగు పంచభూతాలు వసువులు. అవి కలవాడు కాబట్టి ఇతడు వసిష్ఠుడైనాడు. అణిమాది (శరీరాన్ని పరమాణువయ్యేట్లు తగ్గించటం) సిద్ధులచేత వసువులను వశపరచుకోవడం వల్ల ఇతడికీ పేరు కలిగింది. దక్షయజ్ఞంలో దేవతలతో పాటు ఇతడు కూడా మరణించాడు. అప్పుడు అరుంధతి కూడా ఇతణ్ణి అనుసరించింది. వీరిరువురు నక్షత్రాలైనారు. వీరికి – చిత్రకేతువు, పురోచిషుడు, విరచుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసుభృద్యానుడు, ద్యుమంతుడు అని ఏడుగురు కొడుకులు జన్మించారు. వీరంతా బ్రహ్మర్షులు. బ్రహ్మదేవుని హోమాగ్ని నుంచి ఇతడు రెండవసారి జన్మించాడు. ఈ జన్మలో అరుంధతి 'అక్షమాల' అనే పేరుతో ఇతనికి భార్య అయినది. నిమి చక్రవర్తి శాపం చేత ఈ జన్మ అంతరించింది. మిత్రావరుణుల కుమారుడుగా, అగస్త్యుని సోదరుడుగా ఇతడు మూడవ జన్మనెత్తాడు. ఈ జన్మలో నారదుని చెల్లెలు అరుంధతి ఇతని భార్య. పురాణాలలోని వసిష్ఠునికి సంబంధించిన అనేక కథలు రెండు, మూడు జన్మలకు సంబంధించినవి. వేదదర్శనం మొదటి జన్మకు సంబంధించింది.

### భరద్వాజుడు

భరద్వాజుడనే పేరుతో మన ఇతిహాస పురాణాలలో ఏడుగురు కనబడుతున్నారు. అందులో చివరివాడు తప్ప, మిగతా అందరూ ఋషులే. ధర్మసూత్రకర్త అయిన పండితుడు చివరి భరద్వాజుడు. మంత్రద్రష్ట అయిన భరద్వాజుడు అత్రి మహర్షి కుమారుడు. చాలా వేల సంవత్సరాల జీవించాడు. ఇతని జీవితం వేదాధ్యయనానికే అంకితమైంది.

వాల్మీకి శిష్యుడు, వనవాసంలో శ్రీరామునికి ఆతిథ్యమిచ్చింది ఇతనేనని కొందరంటారు. కొడుకులను, శిష్యులను, దేవతలను, ద్విజులను, భార్యను ప్రేమతో భరిస్తానని ఇతడు చేసిన ప్రతిజ్ఞ వలన భరద్వాజుడనే ప్రసిద్ధి పొందినట్లు భాగవతం పేర్కొంటున్నది.

## విశ్వామిత్రుడు

కుశుని మనుమడైన గాధి కుమారుడు విశ్వామిత్రుడు. ఋచీకుని భార్య సత్యవతి ఇతని సోదరి. ఇతడు కన్యాకుబ్జ (కనూజ్) దేశాధిపతి. ఒకసారి వసిష్ఠుడితో పంతం పట్టి తపస్సుచేసి మొదట రాజర్షి అయి తరువాత బ్రహ్మర్షి అయినాడు. కౌశికీ నదీ తీరంలో ఇతడు బ్రహ్మర్షి అయినట్లు భారతం పేర్కొంటుంది. ఇతనికి వందమంది కుమారులు. విశ్వామిత్రుని ప్రేరణ వలనే కల్మాషపాదుడు వసిష్ఠుని కొడుకులందరిని చంపాడు. వసిష్ఠ విశ్వామిత్రుల విరోధ వృత్తాంతం ఋగ్వేదంలో కనబడుతుంది. విశ్వామిత్రుడొకసారి ఇంద్రునితో కలసి సోమపానం చేయగా, అప్పటి నుండి అతడు క్షత్రియుడు కాదని, బ్రాహ్మణుడేనని ప్రసిద్ధి ఏర్పడింది. అజీగర్తుని కొడుకైన శునశ్శేపుని (దేవరాతుడు) యాగంలో ఆహుతి కాకుండా ఇతడు కాపాడాడు.

## వామదేవుడు

వామదేవుడు పేరుతో ఒక రాజు, ఒక మనువు కుమారుడు మన ఇతిహాసాలలో కనబడుతున్నారు. ఈ వామదేవుడు గోతముని కుమారుడు. వాల్మీకి రామాయణంలో వసిష్ఠుని స్నేహితుడుగ, దశరథుని పురోహితుడుగా చెప్పబడ్డాడు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే అశ్వినీ దేవతలను స్తుతించిన మహానుభావుడీతడు. ఇంద్రసభలో ప్రముఖ సభ్యుడు. వసు మనసుడనే మహారాజుకు ఇతడు ధర్మాలను ఉపదేశించాడు. వామదేవుడు అథర్వాంగి రసుల కుమారుడని గొప్ప తపస్సు చేసి పరశురాముని సందర్శించాడని బృహదారణ్యకం చెబుతుంది. అసిజ, బృహదుక్థులకు తండ్రని వాయుపురాణం పేర్కొంటుంది.

## గృత్సమదుడు

వితహవ్య మహర్షి కుమారుడు. బృహస్పతితో సమానమైన పాండిత్యం కలవాడు. ఇంద్రుని స్నేహితుడు. ఇతని కుమారుడు కుచేతసుడు. మనువు కుమారుడైన వరిష్ఠుడు గృత్సమదుని స్నేహితుడు.

## దీర్ఘతముడు

బ్రహ్మ కుమారుడు అంగిరసుడు. ఇతనికి ఉచథ్యుడు, బృహస్పతి అని ఇద్దరు కుమారులు. ఉచథ్యుని కుమారుడు దీర్ఘతముడు. ఇతని తల్లి మమత. తల్లి కడుపులో ఉన్నపుడే ఇతనికి వేదవేదాంగ జ్ఞానమున్నది. బృహస్పతి శాపం వల్ల ఇతడు గుడ్డివాడుగా పుట్టాడు. అందుకే ఇతనికి దీర్ఘతముడనే పేరు వచ్చింది. బుద్ధిబలంలో ఇతడు బృహస్పతితో సమానుడు. ప్రద్వేషి ఇతని భార్య. వీరిరువురికి గౌతముడు జన్మించాడు. ఇంకో భార్య ఉశిజ. ఈమెకు పదకొండు మంది కుమారులు కలిగారు. వారిలో కక్షీవంతుడు ప్రసిద్ధుడు. ఇతడు ఋక్సంహితలో కొన్ని సూక్తాలను దర్శనం చేశాడు. దీర్ఘతముని అనుగ్రహం వల్ల సుధేష్ణకు పుట్టినవారే అంగ, వంగ, కళింగ, పుండ్ర, శుంగులనే రాజులు. వారి పేర్లతో అయిదు రాజ్యాలు స్థాపించారు. అవే భాగల్పూర్, బెంగాల్, ఆంధ్ర, రాజసాహి, తామ్రవిక రాజ్యాలుగా ప్రసిద్ధి.

## అగస్త్యుడు

కుండలో పెట్టబడిన వరుణుని వీర్యం నుంచి ఇతడు పుట్టడం చేత ఇతనిని కుంభసంభవుడంటారు. ఇతని భార్య లోపాముద్ర. దృఢదస్యుడు కుమారుడు. వాతాపి అనే రాక్షసుణ్ణి ఇతడు జీర్ణం చేసుకున్నాడు. వింధ్యపర్వతం పైపైకి పెరిగిపోతుండగా, సూర్యచంద్రులు ఇతనిని ప్రార్థించగా దాని ఎత్తు తగ్గించినవాడితడు. అందువలన ఇతనికి అగస్త్యుడు అనేపేరు సార్థకమైంది. అప్పుడు ఉత్తర భారతదేశాన్ని వదలి, దక్షిణ భారతదేశానికి వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నహుషుని ఊసరవెల్లి కమ్మని శపించాడు. శ్రీ మహావిష్ణువు ఆదేశించగా కాలకేయుల సంహారం కోసం ఈయన సముద్రాన్ని ఆపోశనబట్టి త్రాగేశాడు. శ్రీరామచంద్రునికి ఆదిత్య హృదయాన్ని ఈ మహానుభావుడే ఉపదేశించాడు. ఇతనికి సంతీష్ణుడనేవాడు తమ్ముడు మరియు శిష్యుడు. ఇతడు శ్రీరామునికొక బాణం ఇచ్చినట్లు ఉత్తర రామాయణం పేర్కొంటున్నది.

## గోతముడు

గోతముడు రాహుగణుని కుమారుడు. ఒకసారీ మహర్షి దాహం వేసి మంచినీళ్ళ నివ్వమని మరుత్తులను అడిగాడు. వాళ్లు ఇతని కోరిక మన్నించి పెద్ద బావిని తవ్వించి దాహం తీర్చారు. ఆ బావిని తవ్వినవాళ్లు అశ్వినీదేవతలు.

## ప్రజాపతి

ప్రజాపతి పేరు పురాణేతిహాసాలలో కనిపిస్తుంది. ఇతడు భారతంలో 'దేవుడు' అనే మనువుకు కుమారుడుగా, ధూమ్ర, బ్రహ్మవిద్య, మనస్విని, రతి, శ్వాస, శాండిలి, ప్రభాత అనే ఏడుగురు భార్యలు కలవాడుగా వర్ణింపబడ్డాడు. ఇతనికి ధరుడు, సోముడు, అహుడు, అనిలుడు, అగ్ని, ప్రత్యూషుడు, ప్రభాసుడు అని ఎనిమిది మంది పుత్రులని మహాభారతంలో ఉంది.

## పరమేష్ఠి

పరమేష్ఠి పేరు పురాణేతిహాసాలలో అక్కడక్కడ కనిపిస్తుంది. ఇతడు బ్రహ్మ శిష్యుడు. వైదిక సూక్త ద్రష్ట. జైమినీయ బ్రాహ్మణం ప్రజాపతి శిష్యుడుగా పరమేష్ఠిని వర్ణిస్తుంది.

## ఆత్రేయుడు

ఆత్రేయుడనే పేరుతో ఒక ఋషి పురాణేతిహాసాలలో పేర్కొనబడ్డాడు. ఇతడు ఒక నక్షత్రం నుంచి మరో నక్షత్రానికి వెళ్ళగల శక్తి కలవారు. ఇతని గురువు వామదేవుడు. ఇతడు తన శిష్యులకు నిర్గుణ బ్రహ్మను గురించి బోధించాడు.

## మేధాతిథి

మేధాతిథి పేరుతో ముగ్గురున్నారు. మొదటివాడు రాజు. మూడవవాడు అరుంధతికి తండ్రి అయిన మహర్షి. చివరి ఇద్దరికి వేదదర్శన సంబంధం ఉంది. రెండవవాడు కణ్వుని కుమారుడుగా భారతంలో వర్ణించబడ్డాడు. ఇతనికి దుష్యంతుడు, ప్రవరుడనే ఇద్దరు కుమారులు. బృహదారణ్యకంలో స్వాయంభువ మనువు మనవలలో ఒకడుగాను, భారతంలో వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి తపస్సు ద్వారా స్వర్గాన్ని పొందిన రాజర్షిగా వర్ణింపబడ్డాడు.

## మధుచ్ఛందుడు

ఐతరేయ బ్రాహ్మణంలో మధుచ్ఛందుడు విశ్వామిత్రుని యాభై ఒకటవ పుత్రుడని చెప్పబడింది. శునఃశేపుని సోదరునిగా భావించమని విశ్వామిత్రుడు చెప్పగా, ఇతనితోపాటు ఇతని సోదరులు కూడా అంగీకరించారు.

## నారాయణుడు

నారాయణుడు బ్రహ్మపుత్రుడైన ధర్ముని కుమారుడు. ధర్మునికి దక్షపుత్రిక వలన హరి, కృష్ణ, నర, నారాయణులు జన్మించారు. నర, నారాయణులిద్దరూ ఎప్పుడూ విడిపోనివారు. వీరు మహావిష్ణువు అతారభూతులు. నారాయణ ఋషి యొక్క తెల్లజుట్టు నుంచి బలరాముడు, నల్లజుట్టు నుంచి కృష్ణుడు జన్మించారని మహాభారతం పేర్కొంటున్నది.

## వరుణుడు

అదితి, కశ్యపుల కుమారుడు వరుణుడు. ఇతనికి గౌరి, వరుణాని, చర్షణి అని ముగ్గురు భార్యలు. సుషేణుడు, వంది, వసిష్ఠుడు ఇతని కుమారులు. వారుణి కూతురు. వరుణుడు రాజసూయయాగాన్ని యమునా నదీతీరంలో నిర్వహించాడు. ఇతని రాజధాని శ్రద్ధావతి. అర్జునుడికి గాండీవాన్నిచ్చింది ఇతడే.

## ఆంగిరసులు

'ఆంగిరస' వంశంలో పుట్టినవారు. కృష్ణుడు, అజీగర్తి, చ్యవనుడు, అయాస్య, సంవర్త, సుధన్వలు ఈ వంశానికి చెందినవారు.

## శునఃశేపుడు

శునఃశేపుని గురించి రెండు రకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకడు అజీగర్తుని కుమారుడు. ఇతడు హరిశ్చంద్రుని చేత యాగబలిగా తీసికొనబడ్డాడు. మరొకడు ఋచీకముని కుమారుడు. ఇతడు అంబరీషుని యజ్ఞబలిగా నియోగించబడ్డాడు. ఇతనిని భృగువంశంలో శునఃశేపుడని, గాధివంశంలో దేవరాతుడని పిలుస్తారు.

## జమదగ్ని

జమదగ్ని ఋచీక, సత్యవతుల కుమారుడు. ఇతని మేనమామ విశ్వామిత్రుడు. ప్రసేనజిత్తు కుమార్తె అయిన రేణుక ఇతని భార్య. ఒకరోజు రేణుకకు ఎండవేడి ఎక్కువైనందుకు జమదగ్ని కోపించగా, సూర్యుడే వచ్చి గొడుగు, పాదరక్షలు సమర్పించాడు. ఇతనికి రుమణ్వంతుడు, సుహోత్రుడు, వసు, విశ్వావసు, పరశురాముడని అయిదుగురు కుమారులు.

## దధ్యంగుడు

దధ్యంగుడు అథర్వుని కుమారుడు. ఇంద్రుడు ఇతనికి 'మధువిద్య'ను నేర్పి ఇతరులెవరికైనా ఉపదేశిస్తే తల పగిలిపోతుందని చెప్పాడు. అశ్విని దేవతలు మధువిద్యను నేర్చుకోదలచి, దధ్యంగుని తలను నరికి గుర్రపు తలను అతికించి, మధువిద్యను నేర్చుకున్న తరువాత తిరిగి తలను అతికించారు.

## యాజ్ఞవల్క్యుడు

యాజ్ఞవల్క్యుడు దేవరాతుని కుమారుడు. ఇతనికి వాజసని, బ్రహ్మరాతుడని పేర్లు కూడా ఉన్నాయి. యాజ్ఞవల్క్యుడు పైలుని శిష్యుడైన బాష్కలుని వల్ల ఋగ్వేదాన్ని, జైమిని వల్ల సామవేదాన్ని, మహాముని ద్వారా అథర్వవేదాన్ని, వైశంపాయనుని వల్ల యజుర్వేదాన్ని అధ్యయనం చేశాడు. విధి వైపరీత్యం చేత యాజ్ఞవల్క్యుడు గురువైన వైశంపాయనునితో గొడవపడి యజుర్వేదాన్ని పరిత్యజించాడు. తరువాత ఉగ్రతపస్సు చేసి సూర్యుణ్ణి సంతోషపరిచాడు. సూర్యుడు వాజి (అశ్వ) రూపంలో ప్రత్యక్షమై శుక్ల యజుర్వేదాన్ని బోధించాడు. ఈ శాఖకు 'వాజసనేయిసంహిత' అనే పేరు వచ్చింది. యాజ్ఞవల్క్యుడు రాజర్షి అయిన జనకునికి సమకాలికుడు.

## బృహస్పతి

బృహస్పతి అంగీరసపుత్రుడు. కొన్ని పురాణాలు బృహస్పతి తల్లి 'వసుద' అని, ఇంకొన్ని 'శ్రద్ధ' అని పేర్కొంటున్నాయి. బృహస్పతి అగ్ని కుమారుడని భాగవతంలో చెప్పబడ్డాడు. ఇతడు దేవగురువు. తార ఇతని భార్య. వానరజాతిలోని తారుడు బృహస్పతి పుత్రుడే. ఉత్తర రామాయణంలో కుశధ్వజుడు బృహస్పతి పుత్రుడుగా పేర్కొనబడ్డాడు. దేవీభాగవతం ఇతణ్ణి శుకమహర్షికి గురువుగా చెబుతుంది. దేవతల ప్రతిచర్య వెనుక బృహస్పతి ఆలోచన తప్పకుండా ఉంటుంది. ఇతడు పదునైన బుద్ధి కలవాడు.

## వివస్వతుడు

అదితి, కశ్యపుల కుమారుడు వివస్వతుడు. ఇతని భార్య విశ్వకర్మ పుత్రిక సంజ్ఞ. వీరి పుత్రుడే వైవస్వత మనువు. సూర్యవంశం ఇతనితోనే మొదలైంది. యమ – యమిలు కూడా ఇతని సంతానమే. వివస్వతుడు ఇరవై ఎనిమిదిమంది ప్రజాపతులలో ఒకడు. సాత్వత ధర్మాన్ని మహావిష్ణువు ద్వారా నేర్చుకుని తన పుత్రుడైన వైవస్వతునికి బోధించాడు.

అశ్వినీకుమారులు, నాసత్యదస్రులు వివస్వతుని పుత్రులు. వీళ్ళు సంజ్ఞ యొక్క నాసిక నుంచి జన్మించారు.

## కణ్వుడు

కణ్వుడు తన సామానికి ఆధారం దొరక్క ఆలోచిస్తుండగా ఒక పిల్లి తుమ్ము విన్నాడు. ఆ శబ్దం ఆధారంతో సామబుక్కును చెప్పాడని బ్రహ్మపురాణంలో చెప్పబడింది. శకుంతలను పెంచినవాడుగా ప్రసిద్ధుడు. కశ్యప వంశంలో జన్మించడం వలన కాశ్యపుడనే వారు.  ఇతని తండ్రి మేధాతిథి అని మహాభారతం చెబుతుంది. ఇతని ఆధ్వర్యంలో దుష్యంతుని కుమారుడైన భరతుడు 'గోవితత' అనే యాగం చేశాడు.

## సౌభరి

సౌభరి తండ్రి సోభరి. ఇతడు నీటి మధ్యలో కూర్చుని తపస్సు చేసుకునేవాడు. మత్స్యరాజు యొక్క భోగాలను చూచి తాను వాటిని అనుభవించాలనుకున్నాడు. మాంధాత దగ్గరికి వెళ్ళి, అతని కుమార్తెలను తనకిమ్మని కోరాడు. వృద్ధుడైనందువలన కుమార్తె లంగీకరిస్తే వివాహం చేయగలనని అతడు చెప్పగా, తన దివ్యశక్తితో సుందరరూపాన్ని పొంది, వారిని వివాహమాడి, బంగారు మందిరాలను నిర్మించుకొని, భోగాలను అనుభవించాడు. కాని చివరికి తను చేసినది తప్పని భావించి తపస్సు చేసి పరబ్రహ్మను పొందాడని విష్ణుపురాణం, భాగవతం చెబుతున్నాయి.

మరొక సౌభరి వింధ్యపర్వతం మీద ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. యుధిష్ఠిరుని అశ్వమేధయాగకాలంలో అర్జునుడు ఇతని ఆశ్రమాన్ని దర్శించాడు. ఆ సమయంలో ఉద్దాలకుని చేత శపింపబడ్డ చండి వృత్తాంతం సౌభరి అర్జునుడికి చెప్పాడు.

## ప్రస్కణ్వుడు

పురాణేతిహాసాలలో ఈ పేరుతో ఇద్దరున్నారు. ఒకరు మేధాతిథి పుత్రుడు. ప్రస్కణ్వ వంశంలోని రాజులు అందరూ బ్రాహ్మణులుగా మారిన క్షత్రియులు. వేరొక ప్రస్కణ్వుడు కణ్వముని కుమారుడు.

## కశ్యపుడు

కశ్యపుడు మరీచి పుత్రుడు. సంతానం కోసం 'కశ'మనే మద్యాన్ని సేవించడంతో ఇతనికీపేరు వచ్చింది. ఇతడు దక్షపుత్రికలైన అదితి, దితి, దనువు, కాల, అనాయువు,

సింహిక, క్రోధ, పృథ, విశ్వ, వినతి, కపిల, కద్రువలను వివాహం చేసుకుని, దేవతలను, దానవులను, నరులను, మృగాలను, వృక్షాలను సంతానంగా పొందాడు. ఇతడు బ్రహ్మచారి మరియు ప్రజాపతి, దేవర్షి. ఆదిత్యులు, మరుత్తులు, రుద్రులు ఇతని సంతానమే. కుబేరుని ఏడుగురు గురువులలో ఇతడొకడు.

## అత్రి

పురాణేతిహాసాలలో ఈ పేరుతో ఇద్దరున్నారు. ఒకరు బ్రహ్మ కళ్ళ నుంచి పుట్టినవాడు ఇతని పుత్రులు చంద్రుడు, దుర్వాసుడు, ప్రాచీన బర్హి, సప్తర్షుల్లో ఒకడు. వేరొక అత్రి శుక్రాచార్యుని పుత్రుడుగా పేర్కొనబడ్డాడు.

## వాలఖిల్యులు

సంతతి, క్రతుల సంతానం. వీళ్లు అరవై వేలమంది. సూర్యుని కీర్తిస్తూ ఉదయించినది మొదలు అస్తమించే వరకు పక్షుల రూపంలో ఎదురుగా ఉండేవారు. వీరు తపస్సు ద్వారా ఋషులైనారు. వీరే కొన్ని సంహితలకు ద్రష్టలయ్యారు. సూర్యలోకంలో నివసిస్తారు. వాలఖిల్యులు దర్భల కొనల నుంచి జన్మించారని, వారుణి యజ్ఞంలో వారికి అన్నిరకాల అధికారాలు వచ్చాయని, పుణ్య, సుమతి అనే ఇద్దరు సోదరీమణులని అంటారు. అంగుష్ఠప్రమాణ దేహులు. తలక్రిందులుగా తపస్సు చేసేవారు. నిత్య బ్రహ్మచారులు. వేదాలను, శాస్త్రాలను సూర్యుని రథంలో కూర్చునే నేర్చుకున్నారు.

## అథర్యుడు

అథర్యుడు బ్రహ్మ ముఖం నుంచి జన్మించాడు. ఇతనిని అథర్వణుడని కూడా అంటారు. అథర్వవేదానికి మూలపురుషుడు. కర్దమ పుత్రిక శాంతి ఇతని భార్య. ఈమెకు 'చిత్తి' అనే పేరు కూడా. కొన్ని పురాణాలలో చిత్తి రెండవ భార్యగా చెప్పబడింది. భాగవతం అథర్వుణ్ణి వసిష్ఠపుత్రునిగా పేర్కొంటుంది. అథర్వుడే అంగిరసుడని కొన్ని పురాణాలలో ఉంది. ఒకసారి భృగుమహర్షి శాపం వల్ల, అగ్ని సముద్రంలో దాగితే, దేవతల కోరికపై అతనిని కనుగొన్నాడు. ఇతడు బ్రహ్మ ద్వారా బ్రహ్మవిద్యను తెలిసికొని మొట్టమొదట అగ్నిని భూమిపైకి తీసుకువచ్చాడు. ఈ పేరుగల ఋషి మహాభారతంలో వేదపాఠకుడుగా వర్ణింపబడ్డాడు.

## భృగువు

బ్రహ్మ కుమారుడు. భృగు వంశానికి మూలపురుషుడు. ఈ వంశీయులను భార్గవులంటారు. బ్రహ్మ చర్మం నుండి పుట్టిన భృగువు దక్షయజ్ఞ వాటికలో మరణించాడు. మరల వరుణుని బ్రహ్మయజ్ఞ సమయంలో అగ్ని నుండి పుట్టాడని, ఇతనికి రెండు జన్మలని పురాణాలు పేర్కొంటున్నాయి. ఇంద్రపదవి నుండి నహుషుని తొలగించడానికి అగస్త్యునికి భృగువు సలహా ఇచ్చాడని ప్రతీతి.

## శౌనకుడు

అసలుపేరు గృత్సమదుడు. శునకుని కుమారుడు కావున శౌనకుడని పేరు వచ్చింది. ఆశ్వలాయనాచార్యులు ఇతని శిష్యుడు. శౌనకుడు ఋగ్వేద రక్షణం కోసం ఆర్షానుక్రమణి, చన్దోనుక్రమణి, దేవతానుక్రమణి, అనువాకానుక్రమణి, సూక్తానుక్రమణి, ఋగ్విధానం, పాద విధానం, బృహద్దేవతా, ప్రాతిశాఖ్యం, శౌనకస్మృతి అనే పది గ్రంథాలు రచించాడు.

## శుక్రుడు

విష్ణుపురాణంలో వసిష్ఠుని పుత్రునిగా పేర్కొనబడ్డాడు. వసిష్ఠునికి, ఊర్జకు కలిగిన ఏడుగురు కుమారులలో ఇతను ఒకడు.

## అంగిరసుడు

అంగిరసుడు బ్రహ్మ మానసపుత్రుడు. అంగిరసునికి శుభ, స్మృతి, శ్రద్ధ, దేవసేన, వసుద అని అయిదుగురు భార్యలు. బృహత్కీర్తి, బృహజ్యోతి మొదలగు ఏడుగురు కొడుకులు; భానుమతి, సినివాలి, రాకా మొదలగు ఏడుగురు కూతుళ్లు ఉన్నారు. అంగిరసుని గౌరవించని కారణంగా అగ్ని శపించబడ్డాడు. దాని మూలంగానే అగ్ని నుంచి పొగ రావడం. ఒకసారి సముద్రపు నీటిని త్రాగి, దాహం తీరక కొత్తగా నీటిని సృష్టించి, ఆ నీటిని కూడా తాగిన మహనీయుడు అంగిరసుడు.

వీరుగాక నాలుగు సంహితలను దర్శించిన మహర్షులు చాలామంది ఉన్నారు.

కొందరు స్త్రీలు కూడా సంహితలను దర్శించారు. వారిని 'బ్రహ్మవాదినులు' అని గౌరవింపబడ్డారు – ఉశన, గౌరీవీతి, చైలకి, జయ, ప్రాదురాక్షి, మేధ, రమ్యాక్షి, లోపాముద్ర, లౌగాక్షి, వసుశ్రుత, వారుణి, విదర్భి, విశ్వవార, వృష, శిరింబిఠ, సర్వరాజ్ఞి, సునీతి, ఆసురి, హైమ మొదలైన స్త్రీమూర్తులు మంత్రాలను దర్శించారు.

J#° |Oˆ□ÎOD=ü È°

# కొందరు భాష్యకారులు

## యాస్కుడు

వేదాలలోని నిగూఢార్థాలు కల పదాలను సంకలనం చేసి ప్రాచీనాచార్యులెవరో నిఘంటువును తయారు చేశారు. దానికి వ్యాఖ్యానం వంటిది యాస్కుని నిరుక్తం. తరువాత వేదభాష్యాలు వ్రాసిన వారందరూ నిరుక్తాన్ని ప్రమాణంగా తీసుకున్నారు.

## స్కందస్వామి

ఇతడు వలభి నివాసి. ఇతని తండ్రి భర్త్ర ధ్రువుడు. ఏడవ శతాబ్ధివాడంటారు. వేదార్థాన్ని తెలుసుకోవాలంటే ఛందస్సు బాగా తెలియాలంటారు. ఇప్పుడు దొరుకుతున్న ఋగ్వేద భాష్యాలలో ఇతనిదే మొదటిది, ప్రమాణికమైంది. ఇతనికి ముందు ఉన్న కొందరు భాష్యకారులను స్మరించడం వలన, ఇతనికి ముందే కొన్ని భాష్యాలు ఉన్నట్లు తోస్తుంది. ఇతని భాష్యం యజ్ఞపరమైనది.

## నారాయణాచార్యుడు

ఇతడు స్కందస్వామికి భాష్యరచనలో సహాయం చేశాడు.

## ఉద్గీథాచార్యుడు

ఉద్గీథాచార్యుడు స్కందస్వామి సమకాలికులు. సాయణుడు తన భాష్యంలో ఉద్గీథుని చాలాసార్లు స్మరించాడు. ఉద్గీథాచార్యుని ఋగ్వేద భాష్యం పదవ మండలంలోని అయిదవ సూక్తం నుంచి ఎనభై మూడవ సూక్తం వరకే దొరుకుతున్నది. ఇది కూడా యజ్ఞపరమైన భాష్యమే.

## హస్తామలకుడు

ఇతడు ఎనిమిదవ శతాబ్దం వాడు. ఋగ్వేద భాష్యకారుడుగా పేరు ఉంది కాని, ఆ భాష్యం ఇంతవరకు దొరకలేదు.

## వేంకట మాధవుడు

ఇతడు పదవ శతాబ్దం వాడు. కావేరీ ప్రాంతంవాడు. తల్లి సుందరి, తండ్రి వేంకటాచార్యులు. ఋక్సంహితకు 'ఋగర్థ దీపిక' అనే భాష్యం వ్రాశాడు. ఇది కూడా యజ్ఞపరమైన భాష్యమే. వేదార్థాన్ని తెలుసుకోవడానికి కేవలం నిరుక్త వ్యాకరణ జ్ఞానమే కాకుండా, బ్రాహ్మణ గ్రంథ పరిచయం కూడా ఉండాలంటాడు.

## లక్ష్మణాచార్యుడు

ఇతడు పన్నెండవ శతాబ్దం వాడంటారు. ఇతడు ఋక్సంహితకు 'వేద భూషణమ్' అనే భాష్యం వ్రాశాడు. కాని కనబడడం లేదు.

## ఆనందతీర్థుడు

పదమూడవ శతాబ్దం - కర్ణాటక దేశీయుడు. ద్వైత సంప్రదాయ ప్రవర్తకుడైన మధ్వాచార్యుడే ఆనంద తీర్థుడు. ఋక్సంహిత ప్రథమ మండలంలోని మొదటి నలభై సూక్తాలకు దిగ్దర్శనంగా ఏకదేవతావాదపరమైన భాష్యం వ్రాశాడు. పరమేశ్వరుడైన విష్ణువే సకలవేద ప్రతిపాద్యుడని ఈయన సిద్ధాంతం.

## ఆత్మానంద తీర్థుడు

పదమూడవ శతాబ్దం వాడు. ఋక్సంహిత ప్రథమ మండలంలోని నలభై సూక్తాలకు భాష్యం వ్రాశాడు. 'అస్య వామస్య' సూక్తానికి భాష్యం వ్రాసిన ఆత్మానందుడు, ఈయన ఒకరేనేమో!

## ముద్గలాచార్యుడు

ఇతడు పదిహేనవ శతాబ్దం వాడు. ఋక్సంహితా భాష్యం ప్రథమాష్టకానికి పూర్తిగా, చతుర్థాష్టకానికి అయిదవ అధ్యాయం వరకు దొరుకుతుంది.

## దేవస్వామి

ఇతడు చాలా ప్రాచీనుడు. ఋక్సంహితకు భాష్యం వ్రాశాడని ప్రసిద్ధి. కాని లభించడం లేదు.

## చతుర్వేదస్వామి

ఋక్సంహితలోని కొన్ని భాగాలకు కృష్ణపరమైన భాష్యం వ్రాశాడు. బృందావన విహారియైన కృష్ణచరితం వేదమంత్రాలలో ఉన్నదని ఈతని సిద్ధాంతం.

## భట్టస్వామి

ఇతడు చాలా ప్రాచీనుడు. యజుర్వేదానికి సంబంధించిన తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాశాడంటారు. అలభ్యం.

## భట్టభాస్కరుడు

ఈతడు పదకొండవ శతాబ్దంవాడు. యజుర్వేద భాష్యకారులలో ప్రసిద్ధుడు. ఈయన తన భాష్యంలో చాలామంది ప్రాచీన భాష్యకారులను పేర్లు చెప్పకుండా పేర్కొన్నాడు. సాయణుడు మాత్రం తన భాష్యంలో భట్టభాస్కరుని పేరు చాలా చోట్ల ఉదహరించాడు.

## దుర్గాచార్యుడు

పదిహేనవ శతాబ్దం వాడు. తైత్తిరీయ సంహితకు భాష్యం వ్రాశాడు కాని ఇప్పుడు దొరకడం లేదు.

## భావస్వామి – గుహదేవుడు

వీరిరువురు యజుస్సంహితకు చెందిన తైత్తిరీయ సంహితకు భాష్యాలను వ్రాశారు.

## మాధవుడు – భరతస్వామి – గుణవిష్ణువు

వీరు ముగ్గురు సామవేదానికి భాష్యాలు వ్రాశారు.

## సాయణాచార్యుడు

మాయణ – శ్రీమతుల కుమారుడు సాయణుడు. ఇతని అన్న మాధవుడు. మాధవుడు సన్యాసం స్వీకరించి విద్యారణ్యస్వామి అయి, హరిహరరాయలు – బుక్కరాయలు ద్వారా విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తమ్ముడు భోగనాథుడు. ఇతడు సంగమ నృపతికి నర్మసచివుడు. వీళ్ళు ముగ్గురు వేదవేదాంగాలలో నిష్ణాతులు. క్రీ.శ. 1315లో పుట్టిన సాయణుడు 1387 వరకు జీవించాడు. బుక్కరాయలు విద్యారణ్యుణ్ణి వేదాలకు భాష్యాలు వ్రాయమని ప్రార్థించాడు. అందుకాయన నా తమ్ముడు సాయణుడు ఆ పనికి సమర్థుడన్నాడు. రాజు సాయణుని వేదభాష్యాలు వ్రాయమని ప్రార్థించాడు. బుక్కభూపతి ప్రేరణతో సాయణుడు తైత్తిరీయ సంహిత (కృష్ణయజుర్వేదం), ఋక్సంహిత, సామ సంహిత, కాణ్వ సంహిత (శుక్ల యజుర్వేదం), అథర్వ సంహితలకు

మరియు తైత్తిరీయ బ్రాహ్మణం – తైత్తిరీయారణ్యకం, శతపథ బ్రాహ్మణం, ఐతరేయ బ్రాహ్మణం – ఐతరేయారణ్యకం, తాండ్య (పంచవింశ), షడ్వింశ, సామవిధాన, ఆర్షేయ, దేవతాధ్యాయ, ఉపనిషత్, సంహితోపనిషత్, వంశ మొదలైన బ్రాహ్మణాలకు భాష్యం వ్రాశాడు. వైదిక వాఙ్మయంలో సాయణుడు చేసిన కృషి అద్వితీయం.

### ధానుష్కయజ్వ

ఇతడు ఋక్సంహితకు, సామసంహితకు భాష్యాలు వ్రాశాడు కాని దొరకడం లేదు.

### రావణుడు

ఇతడు ఋగ్వేదానికి, యజుర్వేదానికి భాష్యం వ్రాశాడు. ఇది అక్కడక్కడ దొరుకుతున్నాయి. లంకాధిపతి, ఇతడు ఒకడేనని కొందరు భ్రమించారుకాని, కాదు.

### స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడైన దయానంద సరస్వతి యజుర్వేదానికి పూర్తిగాను, ఋగ్వేదం ఏడవ మండలం వరకు భాష్యం వ్రాశాడు.

### హలాయుధుడు – అనంతాచార్యుడు

వీళ్ళు ఇద్దరు కూడా వేద భాష్యాన్ని వ్రాసినట్లు ప్రసిద్ధి.

# అనుబంధం - నాలుగు

**వేదకాలమున గల కొన్ని దేశముల పేర్లు. వాటి ఆధునిక పేర్లతో సమన్వయ మగుచున్నవని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.**

**ఉదాహరణకు :**

| | | |
|---|---|---|
| అపగాన స్థానము (గాంధారము) | : | ఆఫ్గనిస్థానము |
| ఆర్యస్థానము | : | ఇరాన్ |
| హరివర్షము | : | యూరోప్ |
| పాతాళము | : | అమెరికా |
| అజపదము | : | ఈజిప్టు |
| పాలిస్థానము | : | ఫిలిప్పైన్ |
| ఆర్యవాహము | : | అరబీ |
| యవనదేశము | : | యూనానీ |
| శర్మణ దేశము | : | జర్మనీ |
| ధనమార్గము | : | డెన్మార్కు |
| సుయోధనము | : | స్వీడెన్ |
| నారావజము | : | నార్వే |
| ఆర్యఖండము | : | ఐర్లెండు |
| త్రివిష్టపము | : | టిబెటు |

---

(ఈ రచనకు తోడ్పడిన ఎన్నో గ్రంథాలు – ఆయా రచయితలకు, ప్రచురణకర్తలకు కృతజ్ఞతలు)

# అనుబంధం - అయిదు

## నామసూచిక

అంగిరసుడు
అంగిరసప్రచేతసుడు
అక్బరు
అగస్త్యుడు
అగ్రాయణ
అగ్ని
అగ్నిమాఠర
అగ్నిసౌచీకుడు (కశ్యపుడు)
అగ్నివేషుడు
అగ్నీధ్రుడు
అచ్ఛావాకుడు
అజాతశత్రువు
అజుడు (ఏకపాత్)
అత్తి
అత్రి
అత్రిభౌముడు
అథర్వవీతహవ్యుడు
అథర్వాచార్యుడు
అథర్వుడు
అధ్వర్యు
అనంతకృష్ణశాస్త్రి
అనంతాచార్యుడు
అపాంనపాత్
అప్రతీర్థుడు
అయాస్యుడు
అరవిందుడు
అర్చనానా

అవత్సారుడు
అశ్వినులు
అసనసుడు
అసితుడు
అస్సినా
అహిబుధ్నుడు
అహురమజ్ది

ఆతర్
ఆత్మానందుడు
ఆత్రేయుడు
ఆదిత్యులు
ఆధ్రవన్
ఆధ్వ్య
ఆనంద కుమారస్వామి
ఆనంద చంద్ర వేదాంత వాగీశుడు
ఆనందతీర్థుడు
ఆనందతీర్థుడు (మధ్వాచార్యుడు)
ఆపః (నీళ్లు)
ఆపస్తంబుడు
ఆపో
ఆరుణి
ఆరుణేయుడు
ఆర్యభట్టు
ఆశ్వలాయనుడు
ఆష
ఆసురి

ఇంద్ర
ఇంద్రప్రమతి
ఇంద్రుడు
ఇ.ఆర్. కృష్ణశర్మ
ఇతరా
ఇరింబిఠి

ఈశ్వరుడు

ఉఖమహర్షి
ఉఖుడు
ఉచధ్యుడు
ఉచ్చ్రేచవనుడు
ఉదయనుడు
ఉద్గాత
ఉద్దాలకుడు
ఉద్గీధుడు
ఉన్నేత
ఉన్మోచవనుడు
ఉపటుడు
ఉపరిబభ్రువుడు
ఉవ్వటుడు
ఉశన
ఉశనసులు
ఉషస్సు

ఊర్వశి

ఋజిశ్వ
ఋభుకపింజలుడు
ఋషభుడు

ఐతరేయ మహిదాసు

ఔదుంబరాయణ
ఔపమన్యవ
ఔరంగజేబు

కణ్వ
కణాదుడు
కణ్వుడు
కణ్వుడు (ఘౌరుడు)
కద్రూ
కబంధుడు
కవషుడు (ఐలూషుడు)
కవి (భార్గవుడు)
కశ్యపమారీచుడు
కశ్యపుడు
కహోల కౌషీతకి
కక్షీవంతుడు
కాంకాయనుడు
కాత్థక్య
కాత్యాయని
కాత్సాయనుడు
కారుపతి
కారెశాని
కాశీనాథశాస్త్రి ఆగాశె
కుండినుడు
కుత్సుడు
కుమారిలభట్టు
కుముదుడు
కురుసుతి
కుషీతకుడు
కుసీది
కృష్ణుడు

కె. నారాయణస్వామి
కె. రాఘవపిళ్లై
కౌశికుడు
కౌషీతకుడు
క్రౌష్టుకి

గంగా విష్ణు శ్రీకృష్ణదాస్
గందరెవ
గరుత్మంతుడు
గాధి (కౌశికుడు)
గార్గ్యుడు
గాలవ
గాలవుడు
గ్రావస్తుత్
గ్వాలీయ
గుణవిష్ణువు
గుణాఖ్య శాంఖాయనుడు
గులాబ్‌రాయ్ వఝే శంకర
గృత్సమదుడు
గృహదేవుడు
గోపథుడు
గోపథ భరద్వాజుడు
గోవిందస్వామి
గౌతమబుద్ధుడు
గౌతముడు
గౌతముడు (అక్షపాదుడు)
గౌరీవీతి

ఘోష

చంద్రధరశర్మ
చాతనుడు
చిన్నస్వామి శాస్త్రి

చైలకి
ఛాగలేయ

జగద్బీజం పురుషుడు
జనకుడు
జనమేజయుడు
జమదగ్ని
జయ
జవోతర్
జాతికాయనుడు
జాతూకర్ణ్యుడు
జాబాలి
జీర్ణనాభ
జీవానంద విద్యాసాగర భట్టాచార్య
జైబలి
జైమిని

తలవకారుడు
త్రసదస్యుడు
త్వష్ట
త్వష్టుడు
తాండి మహర్షి
త్రితుడు
త్రిప్ష్య
తైటికి

దంద్యఅథర్వ్యణుడు
దయానంద సరస్వతి
దక్షుడు
దృషద్వతి
ద్రవిణోదాసుడు
దారాషుకో
దాశరథి రంగాచార్య

ద్రాహ్యాయణుడు
ధానుష్కయజ్వ
దివోదాసు
ద్విజరాజభట్టు
ధ్రిత
దీర్ఘతముడు
దుందుభ
దుర్గామోహన భట్టాచార్య
దుశ్చ్యవనుడు
దుష్యంతుడు
ధ్రుజ్
ధ్రువహణండు
దేవకి
దేవదర్ముడు
దేవరాజుయజ్వ
దేవరాతుడు
దేవలుడు
దేవసేన
దేవేంద్రనాథ్ ఠాగూర్
ద్వ్యాస్

నచికేతుడు
నాభాకుడు
నారదుడు
నారాయణుడు
నారాయణశాస్త్రి గోడ్ బోలే
నింబార్కచార్య
నీలకంఠుడు
నృమేధుడు
నేష్ఠ
నోధా గౌతముడు

పట్టాభిరామశాస్త్రి
పతంజలి
పథ్యుడు
పరాశర
పరాశరుడు
పరీక్షితుడు
పరుచ్ఛేపుడు
పర్జన్యుడు
పలిశుడు
పాణి
పిప్పలాదుడు
పురూరవ
పురోహితస్వామి
పూషుడు (పూషన్)
పైలుడు
పోత
పృథ్వి (భూమి)
ప్రకాశాత్ముడు
ప్రగాధుడు
ప్రచేతసుడు
ప్రజాపతి (వాచ్యుడు)
ప్రజాపతి (వైశ్వామిత్రుడు)
ప్రత్యాంగిరసుడు
ప్రతివేదన
ప్రతివేశ్యుడు
ప్రతిహర్త
ప్రభువు
ప్రమోచనుడు
ప్రవహణ
ప్రశోచనుడు
ప్రస్కణ్యుడు

ప్రస్తోత
ప్రక్షన్యుడు
ప్రియమేధుడు
ప్రియవ్రతుడు
ప్రాదురాక్షి
ఫణి

బంకుపల్లి మల్లయ్య శాస్త్రి
బంధువు (గౌపాయనుడు లేక
లౌపాయనుడు)
బభ్రువు
బభ్రు పింగళుడు
బాదరాయణి
బాబా శాస్త్రి ఫడకే
బాలకృష్ణ దీక్షిత్
బాలగంగాధర తిలక్
బాష్కలుడు
బాష్కలి భరద్వాజుడు
బి.ఆర్. శర్మ
బృహచ్ఛక్రుడు
బృహజ్యోతి
బృహత్కీర్తి
బృహదుక్థడు
బృహద్దిపుడు
బృహద్విప అథర్వణుడు
బృహస్పతి
బోధాయకుడు
బ్రహ్మ
బ్రహ్మగుప్త
బ్రహ్మబలి
బ్రహ్మస్కందుడు

బ్రాహ్మణాచ్ఛంసి
బౌధ్య
భగుడు
భట్టభాస్కరుడు
భరతస్వామి
భరతుడు
భరద్వాజుడు
భర్తృధ్రువుడు
భవత్రాతుడు
భవస్వామి
భాగలి
భానుమతి
భార్గవవైదర్భి
భార్గవుడు
భాస్కరాచార్యుడు
భృగ్వంగిరసుడు
భృగ్వాంగిరస బ్రహ్మ
భృగువు
భృగుమహర్షి
భృగు అథర్వణుడు
భోజుడు

మంగళదేవశాస్త్రి
మధ్వాచార్యులు
మధుచ్ఛందుడు
మనువు
మనువు (వైవశ్వతుడు)
మయోభువు
మరుత్తులు
మహిదాసు
మహిదాసు ఐతరేయుడు

మహీధరుడు
మహాదేవశాస్త్రి
మాండవ్యుడు
మాండూకేయుడు
మాతరిశ్వుడు (మాతరిశ్వన్)
మాతృనామ
మాధవభట్టు
మాధవుడు
మానవ
మారీచుడు
మిత్రరాజేంద్రలాల్
మిత్రుడు
మిద్ర
ముంజకేశుడు
ముకుందపాఠక్
ముద్గల
ముమ్మటుడు
మృగారుడు
మెహర్
మేధ
మేధాతిథి
మేధ్యుడు
మైత్రావరుణుడు

యం. రామనాథ దీక్షితార్
యమ
యమి
యముడు
యిమ
యాస్కుడు
యాజ్ఞవల్క్యుడు

రఘువీర
రణవీర్‌సింగ్
రధీతరశాకపూణి
రమ్యాక్షి
రవీంద్రనాధ ఠాగూర్
రస్ను
రాజేంద్రలాల్‌మిత్ర
రాత్రి
రామతీర్థుడు
రామదేవ్
రామనాధుడు
రామానుజాచార్యులు
రుద్రుడు
లక్ష్మణసేనుడు
లాట్యాయణుడు
లిఖితుడు
లీలావతి
లోకేశచంద్ర
లోపాముద్ర
లోమశ
లౌగాక్షి

వజ్రటుడు
వత్సప్రి (బాలందనుడు)
వయు
వరదరాజు
వరాహ
వరాహమిహురుడు
వరుణుడు
వల్లభాచార్యులు
వసిష్ఠుడు
వసుకృత్తు (వాసుక్రుడు)

వసుద
వసువు
వసువు (భరద్వాజుడు)
వసుశ్రుత
వ్యశ్వుడు
వాక్
వాత్స్య
వామదేవుడు
వాయువు (వాతుడు)
వారుణి
వార్షాయణి
వాల్మీకి
వాసుదేవుడు
వ్యాసుడు
విజ్ఞానభిక్షువు
విదర్భి
విద్యాధరశర్మ
వినాయక గణేశ ఆప్టే
వినాయకభట్టు
వివజ్హ్వాంత్
వివస్వత్తు (వివస్వత్)
విశ్వమనసుడు
విశ్వవారా
విశ్వామిత్రుడు
విష్ణువు
విహవ్యుడు
వీతహవ్యుడు
వృతహన్
వృత్రుడు
వృష
వెరెథ్రన్న
వేంకట గోవిందుడు
వేంకటాచార్యుడు
వేంకట మాధవుడు
వేదమిత్ర శాకల్యుడు (శాకలుడు)
వేదాచార్యుడు
వేనుడు
వైఖానసుడు
వైశంపాయనుడు

శంకరాచార్యులు
శంకుడు
శంకర్ పి. పండిట్
శంభువు
శంయువు
శంతాతి
శకటాయనుడు
శతపుడు
శాకపూణి
శాకల్యుడు
శ్యామాయనీయ
శ్యావాశ్యుడు
శిరింబిఠ
శివుడు
శుక్రాచార్యుడు
శుకుడు
శుక్రుడు
శుచి
శునఃశేపుడు (అజీగర్తి)
శుభ
శ్రద్ధ
శ్రుతబంధువు
శ్వేతకేతు

శైశిరుడు
శౌనకుడు
శౌష్కాయనుడు
శ్రీకృష్ణుడు
శ్రీ గణేశ శాస్త్రి పాఠక్
శ్రీధరశర్మ
శ్రీనివాసాచార్యులు
శ్రీరంగరామానుజుడు
షద్గురు శిష్య
షాజహాన్

సంకర్షణుడు
సంవర్తుడు
సత్యవ్రతసామాశ్రమి
సత్యశ్రవుడు
సత్యశ్రీ
సత్యహితుడు
సత్యాషాఢుడు
సరమ
సరస్వతి
సర్వరాజ్ఞి
సవర్ణ
సవిత (సవితృ)
సవ్యుడు
సాంగాయనుడు
సాకమశ్వుడు
సాయణుడు
సాయణ మాధవాచార్యుడు
సావిత్రీసూర్య
సింగన
సింధుద్వీపుడు
సినివాలి

సుతంభరుడు (ఆత్రేయుడు)
సుధాకర మాలవీయ
సునీత
సుబ్రహ్మణ్యుడు
సుమంతుడు
సుమ్నయువు
సూర్యకాంత
సూర్యా
సూర్యుడు
సైంధవుడు
సోమపుడు
సమాహుతి (భార్గవుడు)
సోముడు
సౌభరి (కాణ్వుడు)
స్థౌలాష్ఠీవి
స్కందస్వామి
స్మృతి
స్వయంభువు (బ్రహ్మ)

హరస్వతి
హరిస్వామి
హరితుడు
హరిద్రవీయ
హరిస్వామి
హలాయుధుడు
హిరణ్యస్తూపుడు
హుజారపతి
హైమ
హోత

క్షురుడు

## పాశ్చాత్యులు

అవుఫ్‌రెస్ట్
ఆర్. గార్బెస్తుత్ గార్త్
ఆర్.టి. హెచ్. గ్రిఫిత్
ఆర్. రోథ్
ఆర్. లొబ్బెక్
ఆల్బర్ట్ వెబర్
ఆల్ఫ్రెడ్ లుడ్విగ్
ఇ.డబ్ల్యూ. హోప్కిన్స్
ఇ.బి. కోవెల్
ఎగ్గలింగ్
ఎ.బి. కీథ్
ఎ.సి. బర్నెల్
ఓల్డెన్ బెర్గ్
కార్ల్.ఎఫ్. గెల్డనర్
కోల్‌బ్రూక్
గ్రాస్‌మన్
ఛార్లెస్ లాన్‌మన్
జోరో ఆస్తర్
డబ్ల్యూ. కాలండ్
డబ్ల్యూ.డి. విట్నీ
డి. గాస్త్ర
ధ్యూడర్ ఔఫ్రిత్
పాలేద్యసేన్
బి. లిండ్నెర్
బోట్ లింక్
బెన్ఫీ
మాక్ డొనెల్
మాక్స్ ముల్లర్
మార్టిన్‌హాగ్
యం. బ్లూమ్ ఫీల్డ్
యాకోబీ
యుజీన్ బుర్నోఫ్
రాబర్డ్ డీనేబిలిస
రాస్
రిచర్డు గార్బే
రుడాల్ఫ్ రోథ్
రోజెన్
వాల్డర్ ఫ్రెండ్ లండర్
వాల్టేర్
వింటర్ నిట్చ్
సర్ విలియం జోన్స్
సి.ఆర్. లాన్‌మన్
సి.పి. బ్రౌన్
స్టీవెన్‌సన్
సెయింటు పీటర్స్ బర్గ్
హన్స్ జోర్గెన్సన్ దార్మ్‌స్తత
హెచ్. ఓర్టెల్
హెచ్.హెచ్. విల్సన్
హెన్రిచ్ త్సిమర్
హెన్రిచ్ స్టోనర్ హోలే

సమీక్ష

# సాహితీ 'ముద్వల' సేరాగాలు

ముద్వల సుబ్బరామయ్యగారు ప్రాచీన కవులు, సాహిత్య మరమరాలు (వందేళ్ళ సాహిత్యంలో అపూర్వ ఘటనలు), తెలుగు సాహితీ వేత్తల చరిత్ర అని మూడు గ్రంథాలు వెలువరించారు. సాహిత్య ప్రేమికులు చదవదగిన, దాచుకోదగిన మంచి గ్రంథాలివి. వారికి ఆధునిక ప్రాచీన సాహిత్యాలతో వున్న పరిచయం, అభినివేశం ఈ గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

ప్రాచీన కవుల్లో తెలుగు కవులేకాక వ్యాసుడు మొదలు పోతన్నదాకా సంస్కృత కవులు, నన్నయ మొదలు బద్దెన దాకా తెలుగు కవులు. వాళ్ళ వ్యక్తిగత సాహిత్య విశేషాలు యిందులో వున్నాయి. ప్రాచీన కవుల్లో ఆయన పరిశోధనాత్మక వ్యాసాలూ వున్నాయి. ఉదాహరణకు అశ్వఘోషుడి గురించి రాసిన వివరాలు చూడండి.

"అశ్వఘోషుడు తన పేరుకు - ఆర్య, సువర్ణాక్షిపుత్ర, సాకేతక, భిక్షు, ఆచార్య, భదంత, మహాకవి, మహావాదిన్ అనే ఎనిమిది విశేషాలను జోడించాడు."

ఇంకా అశ్వఘోషుని బుద్ధ చరిత్ర ప్రాధాన్యాన్ని వివరిస్తూ "సంస్కృతంలోని ఈ మూలగ్రంథం అసంపూర్ణం. ఇ.హెచ్. జాన్స్టన్ (కలకత్తా 1935) సంపాదకత్వం వహించి ప్రచురించిన 'బుద్ధ చరిత్రం'లో పదమూడు సర్గలు పూర్తిగాను, పద్నాలుగవ సర్గలో ముప్పై ఒకటవ శ్లోకం వరకు మాత్రమే వున్నాయి. 1893లో ఆక్స్‌ఫర్డ్‌లో కోవెల్ ముద్రించిన ప్రతిలో పదిహేడు సర్గల వరకూ వుంది. ఇవి 19వ శతాబ్దంలో పూర్వభాగంలో నేపాల్ ఆస్థాన పండితుడు, వ్రాయసకాడు హెడ్జ్‌సన్‌దొర వద్ద పనిచేసే పండిత అమృతానంద విరచితాలు"

ఈ విధంగా మనకు తెలియని ఆశ్చర్యం కలిగించే ఎన్నో విశేషాలు వివరించారు. ఈ విధంగా యితర ప్రాచీన కవుల జీవితాలు, వాళ్ళ రచనల సంక్షిప్త పరిచయాలు చేశారు.

సంస్కృత కవుల కన్నా తెలుగు కవుల పరిచయాలు సంక్షిప్తంగా వున్నాయి. కొంతమంది జీవితాల, రచనల వివరణలు పెద్దగా వున్నా, చాలా మంది ప్రాచీన తెలుగు కవుల జీవితాలు క్లుప్తంగా ఇచ్చారు. కారణం వాళ్ళ జీవిత విశేషాలు లభ్యం కాకపోవడం కావచ్చు.

సాహిత్య మరమరాలు సాహిత్య ప్రేమికులందరూ దాచుకోదగిన గ్రంథం. సుప్రసిద్ధ సాహిత్యకారులు యితర సాహిత్యకారుల గురించి, సాహిత్యాల గురించి వివిధ సందర్భాలలో చెప్పిన మాటలు. వీటిల్లో ఉత్తరాల ద్వారా, వ్యాసాల ద్వారా సేకరించినవి యథాతథంగా చెప్పడం జరిగింది. ఒక పత్రికలో నాలుగు సంవత్సరాల పాటు ఇవి ధారావాహికంగా వచ్చాయి. సాహితీమూర్తులు యితర సాహిత్యకారుల గురించి చెప్పినవేకాక తమ గురించి చెప్పిన విషయాలూ వున్నాయి. సాహిత్యం ఒక్కటే కాక యిందులో వ్యక్తిగత

రచయిత: ముద్వల సుబ్బరామయ్య ప్రచురణ : జయంతి పబ్లికేషన్స్, విజయవాడ



సాహిత్య మరమరాలు
పేజీలు : 272
వెల రూ. : 100/-



ప్రాచీన కవులు
పేజీలు : 216
వెల రూ. : 75/-



తెలుగు సాహితీ వేత్తల చరిత్ర
పేజీలు : 256
వెల రూ. : 90/-

అంశాల్ని కూడా సాహిత్యకారులు ప్రస్తావించారు.

గుర్రం జాషువాగారు తన గురించి చెప్పిన మాటలు చూడండి.

"జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు. పేదరికం, కుల మత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచిందేకానీ బానిసగా మాత్రం మార్చలేదు. గాంధ్ర్యాన్నీ కులభేదాన్నీ కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత."

ఇట్లా సాహిత్యకారుల ఆత్మావిష్కారాలు మనల్ని వుద్వేగుల్ని చేస్తాయి.

శ్రీశ్రీకి ఉత్తేజాన్నిచ్చిన అబ్బూరి రామకృష్ణారావుగారి గురించి ఆరుద్ర చెప్పిన మాటలు ఆసక్తికరంగా వున్నాయి. ఆంధ్ర సాహిత్యలోకంలో ఆధునిక చేతన కలిగించిన వివేకశీలి అబ్బూరి రామకృష్ణారావుగారు. "అబ్బూరివారు శ్రీరంగం శ్రీనివాసరావును పిలిచి లక్నో మేనిఫెస్టోని యిచ్చి, అతని సహకారంతో 'ఆంధ్ర వర్తమాన రేఖక సంఘం' అనే సంస్థను స్థాపించారు. తాను అధ్యక్షుడు, శ్రీశ్రీకార్యదర్శి. ఊళ్ళోనే వున్న గుడిపాటి వెంకటచలం గారిని సభ్యులుగా చేర్చారు. ప్రణాళిక అచ్చువేసి ప్రకటించారు" అంటూ అబ్బూరివారు యం.ఎన్.రాయ్ గారిని కలుసుకోవడం, కమ్యూనిస్టుల్తో తెగతెంపులు చేసుకొని రాయిస్టుగా మారడం వంటి విశేషాల్ని వివరించారు.

ముద్వల సుబ్బరామయ్యగారి సాహిత్య ప్రేమ, సాహిత్యకారుల ప్రేమ, శ్రమ అడుగడుగునా కనిపిస్తాయి. తెలుగు సాహిత్య ప్రేమికులు మరచిపోలేని గ్రంథమిది.

మూడో గ్రంథం 'తెలుగు సాహితీవేత్తల చరిత్ర' ఈ గ్రంథం చూస్తే మనకు ఆశ్చర్యమేస్తుంది. కొన్ని వందల మంది తెలుగు కవుల గురించిన గ్రంథమిది. ఇందులోవాళ్ళు పుట్టిన తేదీ, మరణించిన తేదీ వాళ్ళ కుటుంబ విశేషాలు, వాళ్ళ రచనల వివరణ ఉంది. ఐతే వందల మంది వివరాలు రాయడంవల్ల తప్పనిసరిగా అతి సంక్షిప్తంగా రాయాల్సి వచ్చింది.

ఒక సాహితీ పరిశోధకుడు అవిశ్రాంత పరిశోధన చేసి ఆవిష్కరించిన గ్రంథాలివి.

పీటన్నిట్లో నిర్మలమయిన నిరాడంబరమైన శైలి మనల్ని చదివిస్తుంది. ఎక్కడా కనీసం ముందుమాటలు లేవు. ముద్వల సుబ్బరామయ్యగారి వివరాలూ లేవు. 'ఆకులందున అణగిమణగి' ఆయన ఆలపించడమే కనిపిస్తుంది. నిరాడంబరత మంచిదే. కానీ రచయిత వివరాలు కూడా లేకుండా వుండడం అన్యాయం.

తెలుగు సాహిత్య ప్రేమికులు చదవాల్సిన గ్రంథాలివి.

– సౌభాగ్య

# ముప్పల సుబ్బరామయ్య
# ఇతర రచనలు
















